# దేవుని నివాస స్థలము

భక్త్‌సింగ్

# దేవుని నివాస స్థలము

## విషయసూచిక

పేజి నంబరు


1. దైవమర్మము ........ 1
2. వాగ్దానము ........ 7
3. దర్శనము ........ 13
4. మందిరముయొక్క మాదిరి ........ 19
5. నిబంధన ........ 24
6. పరీక్షింపబడుట ........ 28
7. ప్రతిష్ఠార్పణ ........ 33
8. ప్రశస్త లోహములు ........ 39
9. తెరలు ........ 45
10. పై కప్పులు ........ 49
11. తుమ్మకర్ర ........ 57
12. ప్రదీపమునకు తైలము ........ 63
13. అభిషేక తైలము ........ 74
14. సుగంధ సంభారములు ........ 88
15. రత్నమణులు ........ 98
16. పలకలు ........ 109
17. అడ్డకర్రలు ........ 121
18. దాచబడిన వస్తువులు ........ 135
19. జీవులు ........ 143
20 ని తేజస్సు ........ 158

# 1

# దైవ మర్మము

"పిచ్చుకలకు నివాసము దొరికెను. వానకోవెలకు గూటి స్థలము దొరికెను" (కీర్తన 84:3). పిచ్చుక గడ్డిని, చొప్పను పోగు చేసుకొని తన గూటిని కట్టుకొనుట మీరు చూచియుంచురు. గూడు పూర్తికాగానే ఆ పిచ్చుక ఎంత విశ్రాంతి, ఎంత సౌఖ్యమును అనుభవించుచున్నదో! దీనినుండి మనము నేర్చుకొను పాఠమేమనగా ఇట్టి శ్రద్ధ, ఇట్టి ఓర్పుతోనే తనకొక నివాస స్థలమును నిర్మించుకొనుటకై దేవుడు సామగ్రిని సమకూర్చుకొనుచున్నాడు. "ఆత్మ మూలముగా దేవునికి నివాస స్థలమై యుండుటకు," ప్రభువైన యేసుక్రీస్తు రక్తము ద్వారా విమోచింపబడిన మానవులైన మనలను ఆయన సమకూర్చు కొనుచున్నాడు (ఎఫెసీ. 2:22). ఎందుకనగా ఆయనకు తృప్తి కలిగించి, విశ్రాంతి నొసగు నివాస స్థలమిదే. రక్షణ పొందక పూర్వము దేవుని యొద్దనుండి ఏమేమి రాబట్టుకొనగలమా యను చింత గలిగియుందుము. ఇప్పుడైతే దేవునికి మనము ఏమి ఇత్తుమా అను వాంఛ గలిగియున్నాము. పరలోకముగాని, దేవదూతలుగాని ఆయనకు ఇవ్వజాలనట్టి సౌఖ్య విశ్రాంతులు, పాపాత్ములై యుండిన పనికిమాలినవారై యుండిన మానవులే తాము విమోచింపబడిన పిదప ఇవ్వగలుగుచున్నారు. ఇదొక మర్మము. అయితే, సంఘము అనునది సత్యముగా ఏమిటో, అది దేవునికి ఎంత అమూల్యమైనదో నీవు గ్రహింపగా ఈ

మర్మము నీకు తేటపడును.

మనము "**చర్చి**" అను ఇంగ్లీషు మాటను బహుచులకనగా పలుకుచు దాని అసలు అర్థము తెలం  దానిని వాడుదుము. ఆదివారమునాడు, 'నేను **గుడికి వెళ్ళుచున్నాను**. అని తెలుగు భాషలో చెప్పిన ఎడల అందులో వింత లేదు. ఎందుకనగా 'గుడి' అనునది ఒక కట్టడమే. అట్లుగాక, ఆంగ్లభాషా పదమును "చర్చ్" అనుచు ఉపయోగించి. "నేను చర్చ్‌కు వెళ్ళుచున్నాను," అని చెప్పిన ఎడల నవ్వవలసినదే. ఎందుకనగా, ఆంగ్లమందు "చర్చ్" అనబడునది ఒక కట్టడము కాదు. మనుష్యులే, అనగా రక్షింపబడిన మానవులే. బైబిలులో "చర్చ్" అనుపదము మనుష్యులచే కట్టబడిన ఏ మందిరమునకు కూడ చెందుటలేదు. మనుష్యులు ఆరాధన కొరకు నిర్మించుకొనిన కట్టడములనే "చర్చ్" అనుచున్నాము. ఎంత పొరపాటు! ఒక "గుడిమీద బాప్టిస్ట్ చర్చ్" మరొక దానిమీద "మెథడిస్ట్ చర్చ్," ఇంకొక దానిమీద "దక్షిణ ఇండియా చర్చ్" అని ఇట్లు వ్రాయబడియుండుట కనబడును. ఒక కట్టడము ప్రభు రక్తముతో విమోచింపబడిన సంఘమగునా? గుడి, అనవలసిన దానిని, "చర్చ్" అనుటచేత, అనేకులకు "చర్చ్" -అనగా "సంఘము" యొక్క పరసంబంధమైన మర్మము అర్థము కాకున్నది.

అపొస్తలుడైన పౌలు, పత్రికలలో "కొరింథులో నున్న సంఘము"నకు, "ఎఫెసులోనున్న సంఘము"నకు, "ఫిలదెల్ఫియాలో నున్న సంఘము"నకు అనుచు మనుష్యులకు వ్రాసెనేగాని, ఈ గుడికి, ఆ దేవాలయమునకు అనుచు మనుష్యులచే నిర్మింపబడిన మందిరములకు వ్రాయలేదు. "చర్చ్" అని వ్రాసినపుడు పౌలు సజీవులైన విశ్వాసులకు వ్రాసెనే కాని నిర్జీవమైన ఇటుక, రాతి కట్టడములకు వ్రాయలేదు. మనము ఒక మందిరమును "బాప్టిస్ట్ చర్చ్" అనినచో పరిశుద్ధాత్ముని భాషను తప్పుగా ఉపయోగించితిమి. "బాప్టిస్ట్

మందిరము, ఆలయము, హాల్," ఈ విధముగా చెప్పిన యెడల అది సరియగును. "చర్చ్" అని బైబిలులో చెప్పబడిన వారు ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా విమోచింపబడిన స్త్రీ, పురుషులే. కావున "చర్చ్" అను పదము మరొక విధముగా ఉపయోగింపరాదు. అపొస్తలుల కార్యములలో "ప్రభువు అనుదినము రక్షణ పొందుచున్న వారిని సంఘమునకు చేర్చుచుండెను," అని యున్నది. (అపొ. కార్య. 2:47). ఈ ఆత్మలను తీసికొనిపోయి ఒక కట్టడమునకు అతికించలేదు. గాని ప్రభువైన యేసుక్రీస్తునందు విశ్వాసముంచి పరిశుద్ధాత్మను పొందిన ఒక గుంపుకు ఆయన చేర్చుచుండెను. ఆ సంఘము ద్వారానే దేవుని యొక్క నానా విధములైన జ్ఞానమును, శక్తియు ప్రత్యక్ష పరచబడవలసి యున్నది. పరలోక మందున్న దూతల ద్వారా కాదుగాని, క్రీస్తు రక్తము చేత విమోచింపబడిన ప్రజల ద్వారానే దేవుని వివిధ జ్ఞానము ప్రత్యక్ష పరచబడుచున్నది.

బహు నేర్పరియైన చిత్రకారుడొకడు తన స్నేహితునికి ఇచ్చిన ఒక ఈవిని నేను చూచియుంటిని. ఒకనాడు బజారులో అమ్మబడుచుండిన ఒక సాధారణమైన కుండను ఇతడు చూచి, ఒక కాణి వెల చెల్లించి ఇంటికి తెచ్చెను. కుంచెలను ఆయా రంగులలో ముంచి, ఆ కుండమీద ఇతడు చెట్ల యొక్క, పుష్పముల యొక్క, పొలముల యొక్క పటములను బహు సొగసుగా చిత్రించెను. చిత్రకారుడు ప్రతిదినము గంటల కొలది ఈ పనిని చేయుచుండగా నేను చూచితిని. ఎన్నో దినములకు ఆ పని పూర్తికాగా ఆ కుండను ఒక స్నేహితుని కడకు తెచ్చి, "ప్రియ స్నేహితుడా, నీకొక బహుమతి ఇదిగో," అనుచు దానిని ఇవ్వగా ఆ స్నేహితుడు బహుగా ఆనందించి, దానికి తన భోజనపు గది లోనికి వచ్చే వారికందరికి కనబడులాగున గోడ పై భాగములో నుంచెను. ఈ స్నేహితుని చూడవచ్చిన ప్రతి యొక్కరికి ఆ గదిలో మొట్టమొదట కనబడు వస్తువు ఈ కుండ. అందరు దానిమీద నున్న రమ్యమైన చిత్రములను

ముచ్చటతో చూచుచు వేయు మొదటి ప్రశ్న ఏదనగా: "ఇది ఎక్కడ దొరికినది? ఎంతకు కొన్నావు? ఇంత అందముగా ఈ పటాలను పెయింటింగ్ చేసిన వాళ్ళెవరు? ఆ కుండమీద ఇంత సొగసైన చిత్రములను వేసిన చిత్రకారుని జ్ఞానమును, నేర్పరితనమును, ఆ గోడ బల్లమీద నున్న ఆ వస్తువు వచ్చిన సమస్తమైన వారికి వెల్లడి చేయుచుండెను. ఆ కుండ యొక్క వెల ఎంత? ఒక్క కాణీ డబ్బు. అయితే దానియొక్క సరియైన విలువ ఆ చిత్రకారుని మహత్త్యమును ఎంతోమందికి వెల్లడి చేయుచున్నది.

ఎఫెసీ మూడవ అధ్యాయము 10వ వచనములో గల భావమిదే: "దేవుడు మన ప్రభువైన క్రీస్తుయేసునందు చేసిన నిత్య సంకల్పము చొప్పున పరలోకములో ప్రధానులకును, అధికారులకును, సంఘముద్వారా తన యొక్క నానా విధములైన జ్ఞానము తెలియబడవలెనని" దైవకృప వలన ప్రభువైన యేసుక్రీస్తు రక్తము ద్వారా మనము విమోచింపబడినపుడు ఒక ప్రవీణ చిత్రకారుని చేతిలోని మట్టి కుండలను పోలినవారము. తన నైపుణ్యము గల హస్తముతో, మనకు తెలియకుండనే మనమీద చిత్రములు పర సంబంధమైన చిత్రములు చిత్రించుచున్నాడు. మనుష్యులేమో మన నల్లని ముఖాలు, లావు పెదవులు, వికారమైన ముక్కులనే చూచుచున్నారు. ఇవి దేవుడు చూచుటలేదు. మనమీద తన పర సంబంధమైన చిత్రములు వేయుచుండు పని మీదనే ఆయన యొక్క గమనము. ఒక దినము రానై యున్నది. ప్రభువు మనలను తన పరలోకపు దూతల ఎదుట ప్రదర్శించి, "దూతలారా రండి. పౌలు అనబడు ఈ పాత్రను చూడుడి" అనును. అప్పుడు దూతలు దేవునితో ఇట్లందురు: "దేవా ఇతనిని ఇంత అందముగా ఎలాగు చేసితివి. హైదరాబాదు సంస్థానములో వీడు ఉన్నప్పుడు మేము చూచితిమి. పొట్టి గిడస, ఒక మంచి రూపమైనా లేదు. అతనిని ఎవరూ లెక్కచేయరు. ఇప్పుడీ సుందరాంగుడు వాడేనా? వికారమైన ఎంత నల్లని ముఖము వీనిది. అంత పనికిమాలిన పౌలును ఇంత సొగసైన

ానిగ ఎట్లు చేసితివి? అవును మనలను పరలోకమందు చూచి దేవదూతలు సహా ముచ్చట పడుదురు. కల్పనా కథలు నేను చెప్పడము లేదు. దేవుని వాక్యమందున్న సత్యమునే చెప్పుచున్నాను. మనము ప్రభువును ముఖాముఖిగా చూచి ఆయనను పోలియుండు ఆ సమయమున, పరలోక సమూహములు మనలను మెచ్చుకొందురు. పనికిమాలిన, బుద్ధిలేని, మలినమైన, ఒక దౌర్భాగ్య నరుని ఇంత సౌందర్యవంతునిగా దేవుడు ఎట్లు చేయగలిగెను? భూమిమీద నున్న ఒక చిత్రకారుడు ఒక సామాన్యమైన కుండను అంత సొగసు నివ్వగా, ఇట్టి అద్భుత కార్యమును దేవుడు చేయలేడా?

అనేక సంవత్సరముల క్రిందట నేను జపాను గుండా వచ్చునపుడు కోబీయను పట్టణమునకు వెళ్ళితిని, కోబిలో అనేక బజారులున్నవి. చాలా చక్కగా చేయబడిన బహు సొగసైన పాత్రలు ఎన్నో అమ్మ బడుచుండెను. అవి వేల కొలది రూపాయల ఖరీదు చేయును. "ఇవి తయారు చేయడము ఏలాగు? ఎక్కడ చేస్తారు? వెల ఎంత?" అని వాటి విషయము అడిగితిని. అంగడివాడు ఇట్లు ప్రత్యుత్తరమిచ్చెను: అయ్యా, రోడ్డు ప్రక్కలో పారవేయబడిన చెత్త కాగితాలతోనే ఇవి తయారుచేస్తాము. మురికిగా అసహ్యంగా ఉన్న పనికిమాలిన చిరిగిన కాగితములనే మేము ఈ వీధులు, ఆ వీధులు తిరిగి కనబడిన ప్రతి చిన్న కాగితపు ముక్కను ఏరి తెచ్చి ఒక యంత్రములో వాటిని వేస్తాము. ఆ యంత్రము వాటిని రుబ్బివేసి ఒక పలుచని ముద్దగా చేస్తుంది. ఆ ముద్దతో ఈ పాత్రలు తయారు చేస్తున్నాము. ఆ పదార్థాన్ని, 'పాపీర్ మాషా(Papier mache) అంటారు. ఆ పాత్రల మీద చేతితో వివిధమైన రంగు రంగుల చిత్రాలు వేస్తున్నాము. ఇది మీరు నమ్ముతారా?

నేడు భూలోకమందు జరుగుచున్నది కూడ ఇదియే. మురికి కాగితములతో నరుడు సుందరమైన వస్తువులు తయారు చేయగా, దేవుడు

మనకు అందము కలిగించలేదా?

మనము బైబిలు చదువునపుడు ఆదికాండము నుండి ప్రకటన వరకు కూడ దేవుడు వాస్తవముగా ఈ కార్యమే చేయుచుండుటయు, ఆరంభము నుండి అంతము వరకు తన పరలోక సంబంధమైన ఏర్పాటులు ఆ గ్రంథమందు విశదపరచుచుండుటయు చూతుము. దేవుడు సహాయము చేసిన కొలది, ఆయన తన సంకల్పమును ఈ సమయమందును ఏ విధముగా కొనసాగించుచున్నాడో చూచెదము. ఈ విషయమును మనసులో వుంచుకొని, దేవుని గృహమును గూర్చి పఠించుచు, దాని ద్వారా నిత్యత్వము నుండి దేవుడు తన మహిమను మనకును, మన ద్వారాను ఏ విధముగా బయలు పరచ నుద్దేశించి యున్నాడో చూచెదము.

# 2
# వాగ్దానము

లేఖనములలో రెండు భాగములు మనమిక్కడ చదువవలసి యున్నది. ఒకటి ఆదికాండము 28, రెండవది ప్రకటన 21. మొదటిది చూచెదము :-

యాకోబు అను నతడు భయముతో, హడలుతో ఇంటినుండి పరుగెత్తి పారిపోవుచుండుట ఇక్కడ మనకు కనబడుచున్నది. "మీ అన్న ఏశావు రేపో, మాపో నీ ప్రాణములు తీసేస్తాడు," అని ఒకరు అతనితో చెప్పిరి. యాకోబుకింక భయము పట్టుకొనెను. "ఏశావు నన్ను పట్టుకొని ఎప్పుడు చంపునో, ఎక్కడ చంపునో!" ఇదే యాకోబు తలంపు. తల్లివచ్చి ఇట్లనెను : "అబ్బాయి, ఏశావు నిన్ను ఏనాడో చంపేస్తాడని నాకు భయముగా ఉంది. నీవు ఇక్కడ నుండి మా అన్నగారి ఇంటికి కొన్నాళ్ళకు పారిపోయి, మీ అన్న కోపము చల్లారిన తరువాత తిరిగి రా," అనెను. తల్లిమాట ప్రకారము భయముతో యాకోబు ఇల్లు విడిచి పారిపోయెను.

దేవుడు యాకోబుతో నుండుట అతడైనను, తల్లియైనను చూడలేదు కాని దేవుడు అతనితోనే యుండెను. సంభవించిన ఈ విషయములన్నింటి యందును దేవుడెట్లు పనిచేయుచుండెనో ఇరువురికి తెలియదు. పరుగెత్తి అలసిపోయి, తుదకు పరుపు, దుప్పటి, తలగడయైనను లేక, యాకోబు క్రింద పండుకొని, దగ్గరనున్న ఒక రాయి తీసి తలక్రింద పెట్టుకొని నిద్రపోయెను. మంచి మెత్తని తలగడలున్నవారు సహా నిద్రపట్టక ఉందురు. యాకోబైతే

కష్టము లేక సుఖనిద్రలో మునిగెను. ఒక స్వప్నము కనెను. ఆకాశము తెరవబడి, భూమినుండి ఆకాశము వరకు ఒక నిచ్చెన వేయబడియుండుట చూచెను. పైకి క్రిందికి దేవదూతలు ఆ నిచ్చెన మీద ఎక్కుచు దిగుచునుండిరి. నిచ్చెన తలస్థానము దగ్గర నుండి దేవుడు మాట్లాడుచుండెను. యాకోబుకు అర్థముకాని ఆశ్చర్యకరమైన మాటలు ఆయన అతనితో చెప్పుచుండెను (ఆది కాం. 28:13,14).

ఎంతటి ఆశీర్వాదమును దేవుడు యాకోబుకు ఇచ్చుచున్నట్లు వాగ్దానము చేసెనో ఇచ్చట చూచుచున్నాము. "నీవు పండుకొనియున్న ఈ భూమిని నీకును, నీ సంతానమునకును ఇచ్చెదను. నీవు పడమటి తట్టును, తూర్పు తట్టును, ఉత్తరపు తట్టును, దక్షిణపు తట్టును వ్యాపించెదవు; భూమి యొక్క వంశములన్నియు నీ మూలముగా ఆశీర్వదింపబడును. నా వాగ్దానము లన్నియు నీలో నెరవేర్చబోవుచున్నాను" అని దేవుడు చెప్పెను, ఇంతకంటె ఎక్కువ మేలు యాకోబుకు దేవుడు చేయగలడా?

వచనములు 20-22 చదువగా, యాకోబు ఎంత అల్ప విశ్వాసియో కనబడుచున్నది. ఇంత గొప్ప వాగ్దానము దేవుడిచ్చుచుండగా, యాకోబు చెప్పినది ఏమి? నేను తిరిగి నా తండ్రి యింటికి క్షేమముగా వచ్చునట్లు దేవుడు నాకు తోడైయుండి, నన్ను కాపాడి, తినుటకు ఆహారమును, ధరించుకొనుటకు వస్త్రములను నాకు దయచేసిన యెడల, నీవు నాకిచ్చు యావత్తులో పదియవ వంతు నీకు చెల్లించెదను." ఇది యాకోబు జవాబు. దేవుని వాగ్దానములను అతడు ఇంతమట్టుకే నమ్మగలిగెను. ఆకాశము తెరవబడుట చూచెను. భూమ్యాకాశములను కలుపుచున్న నిచ్చెనను చూచెను. దానిమీద ఎక్కుచు దిగుచునుండిన దేవదూతలను చూచెను: నిచ్చెనకు పైగా దేవుడు నిలిచి, "నీకు సమస్తము నిచ్చెదను నీ సంతానము భూమిమీద (లెక్కకు) ఇసుక రేణువులవలె

నగును. నేను నీతో చెప్పినది నెరవేర్చు వరకు నిన్ను విడువను" అని చెప్పుట వినెను. అతడిచ్చిన జవాబేమి? "ప్రభువా, నాకు తినడానికి ఇంత అన్నము తొడుగుకొనుటకు ఒక అంగీని ఇస్తే చాలు. నీకెంతో వందనస్థుడ నవుదును." యాకోబు యొక్క విశ్వాసము చూచితే, దినమునకు ఎనిమిది ఔన్సుల అన్నమంత మాత్రము ఉన్నది. దేవుడు అన్ని ఆశ్చర్యకరమైన సంగతులు చెప్పుచుండగా, ఆ సమయమందు అతడు నమ్మగలుగుట అంత మాత్రమే. ఇది యాకోబు అంధత్వము. తాను చూచినది, వినినది అతనికి అర్థమే కాలేదు. అతడు గ్రహింపక ఉన్నంత మాత్రమున దేవుడు తన సంకల్పములను మార్చుకొనలేదు. నీవిట్లు అనవచ్చును : "ప్రభువా, నన్ను స్వస్థ పరిచినచో చాలును; నాకొక ఉద్యోగమిచ్చినచో చాలును. ఎంత చిన్న ఉద్యోగమైన సరే;" లేకుంటే, "ప్రభువా, నాకొక మంచి ఇల్లు దొరికేలాగున చేయి. నీకు ఇప్పుడు ఇచ్చే దానికంటే ఎక్కువ చెల్లిస్తాను." యాకోబు అర్థము చేసికొనక పోవుటకు కారణము ఆతని భయమే. అతని గుండెలు భయముతో నిండియుండెను; నిద్రలో కూడా భయాక్రాంతుడే, ఆ దినము ఎంత వడిగా నడచి, ఎన్ని మైళ్ళ దూరము వచ్చి యుండినను, ఏశావు తన్ను వెంటాడుచుండెనని ఊహించెనేమో! లోపలి భీతి చేత, దేవుడు చెప్పుచున్నదేమిటో గ్రహించ లేకపోయెను. మనము భయాక్రాంతులమై యుండునంత కాలము, దేవుడు చెప్పుచున్నదేమిటో గ్రహింపజాలము. అన్ని సమయములందు కూడ నానా విధములుగా అపవాది మనలను భయపెట్టుచుండును. దేవుని సంకల్పములను, ఏర్పాట్లను మనము గ్రహించకుండ ఆటంకపరుచునది ఈ భీతియే. దేవుడు చెప్పిన దానిని యాకోబు గ్రహించుటకు పూర్వము కఠినమైన అనేక పాఠములను నేర్చుకొనవలసి యుండెను. భయము నుండి యాకోబు విడుదల పొందుటకు, 20 సంవత్సరముల పైగా పట్టెను. దీనిని బట్టి, "ఈ పాఠము నేర్చుకొనుటకు యాకోబుకు 20 ఏండ్లు పట్టినది కదా? నేను దానిని నేర్చుకొనుటకు నాకు ఒక

20 ఏండ్లు అవసరము లేదా? అని మనము అనకూడదు. మన హృదయములందు క్రీస్తు యొక్క ప్రేమ వెదజల్లబడి యుండగాను, మనకు సమస్తమును బోధించుటకై పరిశుద్ధాత్మ యుండగా, మనము వెంటనే భయమంతటిని వదలు కొనవలెను.

దేవుడు యాకోబుకు చెప్పినది అతడు అప్పటికి గ్రహించలేదు గాని, ఆ రాత్రి ఎంత స్పష్టముగా తన ఏర్పాటును దేవుడు యాకోబుకు తెలిపెనో, అది ఈనాడు మనము తెలిసికొనుచున్నాము. దేవుడు ఇట్లు చెప్పెను : "నా హృదయము లోపల చూచి, నీ కొరకు నాకెట్టి గొప్ప సంకల్పములు గలవో తెలిసికొనుము." యాకోబుకు నిద్రమత్తు తీరగానే తనకు పూర్తిగా అర్థము కాని మాటలు ఏవో కొన్ని పలికెను. "ఇది దేవుని మందిరమే....ఇదే పరలోకపు గవిని" అనెను. ఈ మాటలు అతని ద్వారా చెప్పించినది పరిశుద్ధాత్మయే. వాటి అర్థమేనగా, యాకోబు చూచిన దానిని "దేవుని మందిరము" అని చెప్పుటకంటె, ఇంకొక విధముగా వర్ణించుటకు వీలుకాదు. అక్కడేమైనా ఒక కట్టడము ఉండెను గనుకనా? అయితే, దేవుడు యాకోబుకు చెప్పినది ఈ రీతిగానే యుండెను : "యాకోబూ, నీకు గొప్ప ఆశీర్వాదము ఇవ్వబోవుచున్నాను. నీవు ఎప్పుడైతే, నా మందిరమనగా ఏమిటో, దానిని నిర్మించుట ఎట్లో అని గ్రహింతువో అప్పుడే ఈ ఆశీర్వాదమును తెలిసికొందువు. అప్పుడే నేను నీకిచ్చుచున్నది ఏమిటో నీవు గ్రహింతువు."

దైవబోధన వలన, దేవుని మందిరమనగా నేమిటో మనము గ్రహించినప్పుడే, ప్రభువైన యేసుక్రీస్తు చేతినుండి మనమెంత ఆశీర్వాదము పొందగలమో తెలిసికొన శక్తిమంతుల మగుచున్నాము. "దేవుని మందిరము, దేవుని మందిరము," అను మాటలు యాకోబు ఎన్నటికిని మరచియుండడు. అందుచేతనే, ఆ స్థలమునకు "బేతేలు" అని పేరు పెట్టెను. దాని అర్థము,

దేవుడు యాకోబునకు ఇస్తానసిన స్థలము మాత్రమే కాదు; ఆయన యొక్క వాగ్దానము, ఆశీర్వాదముల పరిపూర్ణత కూడ అందులో కలిసియున్నవి. "భూమియొక్క వంశములన్నియు నీ మూలముగాను, నీ సంతానము మూలముగాను ఆశీర్వదింపబడును" (ఆది కాం. 28:14)

ఎటువంటి వాగ్దానమో! "నీ మూలముగా .... భూమియొక్క వంశములన్నియు ఆశీర్వదింపబడును!" దేవుడు ఈ విధముగా చెప్పియుండినను కూడ అర్థము మాత్రము అదే! "నేడు మొదలు నీ మూలముగానే తప్ప, నేనింకెవరికిని ఆశీర్వాదము ఇవ్వను" అదే దేవుని వాగ్దానము: "యాకోబూ, భూమి మీద నున్న జనములు నా యొద్దనుండి ఆశీర్వాదము పొందగలుగుట నీ మూలముగాను, నీ సంతానమైన వాని ద్వారాను మాత్రమే." అప్పుడప్పుడు బజారులో, ఏదో ఒక అంగడియందు ఫలాన వస్తువు అమ్మబడుచున్నది. "అయ్యా, ఈ ప్రదేశానికంత ఈ వస్తువు యొక్క వ్యాపారము మాదే" అని అంగడివాడు నీతో చెప్పును. ఇట్లే దేవుడు యాకోబుతో ననుచున్నాడు. "యాకోబూ, నేను నీకెట్టి ఆశీర్వాదము ఇవ్వనున్నాననగా, భూమిమీద నున్న ఇతర జనములెవరును, నీ ద్వారానే తప్ప, నా ఆశీర్వాదమును ఇంకొక విధముగా పొందజాలరు."

దేవుడు చెప్పినది, నెరవేర్చు ఉద్దేశముతోనే చెప్పెనా? బైబిలులో వ్రాయబడియున్న సమస్త వాక్యములను, దేవుని సంపూర్ణ అధికారము మీద చెప్పబడియున్నవి. బైబిలులో అనవసరమైన వాక్యము ఒక్కటైనను లేదు. తాను చెప్పునది ఏమో, నెరవేర్చు ఉద్దేశముతోనే దేవుడు చెప్పుచున్నాడు. దేవుడిచ్చు సమస్త ఆశీర్వాదము ఎవనికైనను, ఎక్కడైనను, యాకోబు ద్వారా మాత్రమే లభించును. ఆహారము, వస్త్రము, డబ్బు మొదలైన ఇహలోకపు వస్తువులకును, ఈ ఆశీర్వాదమునకును సంబంధము లేదు. నిత్యత్వమునకు

చెందిన ఆశీర్వాదమును గూర్చియే దేవుడు మాట్లాడెను; ఆయన సంఘము కొరకు కూడ ఆయన పరలోక ఏర్పాటు ఇదే.

క్రీస్తునందు యాకోబుకు ఒక క్రొత్త ఆత్మీయ సంతానము బయలుదేరి యున్నది. క్రీస్తునందు మన పరలోకపు పరిచర్యను మనము సరిగా గ్రహించినప్పుడే ఇది మనము తెలిసికొనుచున్నాము: దేవుడు తన సంఘమగు దేవుని నిజ మందిరమును గూర్చియే తెలుపుచున్నాడు. అనగా, తన సంఘము ద్వారా, తన సంఘములోనే ఇతరులకు దేవుడు ఈ ఆశీర్వాదమును ఇవ్వ గలుగుట ఆదినుండియు ఆయన ఏర్పాటు ఇదే: అంతమునకు మనము వచ్చినప్పుడు చూచునది కూడ ఇదే (ప్రకటన 21వ అధ్యాయము చూడుము).

# ౩

# దర్శనము

యాకోబు జీవించిన కాలము తరువాత కొన్ని శతాబ్దములు గడిచెను. 420 సంవత్సరములు ఐగుప్తులో దాసులుగాను, బానిసలుగాను ఉండిన అతని సంతతివారగు ఇశ్రాయేలీయులను దేవుడు విడిపించినప్పుడు, బేతేలులో యాకోబుకు ఆయన ప్రత్యక్ష పరచిన తన సంకల్పమును వారికి జ్ఞాపకము చేసెను. పర్వతము మీద దేవుడు మోషేకు మందరము యొక్క మచ్చును కనబరచినప్పుడు అదికాండము 28లో అయన యాకోబుకు చెప్పిన సంగతి మరింత విశదముగా తెలిపెను. నిర్గమకాండము 24వ అధ్యాయములో ఈ ప్రత్యక్షతకై మోషేను సిద్ధపరచుటకు, అతడు పొందవలసి యుండిన అనుభవములు కొన్ని చెప్పబడియున్నవి. దేవుని యొక్క ఏర్పాటేమిటో ఆత్మీయముగా చూడవలెనంటె, ఎవరైనను సరే ఎన్నో అనుభవములగుండా వెళ్లవలెను. దేవుడు నివసించుటకు ఒక పరిశుద్ధ స్థలమును నిర్మించుటను గూర్చి 28వ అధ్యాయము, 8 వచనములో ఆయన మాట్లాడుచున్నాడు. దేవదూతలు పరలోకమునుండి వచ్చుచుండుటను యాకోబు చూడగా, ఆ పరమదృశ్య మంతటిని, "దేవుని మందిరము" అనెను. ఇప్పుడు మోషేతో దేవుడు ఇట్లనుచున్నాడు : "కొండనెక్కి ఇక్కడకు రమ్ము, యాకోబు చూచిన దర్శనమును మరికొంత నీకు ప్రత్యక్ష పరచెదను." దేవుని ఏర్పాటు యొక్క వివరములను యాకోబు చూచి యుండలేదు. అంతకంటే ఎక్కువగా చూచుట మోషేకు ప్రాప్తించెను.

మేఘముతో కప్పబడియుండిన కొండనుండి మోషే అనేకమైన వాటిని

చూచెననియు, వీటిలో నొకటి దాని మహిమతో నుండిన దేవుని మందిరమనియు చదువుచున్నాము. మోషే కొండదిగి వచ్చి, ఇశ్రాయేలీయులతో నిట్లనెను; "కొండమీద విచిత్రమైన సంగతులు చూచితిని. ఎంతో రమ్యముగా నున్న ఒక పరలోకపు మందిరమును దేవుడు నాకు కనుపరచెను. తన ప్రజలైన మీరు దానిని నిర్మించుటలో పాలు పొందుదురని దేవుడు నాతో చెప్పెను." మోషే ఏమనుచుండెనో అది అంతయు వారికి అర్థము కాలేదు. హెబ్రీయులు 3:1-6 .చూడగా, మోషే యొక్క గ్రహింపు శక్తినే దేవుడు మరింత లోతుగాను, హెచ్చుగాను చేసెనని తెలియుచున్నది. హెబ్రీయులలో మనము ఇంకొక విషయము చూచుచున్నాము; ఇప్పుడు దేవుడు ఏ మందిరమును కట్టుచున్నాడో, దాని యొక్క ఛాయనే కొండమీద మోషేకు ఆయన చూపెనని అపొస్తలుడు (హెబ్రీ 3:6) లో చెప్పినట్లు ధైర్యమును, నిరీక్షణ వలని ఉత్సాహమును తుదమట్టుకు స్థిరముగా మనము చేపట్టిన యెడల మనమే క్రీస్తు యొక్క ఇల్లుగా నున్నాము.

ఈ గృహము నిర్మించుటలో మనకొక వంతు దేవుడు ఎట్లు ఇవ్వగలడు? మన ప్రభువైన యేసుక్రీస్తు, పేతురుతో ఏమనెనో జ్ఞాపకము చేసికొనుము. "ఈ బండమీద నా సంఘమును కట్టుదును" (మత్తయి 16:18). అంతకు ముందే పేతురును ఈ ప్రశ్న అడిగి యుండెను : "మీరైతే నేను ఎవడనని చెప్పుకొనుచున్నారు?" నీవు సజీవుడగు దేవుని కుమారుడైన క్రీస్తువు"అని పేతురు ప్రత్యుత్తరము చెప్పి యుండెను. అందుకు ప్రభువు అతనితో నిట్లనెను : "పేతురూ, రక్తమాంసముల వలన నీకిది బయలుపరచబడలేదు. నేను ఎవరు అనునది నీకు బయలు పరచినది పరలోకమందున్న నా తండ్రియే. ఈ ప్రత్యక్షత మీదనే నా సంఘమును కట్టబోవుచున్నాను."

పేతురు ఎముకల మీద ప్రభువు తన సంఘమును నిర్మించునని రోమన్ కేథలిక్ వారు చెప్పుదురు, వారు ఎంత గ్రుడ్డివారో! పేతురునందు ఏ

ప్రత్యేక సౌశీల్యమును లేదు. ప్రభువు చెప్పిన దాని అర్థము యేమనగా "నా విషయము నీకు కలిగిన ప్రత్యక్షత ఉన్నదే, దాని మీదనే నాసంఘమును నేను నిర్మింపబోవుచున్నాను." పేతురు శరీర రీతిగా ప్రభువును ముఖాముఖిగా చూచుచుండెను గాని, ఆయనకు బయలు పరచబడిన ప్రత్యక్షత పేతురు ప్రభువుతో మాట్లాడుట, నడచుట వలన కలిగినది కాదు. ఏ మానవ తెలివితేటల వలన అతడు దానిని పొందలేదు. పరలోకము నుండియే అది అతనికి ఇవ్వబడెను. ప్రభువు ఏమనెనో చూడుడి: "పేతురూ, రక్తమాంసముల వలన కాదుగాని, పరలోకమందున్న నా తండ్రి వలననే నీకిది బయలుపరచబడెను. గనుక, క్రీస్తు ఎవరైయుండెనో, ఆ ప్రత్యక్షత మీదనే ఆయన సంఘము కట్టబడియున్నది. ప్రభువైన యేసుక్రీస్తును, దైవదర్శనము ద్వారా ఎంత అధికముగా తెలిసికొందుమో, అంత ఎక్కువగా ఆయన మందిరమును కట్టుచున్నాము. రాళ్ళతో గాని ఇటుకలతో గాని, మట్టి లేక వెదురుతో గాని మనము ఆ మందిరమును కట్టుట లేదు, ఈ పదార్థములతో దేవుని మందిరమును కట్టము. ప్రభువైన యేసుక్రీస్తు యొక్క మహాత్మ్యమును, దైవిక పద్ధతులతో బయలు పరచుట ద్వారానే, 2 కొరింథీయులు 5:16లో అపొస్తలుడు ఇట్లనుచున్నాడు: అనగా, కొందరు శరీరరీతిగా ప్రభువును ఎరిగి, "మేము ఆయనను చూచియున్నాము, ఆయనతో నడచియున్నాము, ఆయనతో భుజించియున్నాము, ఆయనతో నివసించియున్నాము." అని చెప్పగలిగినను, ఇంకను ఆ విధముగా ఆయన పరిచయము వారికి దొరకదనియు, అందుచేత ఆత్మతో ఆయనను తెలిసికొని ఆత్మలోనే ఆరాధింతురనియు, ఇప్పుడు మనకు కావలసినది క్రీస్తు యొక్క శారీరక దర్శనము కాదు గాని ఒక ఆత్మీయమైన ప్రత్యక్షతయే; తానిచ్చు ప్రత్యక్షత ద్వారా మనము మన ప్రభువును ఎరిగిన కొలది, దేవుని మందిరమును కట్టుటకై అంతకంతకు అధికముగా సామాగ్రిని తేగలము. తార్సువాడైన సౌలు దమస్కునకు ప్రయాణము చేయుచుండగా దారిలో ఒక గొప్ప వెలుగును చూచి, ఒక స్వరమును వినెను. అతడు వెంటనే

నేలమీద పడెను. అతని దృష్టి పోయెను. మూడు దినముల వరకు సౌలు గ్రుడ్డివాడుగా నుండెను. "అవును, వెలుగు ప్రకాశించుట చూచితిని, దేవుని స్వరము వింటిని," అనే అనుభవము మీద సంఘమును కట్టలేదు.

అటు తరువాత ప్రభువైన యేసుక్రీస్తు ఎవరో, అతడు తెలిసికో నారంభించెను. ఇందు నిమిత్తము అతడు అరణ్యములోనికి వెళ్ళవలసివచ్చెను (గలతీ. 1:15-17). సంఘమనగా ఏమిటో, దాని ఆత్మీయ అర్థమును ఈ అరణ్యమందే అతడు గ్రహింపసాగెను. దేవుని వెలుగు ఆ అరణ్యమందు అతనికి ఆత్మీయ దృష్టిని, ప్రత్యక్షతను ఇచ్చెను. బైబిలులోని సంగతులు మనకు తెలిసియుండుటను బట్టియు, మనము సహజముగా బుద్ధికుశాగ్రతలు అను వరములు గలవారము అని దానికి బట్టియు, సంఘము యొక్క మర్మమును గ్రహించగలమని తలంచవద్దు. అది అసాధ్యము. సంఘము యొక్క మర్మమును మనము లోకములో సంపాదించిన జ్ఞానముతో తెలిసికొనజాలము. పరిశుద్ధాత్మ ద్వారా, దేవుని వాక్యము మన ఆత్మలో ప్రత్యక్షమగుట దీనికి అవశ్యకము! అటువంటి ప్రత్యక్షతను పొందవలెనంటే రూపాంతరము చెందునంతటి లోతైన ఆత్మీయ అనుభవము కావలసియున్నది, "నలుగగొట్టబడి విరగ గొట్టబడుట" అందుమే, అట్టి అనుభవము.

దేవుడు ఈ విధముగా నీతో చెప్పుచుండినది నీవు గ్రహించుటకు ఒక దినము వచ్చును : "ముందుకు, నీ కొరకు ఒక గొప్ప విషయము కనిపెట్టుచున్నది. అదేమనగా, క్రీస్తు తన సంఘమును నిర్మించుచుండగా, ఆ కా[illegible]మందు నీకొకవంతు లభించగలదు." అప్పుడు పౌలువలె నీవు కూడ ఇట్లందువు: "వెనుక ఉన్నవి మరచిపోయి ముందున్న వాటి కొరకై వేగిరపడుచు, క్రీస్తుయేసునందు దేవుని పరసంబంధమైన పిలుపునకు కలుగు బహుమానమును పొందవలెనని గురియొద్దకే పరుగెత్తుచున్నాను." (ఫిలిప్పీ: 13-14)

ఈ సత్యమే మరింత స్పష్టముగా ప్రకటన గ్రంథములో బయలుపరచబడి

యున్నది. దేవుని ఆలయము, పరలోకపు మందిరము, దేవుని పవిత్ర నగరము, పరలోకమునుండి క్రిందికి దిగుచున్న దృశ్యమును మనము అందు చూచుచున్నాము. కట్టబడుచున్నది ఏమిటో, అది పరలోకమందు సమాప్తమైయుండి, సమస్తమైన వారును దానిని చూచు నిమిత్తము పరలోకము నుండి "క్రిందికి దిగి" రానున్నది. అయితే, ఆ దినము వచ్చునంతలో, పాతవన్నియు గతించియుండును (ప్రకటన 21:5) అప్పుడే నీవు పరమ యెరూషలేమును, దేవుని పరిశుద్ధ స్థలమును, దేవుని మందిరము ఏమైయున్నదో దాని పూర్ణ మహిమతో చూడగలవు ఇప్పుడు భూమిమీదనైనా దీనినే చూడగలము (2 కొరింథీ 5:17). నీ పాత జీవితమును విడిచి పెట్టుటకు సమ్మతించుచున్నావా? అయినచో, దానిని పూర్తిగా విసర్జించవలెను. పాత జీవితము నంతటిని వదలుకొని నిన్ను సరిక్రొత్త వ్యక్తిగా ఆయనను చేయనిమ్ము.

పాతవన్నియు జాగ్రత్తగా దాచిపెట్టుకొనువారిలో కొందరిని నే నెరుగుదును. 5 ఏండ్ల నుండి పదియుండు వార్తాపత్రికలు, మ్యాగజైనులు వారి ఇండ్లలో కనబడును. 10 ఏండ్లనుండి పడియుండు డబ్బాలు, సీసాలు కూడా చూడవచ్చును. 15 సంవత్సరముల క్రిందటనో, 20 సంవత్సరముల క్రిందటనో, వారు తొడిగిన పాత వస్త్రములు, జోళ్ళు మొదలైన వాటిని గూర్చి ఇక చెప్పనేలేము. పాతవన్నింటిని ఇట్లే దాచి పెట్టుకొనుచున్నారు. ఎందుకని ప్రశ్నించితివా, "ఎప్పుడైనా అవి పనికిరాగలవు" అని ప్రత్యుత్తర మిచ్చుచున్నారు. పాత పెట్టెలు, పుస్తకములు, పరాయిలు చొక్కాలు నీవు కూడ ఇట్లే దాచి పెట్టుచున్నావా? నీవు, ఈ వస్తువులను వదులుకొనజాలకున్నావు, ఇదే విధముగా, పాత అభ్యాసములను, మునుపటి చెడు స్నేహములను, పూర్వపు దురాశలను అంటి పెట్టుకొనియున్నావు.

అయినను పాతవన్నియు గతించిపోవలెను. దేవుని మందిరమును కట్టుటలో నీకొక భాగము కావాలంటే, పాత వాటిని పోనిచ్చి వాటన్నింటి నుండి

విడిపించుకొని, నీవు స్వేచ్ఛగా పని చేయగలుగుటకు సిద్ధపడవలెను. చెడుగును ప్రవేశ పెట్టించునట్టి సమస్తమును విడిచి పెట్టవలెను. వాటికి బదులుగా నిత్యానందము, నిత్య సమాధానము నిచ్చు వాటిని తెచ్చి పెట్టవలెను.

ఎవరితోనో, నీకున్న స్నేహమును గూర్చి నీకు కొంత సందేహము కలిగెను అనుకొనుము. దీనికి తెంపు కావలెనని ఒకప్పుడు తలచుచున్నావు. మరొకప్పుడు, "తెంపు ఏల!" అనుకొనుచున్నావు. దేవుని దగ్గరకు వెళ్ళి ఆయన చిత్తము తెలిసికొను వరకు, ఇట్లే చపల చిత్తుడవుగా నుందువు. ఆయనను ఇట్లు అడుగుము: "ప్రభువా నా జీవితములో ఈ స్నేహము నిత్యానందము కలిగించునా? నాకున్న ఫలాని అభ్యాసము వలన నాకు నిత్యానందము నిత్య సమాధానము కలుగునా? ఈ రీతిగా ప్రార్థించవలెను. జవాబు వచ్చెనా, దాని ప్రకారమే వెళ్ళవలెను. ఇట్టి ప్రార్థన కంటె నీ సంశయము తీర్చుకొనుటకు ఇంకొక సులభమైన పద్ధతి లేదు. పొందికను చెరుపగల సమస్త అభ్యాసములు, సమస్త స్నేహములు, సమస్త సహవాసము, సమస్త అపేక్షలు వదలి పోవలెను. వాటికి బదులుగా క్రొత్తవైన సమస్తమును పరిశుద్ధాత్మ ఇచ్చును. క్రొత్త అలవాట్లు, క్రొత్త కోరికలు, క్రొత్త స్నేహములు.

ప్రభువు ఇట్లనుచున్నాడు: "ఇదిగో సమస్తమును నూతనమైనవిగా చేయుచున్నాను" (ప్రకటన 21:5). దేవుని మందిరమందు నూతనమైనవి మాత్రమే ఉండవలెను. పాత సరుకులేవియు ఈ మదిర నిర్మాణమునకు పనికిరావు. ఇదొక సులభమైన సూత్రము. మందిరము విషయమైన పాఠము నుండి నీవు నేర్చుకొన గలిగినవి ఏమనగా, దేవుని యొద్దకు నూతనమైన సామగ్రి తెచ్చు విధము. దేవుడు మనకు తన పరమ ఏర్పాటును బయలు పరచునుగాక.

# 4

# మందిరము యొక్క మాదిరి

ఆకాశ పక్షి యొకటి పై నుండి ఈ మందిరమును చూచి యుండిన యెడల దానికది ఎట్లు కనబడియుండును? మందిరమును గూర్చి మరికొంత సంపూర్ణముగా చెప్పుకొనవలెనంటే, పక్షి చూచునది మనము కూడ చూడవలెను. నిర్గమ కాండము 24,25 అధ్యాయములను ఒక్కొక్క వచనముగా మనము పఠించి, అక్కడ చెప్పబడిన ప్రతి వివరమును గమనముతో చూడవలెను.

మందిరపు అతి పరిశుద్ధమైన స్థలమందు ఉంచబడిన మందసమును గూర్చి ముందుగా చదివెదము (నిర్గమ. 25:10-22). తుమ్మ కఱ్ఱతో చేయబడిన పెట్టె యొకటి ఊహించుము. దాని కొలతలు: పొడవు 2.5 మూరలు, వెడల్పు 1.5 మూరలు, ఎత్తు 1.5 మూరలు. ఒక మూరకు దాదాపు 20 అంగుళములుండును. 2.5 మూరలు అనగా, రమారమి 50 అంగుళములు. ఈ తుమ్మకఱ్ఱ పెట్టె చెక్కలు వెలుపల, లోపల కూడ బంగారు రేకుతో పొదగింపబడి యుండెను: మేలిమి బంగారుతోనే చేయబడిన పెట్టెమూత, దేవుని 'కరుణా పీఠము' అయి యుండును. ఈ కరుణా పీఠము చేయబడిన మేలిమి బంగారుతోనే చేయబడిన పెట్టెమూత, దేవుని 'కరుణాపీఠము' అయి యుండును. ఈ కరుణాపీఠము చేయబడిన మేలిమి బంగారముతో ఏకాండముగా, రెండు కొనలలోను చెరియొక బంగారు కెరూబు చేయబడి యుండెను. ఈ రెండు కెరూబుల మధ్య నుండియే దేవుడు మాట్లాడుచుండెను.

ఈ మందసము ఉంచబడిన మందిరపు వెనుకటి భాగము పేరు అతి పరిశుద్ధ స్థలము. దీని ఎదుట, ఇంతకంటె పెద్ద గది యొకటి యుండెను. దీనికి "పరిశుద్ధ స్థలము" అని పేరు. ఈ భాగమందు ఉంచబడిన సామానులు ఏవనగా దీప వృక్షము, ధూపవేదిక, మరియు సముఖపు రొట్టెబల్ల (నిర్గమ 25:23-29; 30:1-6). పరిశుద్ధ స్థలము నుండి అతి పరిశుద్ధ స్థలమును వేరుచేయుచు ఒక అడ్డతెర ఉండెను (నిర్గమ. 26:31-33).

మందిరము పైని గుడారము దేనితో చేయబడి యుండెనో చక్కగా గమనింపుము. మందిరపు గోడలు చెక్కలతో చేయబడి యుండెను. అయితే పైకప్పు పెంకులతోగాని, కఱ్ఱతోగాని చేయబడక, తెరలతో చేయబడి యుండెను (నిర్గమ. 26:1). ఒకదానిమీద నొకటిగా, నాలుగు తెరలు మందిరము యొక్క పైకప్పుగా నుండెను. అడుగున ఉన్న తెర పొడవు 28 మూరలు, ఇది పేనిన సన్నపు నారతో చేయబడి యుండెను. అయితే ఇదంతయు ఒకే ముక్కగా నుండక, 28 మూరల పొడవును 4 మూరల వెడల్పును గలిగిన పది తెరలు ఒకదాని ప్రక్కన ఇంకొకటి చేర్చి కలపబడి ఒక పెద్ద తెరగా ఏర్పడెను (నిర్గమ 26:1-6). ఈ పది ఏడి తెరలు ఐదు వేరుగాను, మరొక ఐదు వేరుగాను ముందుగా కూర్చబడి, పిమ్మట ఈ రెండు కూర్పులును కలుపబడెను. ఇవన్నియు ఒకటితో నొకటి చేర్చబడుటకు నీలి నూలు కొలుకులును, బంగారు గుండీలును ఉపయోగింపబడెను. ఇట్లు ఇవన్నియు ఒక పెద్ద తెరగా చేయబడి మందిరము మీద పై కప్పుగా వేయబడినప్పుడు అన్నివైపుల క్రిందికి కూడ వ్రేలాడెను. ఈ విధముగా అవి మందిరము మీద ఒకటే గుడారమాయెను.

ఆ సన్న నారలో నీల, ధూమ్ర, రక్త వర్ణములు గల నూలు పేనబడెను. దానిమీద చిత్రకారుని పనియైన కెరూబులు చేయబడి యుండెను. అడ్డ తెరను మరియు మందిరపు ద్వారమందు వ్రేలాడు తెరను, అవరణము యొక్క

గుమ్మము మీద వ్రేలాడు తెరను కూడ, ఈ వస్తువులతోనే చేసిరి. ఒక్కొక్క కొలత నుండియు, ఆ 50 కొలుకులు, 50 బంగారు గుండీల నుండియు రమ్యముగా కుట్టబడిన కెరూబుల నుండియు, మనమెంతో నేర్చుకొనవచ్చును గాని, ఈ వివరముల కొరకు ఇప్పుడు ఆగలేము. ప్రతి చిన్నదాని నుండి కూడ ప్రభువైన యేసుక్రీస్తును గూర్చి నేర్చుకొను పాఠములున్నవి.

పైన చెప్పబడిన అడుగు తెర తరువాత, మందిరము పైన గుడారముగా మేక వెంట్రుకలతో చేయబడిన రెం... పరాస తెరలుండెను. ప్రతియొక దాని పొడవు 30 మూరలు, వెడల్పు 4 మూరలు (నిర్గమ. 26:7-13). పదికావు, ఇవి పదకొండు తెరలు. అయిదు ఒకటిగాను, ఆరు ఒకటిగాను, ఒకదాని ప్రక్కన ఇంకొకటి చేర్చబడి యుండెను. ఇవన్నియు ఏకముగా, మందిరము యొక్క "గుడారము"గా నుండెను. ఈ తెరలను కూర్చుచేయు గుండీలు ఇత్తడివేగాని, బంగారువి కావు. ఇందులో కూడ ఒక అర్థమున్నది. ఈ తెరలందు మిగిలిపోయిన భాగములు కూడి మందిరము ప్రక్కలలో వ్రేలాడుచుండును. ఈ మేక వెంట్రుకలతో చేసిన పై కప్పు మీదుగా మూడవ పై కప్పు ఒకటి యుండెను. ఇది ఎర్రరంగు వేసిన పొట్టేళ్ళ తోళ్ళతో చేయబడియుండెను. అన్నింటి మీదుగా సముద్ర వత్సల తోళ్ళతో చేయబడిన పై కప్పు ఒకటి యుండెను. ఇదే కడపటిది (నిర్గమ. 26:14).

ఇప్పుడు ఈ తెరలన్నింటిని ఒకమారు చూచెదము. అన్నింటిలో దిగువది, సన్నవారతో చేయబడిన "మందిరము." దీనికి మీదుగా మేక వెంట్రుకలతో చేయబడిన "గుడారము" అను తెర, దీనికి మీదుగా ఎర్రరంగు వేసిన పొట్టేళ్ళ తోళ్ళతో చేయబడిన పై కప్పు. అన్నింటి మీదుగా సముద్ర వత్సల తోళ్ళతో చేయబడిన తెర మిగలిన వాటినంతయు కప్పుచుండెను.

గోడలు కట్టుటకు ఎవరైనను సాధారణముగా ఉపయోగించునవి

ఇటుకలు, రాళ్ళు. అయితే, మందిరము యొక్క గోడలు బంగారు రేకుతో పొదిగింపబడిన తుమ్మకర్ర పలకలేయని చెప్పబడి యున్నది (నిర్గమ. 26:15-30). ప్రతి పలక ఎత్తు 10 మూరలు, వెడల్పు 1.5 మూరలు ఉత్తరవైపు 20 పలకలు, దక్షిణవైపు 20 పలకలు, పడమటివైపు 8 పలకలు. దీనిని బట్టి చూచితే, మొత్తమున మందిరము యొక్క పొడవు 30 మూరలు, ఎత్తు 10 మూరలు, వెడల్పు 12 మూరలు. ఇవే దానియొక్క కొలతలు, ఒక్కొక్క పలక క్రింద రెండేసి కుసులు, మరియు ఈ కుసులకు చెరియొక వెండి దిమ్మ. వీటి అర్థము తర్వాత చూతుము.

మందిరము లోపలి వెనుకటి భాగము అతి పరిశుద్ధ స్థలమనియు దాని ముందు భాగము పరిశుద్ధ స్థలమనియు చూచియుంటిమి. యాజకులు పరిశుద్ధ స్థలములో ప్రతి దినము ప్రవేశింతురు. అక్కడ వారు చేయవలసిన పని దీపములు వెలుగుచునే యుండునట్లు చూచుట, రాత్రింబగళ్ళు ధూపములు వేయుట, వారమున కొకమారు సముఖపు రొట్టెలను మార్చుట. అయితే అడ్డతెర వెనుకనున్న అతి పరిశుద్ధ స్థలములోనికి ప్రధాన యాజకుడు తప్ప మరెవరును ప్రవేశించరాదు. ప్రధాన యాజకుడైన సంవత్సరమునకు ఒకసారి మాత్రమే అందు ప్రవేశించును. మన ప్రభువు కాలమున యెరూషలేములో నుండిన దేవాలయములో కూడ ఇట్టి తెర యుండెనని మీరెరుగుదురు. మరియు సిలువ మీద ఆయన ప్రాణము విడిచినప్పుడు, ఈ తెర పై నుండి క్రింది వరకు రెండుగా చినిగెననియు కూడ ఎరుగుదురు. యేసు రక్తము ద్వారా అతి పరిశుద్ధ స్థలమున ప్రవేశించు మార్గము మనకు తెరువబడెను అనునదియే, అడ్డతెర చినిగిపోవుట యొక్క అర్థము (హెబ్రీ. 9:12).

మందిరమునకును, దాని ఆవరణము యొక్క ప్రధాన గుమ్మమునకును మధ్య నొక బలిపీఠ ముండెను: దీని పొడవు 5 మూరలు, వెడల్పు 5 మూరలు,

ఎత్తు మూడు మూరలు. ఈ బలిపీఠము తుమ్మ కర్రతో చేయబడి ఇత్తడి రేకుతో పొదిగింపబడి యుండెను (నిర్గమ. 27:1-8). దీనికి సమీపముగా నొక ఇత్తడి గంగాళముండెను (నిర్గమ. 30:17-21). బంగారమును ఖర్చు పెట్టలేక, దీనిని ఇత్తడితో చేసిరని అనుకొనవద్దు. ప్రజలు తెచ్చిన బంగారము అత్యధికముగా నుండినందున 'ఇక బంగారము తేవద్దు,' అని మోషే వారితో చెప్పియుండెను. బంగారమును ఖర్చు పెట్టలేక కాదుగాని, ఈ బలిపీఠమును ఇత్తడి రేకుతో కప్పుటకు ఒకానొక కారణముండెను. ఇత్తడి దిమ్మలమీద నిలువ బెట్టిన స్తంభములకు వ్రేలాడగట్టిన సన్ననార, ఈ ఆవరణము యొక్క వెలుపలి గోడలాయెను (నిర్గమ. 27:9-18). ఉత్తర దక్షిణ గోడలు చెరియొక 100 మూరలు పొడవు, తూర్పు గోడ కూడ 50 మూరల పొడవేగాని, ఈ గోడ నడుమ 20 మూరల వెడల్పుగా గుమ్మమొకటి యుండెను. బుట్టా పని చేయబడిన సన్ననార ఈ తెర గుమ్మము మీద వ్రేలాడుచుండెను.

ఈ యన్నింటి యొక్క భావమేమని నీవు తెలిసికొన గోరిన యెడల బైబిలులోనే వెదకుము. బైబిలు కంటె ఎక్కువ చక్కగా బోధించెడు గ్రంథము ఇంకొకటి లేదు. అయితే, యీ సమస్తమైన వాటి విషయము మోషేతో దేవుడు ఒక్కొక్క సంగతి చెప్పెను. 'కొండమీద నీకు కనుపరచబడిన వాటి రూపము చొప్పున వాటిని చేయుటకు జాగ్రత్త పడుము' (నిర్గమ. 25:40). ఇది మనతో చెప్పునది ఏమనగా, ఈ వివరములన్నియు మనము గ్రహించినను, లేకున్నను, పరలోకములో నున్న వాటి విషయమే ఈ వివరములు తెలియ జేయుచున్నవనే నొక వర్తమానము మన కందరికిని ఇందులో గలదు.

# 5

# నిబంధన

మందిరమనగా నేమిటో ఇప్పుడు గ్రహించగలమా? నిర్గమ కాండము 24వ అధ్యాయము యొక్క ప్రారంభమందు దేవుడు మోషే, అహరోను, నాదాబు, అబీహు మరియు ఇశ్రాయేలీయుల పెద్దలలో 70 మంది తన యొద్దకు రావలెనని పిలుచుట చూచుచున్నాము, తక్కిన వారందరు దూరముగా నిలువుండగా మోషే ఒంటరిగా కొండెక్కి వెళ్ళెను.అతనికి దేవుడు కనబరచిన దానిని, క్రిందికి దిగి వారితో చెప్పెను. ప్రజలందరు, 'యెహోవా చెప్పినమాట లన్నిటి ప్రకారము చేసెదము' అని ఉత్తరమిచ్చిరి (వచనము 3). అటు పిమ్మట వివరములు ఇవ్వబడెను.

దేవుని మాట ప్రకారము చేయు నుద్దేశము లేనివారికి ఆయన చెప్పునది అర్థముకాదు. దేవుడు ఏది తమకు బయలుపరచినను, ఆయనకు విధేములై యుండుటకు సిద్ధముగా నున్నవారికి మాత్రమే శక్తితో ఉపదేశించుట సాధ్యము. బైబిలులో నున్న సంగతులను తెలిసికొనుట ఎట్లో మనకు చక్కగానే తెలియును. అయితే, ఆయన చెప్పుచున్న దాని ప్రకారము చేయుచున్నామా? కావలసినంత బైబిలు జ్ఞానమున్నది. అయితే వారు నేర్చుకొనిన దాని ప్రకారము మనుష్యులు చేయుటలేదు. వెలుగును విసర్జించినచో అది చీకటిగా మారిపోవును. అతిశయించి, గర్వించి, విర్రవీగువా రెవరనగా, బైబిలు జ్ఞానమును

బుర్రలో మాత్రము కలిగి, జీవితానుభవము నందు ఎరుగనివారు. ఈ జ్ఞానము శ్రమ ద్వారానే కలుగును. అయితే ఈ శ్రమను మట్టుకు ఎరుగనివారు. కావున, ఈ వర్తమానము ముందుకు సాగించే పూర్వము, దేవునికిట్లు మనము వాగ్దానము చేయవలెను; "ఓ దేవా, నీవు మా కేమేమి యుపదేశించనున్నావో, దాని ప్రకారమే చేసెదము." మనము ఒక నీతి సూత్రమును అవలంబించవలెను. అదేమనగా, మనము బైబిలు తెరచినప్పుడెల్ల, దేవునికిట్లు వాగ్దానము చేయుట: "ఓ దేవా, ఇప్పుడు నీవు నాకేమి యుపదేశింపనున్నావో, దాని ప్రకారము చేసెదనని నీకు వాగ్దానము చేయుచున్నాను." అయన మాట ప్రకారము చేయు నుద్దేశము నీకు లేకున్నచో, నిన్ను నిర్బంధించి, బలవంత పరచి లోబడునట్లు ఆయన చేయడు. ప్రేమ యనునది బలాత్కరముతో కార్యములు జరిగించదు. దేవుడు తనను తాను ప్రత్యక్ష పరచుకొనియున్నాడు. ఎవరైతే, ముందుకు వచ్చి, "దేవుడు చెప్పు దాని ప్రకారము చేసెదము" అని వాగ్దానము చేయుదురో, వారి కొరకు కనిపెట్టుచున్నాడు.

దేవుడు తన ప్రజలతో చాలా ముఖ్యమైన నిబంధన యొకటి చేయబోవుచుండెను (నిర్గమ. 24:4-8). ఈ నిబంధన కొరకు సిద్ధపడుచు, గోత్రమునకు ఒక స్తంభము చొప్పున పండ్రెండు స్తంభములు కలిగిన ఒక బలిపీఠమును మోషే నిర్మించెను. ఈ బలిపీఠము మీద బలి పశువు ఉంచబడెను. దాని రక్తమును తీసి మోషే ప్రజల మీద ప్రోక్షించెను. దీని అర్థమేమనగా, ప్రభువైన యేసుక్రీస్తు రక్తము క్రిందకు వచ్చిన వారే దేవుడు చెప్పు మాటలను గ్రహింపగలవారు. తిరిగి జన్మించనివారు, అనగా, ప్రభువైన యేసుక్రీస్తు ప్రశస్త రక్తముతో ప్రోక్షింపబడుట ఏమియని ఎరుగని వారు ఇచ్చట మందిరమును గూర్చి దేవుడు ఏమి నేర్పుచున్నాడో దానిని ఎన్నిటికైనను పూర్తిగా గ్రహింప శక్తిలేని వారు. ఏమి చెప్పబడినను సరే, ఎంత చక్కగా బోధింపబడినను సరే, ఎవరైతే నిత్య నిబంధన యొక్క రక్తము వలన కొనబడక, వారి పాపములనుండి

కడుగబడక యున్నారో, అట్టి వారెవరును ఈ సంగతులను నిజముగా గ్రహించలేరు.

ఎవరైతే క్రొనబడి కడుగబడి యున్నారో, వారి కొరకే ఈ సంగతులు చెప్పబడినవి. ఒకడు లోక విషయములలో అతి విద్యాహీనుడై యుండవచ్చును, అయినను క్రీస్తు నందుండినచో, పరలోకపు విషయములందు అత్యధిక జ్ఞానిగా కాగలడు. రక్తము యొక్క శక్తి ఇదే. ఇదే వెర్రి వారిలో అతి వెర్రివానిని జ్ఞానులను మించిన జ్ఞానము గలవానిగా చేయును. పర సంబంధమైన విషయములు మనము గ్రహించవలెనంటె, వేయవలసిన మొదటి అడుగు, నిత్య నిబంధన యొక్క రక్తముక్రింద తేబడి, యుంచబడుట. "అవును ప్రభువా, నీవు చెప్పిన మాటలన్నిటి ప్రకారము చేసెదనని నీకు వాగ్దానము చేయుచున్నాను" అని, మనము ఆయనకు వాగ్దానము చేసి యున్నామా?

అనేకులు దేవునికి విధేయులై యుండవలెనని కఠినముగా ప్రయాస పడినను విధేయులు కాజాలకున్నారు. ఇది ఏల? ప్రతి ఉదయము ఇట్లు చెప్పుకొనుచున్నారు. "ఈ దినము కోపానికి చోటివ్వను; ఈ దినము అబద్ధాలాడను; ఈ దినము లంచమే తీసికొనను" రెండు, మూడు గంటల నిర్ణయమే ఇది. తిరిగి మండి పడడమే. ప్రార్థనలు చేయుచున్నారు. బైబిలు చదువుచున్నారు, అయినను ఓడిపోవుచున్నారు. కారణమేమి? ప్రారంభమందే కడుగబడుటకు ఆ రక్తమును ఉపయోగించుటలేదు, అటు తరువాత క్రీస్తే తమ జీవమని ఆయనను పట్టుకొనుట లేదు. దేవుడు చేయగలిగిన కార్యములను తామే మానవశక్తితో చేయ జూచుచున్నారు. కావుననే నెరవేర్చలేక యున్నారు. ప్రతి శోధనను జయింప కోరుదువా? అట్లయితే, చేయవలసిన కార్యమేమనగా, ప్రతి దినము, ప్రతి ఉదయము విశ్వాసము ద్వారా ఆయన రక్తము క్రిందకి రమ్ము. రక్తమందు రెండు శక్తులున్నవి. శుద్ధీకరించుట, జీవమిచ్చుట. నీ

పాపములను ఒప్పుకొనిన యెడల ప్రతి మైలనుండి కడుగబడుదువు. నీలోని క్రీస్తు జీవము నీ అనుదిన నడతలు, చర్యలలో ప్రత్యక్షపడును. దేవుడు చెప్పిన ప్రకారము చేయుటకు ఇశ్రాయేలీయులు రక్తము క్రిందికి రావలసి యుండెను.

"వారు దేవుని చూచిరి" యని ఇశ్రాయేలీయుల పెద్దలను గూర్చి చెప్పబడి యున్నది (నిర్గమ. 24:10). యోహానైతే "ఎవడును ఎప్పుడైనను దేవుని చూడలేదు" అనుచున్నాడు (యోహాను 1:18). ఇంకేమి అనుచున్నాడు? "తండ్రి రొమ్మున నున్న అద్వితీయ కుమారుడే ఆయనను బయలుపరచెను.' ' ఈ అధ్యాయమందు, నిర్గమ కాండమందు చెప్పబడిన విషయము ఆ కొండమీద వారు చూచినది ప్రభువైన యేసుక్రీస్తునే యని తెలుచున్నది.' 'ఎవడును ఎప్పుడైనను దేవుని చూడలేదు.' ఇది ఖచ్చితము, అయితే మోషే పాత్రలో కొంత రక్తము తీసి, కొంత ప్రజల మీదను, కొంత బలిపీఠము మీదను ప్రోక్షించగా, పెద్దలకు ఏదో ఒకటి గోచరింపనారంభించెను. దేవుని గొర్రెపిల్లను చూచిరి. పశువును వధించి, వాటి రక్తమును ప్రోక్షించుట, ఇదే ముందుగా వారు చూడగలిగినది. అటు తరువాత విశ్వాసము యొక్క దృష్టితో వారి కొరకు వధింపబడిన దేవుని గొర్రెపిల్లయగు ప్రభువైన యేసుక్రీస్తును చూచుచున్నారు. ఈ బలి అర్పణలను దృశ్యము ద్వారా ప్రపంచము నందంతట నున్న సమస్తమైన పాపుల కొరకు శ్రమపొంది మరణింపబోవు ప్రభువైన యేసుక్రీస్తునే వారు చూచుచుండిరి. 'ఇదిగో లోక పాపమును మోసికొని పోవు దేవుని గొర్రెపిల్ల' (యోహాను 1:29).

# 6

# పరీక్షింపబడుట

"ఇశ్రాయేలీయులు దేవుని చూచిరి ఆయన పాదముల క్రింద నిగనిగలాడు నీలిమయమైన వస్తువు వంటిదియు, ఆకాశ మండలపు తేజస్సు వంటిదియు ఉండెను" (నిర్గమ 24:10). నీలిరాయి ఎంతో స్వచ్ఛమైనది. అసలైన నీలము ఎంత స్వచ్ఛముగాను, ఎంత తేటగాను, ఎంత నిర్మలముగాను ఉండుననగా, దానిగుండా నీవు చూచినచో అవతల నున్న వస్తువులన్నియు తేటగా కన్పించును. పరలోకమందొక నీలముండినట్లు సొగసైన నిర్మలత ఆ పెద్దలకు కనబడెను; దానిగుండా వారు ఇశ్రాయేలీయుల దేవుని మహిమ ప్రకాశించుటను చూచిరి. వారు వివరించినది ఇదే. అప్పటికైనను వారు చూచినది ఏమిటో మనకు సరిగా చెప్పబడలేదు. అయితే, పరలోకమును ఏదో కొంత చూచిరని తెలియుచున్నది. అంతే చాలును. వారు దేనిని చూచిరో గాని, వారి హృదయములు మట్టుకు సంతోషముతో ఉప్పొంగుచుండెను. ఆశ్చర్యమా?

ఆ కొండ శిఖరము మీద నుండి మోషేకు తన ధర్మశాస్త్రమును, ఆజ్ఞలను, మందిరము యొక్క మాదిరిని దేవుడు ఇవ్వబోవు సమయమది. మున్ముందుగా, ఇశ్రాయేలీయుల ఈ డెబ్బది మంది ప్రధానులు పరలోకమును చూడవలసియుండెను. అప్పుడే, మోషే దేవుని పర్వతము నెక్కి మేఘములో ప్రవేశించుటను చూడగలిగిరి. ఈ అనుభవమే వారికి కలిగియుండనిచో, మోషేను వారు ఇట్లు అడిగి యుందురు : "ఇంత ద్రవ్యము పెట్టి ఒక

మందిరము కట్టమనుచున్నా వేల?" వారికి ఎట్టి సంశయము, భయము లేకుండ చేయుటకే దేవుడు ఆ డెబ్బదిమంది పరలోకమును చూచునట్లు చేసెను. ఈ అనుభవముల ద్వారా దేవుడు ఏమి చెప్పుచుండెనో ఆలకించుము. "మీకా జ్ఞాపింపబడిన సమస్తమును పరలోక సంబంధమైనవి పరలోకము కొరకు సంబంధమైనవిగాని. భూమి కొరకైనవి గాని ఇందేమియు లేవు."

మోషే, తాను స్వంతముగా ఏమియు ప్రవేశపెట్టలేదు. దేవుడు ఎట్లు ప్రత్యక్షపరచెనో, అట్లే ఆయన వ్రాయించి పెట్టెను. మోషే మెదడునుండి ఒక ఆలోచన కూడ బయలుదేరలేదు. 'కొండమీద నీకు కనపరచబడిన వాటి రూపము చొప్పున వాటిని చేయుటకు జాగ్రత్త పడుము' (నిర్గమ. 25:40). అసలైన పరలోకపు పరిశుద్ధ స్థలము యొక్క రూపమును లేక ఛాయను దేవుడు సూటిగా మోషేకు కనబరచెను. అందుచేతనే, మందిరము యొక్క వివరములను మనము పఠించుట చేత, దేవుని యొక్క ఆత్మీయ మందిరమెట్టిదో కొంత బోధపడుచున్నది. మనము సహజముగా ఇట్లనవచ్చును. 'ఈ వివరాలన్ని పట్టుకొని కాలము వృధా చేయుట యెందుకు? అంతేకాదు, వాటి భావము గ్రహించక, ఈ వివరములను చదువుచు కూర్చుండిన ఎడల, విసుగెత్తి, అలసిపోవుట కూడ సులభమే. అయినను, ఇవి పరసంబంధమైన వనియు పరలోక నియమములను ఛాయగా చూపించుచున్న వనియు గుర్తించినప్పుడు ప్రేమా గౌరవములతో వాటిని చదువుదుము. ఇంత సులభమైన పద్ధతి మీద పరలోకమును గూర్చి దేవుడు మనకు నేర్పించు ఏర్పాటు చేసియున్నాడు. గనుకనే, ఆయన వాక్యము యొక్క అధికారమును బట్టి యీ అంశము విషయము మనము పఠించుట అత్యంత ప్రాముఖ్యమని చెప్పగలము.

ఇప్పుడు మోషే యొక్క అనుభవము చూతము. దహించు అగ్నివంటి దేవుని మహిమను ఆ కొండమీద మోషే ఆరు పూర్తి దినములు చూడవలసి

వచ్చెను. ఏడవ దినము దేవుడు మోషేను పిలిచి మేఘమందు ప్రవేశించుమనెను. మోషే ప్రవేశించగా, మేఘముచే మరుగు పరచబడుట వలన ఎవడును. ఆతనిని చూడలేకపోయెను. నలువది దివా రాత్రములు గడచెను. అంత కాలమును దేవుడతనితో మాట్లాడుచుండగా మోషే ఆలకించుచుండెను. ఇందులో కూడ ప్రతి వివరమునకు ఒక అర్థముండెను. మోషేతో దేవుడు మాట్లాడవలెనంటె, ఆయన మహిమను మోషే ముందుగా చూడవలసి వచ్చెను. ఇందుచేతనేమేఘమందు ప్రవేశింపక పూర్వము ఆరు దినములు మోషే వెలుపల నిలుచుండవలసి వచ్చెను. ఆరు అను సంఖ్య బైబిలునందు మనుష్యునికి సంబంధించి యున్నది. ఆరు దినములు మేఘము వెలుపల మోషే ఆగుట ఎందుకనగా, నరమాత్రుడైన తనను తాను చూచుకొని, సంపూర్ణ మహిమ యందున్న దేవునితో సరిపోల్చుకొని, ఆయన ఎదుట తానేపాటి వాడో ముందుగా గ్రహించ వలెననియే.

నీ పొరుగువానితో నిన్ను నీవు సరిపోల్చుకొనగా, అతనికంటె నీవే నయము అనుకొందువు. ఇట్లనగలవు కూడ? 'అంత చెడ్డవాణ్ణి కాను, నేను పాపినేగాని. అంత ఎక్కువ పాపిని కాను. ఏమంత పాపము చేశాను? అబద్ధాలాడుతాను. నిజమే, రోజుకి రెండుసార్లు కోపము తెచ్చుకొంటాను. అబ్బో వాణ్ణి కొంచెము చూడు. ఇతరులతో నిన్ను నీవు సరిపోల్చుకొని చూచితివంటె, నీవు కూడ ఇట్లే చెప్పుకొందువు. కొండ ఎదుట ఆరు దినములు మోషే నిలిచియుండగా, తానెవరై యుండెనో, దేవుడు మోషేకు ప్రత్యక్ష పరచుకొనుచుండెను. దేవుని మహిమను చూడ మొదలిడగా, మోషే దేవుని ఎదుట తానెంతటివాడో సరిపోల్చుకొనుచుండెను. ఎంత అల్పుడో, ఎంత పనికిమాలినవాడో మోషే, దేవుని ఎదుట! అతడు ఇట్లు ఒప్పుకొనవలసి వచ్చెను : 'ఓ దేవా, నేను వట్టివాడను, వట్టివాడును, వట్టి అనుదానికంటె అధముడను.' దేవుని పవిత్రత ఎదుట మనలను మనము చూచుకొనిన ఎడల, మనము

ఏపాటి వారము? మట్టి పురుగులమే. మోషే తగ్గింపబడుటకై మేఘము ప్రవేశింపక ముందు ఆ మహిమ ఎదుట అతనిని దేవుడు అరు దినములు నిలువబెట్టెను.

మనలో గర్వించుచున్న వారందరము ఈ విధముగా తగ్గించబడవలెను; కనిపెట్టవలెను. మేఘమును ప్రవేశించ కూడదు. విరిగి నలిగిన హృదయము మాత్రమే దేవునితో సంభాషించ గలుగును.

ఇక, దేవునితో ఏకాంతముగా గడుపు నలువది దినములు వచ్చెను. బైబిలులో నలువది యను సంఖ్య శోధనా పరీక్షలను సూచించుచున్నది. అపవాది చేత మన ప్రభువే నలువది దినములు శోధింపబడెను. ప్రతివాడు ఎటువంటివాడో తెల్పివేయు నిమిత్తము అతనికివ్వబడు పరీక్షను గూర్చియే నలువది యను సంఖ్య చెప్పుచున్నది. మోషే వాడబడుటకు పూర్వము, దేవుడు చెప్పు మాటలు పలుకువానిగాను, దేవుని సేవకునిగాను, అతడు ప్రతి విషయములోను పరీక్షింప బడవలసి యుండెను. దేవుని యొక్క పద్ధతి ఇదే. ఎవరెవరు దేవుని సేవకులు కాగోరుచున్నారో, వారందరును ప్రతి పరీక్ష గుండా వెళ్ళవలసి యుండును. దగ్గరివారు, ప్రియులు, అందరి నుండి తెంపు కలిగి ఏకాంతముగా నుండుట, ఏమిటో తెలిసిన వారై యుండెవలెను; ఆకలి యనగా నేమో, ఆశాభంగము చెందుట ఏమో, సర్వము నష్టపోవుట అనగానేమో ఇవన్నియు అనుభవించి యుండవలెను; దేవునితో ఏకాంతముగా నుండుట అనగానేమో తెలిసియుండవలెను. కొందరు ఏమని భావింతురనగా, వేద పాఠశాల యందు హెబ్రీ భాష, గ్రీకు భాష, తత్త్వజ్ఞానము పొందవలసిన మూడేండ్లు గడిపిన ఎడల వారు దైవ సేవకులు కాగలరని. అయితే బుర్రలోని జ్ఞానమును బట్టి ఎవడును దేవుని సేవకుడుగా కాజాలడు.

నేనొకప్పుడు రైలు మీద ప్రయాణము చేయుచుండగా, నా దగ్గర నా

బైబిలుండెను. బండిలో కండ్లు మూసికొని ధ్యానించుచుంటిని. అక్కడున్న వారు నేను నిద్రపోవు చుంటిని అనుకొనిరి. వారంతా హిందువులే. ఒకడు ఇంకొకనితో ఇట్లనెను. "అతడొక ఫాదిరి లాగనో, మిషనరి లాగనో కనబడు చున్నాడు." అవతలి వాని జవాబేమనగా, ఫాదిరి అయియుండదు. "ఫాదిరిలాగ కనబడడము లేదు. ఏదో బోధకుడై యుంటాడు." అప్పుడు మొదటివాడు ఇట్లనెను: "అవును అతను ఫాదిరి మోస్తరుగా బట్టలు వేసికొనలేదు. ఫాదిరి అయియుండదు, రెండవవాడు ఇట్లు ప్రత్యుత్తర మిచ్చెను: "బహుశః మూడవ రకము ఫాదిరి అయియుంటాడు." ఇది నిజమే; కొందరి ఉద్దేశ్యమేమనగా ఈ డిగ్రీ, ఆ డిగ్రీ పొంది, ఫస్టుక్లాసు, సెకండు క్లాసు ఫాదిరీలయితే, ఏ డిగ్రీ లేనివాని కంటె దేవుని సేవ చక్కగా చేయవచ్చునని. విద్య సంబంధమైన డిగ్రీలైనా, సాంఘిక డిగ్రీలైనా, సంపాదించుట చేత నీవు దేవుని సేవకుడు కాజాలవు. అయితే శ్రమ పొందుటకు నేర్చుకొనుట ద్వారానే, ప్రభువైన యేసుక్రీస్తు తర్ఫీతు పొందిన పాఠశాలలోనే నీవు కూడ తర్ఫీదు కావలెను. నలుబది దివారాత్రములు మోషే, దేవునితో ఏకాంతముగా ఆ కొండమీద నుండవలసి వచ్చెనను మాట మరువవద్దు.

మోషే ప్రత్యక్ష పరచబడిన పర సంబంధమైన మర్మములను మన మిప్పుడు తెలిసికొన బోవుచుండగా, వాటిని గురించి చదివినంత మాత్రమున అవి గ్రహించి వేయగలము అని అనుకొనవలదు. ప్రభువు కొరకు కష్టాలు, బాధలు, వేదనలు పొంద సిద్ధపడియుంటేనే, ఒక సులభమైన రీతిలో ఈ మర్మములను దేవుడు మనకు బయలుపరచును. ఇవన్నియు సహించుటకు సిద్ధముగా నున్న వారికేగాని, బాధలు సహించుటకు ఒప్పుకొనని వారికి ఆయన ఈ మర్మములను ప్రత్యక్ష పరచడు. మొదట చెప్పబడిన వారికి ఆయన క్రమ క్రమముగా బోధించును.

# 7

# ప్రతిష్ఠార్పణ

మోషే తిరిగి వచ్చినప్పుడు తాను చూచినవి, వినినవి ఇశ్రాయేలీయులతో చెప్పెను; ముఖ్యముగా దేవునికిచ్చు ప్రతిష్ఠార్పణ విషయము ముందు బోధించెను. "యెహోవా మోషేకు ఈలాగు సెలవిచ్చెను - నాకు ప్రతిష్ఠార్పణ తీసికొని రండని ఇశ్రాయేలీయులతో చెప్పుము. మనః పూర్వకముగా అర్పించు ప్రతి మనుష్యుని యొద్ద దాని తీసికొనవలెను (నిర్గమ. 25:1,2).

దేవుని పని కొరకు గాని, ఆయన పరిశుద్ధాలయము కొరకు గాని, తొందర పెట్టబడుట వలననో లేక సరికాని యుద్దేశముతోనే ఇవ్వబడు అర్పణాలను ఆయన అంగీకరించదు. ఇప్పుడు మిమ్ము నేను ఈ ప్రశ్న అడుగుచున్నాను: సంతోషముతో, ఆనందముతో ఏదియు ఉంచుకొన నీ సమస్తమును దేవునికిచ్చు రహస్యము నీవెరుగుదువా? నీకున్న దానిలో అతి శ్రేష్టమైనది ఏదో దానికి దేవునికిచ్చు విధము నెరుగుదువా?

కొంతకాలము క్రిందట ఒక వ్యక్తి నా దగ్గరకు వచ్చి ఇట్లనెను: "మా అబ్బాయికి ఏమైనా సహాయము చేయగలరా? వాణ్ణి చదివించదానికి చూచాను, మాటి మాటికి ఎన్నో ఏండ్లు ఫెయిల్ అవడమే. ఏదో ఒక పని చేర్పించడానికి చూచాను. కార్ డ్రైవింగు, కుట్టుపని, ఇంజనీరింగ్, ఎందులోను పనికిరాడు;

ఒక బోధకుడైనా కానివ్వండి." మనుష్యుల ఆలోచనలు ఇట్టివే. మంచి తెలివితేటలు గల కుమారులు గాని, కుమార్తెలు గాని ఉండినచో వారు ఇట్లు ప్రార్థించెదరు: 'ఓ దేవా మా అబ్బాయి ఒక డాక్టరో, లాయరో కావలెనని కోరుచున్నాము.' ఆ కుమారుడు దేనికి పనికిరాని వాడైనచో వారి ప్రార్థన ఇట్లుండును: "ప్రభువా, మా అబ్బాయిని నీ సేవకు అప్పగిస్తాను, మెట్రిక్యులేషన్‌లో ఫెయిల్ అయిపోయాడు. నీ సేవ అయినా చేయని." మీ కుమారులు, కుమార్తెలలో తెలివితేటలు గలవారేమో ఈ లోకములో బాగుపడవలెనట: మొద్దులైతే, బోధకులు, బోధకురాండ్రు అయిపోవలెనట! నీ కారణములు ఇవేనైతే, నీకు కలిగియున్న వాటిలో అతి శ్రేష్టమైనవి దేవునికిచ్చు ఆనందమును నీ వింకను తెలిసికొనకున్నావు. దేవుని సేవించుట కంటె ఎక్కువైన సంతోషము ఎందున్నదో చెప్పగలవా? నరులు విస్తారముగా గౌరవించెడు వారెవరనగా, దేవుని సేవించుట ఎట్లో అనే రహస్యము తెలిసినవారిని. ఎవరైనను పొందగల అత్యున్నత గౌరవము ఏదనగా దేవుని సేవించుట. దేవునికి మనము అర్పించునది ఎన్నటికిని నష్టము కాదు. ద్రవ్యమో, సమయమో, శక్తియో, లేక బిడ్డలో, ఇంతేకాదు; మనము ఎప్పటికైనను ఇవ్వగలిగినది ఎంతో, దానికి ఎన్నో రెట్లు అధికముగా ఆయన మనకిచ్చును. అయినను, దేవునికి ఇవ్వవలెనంటె మనకెంత పిసినితనము.

దేవుడు ఇట్లనెను: "మనస్సారా ఇచ్చు అర్పణతో నే నంగీకరింతును. నా కిచ్చు బంగారు, వెండి, ఇత్తడి, తుమ్మకఱ్ఱ, నీల, ధూమ్ర రక్త వర్ణములు, ఏదైనను సరే సంతోషానందములతో ఇవ్వబడవలెను." ఇక్కడ ఒక రహస్యము మరుగుపడి యున్నది: అదేమనగా, తనకున్న దానిలో శ్రేష్టమైన దానిని మనస్సారా దేవుని కిచ్చు హృదయము. దేవుని మందిరమందు నీవు యే సేవయైనను చేయకోరిన ఎడల, ప్రార్థన చేయుటయో, బోధించుటయో, పేదవారిని దర్శించుటయో అది ఎటువంటి కార్యమైనను, నీవు సంతోషముతోను

అనందముతోను చేయవలెను.

తన దూడ ఏదైనా చచ్చియుంటె, ఆవు కొన్నిసార్లు పాలు తీయనివ్వదు. అప్పుడు దానిని మోసపుచ్చుట అవసరము. చచ్చిన దూడ చర్మమును ఎండుగడ్డితో నింపి, ఆవు దగ్గర తెచ్చి పెట్టినచో అది దానిని నాకుట మొదలిడును. ఆవు నిట్లు మోసపుచ్చుట ద్వారా అది నెమ్మదిగా నుండును. కావున పాలవాడు దాని పాలు తీయగలుగును. ఎందరో క్రైస్తవులు ఈ విధముగా మోసబోతున్నారు. ఏదో కొంత మోసగించితేనే గాని దేవుని పని కొరకు డబ్బు ఇవ్వరు. ఇట్లు మోసగించి డబ్బు లాగుకొనువారు అనేకులు గలరు. ఉపాయములు చేసి డబ్బు లాగుచున్నారు.

నీవు భిక్షమెత్తి సంపాదించు సొమ్ముగాని, బలవంతపరచి సంపాదించు సొమ్ముగాని దేవునికి కావలెనని ఎన్నటికిని తలంచవద్దు. ఇటువంటి సొమ్మును ఆయన ఉపయోగించడు. అట్టి సొమ్మును మనుష్యులు పుచ్చుకొందురుగాని, దేవుడు ఎన్నటికి పుచ్చుకొనడు. మనసారా సంతోషముతో ఇచ్చే అర్పణే కావాలి. అనిన దేవుడు, ఇట్టి పద్ధతుల మీద సంపాదించిన దానిని అసహ్యించుకొనును.

పరిశుద్ధాత్మ వలన నిర్బంధ పెట్టబడుచున్నావా? అయితే, నీవు ఇవ్వవలసినదే. మరొక విధముగా చేయువారు దేవుని మందిరమనగా నేమిటో, దాని అసలైన అర్థమును నేర్చుకొనకున్నవారు. బలవంతముగా తేబడిన దానిలో ఒక పైసా కూడ దేవుడు ముట్టడు.

పాతది గతించిపోగా దాని బదులు కలుగు నూతన సృష్టి విషయము ప్రకటన 21వ అధ్యాయములో తెలుపబడి యున్నది. అపొస్తలుడైన యోహాను క్రొత్త ఆకాశమును క్రొత్త భూమిని చూచెను. పరిశుద్ధ పట్టణము దేవుని దగ్గరనుండి, ఆకాశమునుండి క్రిందికి దిగుచుండుట చూచెను. ఈ

నగరమంతయు మేలిమి బంగారు మయమై క్రొత్తసృష్టి యొక్క సంపూర్ణతను తెలుపుచున్నది.

ఈ క్రొత్తసృష్టి కార్యమందు, భూమిమీద నున్న మనకు ఒకవంతు గలదని ఇదివరలో చెప్పియుంటిని. దేవుడు భూమిని సృజించుచుండగా, "ఇట్లగుగాక" అనెను. అది అట్లే ఆయెను. ఇదే విధముగా ప్రతిదాని విషయము ఆయన ఆజ్ఞాపించుచుండగా సమస్తమును సృజింపబడెను. నరుని పాపము వలన శాపము పొందిన పాతసృష్టి ఇది. అయితే, క్రీస్తు యందలి క్రొత్త సృష్టిలో ఒక భేదమున్నది; ఈ కార్యమునందు మనము పాలు పొందుచున్నాము. మనము ఇప్పుడు ఏమేమి దేవుని కిచ్చుచున్నామో, వాటితోనే ఈ క్రొత్తసృష్టిని ఆయన నిర్మించుచున్నాడు.

ఈ విషయమున పౌలు, 1 కొరింథీయులు 3:9-15లో మరింత తేటగా కనబరచుచున్నాడు. మనము దేవుని వ్యవసాయము, దేవుని పొలము, దేవుని జతపనివారమునై యున్నాము. మనము దేవుడు కట్టు గృహము, ఈ గృహము యొక్క పునాది ప్రభువైన యేసుక్రీస్తే. ఈ పునాది మీదనే, దేవుని క్రొత్త సృష్టియనబడు గృహము నిర్మింపబడినది. మనతో దేవుడిట్లు అనుచున్నాడు: "నీవు కట్టుటకు బంగారు, వెండి, ఇత్తడి తెచ్చెదవా? లేక కర్ర, గడ్డి, కొయ్యకాలుతో కట్టబోవుచున్నావా?" తమ సహజ శక్తులను తెచ్చువారే, కర్ర, గడ్డి, కొయ్యకాలుతో కట్టువారై యున్నారు. తాము నిర్మించినదేమిటో తమ జీవితకాలమందే కాల్చి వేయబడుట చూతురు. అయితే క్రీస్తుకు మహిమ తెచ్చునట్టివైన బంగారు, వెండి, ఇత్తడి తెచ్చువారు, అగ్ని పరీక్ష దినమున వారు కట్టినది మరింత కాంతితో ప్రకాశించుట చూతురు.

ఒక దినము రానున్నది. మన క్రియలు, మన బోధలు, మన ఉపదేశము, ఆరాధన మొదలైనవాటి నన్నింటిని దేవుడు అగ్నిచేత పరీక్షించు దినమది.

నీ బోధ, నీ ఉపదేశము, నీ ప్రార్థనలు, నీ ప్రేమ విందులు, దేవుని చిత్తమును అనుసరించి యుండిన ఎడల, అప్పుడు నీవు కట్టినది అగ్ని పరీక్షకు నిలుచుట చూతువు. ఏదైతే కర్ర, గడ్డి, కొయ్యకాలుతో కట్టబడి యున్నదో అది కాల్చి వేయబడును.

మంచి క్రైస్తవురాలైన ఒక ధనికురాలికి తాను పరలోకమునకు వెళ్ళి నట్లు ఒక స్వప్నము వచ్చెను. ఎన్నో శృంగారమైన మేడలను చూచెను. ఒక స్థలమున, వీటన్నింటిని మించిన సౌందర్యముతో నున్న మరియొక భవనము చూచెను. ఒక దేవదూత కనబడగా ఆ భవనము ఆ భవనము ఎవరిదియని ప్రశ్నించెను. ఈ క్రైస్తవురాలి ఇంటిలో ప్రతిదినము పాత్రలు తోముట, పొయ్యి ముట్టించుట ఎవరైతే చేయుచుండెనో, ఆ పనిమనిషి యొక్క భవనమది యని దేవదూత ప్రత్యుత్తర మిచ్చెను. ఇది విని ఆమె బహుగా సంతోషించి ఇట్లు తనలో తాననుకొనెను: "నా పనికత్తె భవనము ఇంత గొప్పదైతే, నాది మరింత వైభవముగానే ఉండును." మరికొంత దూరము వెళ్లగా ఒక గుడిసె కనబడెను. ఇది ఎవరిది యని దూతను అడిగెను. "అమ్మా, అది నీదే" యని దూత చెప్పెను.

ఆమెకు ఒళ్ళు మండెను. "చదువు లేనిదానికి, నా నౌకరీ మనిషికేమో ఇంత పెద్ద భవనము, నాకేమో ఈ చిన్న గడ్డి పాకనా? ఇందులో న్యాయమేది? ఎందుకీలాగు చేసారు?" అని ఆవిడ బిగ్గరగా అడిగెను. అప్పుడు ఆ దేవదూత చెప్పిన దేమనగా, "భూమి మీద నుండి ఎవరు ఏ సరుకు పంపితే, దానితోనే మేము వారికి గృహము నిర్మించుచున్నాము. ఆ పనికత్తె మాకు బంగారు, వెండి పంపుచున్నది. వాటితోనే ఆ భవనమును కట్టుచున్నాము. నీవు పంపించుచున్నది. కర్ర, గడ్డి, కొయ్యకాలు. వీటితో మేము కట్టగలిగినది ఒక గుడిసె మాత్రమే." ఆమె తిరిగి ఇట్లడిగెను: "అలాగంటావేమి? ధర్మాలు చేయడానికి, వేలాదివేలుగా

నేను రూపాయలివ్వలేదా? ప్రతి ఆదివారం ఆరాధనకు వెళ్లుచున్నానే? ఎక్కడ ఏ కమిటి ఉంటె అందులో నేను కూడ ఉన్నానే? ప్రతి క్రిస్మసుకు ఎంత విస్తారంగా ఈవులిస్తున్నాను? ఆ వైద్యశాలను కట్టించినది ఎవరు? ఆ పాఠశాల మందిరాన్ని కట్టించినది ఎవరు? నేను కానా? కర్ర, గడ్డి కొయ్యకాలు పంపుతున్నానని చెబుతున్నావే? అప్పుడు ఆ దేవదూత ఇట్లు పలికెను: "నీవు చేయడమంతా మనుష్యులు చూడవలెననియే. అది దేవుని సేవించుట కాదు. నీవు చాలా గొప్పదానివని మనుష్యులు భావించవలెను; నీకే పేరు ప్రతిష్టలు రావలెను. ఆ పేదరాలు, నీ పనికత్తెను చూడుము, ఎంత విశ్వాసముతో నిన్ను సేవించుచున్నదో, రాత్రింబగళ్ళు నీ కుటుంబము కొరకు ప్రార్థన చేయుచున్నది. అంతేకాదు, మీ యింటికి వచ్చు ప్రతి చుట్టము కొరకు కూడ ప్రార్థించుచున్నది. ఆమె ప్రార్థనలను బట్టి అనేక ఆత్మలు రక్షింపబడినవి. నీవైతే, ఎంతసేపు కోడికూర మీదనే ధ్యానించుచుందువు. దేవుని వర్తమానము నీ తలంపునకే రాదు. మరి ఈ విధముగా నీవు దేవునికి ఇచ్చునది గడ్డి, చొప్ప ఇంతే."

# 8
# ప్రశస్త లోహములు

"మీరు వారి యొద్ద తీసికొనవలసిన అర్పణలేవనగా బంగారు, వెండి, ఇత్తడి." తనచే విమోచింపబడిన తన ప్రజలతో దేవుడేమనుచున్నాడనగా, "రమ్ము; నీ వంతు కానుక ఏదో తెచ్చి యిమ్ము." మందిరమును ఏ వస్తువును ఉపయోగించి నిర్మింపవలెనని దేవుడు ఆజ్ఞాపించెనో, అందు ప్రతియొక దానికి ఒక అర్థముండెనని మనము చూడబోవుచున్నాము. బంగారు, వెండి, ఇత్తడి, తుమ్మకర్ర వీటి యొక్క ఆత్మీయ భావమేమి? ఏ కారణముచే వీటిని తెమ్మని దేవుడు చెప్పెను? దేవుడు అడిగిన వస్తువులను ఒక్కొక్కటిగా పరీక్షింతము.

బంగారు దైవ స్వభావమును తెలుపుచున్నది. చేయబడు కార్యములు సమస్తమును దేవుని జ్ఞానము వలన చేయబడవలెనే గాని మనుష్య జ్ఞానము వలన కాదు. మనకు దైవజ్ఞానము, దైవబలము, దైవ పాండిత్యము కావలసి యున్నది. ఇవన్నియు తన కుమారుని యందు మన కొరకు ఆయన ఏర్పరచియున్నాడు (1 కొరింథీ. 1:31). ఎప్పుడైతే ప్రభువైన యేసుక్రీస్తు యొక్క దివ్య ఏర్పాటు ప్రకారము ఈ కార్యములు చేయుదుమో అప్పుడు ఆయన పరిశుద్ధాలయమును కట్టుటకు బంగారు ప్రోగుచేయుచున్నాము.

ఎంత సులభముగా డబ్బు కొరకు బోధ చేయగలము! ఇంత చక్కని ప్రార్థనలు మేము చేయగలమని ప్రదర్శించుకొనుటకై ప్రార్థనలు చేయను ఎంత సిద్ధముగా నున్నాము: అనేక పర్యాయములు మనము చేయు కార్యములు

మనమెంతో మంచివారమని, నీతిమంతులమని, ధర్మాత్ములమని చూపించు కొనుట కొరకే. ఒకప్పుడు క్రైస్తవ స్నేహితులైన ఒక కుటుంబము వారి ఇంటనుంటిమి. ప్రతి ఉదయము, ప్రతి సాయంకాలము వారి నౌకరులతో సహా వారు కుటుంబ ప్రార్థనలు జరుపుచుండిరి. 'ఎంత మంచివారు' అనుకొంటిని. ఒకనాడు ఒక నౌకరు నాతో ఇట్లనెను: "ఈ ఇంటికి చుట్టాలు వచ్చినప్పుడు మాత్రమే కుటుంబ ప్రార్థన: చుట్టాలు వెళ్ళిపోగానే అది ఆగిపోతుంది." మనుష్యులు చూడవలెనని మనము చేయు ఏ కార్యమును దేవునికి అంగీకారము కాదు. దైవ ఏర్పాటు ననుసరించి దైవ స్వభావము, దైవశక్తితో మనమేమి చేసినను అది ఆయన మందిరము కొరకు ప్రోగుచేయు బంగారమే. నూతన సృష్టి యొక్క బంగారమును పరమ నగరమునకు తెచ్చు అధిక్యత మనదై యున్నది.

వెండి విమోచనమును సూచించుచున్నది. ముప్పది వెండి నాణెములకు మన ప్రభువు అమ్మబడినది జ్ఞాపకమున్నది కదా? ఒక బానిస వాని కొనునంత వెల అది. తన శిష్యుడిగా నుండినవాడే, ఒక బానిసచేయు ఖరీదుకు మన ప్రభువును అమ్మివేసెను; ఆయన తన్ను తానే ఖరీదుగా కట్టి మనలను తన సొత్తుగా కొనుక్కొనెను. ముఖ్యులైన యాజకులు ఆయన కొరకు 30 వెండి నాణెములు మాత్రమే ఇచ్చిరి: ఆయనైతేనో మనలను రక్షించుటకై తన ప్రాణాధారమైన రక్తమునే ఇచ్చెను. మందిరమందు వెండి ఎక్కడ కనబడినను విమోచనను సూచించుచున్నది. అనగా మన రక్షణకై మన ప్రభువు చెల్లించిన వెల.

మనము తిరిగి జన్మించినప్పుడు మన ప్రభువైన యేసుక్రీస్తు "కొనుక్కొనిన తన సొత్తుగా" అయిపోవుచున్నాము. శరీరాత్మలుగా ఆయన సొత్తయిపోతిమి. "విలువ పెట్టి కొనబడినవారము" (1 కొరింథీ. 6:20). నా చేతులు, నా కాళ్ళు,

నా పెదవులు, నా కండ్లు, నా స్వంతమని నేనిక చెప్పజాలను. రక్తమును ఖరీదుగా కట్టి నన్ను ప్రభువైన యేసుక్రీస్తు కొనినందున, అవి అన్నియు ఆయనవే (1 పేతురు 1:18, 19).

మన దేహము పరిశుద్ధాత్మ యొక్క ఆలయము (1 కొరింథీ. 6:19) అందుచేతనే మన దేహముతో మనము దేవుని మహిమ పరచవలయును. అనగా మన వస్త్రముల ద్వారా, అభ్యాసముల ద్వారా, మన ప్రవర్తన ద్వారా, మన పలుకుల ద్వారా (1 థెస్సలో. 4:4, 5:1. 1తిమోతి. 2:2, 10). ఇదే నిర్మలమైన వెండి మందిరమందు ఏ భాగమందైనా వెండి నాకు కనబడినప్పుడు నాకేమి జ్ఞాపకము వచ్చుననగా శారీరాత్మికముగా నేను ప్రభువుచే కొనబడిన ఆయన సొత్తయి యున్నాననియు, నేను ఇదివరలో తొడుగు చుండినట్టి వస్త్రములు ఇప్పుడు ధరింపరాదనియు, లౌకిక వస్తువుల మీదగాని, లౌకిక మహిమ కొరకు గాని, నేను నా డబ్బు ధారపోయకూడదు. నా వస్త్రముల ద్వారా, ప్రవర్తన ద్వారా నడతల ద్వారా, ఆయననే నే నిప్పుడు మహిమ పరచవలసి యున్నది.

మనము అందముగా నుండవలెనంటే లౌకిక సాధనములు ఉపయోగించ నవసరము లేదు. వాటి కొరకు డబ్బు ధారపోయ నవసరము లేదు. ఆయన పరిశుద్ధత, ఆయన నిర్మలత, మన మూలముగా ప్రత్యక్ష పరచబడినప్పుడు ఇంక ఏ సౌందర్యము కూడ దానికి సాటిరాదు (పేతురు 3:3, 4). మన ప్రభువును ఈ రీతిని మనము మహిమ పరచగా, పరలోకపు సృష్టికి అవశ్యమైయుండు యధార్థమగు వెండిని మనకు తెలియకనే, పరలోకము కొరకు సేకరించుచున్నాము. దేవుని మందిరమునకు వెండిని తెచ్చుట ప్రతి విశ్వాసి యొక్క భాగ్యమైయున్నది.

ఇత్తడి, తీర్పును గూర్చి తెలుపుచున్నది. అరణ్యములోని ఇత్తడి సర్పమును గూర్చి మన ప్రభువు నికోదేముతో చెప్పెను కదా! (యోహాను 3:14; సంఖ్యా కాం. 21:9, మరియు 2వ రాజులు 18:4 కూడ చూడుము) ఇశ్రాయేలీయులు అరణ్యమందు సణుగుట వలన వారిని శిక్షించుటకై తాపకరమైన సర్పములు పంపబడెను. అటు తరువాత ఒక ఇత్తడి సర్పమును చేయుమని మోషేకు ఆజ్ఞాపించెను. ఎందుకనగా దానివైపు చూచువారందరును బ్రతుకవలెనని (సంఖ్యా కాం. 21:5-9). ఇదంతయు తీరిపోయి ఆ కాలము గడిచిన వెనుక, క్రొత్త తరముల ఇశ్రాయేలీయులు ఈ ఇత్తడి సర్పమందు ఏదో యొక శక్తి యుండెనని ఊహించుకొని, దానికి ధూపహారతులు వేయ మొదలిడిరి. ఈ విగ్రహారాధన మాన్పుటకై తుదకు ఆ సర్పములు చూరు చూరలుగా విరుగగొట్టి పారవేయబడ వలసి వచ్చెను (2వ రాజులు 18:4).

అయితే, దేవుడు తన దివ్య సంకల్పమును ఆ సర్పమందు కనబరచెను. ఆది సర్పమైన అపవాది ఎల్లప్పుడు తిరుగుబాట్లు జరిగించుచుండును. వాని స్వరము వినినందుననే ఇశ్రాయేలీయులు సణిగిరి. సర్పమువైపు ఎవరైతే చూచిరో, ఆ చూచుట ద్వారా ఇట్లు ఒప్పుకొనునట్లాయెను-వారు తీర్పు క్రిందకు తేబడిరి అనియు, వారి తిరుగుబాటునకు, మరణమునకును కారకుడు అపవాదియే అనియు అతని శక్తినుండి వారిని తప్పించుటకై ముందుగా అతనినే తీర్పు క్రింద దేవుడు తేవలసియుండెను. ఎల్లప్పుడు దేవునికి విరోధముగా అతిక్రమించుటకు మనలను పురిగొల్పు చుండునది ఆ సర్పమే, సాతానే. "అరణ్యములో మోషే సర్పమును ఏలాగు ఎత్తెనో అలాగే విశ్వసించు ప్రతివాడును నశింపక ఆయన ద్వారా నిత్యజీవము పొందునట్లు మనుష్య కుమారుడు ఎత్తబడవలెను" (యోహాను 3:14) అని ప్రభువైన యేసుక్రీస్తు చెప్పెను, మనకు ప్రతిగా మనుష్య కుమారునిగా, మన ప్రభువు సిలువ మీద మరణించెను. తీర్పు యొక్కయు, శాపము యొక్కయు స్థానము అదే. ఈ సిలువ మరణము

ఏలననగా, మనలను తొందర చేయుచు, దేవునికి విరోధముగా తిరిగి, ఆయనకు అవిధేయులగునట్లు చేయుచుండు సాతానుకు తీర్పు తీర్చుటకై మన శత్రువును తన సిలువ ద్వారానే మన ప్రభువైన యేసు జయించెను. సాతానును ఆయన నలుగగొట్టినందున, ఆయనయందు విశ్వాసము ద్వారా మనము జయమొందుదుము.

ఇట్లు ఇత్తడి తీర్పును సూచించుచున్నది - ఏ తీర్పు అనగా, యేసుక్రీస్తు మరణించిన వేళలో సిలువ దగ్గర ఆ సర్పము మీద పడిన తీర్పు. బంగారు కాదు, ఇత్తడితోనే బలిపీఠమును చేసిరి. ఎందుకనగా, మన శిక్షను తానే మోసికొని ప్రభువైన యేసుక్రీస్తు అపవాదిని జయించెను, ఇప్పుడు మనలను బట్టి మనము అతిశయించుటకు వీలులేదు. ప్రభువైన యేసుక్రీస్తు యొక్క జయమును బట్టియే అతిశయించగలము.

లోకమునకు మనము మరణించవలెనంటె; సిలువ మూలముగా గాక మరొక విధముగా అది జరుగదు. తన స్వంతశక్తిని వినియోగించి ఎవడును లోకేచ్ఛల అనుభవమునకును గాని, లోక భోగములకు గాని మరణించలేదు. పౌలు ఇట్లనుచున్నాడు: "మన ప్రభువైన యేసుక్రీస్తు సిలువ యందు తప్ప మరి దేనియందును అతిశయించుట నాకు దూరమగునుగాక; దాని వలన నాకు లోకమును లోకమునకు నేనును సిలువ వేయబడియున్నాము" (గలతీ. 6:14). సిలువశక్తి వలన మాత్రమే లోకమును జయించుటయు, సిలువశక్తి వలన మాత్రమే శోధనను జయించుటయు మనకు సాధ్యము కాగలదు. కావున మనమిప్పుడు సిలువయందు తప్ప మరి దేనియందు కూడ అతిశయింపజాలము. కావున, ఇత్తడి ద్వారా దేవుడిట్లు పలికెను: "ఓ నరుడా, మానవశక్తి చేతనైనను, మానవయత్నము చేతనైనను, మానవ మనోబలము చేతనైనను, పాపమునుగాని, శోధననుగాని, జయించుటకు ప్రయత్నించకుము.

నీ వెన్నటికిని కృతార్థుడవు కాజాలవు.''

అరణ్యమందు 40 సంవత్సరములు ఇశ్రాయేలీయ హృదయములందు అపవాది పనిచేయుచు ప్రతిసారి కూడ వారిని ఓడించుచుండెను. ఇదంతయు అపవాది యొక్క కార్యమని ఎప్పుడైతే వారు గ్రహించి, అతనికి తీర్పు తీర్చబడవలెనని తెలిసికొనిరో అప్పుడు వారికి జయము కలిగెను. ఆ విధముగానే నీవు కూడ జయింపగలవు, నీ ఉద్రేకమును, నీ బలహీనతను, మతాచారము వలన, అనగా వేదము చదువుట, ఉపవాసముండుట, ప్రార్థన చేయుట వలన కాదు. మరియు నీ స్వంత యత్నము, నీ స్వంత శక్తి వలన కూడ కాదు. నీవు జయించలేవు. నీవు జయము పొందుటకు ఒకే మార్గము గలదు. ఆయన మరణము, భూ స్థాపన, పునరుత్థానము, హెచ్చింపబడుట; వీనియందు నీవు ప్రభువైన యేసుక్రీస్తుతో ఐక్యపరచబడుటయే.

సిలువపై ప్రభువైన యేసుక్రీస్తు ఎట్లు అపవాదికి తీర్పు తీర్చి, ఓడించి, తారుమారు చేసెనో ఇది మనము గ్రహించిన కొలది, అంతకంతకు మన శోధన వేళలయందు ఎక్కువగా హర్షింతుము. ఎందుకనగా, ఆయనయందు జయము మనదే అయియున్నందున, దేవుని పరిశుద్ధాలయమునకు కావలసియుండు ఇత్తడిని మనము ప్రోగుచేయుట ఈ విధముగానే.

దేవుడు అడుగు ప్రతి పదార్థమునకును ఏదో ఒక ఆత్మీయ అర్థమున్నది. అన్నియు కూడ క్రీస్తునందున్నవి. బంగారము, దైవ స్వభావమును తెలుపుచున్నది; వెండి, ఆయన మన కొరకు చెల్లించిన విమోచన క్రయమును తెలుపుచున్నది; ఇత్తడి, మన బదులు ప్రభువు భరించిన తీర్పును సూచించుచున్నది. ఈ వస్తువులను ప్రోగుచేసి తెమ్మని ఆయన మనకు ఆజ్ఞాపించినాడు.

# ౯

# తెరలు

"నీల ధూమ్ర రక్త వర్ణములు, సన్నపునార:" (నిర్గమ. 25:4) ఇవన్నియు దేనికొరకు కావలసియుండెను? మందిరము పది తెరలతో చేయబడవలెననియు (నిర్గమ. 26:1-6), పరిశుద్ధ స్థలము ఎదుట ఒక అడ్డ తెరయు (26:31-33), గుడారము గుమ్మము మీదను (26:36, 37), ఆవరణపు ద్వారము మీదను (26:16, 17), వ్రేలాడు తెరలును చేయబడవలసి యుండెనని ఇదివరలోనే చూచియుంటిమి. తెరలును ఇవన్నియు, ప్రధాన యాజకుని వస్త్రముతో కూడ (28:4-8), ఈ మూడు రంగుల నూలుతోను పేనిన సన్నునారతోను చేయబడవలసి యుండెను; మరియు ఆవరణము ఏర్పడుటకు ఉపయోగించు యవనికలు కూడ పేనిన సన్ననారవై యుండవలెను (27:9, 18). ఇప్పుడు ఈ వస్తువుల యొక్క భావమును చూతము.

నీలి-ఇది పరలోక సంబంధమైన వర్ణము. నీలిరంగును చూచునప్పుడు మనకు ఆకాశమే జ్ఞాపకము వచ్చుచున్నది. మనమిక్కడ భూమిమీద నుండగా, మన పరలోకపు వృత్తిని నీలి జ్ఞాపకము చేయుచున్నది. లోకమందేమో వ్యాపారస్థులుగాను, గుమాస్తాలుగాను, డాక్టర్లుగాను, టీచర్లుగాను మనము పనిచేయవలసి యుండినను, మనము రక్షించబడినప్పుడు ఒక పరలోకపు వృత్తికూడ మనము పొందుచున్నాము (హెబ్రీ. 3:1). పరలోకపు వృత్తి యొకటి, సేవ యొకటి పొందుట నిజమైన ప్రతి విశ్వాసి యొక్క ఆధిక్యతయై యున్నది.

బజారులోగాని, రైలుబండి మీదగాని, మనలను సర్వ సాధారణముగా అడుగు ప్రశ్నలేమి? "మీ పేరేమి? మీ వృత్తి ఏమి?" మనమిచ్చు జవాబు ఇట్లుండును: 'నా పేరు ఫలాన, నేను గుమాస్తా పని చేయుచున్నాను.' (లేక నీవు ఒక కూలివాడవో ఏమైయున్నావో అది చెప్పుదువు). అయితే, క్రైస్తవుల మధ్య, "నీ పేరేమి?" అని అడుగుము "నీవు రక్షించబడి యున్నావా?" అని అడుగుము. దాని అర్థము. నీవు దేవుని బిడ్డవా? దేవుని యొక్క సంతోషము నీకు దొరికెనా? నీ పాపములు క్షమించబడెనా? నిజమైన శాంతి నీకు గలదా? నీ పేరు పరలోకమందు వ్రాయబడియున్నదా?" క్రైస్తవులమైన మనము ఇదే అడుగుదుము. అటు తరువాత వేయు ప్రశ్నలు: "నీ పరలోకపు పిలుపును నెరవేర్చుచున్నావా? తిరిగి జన్మించి యున్నాను అంటున్నావే, నీ పరలోక సంబంధమైన పిలుపుకు తగినట్లుగా జీవించుచున్నావా? నీ రక్షకుని యొద్దకు ఆత్మలను తెచ్చుచున్నావా? నీలో దేవుని మహిమ ప్రత్యక్షమగుచున్నాదా? నీ పరలోకపు పిలుపు విషయము నీ నమ్మకత్వము వలన అపవాది అపజయము పొందుచున్నాడా?"

ప్రభువైన యేసుచే పాపములు కడిగి వేయబడిన ప్రతి యొక్క పాపియు, ఆ రక్తము ద్వారా ఆ పరలోక పిలుపునందు పాల్గొనుచున్నారు. దీనినే నీలివర్ణము మనకు జ్ఞాపకము చేయుచున్నది.

ధూమ్రవర్ణము రాజవర్ణము ఇది మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క రాజత్వము తెలుపుచున్నది. రాణువవారు ఈయనను హేళన చేయుచు ధూమ్రవర్ణపు వస్త్రమును ఆయనకు తొడిగించి, "యూదుల రాజా శుభము" అని చెప్పలేదా! (యోహాను 19:2,3). మనుష్యులు ప్రభువైన యేసుక్రీస్తును అపహసించుచు ఆయనకొక ముండ్ల కిరీట మిచ్చిరి. ఆయనైతే, మనకొక స్వర్ణ కిరీట మిచ్చుచున్నాడు. అపహాస్యముతో ఆయనకు ధూమ్రవర్ణ

వస్త్రములను తొడిగించిరి; ఆయనైతే మనలను దేవునికి రాజులుగాను యాజకులుగాను చేయుచున్నాడు.

ఇట్లు మందిరములోని ధూమ్రవర్ణము వారి యొక్క రాజ పదవికి చెందిన పిలుపును జ్ఞాపకము చేయుచున్నది (నిర్గము. 19:6). పనికిమాలిన పాపులమగు మనలనే దేవుడు, రాజులుగాను ప్రభువులుగాను వుండవలెనని కోరియున్నాడు. మన యెడల ఇది ఆయన ప్రేమ: దేవుని ప్రతి యొక్క న్యాయవిధిని అతిక్రమించి యున్నాము. ఎన్నో ఏండ్లుగా ఆయనను దుఃఖపరచుచున్నాము. అట్లయినను కూడ దైవ ఏర్పాటేమనగా, మనము రాజులు, ప్రభువులు కావలెనని. ఈ పిలుపునకు మనము సిద్ధపడుటకై, మనకు బైబిలును మరియు ఆయన పరిశుద్ధాత్మను ఇచ్చియున్నాడు.

రక్తవర్ణము దేనిని తెలుపుచున్నదనగా, యేసు యొక్క ప్రశస్థ రక్తము వలన మనము కడుగబడుటను (యెషయా 1:8). రక్తవర్ణము ఇట్లనుచున్నది. నీవెన్ని పాపములు చేసియుండినను సరే: అవి రక్తవర్ణమువలె నుండినను సరే; ప్రతి దోషపు మచ్చను ప్రభువైన యేసుక్రీస్తు యొక్క రక్తము కడిగివేయగలదు.

నా సహోదరుడా, నీ పాపము వలన ప్రభువైన యేసుక్రీస్తు నుండి దూరపడి యుండకుము. ఆయన చెంతకు వచ్చి, వాటి నన్నింటిని ఒప్పుకొనుము. అతి మలినమైన పాపులను కూడ, వారు లోకమందు ఎక్కడుండినను, శుద్ధీకరించుటకు ఆయన రక్తము చాలియున్నది. రక్తవర్ణము మనకేమి తెలుపుచున్నదనగా, ఎంతటి పాపులైనను ప్రభువు సంతోషముతో చేర్చుకొనుచున్నాడని (లూకా 15:2).

కడపటిగా పేనిన సన్ననార మిగిలియున్నది. సన్ననార పరిశుద్ధుల యొక్క నీతిని సూచించుచున్నది (ప్రక. 19:8). రక్షణ వస్త్రములు తొడుకొను

భాగ్యము ప్రభువైన యేసుక్రీస్తు మన కొసగియున్నాడు. "ఆయన రక్షణ వస్త్రములను నాకు ధరింపజేసియున్నాడు" (యెషయా 61:20). మన దిగంబరత్వమును కప్పుటకు మనకు ఇవ్వబడిన అంగీని ఈ తెల్లనార సూచించుచున్నది.

మనము తిరిగి జన్మించినప్పుడు ఆయన యందు మనము నీతిమంతులగుటకై ప్రభువైన యేసుక్రీస్తు యొక్క స్వభావమే మనలో చేరునట్లు ఇవ్వబడుచున్నది. మనము ఆయన చెంతకు రాగా, తెల్లనార వలె స్వచ్ఛమైన తెలుపుగా మనలను చేయుచున్నాడు. మనము ప్రార్థన చేయుటను బట్టి లేక బైబిలు చదువుటను బట్టి నీతిమంతులమగుట లేదు. ప్రభువైన యేసుక్రీస్తు యొక్క నీతి మనకు వస్త్రముగా మనలను కప్పుచున్నది. గనుకనే నీతిమంతులమై యుందుము.

# 10

# పై కప్పులు

"మేక వెండ్రుకలు, ఎరుపురంగు వేసిన పొట్టేళ్ళ తోళ్లు, సముద్రవత్సల తోళ్లు" (నిర్గమ. 25:4,5). పరిశుద్ధ స్థలముమీద "ఒకటే మందిరముగా" ఏర్పడిన లోపలి పదితెరలు ఏ పదార్థములతో చేయబడెనో ఇప్పుడిప్పుడే చూచియుంటిమి (నిర్గమ. 26:6). ఇవిగాక వేరే పదార్థములతో చేయబడిన మూడు వేరే కప్పులుండును. ఇప్పుడు వీటిని చూతము.

మొదటిది మేక వెండ్రుకలతో నేయుబడిన మందిరపు పైని "గుడారము." మేక వెండ్రుకలతో నేయబడిన పదకొండు తెరలను అతికించి చేయబడిన గుడారమిది. ప్రతి తెర వెడల్పు 4 మూరలు పొడవు 30 మూరలు. ఇవన్నియు కలిసి పై భాగము సర్వమును కప్పి వేయుటయేగాక, ఇరుప్రక్కల, వెనుక, క్రిందికి వ్రేలాడెను. గుమ్మము వైపు మాత్రము వ్రేలాడుచున్న భాగమును పైకెత్తి మడతపెట్టిరి.

సామెతలు 30:29-31లో విలాసముగా నడచునవి నాలుగు పేర్గొ డి యున్నవి. సింహము ఠీవితో నడచుచున్నది; శోణంగి కుక్క యొక్క చలనము సొంపుగా నున్నది; మేకపోతు నడకలో దాని కాలి పట్టుత్వము తెలియుచున్నది; తన సైన్యముల ముందు తన పోటీ గాంభ్రమీద విజయమొందిన రాజోత్తముని గాంభీర్య గమనము.

ఉరవడి ప్రవాహముగల నదిలో సింహము ఈదుకొని వెళ్ళుచుండుట చూపునకు ఎంతో ఆశ్చర్యముగా నుండును. నీరు అంత వేగముగాను జోరుగాను ప్రవహించుచుండినను, ఈ గట్టునుండి ఆ గట్టునకు సింహము ఈత గొట్టుచు వెళ్ళుచుండగా, ఆ ప్రవాహ బలము దానిని తన మార్గము నుండి మరలింపలేక యున్నది. క్రైస్తవుని నడక ఇట్లే యుండవలయును. తిన్నని మార్గమును విడుచుటకు శోధనలు అతనిని ఈడ్చివేయ చూచినను అతడది విడువరాదు. నీతి మార్గమును మనము చూచియుండగా, దానిమీదనే మనము నడవవలసి యున్నది. కష్టములు, ఆటంకములు, పరీక్షలు ఎన్నియైనను రానిమ్ము; మనము సూటిగా తుదివరకు నడువవలసినదే. ఇట్టి నడకయే దేవునికి ఎంతో సొంపుగాను, రమ్యముగాను, మనోహరముగాను ఉండును.

దాని మేతను పట్టుకొను పర్యంతరము శోణంగి కుక్క పరుగిడుచునే యుండును. సాధారణమైన కుక్కకు ఒక చిన్న ఎముక కనబడినచో అంతే దానికి చాలును కనుక తన గురినుండి సులభముగా మరలిపోవును. నీవు ఎన్ని ఎముకలు శోణంగి కుక్కకు ఇవ్వబోయినను, అది మాత్రము దాని పరుగు విడువదు. ఏ జంతువును చంపి తినవలెనని అది గురిపెట్టి యున్నదో, ఆ జంతువును పట్టుకొనునంత వరకు అది పరుగెత్తుచునే యుండునుగాని, ఆగదు. భూమిమీద మనము చేయవలసిన సేవ యొకటి ప్రభువైన యేసు మన కప్పగించియున్నాడు. ఎవరెంత ద్రవ్యమిచ్చినను ఎంత లంచము కట్టినను, ఈ పరిచర్యను, ఈ సేవను మనము వదలుకొనకూడదు. మన విధులను నెరవేర్చుటకు శోణంగి కుక్కవలె పట్టిన పట్టు విడువరాదు. ఇట్లు జీవించుట ప్రభువుకు ఇష్టమయి యున్నది.

ఎంత నిటారుయైన కొండనైనను మేకపోతు ఎక్కగలదు. రమారమి గోడవలె నిలువుగా నున్న కొండ పార్శ్వమును ఎట్లు ఎక్కుట అని అది

వెనుకతీయదు. ఎందుకనగా కొండ శిఖరముల మీద మేయుట దానికి అభ్యాసము. ఆ ఉన్నత ప్రదేశములను చేరుటకై, అది పైకి ఎక్కుచుండగా ఎంతో గాంభీర్యముగా కనబడును. మన నడత కూడ ఇట్లే ఉండవలయును. క్రైస్తవ జీవితము ఎట్టిదనగా, ఒక ఎత్తైన కొండను ఎక్కినట్టిదిగా కనబడును. దేవుని సన్నిధిలో అనందించగోరుదువా? దేవుని మహిమ చూడగోరుదువా? జంకు, గింకు విడిచిపెట్టి వెనుకకు మరలకుండా ఎక్కుటకు అసాధ్యముగా కన్పించు కొండలను నీవు ఎక్కవలెను. సమస్యలు ఎదుర్కొనవలసి వచ్చినప్పుడు గాభరాపడిపోవద్దు. ఉత్సాహము విడువవద్దు, శిఖరము చేరుకొను పర్యంతరము సంతోషముతో, ఆనందముతో ఎక్కుచు పైకి సాగుము. ఒక చిన్న కష్టము వచ్చేటప్పటికి రాత్రులలో కన్నీళ్ళు విడిచి తలదిండ్లను తడుపు క్రైస్తవులున్నారు. వారు ఏడ్చుట ఎవరైనను చూడడము వారికి ఇష్టములేదు. కావున పడకమీద నున్నప్పుడు ఆ పని చేయుచున్నారు. ఇటువంటి క్రైస్తవులు ఆత్మీయముగా ఎదుగలేరు. "నా ప్రభువు నాకు జయము కలుగజేయును" అను నమ్మకముతో సంతోషముగాను, వందనము చెల్లించుచు ప్రతి పరీక్ష, ప్రతి శ్రమ, ప్రతి ఇక్కట్టును నీవు ఎదుర్కొనవలసి యున్నది.

కడపటిదిగా, ప్రజల తిరుగుబాటును ఎరుగని రాజు యొక్క నడక సొంపుగా నుండును. అతడు అడుగులు వేయుచుండునప్పుడు ఎంత ఠీవి, ఎంత గంభీరము! ఎన్ని సైన్యములు వచ్చినను నాకు లొంగిపోవలసినదే యని తన పరాక్రమమును ఎరిగిన రాజు శత్రు నగరములలో తన విజయసేనను నడుపుచున్నాడు. క్రైస్తవుడా! నీవిట్లే విజయుడు కావలెను. జయావిజయమైన బ్రతుకే నీవు బ్రతుకవలెనని ప్రభువు అనుచున్నాడు. అయన లోకమునకు వచ్చుట ఇందుకే. ఒక పుట్‌బాల్ క్రైస్తవుని చూచియుంటివా? ఈపుట్‌బాల్ అనబడు కాలిబంతిని ఒక మంచి తన్ను తన్నితే, ఎంతో పైకి లేచిపోవును. ఎక్కడైనా చిన్న ముల్లు దానికి గ్రుచ్చుకొనెనా చప్పగా అణిగిపోయి కూర్చుండును.

అయ్యో! ఏమయింది నా కాలిబంతికి అనుకొందువు. ఇప్పుడిప్పుడే అంత పైకి ఎగిరింది. ఇదేమిటో, ఇంతలో నేలకు అంటి పెట్టుకొని పడి ఉన్నది! ప్రక్కలో ఒక చిన్న ముల్లు దిగినందుకేనా? దానికొక అతుకు వేసి, తిరిగి దానిలో గాలి ఎక్కించవలసి యున్నది.

అయ్యో! ఎందరో క్రైస్తవుల స్థితి ఇదే. కూటములలో ఉన్నప్పుడు వారి సంతోషము ఏమి చెప్పను! ఆత్మీయముగా ఆకాశమంత పైకి ఎగురుచున్నారు. ఆహా! ఏమి పాటల జోరు! కూటములు తీరిపోయెను. అటు పిమ్మట ఎక్కడో ఒక చిన్న ముల్లు దిగెను. ఇక ఉత్సాహమంతయు వదలిపోయెను. ఆ కాలిబంతి పడియుండిన రీతినే నెలలు కొలది కూడ వీరును అణిగిపోయి పడియుందురు. తిరిగి ఒక బోధకుడు వచ్చి కొంత అతుకువేసి ఉత్సాహము ఎక్కించినప్పుడే, తిరిగి ఎగురుదురు. వీరే "ఫుట్‌బాల్ క్రైస్తవులు." మన ప్రభువు మనలను ఎట్లు ఉండమనుచున్నాడు? ప్రజల తిరుగుబాటు ఎరుగని రాజువలె, శోణంగి కుక్కవలె, సింహమువలె, మేకపోతు వలె గదా!

కష్టములుండవా; ఎన్నో పరీక్షలుండి తీరును. అయినను ఆయన హస్తమును పట్టుకొని, ఆయన వైపు చూచుచుంటిమేని అత్యధిక విజయము పొందుచున్నాము. మేక వెంట్రుకలు నేర్పు పాఠమిదే.

మందిరము పైన రెండవ కప్పు ఎర్రరంగు వేసిన పొట్టేళ్ళ తోళ్లు (నిర్గమ 26:14). ఇది ఎట్లు చేయబడెనో అంతగా చెప్పబడలేదు. సంపూర్తిగా తోళ్ళనే ఉపయోగించి యుండవలెను. ఇది డేరానంతయు సంపూర్తిగా కప్పివేసెను. ఈ పైకప్పులో క్రిందికి వ్రేలాడు భాగము పైకి ఎరుపుగా కనబడెను. ఇది దేనిని సూచించుచున్నదనగా, తన రక్తముతో మనము కప్పబడునట్లు మన ప్రభువు చేసిన ఏర్పాటును దేవుడు తన సన్నిధి నుండి ఆదామును తొలగించి వేసినప్పుడు, ఆయన "ఏదేను తోటకు తూర్పుదిక్కున కెరూబులను, జీవ వృక్షమునకు పోవు

మార్గమును కాచుటకు ఇటు అటు తిరుగుచున్న ఖడ్గ జ్వాలను నిలువ బెట్టెను" (నిర్గమ. 3:24). ఈ జీవ వృక్షమును నరుని కొరకు దేవుడు సృజించియుండెను. ఇప్పుడతడు పాపము చేసినందున దానిని అనుభవించుటకు వీలుపడదు. ఆదామును ఆ వనమునుండి వెళ్ళగొట్టివేసి, ఆ కెరూబులను, ఆ ఖడ్గ జ్వాలను దేవుడు అక్కడ నిలువ బెట్టుటకు కారణము, పాపియై యుండిన ఆదాము ఆ జీవవృక్షమును అనుభవించకుండ దానిని కాయుటకై, తిరిగి మన ప్రభువైన యేసుక్రీస్తు ఆ ద్వారము తెరచువరకు ఆ వృక్షము అట్లే కాపాడబడు చుండెను. ఆ దీర్ఘకాలమంతయు పాపము నిమిత్తమై అర్పింపబడిన మేకల, కోడెల యొక్క రక్తము ఆయన (యేసు) వైపే నడిపించుచున్నది.

నరుడు పాపము వలన మారిపోయెను. దేవుడు మారగలడా? ఆయన ప్రేమ మారిపోవునా? గడచిపోయిన నిత్యత్వము నుండియు ఈ జీవవరమును మనుష్యునికి ఇచ్చుటకై దేవుడు సంకల్పించి యుండెను. అతడింకను దానిని పొందుటకై సిద్ధముగా నుండలేదు. అందువలన ఆయన దానిని దాచియుండెను. పిమ్మట అతడు (ఆదాము) తిరుగుబాటు కూడ చేసెను. ఇప్పుడు పాపము వలన దానిని పొందలేకపోయెను. ఆ కెరూబులు అక్కడ నిల్చియుండుట వలన అతనికి ఏమి జ్ఞాపకము చేసిరి? "ఓ ఆదామా! ఈ దినము నీవేమి కోల్పోతివో, అదే వరము ఒకనాడు నీకు మరల నివ్వబడును."

తిరిగి జన్మించిన వారమైన మనమందరం కూడ ఎన్నో పాపములు చేయుచున్నాము. తప్పులు చేయుచునే యుందుము, కోపము తెచ్చుకొందుము, మాటిమాటికి ఓర్పులేనితనము హృదయములో ప్రవేశించుచున్నది. అయినను మనలను కప్పిన రక్తము వలన మనకు సేదదీర్చబడుచున్నది. మన ప్రభువైన యేసుక్రీస్తునందు మనకు గల సమస్తమును, మనము పోగొట్టుకొనక జాగ్రత్త పెట్టుచున్నది ఆయన రక్తమే. తప్పిపోవుట వలనను, అవిధేయత వలనను,

అపరాధము వలనను మనము కోల్పోయిన సమస్తమును మనకు తిరిగి ఇవ్వబడు రీతి ఇదియే. రంగువేసిన పొట్టేళ్ళ తోళ్ళతో చేయబడిన ఆ పైకప్పు మనకు జ్ఞాపకము చేయు విషయమేమనగా; మనలను కప్పునది మనుష్యుని రక్తము కాదు గాని, ప్రభువైన యేసుక్రీస్తు యొక్క రక్తము గావున, మనము ఎల్లప్పుడు సురక్షితముగా నుందుము.

అన్నింటికి పైగా నుండిన పైకప్పు సముద్రవత్సల తోళ్ళతో చేయబడియుండెను. ఇది పరిశుద్ధ స్థలము నంతయు, మందిరము నంతయు కప్పుచుండెను. సముద్రవత్స దాని కూనలను అత్యధిక జాగ్రత్తతో కాచునట. ఎల్లప్పుడు మెలకువతో వాటిని కాపాడుచు, కూనలకు హాని చేయుటకుగాని, దగ్గరైనను వచ్చుటకుగాని, వేరే జంతువులను రానియ్యదట. ప్రభువు మనల నేవిధముగా కాపాడుచున్నాడో సముద్రవత్సల తోళ్ళు తెలుపుచున్నవి - అనగా పక్షిరాజు తన పిల్లలను కాచునట్లు (ద్వితీ. 32:11, 12). లేక గొర్రెల కాపరి తన గొర్రెలను కనిపెట్టునట్లు (యెహెజ్కేలు 34:11).

ప్రభువైన యేసుక్రీస్తే మనకు నిజమైన మహా గొర్రెల కాపరియై యున్నాడు (యోహాను 10:11, 14; హెబ్రీ. 13:20; 1పేతురు 2:25). భూమిమీద కావలసినంత మంది గొర్రెల కాపరులు అనబడువారు గలరు. అయితే అందులో ఎక్కడో కొద్దిమంది మాత్రమే అట్లు పిలువబడుటకు యోగ్యత గలిగినవారు (యెషయా 56:10-12). దేవుని మందను కాచుటకు శక్తి సామర్థ్యతలు గలవారు దేవుడు ఏర్పరచిన గొర్రెల కాపరులే. ఈ లోకమందు దేవుని బిడ్డలను బాధించు అనేక అబద్ధ ప్రవక్తలు, అబద్ధ బోధకులు, అనేక శ్రమలు ఉండును. అయితే అడవి జంతువుల నుండియు, దేవుని మందను ధ్వంసము చేయుటకై, అప్పుడప్పుడు గొర్రెలను దోచుకొనుటకు గొర్రె చర్మమును కూడ కప్పుకొని వచ్చునట్టి క్రూర తోడేళ్ళ నుండియు, దేవుని బిడ్డలను కాపాడు నిమిత్తము,

సముద్రవత్సలు దాని కూనలను కనిపెట్టుచుండునట్లు మన మంచి గొర్రెల కాపరి మనలను ఎల్లప్పుడు కనిపెట్టుచుండును.

అపొస్తలుడైన పౌలు సంఘకాపరులకు ఇట్లు హెచ్చరిక చేసెను. అనేక క్రూరమైన తోడేళ్లు దేవుని బిడ్డల మధ్య ప్రవేశించి, దేవుని మందను చెదరగొట్టివేయ జూచుననియు, తాను దివారాత్రులు కన్నీళ్లు విడుచుచు, ప్రతివారికి ఎట్లు సేవ చేయుచు బుద్ధి చెప్పుచుండెనో, అది జ్ఞాపకము చేసికొని, దేవుని మందను ఆ రీతిగా కనిపెట్టుమని చెప్పెను (అపొ. కార్య. 20:28-33). గమనింపవలసిన అంశములు ఇక్కడ మూడున్నవి.

"ఎవని వెండినైనను, బంగారమునైనను, వస్త్రములనైనను, నేను ఆశింపలేదు" (వచనము 33), అని పౌలు అనుచున్నాడు. అయ్యో, అనేక బోధకులు ఏమనుచున్నారంటె, "మాకు జీతాలు లేవు, సరే మేము ఎవరిని కూడా పైసలు అడుగము." ఒకరి వెండి బంగారములను వీరు ఆశించరను కొందము. అయితే, మంచి బట్టలు, మంచి తిండి, మంచివి ఏవైనను సరే ఆశించుచున్నారు. అంత సూటిగా కాకున్నను ఇతరులు గ్రహించు విధముగానే, వారు ఆశించు వాటిని తెలియజేయుచున్నారు. అందరు వినునట్లుగా ఎలుగెత్తి ఈ విధముగా ప్రార్థన చేయుచున్నారు? "ప్రభువా, నాకొక కోటుగాని, షర్టుగాని లేదని నీ వెరుగుదువు, నాకు బట్టలు లేవు కదా?" దేవుని మందల కాపరులుగా నుండ గోరు వారికి ఏ విధమైన ఆశయు నుండరాదు; బంగారు, వెండి ఆభరణములు, తిండి మరి ఈ జీవితమందు వేరే ఏది కూడను ఆశింపరాదు. అప్పుడే, ఎట్టి పరిస్థితుల యందైనను, సంతోష ఉత్సాహములతో దేవుని సేవించగలరు. ఇట్టి కాపరులైతేనే, నిన్ను నిజముగా కనిపెట్టుదురు. ఇట్లు గాని వారు పక్షములు, కలహములు తెచ్చిపెట్టుదురు. పౌలుకు ఎవరేమి ఇచ్చినను దానిని ఇతరులతో పంచుకొనెను. అతడు చెప్పినది ఏమనగా; "పుచుకొనుట

కంటె ఇచ్చుట ధన్యత" (వచనము 35). ఇతరుల అవసరముల నిమిత్తము తన చేతులు కష్టపడెను. మనమైతే, ఏమనుకొనుచున్నామంటె, మనము బోధకులము గనుక, మనకు అన్నియు ఇతరులు ఇవ్వవలెననియు, మన చేతిలో పడు సమస్తము, మన జేబులలోనికే వెళ్ళవలెననియు. ఇట్లు భావించు వారెవరును మంచి కాపరులు కానేరరు. దేవునికి ఇచ్చుట ఎట్లో, దేవుని కొరకు వినియోగించుట ఎట్లో తెలిసికొనిన వారే నిజమైన కాపరులు.

జబ్బులో నున్నవారికి, బాధలో నున్నవారికి, లేమి కలిగినవారికి, బీదలకు, కాపరులు కావలసియున్నారు. దేవుని యొక్క నిజమైన కాపరులై యుండగోరు పురుషులెక్కడ? మనమిట్లు ప్రార్థన చేయవలసి యున్నది: "ప్రభువా, సముద్రవత్స దాని కూనలను కనిపెట్టునట్లు మమ్మును కనిపెట్టునట్టి నిజమైన కాపరులను మా సంఘమున కిమ్ము!" అప్పుడే ప్రతి అడవి మృగమునుండి నీవు సంరక్షింప బడుదువు.

# 11

# తుమ్మకర్ర

"తుమ్మకర్ర" (నిర్గమ. 25:4). మందిరమందు ఎటు చూచినను తుమ్మకర్ర కనబడుచున్నది. అతి పరిశుద్ధ స్థలమందుయున్న మందసమేమి, ధూప పీఠమేమి, పరిశుద్ధ స్థలములోని సన్నిధి రొట్టెల బల్ల ఏమి, మందిరము యొక్క చెక్కలు, స్థంభము లేమి, వెలుపటి ఆవరణము యొక్క స్థంభము లేమి, ఇత్తడితో కప్పబడిన ఆ పెద్ద బలిపీఠమేమి, సమస్తమును తుమ్మకర్రతో చేయబడినవే. ఇక్కడొక ముఖ్యమైన పాఠము మనకొరకున్నది.

తుమ్మచెట్టు కసిందచెట్టు జాతికి చెందినది. లోకములో ఎక్కడ చూచినను సర్వ సాధారణమైన కర్ర ఇది. ఉత్తర దక్షిణ ఇండియాలు నీవు తిరిగినను, లోకమందు ఏ ఉష్ణ దేశము పోయి చూచినను కావలసినన్ని కసిందచెట్లు, కావలసినంత తుమ్మకర్ర నీకు కనబడును. ఇది పొయ్యిలో పెట్టి కాల్చుటకే గాని ఇంక దేనికిని అంతగా ఉపయోగించరు.

మహిమారాజగు ప్రభువైన యేసు ఒక సామాన్య మనుష్యుని రూపము దాల్చెను. ఒక రాజభవనమందు జన్మించలేదు. ఒక పశువుల శాలలో పుట్టెను. పశువుల తొట్టిలో పెట్టబడెను. అతి సామాన్యునిగా పెంచబడెను. భూలోక వైభవము, శోభలతో ఈ భూమికి రాలేదు. ఒక సాధారణ మానవునిగా వచ్చి అతి పేద జనుల మధ్య నివసించెను.

అయితే, ఆయన మాటలాడినప్పుడు అవి ఒక అధికారి యొక్క అధికారపు వాక్కులే (మార్కు 1:22; యోహాను 7:46). ఆయన వస్త్రములు చూడగా, ఆయన జీవించుచుండిన విధము చూడగా, ఒక బీద మనుష్యుడే. అయితే, ఆయన మాటలు చూచినచో పరిసయ్యులు, శాస్త్రులవలె ధర్మశాస్త్రమును బోధించువాడు గాక, తన స్వంత అధికారము మీద మాట్లాడు దైవమే. పరిసయ్యులైతే తమ నిడుపాటి వదులు వదులుగా నున్న అంగీలు జుబ్బాలను బట్టి అతిశయించుచుండిరి, పై వేషాలు ఏమియు వేయక ప్రభువైన యేసుక్రీస్తు వచ్చెను. తుమ్మకర్ర, సర్వ సాధారణమైన తుమ్మకర్ర వలె వచ్చెను. ఎందుకనగా, ఏ దేశస్థుడైనను, ఏ అంతస్థు వాడైనను ఆయన విషయము, నా ప్రభువు, నా రక్షకుడు, నా స్నేహితుడు, అనగలుగు నిమిత్తము. ఏ బాహ్య వైభవమును లేకుండా వచ్చినను మనకాయన దేవుని యొక్క శక్తి, అధికారము, మహిమలను తెచ్చెను. తుమ్మకర్ర శక్తిమంతుడైన దేవుడు, సజీవ దేవుడు మన నిమిత్తము ఎట్లు మానవుడాయెనో తెలుపుచున్నది (ఫిలి. 2:5-9). పేదరిక మనగా నేమిటో మన ప్రభువు ఎరుగును, బట్టబయలులోను, చెట్ల క్రిందను, కొండమీదను నిద్రించుట ఏమిటో ఆయన ఎరుగును. తోబుట్టుల ద్వేషమనగా నేమిటో ఆయన ఎరుగును. స్వంత స్నేహితుల వలన త్రోసివేయబడుట ఏమిటో ఆయన ఎరుగును. దూషింపబడుట, అబద్ధ నేరములు మోపబడుట ఏమిటో ఆయన ఎరుగును. దయ్యములకు అధిపతియైన బయెల్జెబూలు అను పేరు పొందుట ఏమిటో కూడ ఎరుగును. ఏల? "అన్ని విషయములలోను ఆయన తన సహోదరుల వంటివాడు కావలసి వచ్చెను" (హెబ్రీ. 2:17, 18). కారణము? వారికి వచ్చు శ్రమలు, శోధనలు తానే అనుభవించి యున్నందున, వారికి సహాయము చేయగల వాడగుటకు, "తాను శోధింపబడి శ్రమ పొందెను. గనుక శోధింపబడు వారికిని సహాయము చేయగల వాడై యున్నాడు." ఇందువలన మన కష్టములన్నియు,

మనము ఆయనతో చెప్పుకొనవచ్చును.

నా జీవితమందు నే నెన్నడు ఎరుగనంతటి తీవ్రతరమైన ఒక కష్ట కాలమందు, ఈ వచనము నన్ను ఆకర్షించెను. నేను రక్షింపబడక పూర్వము సునాయాసముగా జీవించుచుంటిని. డబ్బుకు కొదువలేదు; స్నేహితులకు కొదువలేదు; రక్షింపబడిన పిమ్మట డబ్బు ఎగిరిపోయెను; స్నేహితులు మాయ మైపోయిరి. అప్పుడప్పుడు, చాలా దినములు పస్తు పడుచుంటిని. అనేక మాసములు ఒక వంటవానిగా కూడా పని చేయవలసి వచ్చెను. నేనొక నిర్ణయము చేసికొనియుంటిని. ఒకరి దగ్గరకు వెళ్ళి ఏ సహాయము అడుగరాదని, పస్తుపడి చచ్చిన ఎడల చచ్చెదను గాక; ఏ మనుష్యునితోను నా అక్కరల విషయము చెప్పుకొననని తీర్మానించి యుంటిని.

అటు తరువాతనే, కొన్ని మాసములు గడచిన పిమ్మట ఒక వంటవాని పని దొరికెను. "వంటవానిగా పని చేయుటకు ఒప్పుకొందువా?" అని ఒకరు అడిగిరి. "నాకు వంటలు రావుగాని, ప్రయత్నము చేస్తాను" అని ప్రత్యుత్తర మిచ్చితిని. ఒక అమెరికన్ హోటల్‌లో భారతీయ భోజనము ఒక 500ల మందికి చేయవలసి యుండెను. ఇంతమందికి భోజనము తయారుచేయవలెనంటే, నా బసను తెల్లవారుజాములలో విడిచి హోటల్‌కు పోవలసి యుండెను. ఇగురు కూరలకు రెండు బక్కెట్లనిండా ఉల్లిగడ్డలు తరుగవలసి యుండెను. నా కండ్లలో నీరు కారి ముఖము మీద దిగజారుచుండెను. అటు పిమ్మట అగ్ని కొలిమి వంటి పొయ్యి దగ్గర నిలువబడి వంటలు చేయవలసి వచ్చెను; కూరగాయలతో తయారు చేసిన కూర ఒకటి, మాంసము కూర ఒకటి, అన్నము, ఎందులో ఏ చిన్న పొరపాటు వచ్చినను నా ఉద్యోగము సమస్తము పోవునను భయమొకటి. తెల్లవారుజామున చలి తిమ్మిరెక్కించుచుండగా, బయటకు బయలుదేరి హోటల్‌కు వెళ్ళవలసి యుండెను. ఒకనాడు ఆ రెండు

బకెట్లు ఉల్లిపాయలు, ఆ మాడ్చివేయునట్టి పొయ్యి నిప్పు తలచునప్పటికి, మార్గమందు నా మనస్సు చాలా క్రుంగిపోయెను. ఎంతో శరీరాయాసము మనస్సులో కష్టము బాధించుచుండగా, రోడ్డుమీద నడచుచు ఇట్లు తలచింతిని. "నా ప్రాణానికి ఇంత కష్టము దేవుడు రానివ్వనేల?" నేను మారు మనస్సు పొందక ముందేమో డబ్బుకు కొదువలేక పోవడము, ఇప్పుడేమో ఒక నాలుగు రూపాయలు దొరికితే చాలునని వంటవాడు కావడమా?"

అకస్మాత్తుగా రోడ్డు ప్రక్కన ఒక బోర్డు కనబడెను. దాని మీద ఇదే వాక్యము వ్రాయబడియుండెను: "తాను శోధింపబడి శ్రమపొందెను. గనుక శోధింపబడువారికిని సహాయము చేయగలవాడై యున్నాడు" (హెబ్రీ. 2:18). ఈ వచనము నాకు తెలిసియుండలేదు. అయితే అక్కడ ఆగి ఆ మాటలు చదువుచుండగా ఆదరణ కలిగెను. తిరిగి నా దారిని వెళ్ళుచు మాటిమాటికి "సహాయము చేయగలవాడై యున్నాడు" అనుచు నడిచితిని. హోటల్ చేరి ఆ రెండు బక్కెట్లు ఉల్లిపాయలు తెచ్చికొంటిని. తరుగుచుండగా ఎప్పటివలె కండ్లు మండి నీరు కారిపోవుచుండెను. అయినను నా హృదయములో మహా సంతోషముండెను. ఆ దినము మొదలు నా మనస్సు కృంగలేదు. నా తలంపంతయు నిట్లుండెను : "నా ప్రభువు నా పాపము నిమిత్తము అన్ని శ్రమలు భరించెను. కష్టాలు, శోధనలనగా నేమిటో ఆయన ఎరిగియున్నాడు. అందువల్లనే నేను శోధింపబడునప్పుడు నాకు సహాయము చేయగలవాడై ఉన్నాడు." నీవు శోధింపబడునప్పుడు, అదే శోధన ఆయన కూడ పొంది గెలిచి ఉండెననియు, ప్రభువైన యేసుక్రీస్తు నీకు సహాయము చేయగలవాడనియు జ్ఞాపకము చేసికొనుము. అతి యల్ప, అతి పేదజనునితో కూడ కలిసి అతని శ్రమలో తాను పాల్పొందుటకై ఆయన తుమ్మకర్రగా వచ్చెను.

ఎంత వింత! ప్రతి హృదయమును ప్రభువైన యేసుక్రీస్తు ఎరుగును.

నీ హృదయమును నీ వెరిగిన దానికంటే చక్కగా ఆయన ఎరుగును. నీవు ఈ విధముగా తలంచవచ్చును : "నేను పడుతున్న బాధవంటిది మరెవ్వరికి ఉండదు. మా తండ్రి ఎలాంటివాడో (లేక మా అమ్మ ఎలాంటిదో) ఎవరు ఎరుగుదురు? నా భర్త నన్నెన్ని తిప్పలు పెట్టుచున్నాడో (లేక నా భార్య నన్నెన్ని తిప్పలు పెట్టుతుందో) ఇతరులకు ఏమి తెలుసును?" దేవునికి తెలుసునులే. ఆయనకంతా తెలుసును గనుక నిన్ను గూర్చి ఏ నెపములు తేవద్దు. ప్రభువైన యేసు తుమ్మకర్ర వలె అయెను. అనగా, సంపూర్ణముగా మనుష్యుడే. ఎందుచేత? ఏ సమయమందైనను, ఏ చోటనైనను, ఏ పరీక్షలోనైనను నీకు సహాయము చేయవలెనని.

అయితే మరొకటి గమనింతము. తుమ్మకర్ర కసిందచెట్టు జాతికి చేరినది. ఈ కసిందకర్ర ఎప్పటికైనను వంకరలు లేనిది కాదు. చెట్టులో ఎక్కడ వెదికినను వంకరలు లేని కొమ్మ నీకు కనబడదు. ఈ వంకర కర్రతో తిన్నని పలకలు చేయుట చాలా కష్టము. అయితే, మందిరపు పలకలన్నియు తిన్ననివి. అనగా ఈ వంకరకర్రలే తిన్నగా చెక్కబడెను. ఇదెట్లు? అరేబియా దేశపు ఎండుబీడు అరణ్యములలో మాత్రమే మొలచు నల్లకసింద కర్రయే మందిరమునకు ఉపయోగింపబడెను. ఈ తుమ్మకర్ర బలమైనది, గట్టిది, ముడులులేని నున్నటిది, చాలా సొగసైనది. అది ఎంత బలముగాను గట్టిగాను ఉండుననగా, అది చాలా మట్టుకు చెడదు. దాని దుంగలు ఎంత పెద్దవనగా, పన్నెండు మూరలు పొడవు గల పలకను దానినుండి కోసి తీయవచ్చును.

ఇది ఎంత ఆశ్చర్యకరముగా మన ప్రభువైన యేసుక్రీస్తును వర్ణించుచున్నదో! ఆయనలో ఏ వంకరులు లేవు. మార్గము తప్పుట లేదు. చెడుగులేదు. అయితే ఎండుభూమి నుండి వేర్లు బయలుదేరినట్లు ఆయన వచ్చెను (యెషయా 53:2). పైకి మనము ఎంతో మంచివారముగాను, నీతిమంతులముగాను

కన్పించవచ్చును; లోపల అంతా వంకరలే. మన ప్రభువు మనలను తిన్నగా చేయుటకు తుమ్మకర్రవలె వచ్చెను

నేను పెంకితనము చేయకుండినందున, నేను చాలా మంచిపిల్ల వాడనని మా తల్లి అనుకొనెను. బడిలో నవలలు చదువుట మొదలు పెట్టితిని. ఒక దినము ఎన్నో నవలలు ఇంటికి తెచ్చుకొని రాత్రి రెండు గంటలు కొట్టే వరకు చదువుచుంటిని. "ఎందుకింత కష్టపడి చదువుతున్నావు?" అని అమ్మ నన్ను అడిగెను. "అమ్మా, నేను పరీక్షకు కూర్చోవాలి. రేపు బడికి వెళ్ళేముందు ఇవ్వన్ని చదివేయాలని మా పంతులు చెప్పాడు. అందుకనే, ఇంత కష్టపడి చదువుచున్నాను." అని ప్రత్యుత్తర మిచ్చితిని. "అయ్యో కొడుకా" అని జాలిగొని, మా తల్లి నాకు ఎక్కువగా పాలు, మీగడ, వెన్న ఇచ్చెను. చదువుచుండినది మలినమైన నవలలు. మా తల్లి ఏమో పాఠములు చదువుచున్నాను అనుకొనినందున నేను చాలా సిగ్గుపడితిని.

నీవు మంచి తెలివితేటలు గల బాలుడు లేక బాలిక అయియుండవచ్చును. అయితే, నీకున్న వంకరలు దేవుడు చూచుచున్నాడు. మనందరిలోను ఏదో కొంతయినా వంకర లేకపోలేదు. మనలను తిన్నగా చేయు నిమిత్తమే ప్రభువు తుమ్మకర్ర వలె ఆయెను. ఆయన లేకుంటే, మనకంతా వంకరలే. ఆయనలో మాత్రమే మనము తిన్నగా ఉండగలము ఎవ్వరైనా నిన్ను తిన్నగా ఉండునట్లు చేయగలరా? అది అసాధ్యముగా కన్పించును. అట్లు కాదా? దేవునికి స్తోత్రము : "వంకరని చక్కగా ఉండ వలెను," (యెషయా 40:3, 4). మన ప్రభువైన యేసు మనలను ఆయనలో ఆ రీతిగా చేయును. అదే ఆయన మనలో చేయకోరుచున్నాడు. తుమ్మకర్రను గూర్చిన పాఠము కొరకు దేవునికి వందనములు:

# 12

# ప్రదీపమునకు తైలము

"ప్రదీపమునకు తైలము (నిర్గమ. 25:6). దీపమును నిత్యము వెలుగుచుండ చేయుటకై ప్రదీపము కొరకు దంచితీసిన అచ్చమైన ఒలీవ నూనెను తేవలెనని ఇశ్రాయేలీయులకు అజ్ఞాపించుము" (లేవీ. 24:2). బైబిలులో నూనె పరిశుద్ధాత్మకు చిహ్నముగా నున్నది. పెండ్లి కుమారుని రాకడ కొరకై మనము కనిపెట్టుచుండగా, మన పాత్రలు నింపబడి, మన దీపములు వెలుగుచు నుండవలెనని మత్తయి 25:1-13లో చెప్పబడియున్నది (దీనిని లూకా 12:35, 36 తో సరిపోల్చుము). రోమా 8:9లో మనమేమి చదువుచున్నమనగా: "ఎవడైనను క్రీస్తు ఆత్మలేని వాడైతే వాడాయనవాడు కాడు. మరియు ఎఫెసీయులు 5:18లో "ఆత్మపూర్ణులై యుండుడి" యని మనకు అజ్ఞాపింపబడియున్నది.

దేవుని కృప ద్వారా మనము రక్షింపబడి విమోచింపబడగా ఒక క్రొత్త కుటుంబములో ప్రవేశించుచున్నాము. క్రైస్తవులు అనిపించుకొను ప్రతి యొక్కరు, ఆ కుటుంబమునకు చెందినవారే అనుకొనుటకు వీలులేదు. ప్రభువైన యేసుక్రీస్తు యొక్క జీవము ఎవరెవరిలో నున్నదో వారు మాత్రమే ఆ కుటుంబమునకు చెందియున్నారు. నీవు, క్రైస్తవులు అనబడు జాతిలో జన్మించి యుండవచ్చును. బాప్తిస్మము పొంది యుండవచ్చును. ఒక పాస్టరుగానో లేక బోధకునిగానో లేక బిషప్పుగానో నీవు ఉండవచ్చును. అయినను, నీవు

పరిశుద్ధాత్మద్వారా 'తిరిగి జన్మించి' యుండనిచో, ఆ పరలోక కుటుంబమునకు నీవు ఎంత మాత్రము చెందియుండలేవు. ఇప్పుడు మనము చెప్పుకొను ఈ వర్తమానమంతయు ఆ పరలోకపు కుటుంబపు వారికి మాత్రమే. ఆ కుటుంబములో నీవు కూడ చేరియున్నావో లేదో అను ప్రశ్నకు నీవే జవాబు చెప్పుకొనవలెను. నిత్యజీవమును అనుభవపూర్వకముగా కలిగియున్నప్పుడే, ఆ నిత్య కుటుంబమునకు చెందియుండగలము. లేనిచో మనము నిజమైన సభ్యులము కాము.

ఆ పరమ కుటుంబమునకు రెండంతల దైవపరిచర్య గలదు - భూమి మీద సేవ, పరలోకమందు సేవ. పరమ ప్రాంత్యములందు మరింత పూర్ణముగా సేవ చేయవలెనంటే, భూమిమీదనే మనము తర్ఫీదు కావలెను. మందిరము యొక్క వివరముల ద్వారా భూమిమీద సేవను గూర్చిగాని, పరమందు సేవ విషయముగాని మనము ఎంతో నేర్చుకొనవచ్చును. మందిరమందు అడ్డుతెరకు బయటనున్న పరిశుద్ధ స్థలములో మూడు వస్తువులను చూచితిమి. దక్షిణవైపు ఏడు కొమ్మలు గల స్వర్ణదీప స్తంభము, ఉత్తరవైపు సన్నిధి రొట్టెల బల్ల, నట్టనడుమ బంగారు ధూప పీఠము. రేయింబగళ్ళు దీపము వెలుగుచునే యుండవలెను. సన్నిధి రొట్టెలు వాటి బల్లమీద ఎల్లప్పుడు నుంచబడవలెను. ప్రతి సబ్బాతు దినమందు పాతరొట్టెలు తీసివేసి క్రొత్తవి ఉంచబడవలెను. ఈ మూడే పరిశుద్ధ స్థలములోని సామానులు. ఇప్పుడు ఆ స్వర్ణదీప వృక్షము విషయము కొంత చూతము. దీని వృక్షము యొక్క సంపూర్ణ వివరము నిర్గమ. 25:31-40లో దయచేసి చదువుము. ఆటు పిమ్మట జెకర్యా 4వ అధ్యాయము తీసి శ్రద్ధతో దానినంతయు చదువుము. భూమిమీది మన యావత్తు పరిచర్యను దేవుడు ఎంత అందముగా కనబరచుచున్నాడో చూతువు. చూచుటకు కండ్లు వినుటకు చెవులు గలవారు గ్రహింపగలరు.

ఈ అధ్యాయమందు జెకర్యాకు ఒక దర్శనమివ్వబడెను. ఇతడొక స్వర్ణదీప స్తంభమును చూచెను. రెండు జీవించుచున్న ఒలీవ వృక్షములలో నుండి ఈ దీప స్తంభములోని నూనె ఎడతెగక దిగుచుండెను (వచనములు 2, 3, 12). అప్పుడు దేవదూత జెకర్యాతో ఇట్లనెను, "నేను ఏ శక్తి వలన లోకమును రక్షించితినో, ఆ శక్తిని ఈ దీపస్తంభము, ఏడు కొమ్మలు తెలుపుచున్నవి. మానవ తెలివివలన మానవశక్తి వలన కాక నా ఆత్మచేత మాత్రమే" నా సేవ జరుగును (వచనము 6).

పరిశుద్ధ స్థలమందు రాత్రింబగళ్ళు వెలుగుచుండిన ఏడు దీపముల ద్వారా దేవుడు తన జనులతో ఏమి చెప్పుచుండెననగా : "నా కార్యములు జరుగగలిగినది ఒకటే మార్గము ద్వారా; శక్తి చేతనైనను, బలము చేతనైనను కాక నా ఆత్మచేతనే" ఎంత సొగసుగాను, తేటగాను దేవుడు మాట్లాడుచుండెనో : ఇట్లుండగా, మానవబలము, ధనము తెలివితేటల చేత దేవుని కార్యములు జరుగగలవని తరచుగా భావింతుము. క్రైస్తవుల మధ్య ఈ కాలమందు ఇంత ఆత్మీయ గొడ్డుతనము చూచుచున్నామేల? మనకు చాలా బలమున్నదని మనము తలంచినను, ఎటు చూచినను, ఆత్మీయ గొడ్డుతనమే. లోకము యొక్క మొత్తపు జనసంఖ్య 240 కోట్లు; ఇందులో క్రైస్తవులు అను పేరుగల వారి సంఖ్య ఒక నాల్గవవంతు. లోకమందు అధిక సంఖ్యాకులు క్రైస్తవులే యని మాటకు చెప్పవచ్చును. అయితే, ఇంత సంఖ్యలో 'తిరిగి జన్మించిన' వారెందరు? నూటికి ఒక్కరు. సంఖ్యలను బట్టి చూస్తే మనదే బలము. ఆత్మీయముగా చూస్తే అంతా గొడ్డుతనమే, బలహీనతయే. పైకి చాలా ధనవంతులమే, అంతా దర్జా; జేబు మాత్రము ఖాళీ.

నేను ఇంగ్లాండులో కాలేజి విద్యార్థిగానుండగా, మా తల్లిదండ్రులు నాకు డబ్బు పంపుచుండిరి. నేను వారికి పంపుచుండినది అంతా దొంగ పద్దులే.

1930లో అన్నియు చాలా ఖరీదే: మంచి మంచి నెక్ టయిలు, ఖరీదుగల సూట్లు. ఇట్టివి తొడుగుకొని దర్జాగా తయారయ్యేవాడను జేబులో పైసా లేదు. ఈ దినాలలో అనేకులు స్థితి ఇట్లే యున్నది. మిషనువి పాఠశాల లేమి, కళాశాలలేమి పెద్ద పెద్ద కట్టడాలు. అయితే ఫాదిరీలు, బోధకులు, బిషప్పులు, మిషనరీలు మొదలైన వారిలో ఏపాటి ఆత్మీయ జీవము చూచుచున్నాము? ఆత్మీయముగా మనము వెనుకబడినవారమే; నిజమైన జీవము మనలో లేదు. ఏల? మన నాయకులు నమ్ముకొనునది తమ డబ్బే. తమ జ్ఞానమే. దేవుని పని కొరకు దేవుడు చెప్పినదేమో, "శక్తి చేతనైనను బలము చేతనైనను కాక నా ఆత్మచేతనే" దేవుడు ఇట్లనుచున్నాడు : "బంగారు మయమైన దీపస్థంభములవలె నుండుటకు మిమ్ము చేసియున్నాను. నా వెలుగు మనుష్యులందరి మీద ప్రకాశించవలెననియు, సమస్తమైన వారు నా ఘనతను, నా మహిమను తెలిసికొనవలెనని. ఇది మరువవలదు" మనకు విద్య, నాగరికత, ఫ్యాషన్లు అధికముగానే యున్నవి. అయుతే, ఆత్మీయమైనవన్నియు పోగొట్టుకొంటిమి. మీ గ్రామములో, బి.ఎ. ప్యాసైనవాడు ఒకడు ఉండిన ఎడల అతడు గంటలకొలది వాదించగలడు గాని, కొంచెము ప్రార్థన చెయ్యండియని అడిగినచో ఒక రెండు మాటలు కూడ అతని నోటినుండి వచ్చుట కష్టమే! తానొక బి.ఎ. అని చెప్పుకొనుచున్నాడు. తన బైబిలు నేమైన తానెరుగునా? దేవుని విషయముగాని, ప్రభువైన యేసుక్రీస్తు విషయముగాని సత్యమేమైనా ఎరుగునా?

క్రైస్తవులనబడు అనేకులు అనేక ఇచ్ఛలతో నిండుకొనియుండుట ఏల? శోధనను గెలువలేక ప్రతిదినము పాపములో పడుట ఏల? ఏలననగా, వారికి బోధ చేయువారు మానవ జ్ఞానముతో దేవుని కార్యమును చేయగలమని భావించినందులకు. వీరికి దేవుడిచ్చు వర్తమానము ఏమనగా "మీరు పేరుకు క్రైస్తవులు. మీలో జీవములేదు." బంగారు మయమైన దీపవృక్షము యొక్క పాఠము ఇదే.

దీపస్తంభమునకు ఇరుప్రక్కల చెరియొక ఒలీవచెట్టు కనబడుట జెకర్యా చూచి, ఇదేమిటని ఆ దూతను అడుగగా, "వీరిరువురు దేవుని అభిషిక్తులు అని ఆయన ప్రత్యుత్తర మిచ్చెను." "ఈ ఇద్దరెవరు?" అని జెకర్యా తిరిగి ప్రశ్నించెను.

ప్రకటన 11:4-11లో లోకాంతకాలపు దినములు వివరింపబడి యున్నవి. ఆ కడపటి మూడున్నర సంవత్సరములు ఎక్కడ చూచినను పాపము, అంధకారము, అంధత్వమే ఉండును. ఆ సమయమందు దేవుడు ఇరువురు సాక్షులను పంపును, వీరు 1260 దినములు - అనగా 3.5 సంవత్సరములు ప్రవచింతురు, వీరే ఆ రెండు ఒలీవ చెట్లు. వీరే ప్రభువైన యేసుక్రీస్తుకు నమ్మకమైన ఇద్దరు సాక్షులు. అంత్య క్రీస్తు వారిని ప్రవచింపకుండునట్లు చేయవలెనని తన బలమును వారిపై నుపయోగించును. అయినను, దేవుడు వారికి చెప్పినదానిని వారు మానకుండ ప్రకటించుచునే యుందురు. అప్పుడు అంత్య క్రీస్తు, అనగా ఆ మృగము వారిమీద యుద్ధము చేసి, తుదకు వారిని ఓడించి, వధించును. అయితే, మూడవ దినమున దేవుని ఆత్మ వారియందు ప్రవేశించి వారికి తిరిగి జీవమునివ్వగా వారు తిరిగి బోధలు, ప్రవచనములు చేయుదురు. ఇక వారిని ఆపు చేయుటకు ఎవరి తరమును కాదు.

ఈ రెండు ఒలీవ చెట్లు ఏమి సూచించుచున్నవనగా నమ్మకమైన, విశ్వాసపూర్వకమైన సత్య సాక్ష్యమును. ఈ దినములలో ఎవరికిని సత్యము అవసరము లేదు. సత్యము తప్పించి ఇంకేదైనను వినుటకు సిద్ధమే. మనుష్యులకు సత్యము నచ్చకుండనందున బోధకులు దేవుని వాక్యమును మార్చి అబద్ధములు, అసత్యములు నేర్పుదురు. తమ కార్యములకు అనుకూలముగా బైబిలును వంకర టింకరలు చేసి, మార్చి, అబద్ధ ప్రవచనములు చేయుచు, అబద్ధ వర్తమానముల నిత్తురు. అంత్య దినముల యొక్క స్థితి ఇదే.

జనులకు కావలసినవి కథలే. నిద్రకు జోకొట్టు కథలు, చిట్టి పాపలకు చెప్పు కథలు-వారిని నవ్వించితే చాలును. వాళ్ళకు బైబిలు అవసరములేదు. మనుష్యులు చెప్పు మాటలే అవసరము. అంత్య దినములు ఇట్లుండునని బైబిలు ప్రవచించుచున్నది. కావున మనము ఎటు చూచినను ఎక్కడైనను ఇదే విధముగా జరుగుచున్నందున మనకిది ఒక ఆశ్చర్యము కాదు. అయితే సత్ క్రైస్తవు లెవరో వారు స్వర్ణదీప స్థంభములవలె ప్రకాశించుచునే యుందురు; వారి దీపము రాత్రింబగళ్ళు మండుచునే యుండును; వారి సాక్ష్యమును మార్చుటకు ఏ లోకాధిపతికైనను తరముకాదు.

ఒలీవ చెట్టులోని విశేషమేమి? ఆదికాండమును చదివినచో ఈ రహస్యము తెలియును. ప్రతి ప్రశ్నకును జవాబు బైబిలులో నున్నది. ఆదికాండము 8:11, కీర్తనలు 52:8 చదివినచో, ఒలీవచెట్టు దేవుని యొక్క కృపాకరుణలను గూర్చి తెలుపుచున్నది. ఆదికాండమందు జల ప్రళయమును గూర్చి చదువుచున్నాము. భూమినంతయును, కొండలను, పర్వతములను సహా జలములు ముంచివేసెను. ఎక్కడ చూచినను జలమే. నరుల చెడుతనము భూమిమీద గొప్పదైనందునను, వారి హృదయము యొక్క తలంపులలోని ఊహ అంతయు ఎల్లప్పుడు కేవలము చెడ్డదైనందున (ఆదికాండము 6:5) దేవుని యొక్క తీర్పును, ఆయన భయంకరమైన ఉగ్రతను ఈ జలము ప్రకటించెను. ఎందుకనగా, నీళ్ళు తప్ప మరేదియు ఎక్కడను ఉండలేదు. భూమినంతయు నశింపజేయుటకే దేవుడు ఈ జలప్రళయమును పంపెను. ఎవరికిని తప్పించుకొను ఆశ లేకుండ చేసెను. నోవహుకు ఎటు చూచినను కన్పించినది నరుల మీదికి దేవుడు తీర్పుగా పంపిన జలమే.

ఒకానొక ఉదయమున ఒక పావురము ఒక ఒలీవ చెట్టునుండి ఒక సన్నని ఆకును నోట పెట్టుకొని నోవహుకు తెచ్చెను. ఒలీవ చెట్టులో ఈ ఆకు

ఒక సూక్ష్మమైన భాగము. అయినను క్రొత్త నిరీక్షణ అతని యందు ఉద్భవించెను. అతని ఆలోచనలు ఇట్లుండి ఉండవచ్చును: "భూమి సర్వము నాశనమాయెను, ఇండ్లన్నియు కూలిపోయెను, మనుష్యులందరు చనిపోయిరి: ఈ భూమి తిరిగి ఏరీతిగా నుండునో," పావురము చిన్న ఒలీవ ఆకు తెచ్చెను. ఒలీవచెట్టు యొక్క ఈ చిన్న ఆకు నోవహుకు ఏమి సంతోషము, ఏమి నిరీక్షణ క్రొత్తగా కలిగించెనో : దేవుని యొక్క కరుణను అతడు క్రొత్త విధముగా గ్రహించెను. భూమికి ఆయన తీర్పు తీర్చుచుండినను, ఆయన కృపాకరుణలు గల స్వభావము మారనిదిగా నుండెను, దేవుడు మనలను శిక్షించి, తీర్పు తీర్చవచ్చును. అయినను మనలను ప్రేమించుచున్నాడు. ఆయన పాప ద్వేషకుడు. కాని, పాపులను ప్రేమించును. ఈ ఒలీవ ఆకు దేవుని కరుణకు గురుతుగా నున్నది.

సువర్ణదీప స్థంభమునకు ఇరుప్రక్కల రెండు ఒలీవ చెట్లుండెను. వాటి ద్వారా జెకర్యాతో దేవుడిట్లు చెప్పెను : "నేను తీర్పు తీర్చుట తప్పక పోయినను నా కృపాకరుణలు మారవు, అంతరింపవు." తిరిగి జెకర్యా 4:7 చూడుము "కృపా ... కృపా." మనము ప్రకటింపవలసిన దేవుని వర్తమానము ఇదే. మనము వెళ్ళి దేవుని కృపను తెలియపరచవలసి యున్నాము. ఈ దర్శనము జెకర్యాకు మహానందము కలిగించెను. ఎందుకనగా, తన ఆలయమును తిరిగి కట్టుదునని దేవుడు చెప్పుచుండెను.

నెబుకద్నెజరు కాలమందు యెరూషలేము నాశనము చేయబడెను. జెకర్యా దర్శనము నాటికి దేవాలయము ఎంతో కాలమునుండి పాడుబడిన దిబ్బగా నుండెను. పాపము విడువని తన జనులకు దేవుడు తీర్చిన తీర్పు ఇదే. పాడు దిబ్బలయి ఉండిన దేవుని మందిరమును చూచి జెకర్యా తనలో తాను ఇట్లనుకొనుచుండెను : "దేవాలయము నేను కట్టించుట నా తరమా?" దేవుడు అతనితో చెప్పినది : "రాజుల దగ్గరకు, భాగ్యవంతుల దగ్గరకు పోయి డబ్బుకు

ముష్టి ఎత్తవద్దు. శక్తి చేతనైనను, బలము చేతనైనను కాక నా ఆత్మచేతనే పర్వతములు-కేవలము నా ఆత్మద్వారా మైదానములై పోవుట నీవు చూచుదువు. జెకర్యా, నా మాటకు లోబడి, నా జనులకు నా వర్తమానము నిమ్ము. నా మందిరము కొరకైన నా పరలోక ఏర్పాటును వారికి తెలుపుము. నాకొక నమ్మకమైన సాక్షిగా నుండుము."

దేవుడు ఏమి ప్రత్యక్షపరచెనో అది ప్రకటించి తీరవలెను; దేవుడు ఏమి చూపెట్టెనో అది జనులకు తెలిపితీరవలెను. ప్రారంభమందు అపొస్తలుల పరిచర్య ఇదే. అపొస్తలుల కార్యములందు 4:18-21లో చెప్పబడినది మీకు జ్ఞాపకముండును. అపొస్తలులు యూదుల సభ యెదుటకు తేబడిరి. ప్రభువైన యేసుక్రీస్తు యొక్క పేరు ఎత్తకూడదని అధికారులు, పెద్దలు వారి కాజ్ఞాపించిరి; ఎత్తిన యెడల వారు శిక్షింపబడి కారాగృహములో వేయబడుదురని చెప్పిరి. అప్పుడు అపొస్తలులు చెప్పినదేమనగా : "మేము కన్నవాటిని విన్నవాటిని చెప్పక యుండలేము" అనిరి.

క్రైస్తవ పాఠశాలలు, క్రైస్తవ కళాశాలలు, ఎన్నెన్నింటిలోనో ప్రభువైన యేసుక్రీస్తు నామమున ప్రార్థనలు చేయుట మానివేసి యున్నారనుమాట నీ వెరుగుదువా? 1936లో ప్రత్యేక కూటముల కొరకు ఒకానొక ఊరిలో నుంటిమి. ఆ వూరిలో బాలురకొక పెద్ద క్రిస్టియన్ కాలేజి, బాలికలకొక పెద్ద క్రిస్టియన్ హైస్కూలును ఉండెను. ప్రార్థనల యందు ప్రభువైన యేసుక్రీస్తు నామము రాకూడదని ఉపాధ్యాయులకై ప్రధాని అజ్ఞాపించెను. ఒకనాడు ఆ ప్రధానిని కలిసికొని ఇట్లు అడిగితిని : "మీరు ప్రార్థనలలో ప్రభువైన యేసుక్రీస్తు నామమును ఏల నుపయోగించుట లేదు? ఉపాధ్యాయులకు ప్రభువైన యేసుక్రీస్తు నామమున ప్రార్థన చేయరాదని అజ్ఞాపించుట ఏల?" అప్పుడు ప్రధాని ఇచ్చిన ప్రత్యుత్తరము : "మా కాలేజిలో ఎందరో హిందూ, ముస్లిము

విద్యార్థులున్నారు. వారి మనస్సు నొప్పించరాదు; ప్రభువైన యేసుక్రీస్తు నామమున ప్రార్థన చేసినచో, వీరందరికి కోపాలు రేగును. అందుచేతనే, 'నీ నామము ద్వారా' అని ప్రార్థన చేయుచున్నాము." అప్పుడు నేను అతనితో చెప్పినది ఏమనగా; "ఈ ప్రార్థనలు పరలోకమందు వినబడవు. మీరెంత పెద్దకేకలు పెట్టి ప్రార్థనలు చేసినను దేవుడవి వినడు. ఈ కాలేజి కట్టుట కివ్వబడిన ప్రతియొక్క ఇటుక కూడా ప్రభువైన యేసుక్రీస్తు నామమున ఇవ్వబడిన సొమ్ముతోనే కొనబడెను. ఇప్పుడైతే ఆయన అంటే మీకు సిగ్గా?"

అపొస్తలులు సిగ్గుపడలేదు. ప్రభువైన యేసుక్రీస్తు నామమును బట్టి ఎవరితోను మాట్లాడకూడదని వారికి ఆజ్ఞాపించి బెదరించిరి. అయితే వారు, "మేము కన్నవాటిని విన్నవాటిని చెప్పక యుండలేమని" ఉత్తరమిచ్చిరి. మన పరిచర్య కూడ ఇదే. దేవుని విషయమై మనమేమి కని, విని యున్నామో, అది ప్రకటించి తీరవలెను. నీవది అంగీకరింతువో, త్రోసి వేయుదువో; మా పని మాత్రము మేము కనివినిన వాటిని ప్రకటించి తీరుట. అపొస్తలుల కార్యములు 22:15లో పౌలుతో దేవుడు ఏమనుచున్నాడు? "నీవు కన్నవాటిని గూర్చియు, విన్నవాటిని గూర్చియు సకల మనుష్యుల యెదుట ఆయనకు సాక్షివై" యుండవలెను. అపొస్తలుల వర్తమానమును వారు వినినను సరే, వినకపోయినను సరే, ఇదే మనకు కూడ దేవుడు ఆజ్ఞాపించి యున్నాడు. రేయింబగళ్ళు వెలుగుచుండిన బంగారు దీపస్థంభము ఇచ్చిన వర్తమానమిదే. ఆ దీపస్థంభమే మనకు మాదిరి చూపుచున్నది.

ఈ దినములలో ఇటువంటి సాక్షులు కనబడుచున్నారా? వారమంతా బోధకులు ఒకటి చెప్పుదురు. ఆదివారములందు ఇంకొకటి చెప్పుదురు. స్త్రీ పురుషులు పైకి మంచివారుగాను, భక్తులుగాను కనబడుదురు? లోన దేవుని పరిహాసము చేతురు. ఆదివారము ఉదయము రమ్యముగా ప్రార్థన చేయుదువు.

విద్యార్థులున్నారు. వారి మనస్సు నొప్పించరాదు; ప్రభువైన యేసుక్రీస్తు నామమున ప్రార్థన చేసినచో, వీరందరికి కోపాలు రేగును. అందుచేతనే, 'నీ నామము ద్వారా' అని ప్రార్థన చేయుచున్నాము." అప్పుడు నేను అతనితో చెప్పినది ఏమనగా; "ఈ ప్రార్థనలు పరలోకమందు వినబడవు. మీరెంత పెద్దకేకలు పెట్టి ప్రార్థనలు చేసినను దేవుడవి వినడు. ఈ కాలేజి కట్టుట కివ్వబడిన ప్రతియొక్క ఇటుక కూడా ప్రభువైన యేసుక్రీస్తు నామమున ఇవ్వబడిన సొమ్ముతోనే కొనబడెను. ఇప్పుడైతే ఆయన అంటే మీకు సిగ్గా?"

అపొస్తలులు సిగ్గుపడలేదు. ప్రభువైన యేసుక్రీస్తు నామమును బట్టి ఎవరితోను మాట్లాడకూడదని వారికి ఆజ్ఞాపించి బెదరించిరి. అయితే వారు, "మేము కన్నవాటిని విన్నవాటిని చెప్పక యుండలేమని" ఉత్తరమిచ్చిరి. మన పరిచర్య కూడ ఇదే. దేవుని విషయమై మనమేమి కని, విని యున్నామో, అది ప్రకటించి తీరవలెను. నీవది అంగీకరింతువో, త్రోసి వేయుదువో; మా పని మాత్రము మేము కనివినిన వాటిని ప్రకటించి తీరుట. అపొస్తలుల కార్యములు 22:15లో పౌలుతో దేవుడు ఏమనుచున్నాడు? "నీవు కన్నవాటిని గూర్చియు, విన్నవాటిని గూర్చియు సకల మనుష్యుల యెదుట ఆయనకు సాక్షివై" యుండవలెను. అపొస్తలుల వర్తమానమును వారు వినినను సరే, వినకపోయినను సరే, ఇదే మనకు కూడ దేవుడు ఆజ్ఞాపించి యున్నాడు. రేయింబగళ్ళు వెలుగుచుండిన బంగారు దీపస్థంభము ఇచ్చిన వర్తమానమిదే. ఆ దీపస్థంభమే మనకు మాదిరి చూపుచున్నది.

ఈ దినములలో ఇటువంటి సాక్షులు కనబడుచున్నారా? వారమంతా బోధకులు ఒకటి చెప్పుదురు. ఆదివారములందు ఇంకొకటి చెప్పుదురు. స్త్రీ పురుషులు పైకి మంచివారుగాను, భక్తులుగాను కనబడుదురు? లోన దేవుని పరిహాసము చేతురు. ఆదివారము ఉదయము రమ్యముగా ప్రార్థన చేయుదువు.

హర్ష గీతములు పాడుదువు. ఏదో ఒక గంటసేపు చూపునకు మంచివాడవే, భక్తిమంతుడవే. ఇంటికి వెళ్ళగానే నీవు కన్నవాటిని, విన్నవాటిని నీ బ్రతుకునందు పెట్టుచున్నావా? నీ వ్యాపారమందును, నీ అంగడియందును దేవుని వెలుతురు లో వచ్చుచున్నదా? దేవుని మహిమ నీ ముఖము మీద ప్రకాశించుట ఇతరులు చూడగలరా? అది చూడకుంటే నీ ముఖము మీద వారు చూచునది పాపపు గురుతులా? అది డబ్బుమీద ఆశ, ఎంతో పైకి రావలెనను అత్యాశ ఈ గురుతులే కనబడుచున్నవా?

కొందరు నాతో సహా ఇట్లనియున్నారు: "మేము బోధ చేయము బోధ చేయడము మా కిష్టము లేదు. అయితే మేము క్రైస్తవులమని మా జీవితములను' బట్టి మనుష్యులు చూచి, వారుకూడ క్రైస్తవులు కాగలరు." సరే, అయితే మీలో అనేకుల జీవితమందు ఇతరులు చూచునది ఏమి? బీడీలు, చుట్టలు, సిగరెట్లు, అట్టహాస చీరలు, మో చేతుల వరకు గాజులు, ఇవి చూచి మీరు క్రైస్తవులు అనుకొందురు కదా? ఒక అద్దము తీసి నీ ముఖము కొంత చూచుకొనుము. అంతా పాపపు ముద్రలే, ఎంతమంది వ్యభిచారమందు మునిగియున్నారు : నీ జారత్వమును బట్టి నీ యొక్క క్రైస్తత్వము ఇతరులకు వెల్లడి యగుచున్నదా? మోసగించువారలారా? దేవునిని అపహాసము చేసి, మీ బోధలలో నుంచి బైబిలును తీసిపారవేయ జూచుచు, మీ జీవితముల నుండి ప్రార్థన తీసిపారవేయ జూచు వారలారా : మిమ్మును చూచు వారెవరైనను క్రైస్తవులగుదురా? ఎన్నడు కాలేరు. దేవుని సమీపించను కూడ సమీపించరు, ఈ తప్పుడు అభిప్రాయములు పెట్టుకొని మోసపోకుడి. దివారాత్రములు సొగసుగా వెలిగెడు స్వర్ణదీపముల వలె మీరు ప్రకాశించని ఎడల, దేవుని మహిమ మీ ద్వారా ఎన్నటికైనను ప్రత్యక్ష పరచబడదు, ఇదే ఆ దీపస్తంభము యొక్క వర్తమానము.

"శక్తి చేతనైనను బలము చేతనైనను కాక నా ఆత్మ చేతనే"అని దేవుడు సెలవిచ్చుచున్నాడు. నీవు దైవాత్మను బట్టి ప్రార్థన చేయగలవా? దైవాత్మను బట్టి పాటలు పాడుదువా? దైవాత్మ వలన బోధ చేయుదువా? దైవాత్మ ననుసరించి నడుచుచున్నావా? దైవాత్మచే నడుపబడుచున్నావా? దేవుని ఆత్మచే పట్టుకొనబడి యున్నావా? ఇట్లుంటేనే గాని దేవుని పని మట్టుకు జరు గదు. దేవుని కార్యములు జరుగుట డబ్బువలన కాదు, కట్టడముల వలన కాదు, విద్య వలన కాదు, మానవసేవ వలన కాదు. కొంతమంది దిట్టముగా దేవుని పని కొరకు ద్రవ్యమిచ్చుచున్నారు: అయితే, వారి జీవితములందు ఎంత దిట్టమైన పాపములను దాచియుంచుచున్నారు? పరిశుద్ధాత్మ ద్వారా తప్ప దేవుని పనిసాగుట అసాధ్యము. దేవునికి కావలసినవి బంగారు దీపస్థంభములే. ఎవరైతే ప్రకాశించుచున్నారో, వారు మాత్రమే దేవుని దీపస్థంభములు అనబడుటకు యోగ్యులు. నీవు ఎక్కువ పేదవాడవై యుండవచ్చును; అయినను దేవుని వెలుగు నీలో నుండి ప్రకాశించగలదు; అనగా నీలో అనుదినము పరిశుద్ధాత్మ పనిచేయుచు నుండిన యెడల, దేవుని పని జరుగుట ఈ రీతిగానే. భూమిమీద దేవుని జనులకు గల పరమ పిలుపు ఇదే. సజీవ తైలమైన దైవాత్మతో మనము మండుచు, దేవుని దీపములై మనము ప్రకాశింపవలసి యున్నది. ఏడు దీపములు ఏ కాంతముగా చెక్కబడి యుండెను. ఇది దేవుని బిడ్డల యొక్క నిజమైన ఐక్యతను తెలుపుచున్నది. ఇట్టి ఐక్యత ఉండగా, దేవుని వర్తమానము బయలువెళ్ళును. "మీరు లోకమునకు వెలుగై యున్నారు." యథార్థముగా ఇట్లు చెప్పగలవా? "దేవుని యొక్క వెలుతురే నాలో నుండి ప్రకాశించుచున్నది గాని, మనుష్య వెలుతురు కాదు" అని చెప్పగలవా? దీపములో మండుచుండిన ఒలీవ నూనె దేవుని ఆత్మకు గురుతుగా నున్నది. దైవాత్మను పొంది, ఆత్మననుసరించి నడుచువారే దేవుని వెలుగుతో ప్రకాశించగలరు.

# 13

# అభిషేక తైలము

"అభిషే తైలమునకు పరిమళ ద్రవ్యములు," నిర్గమకాండము 25:6. ప్రత్యేక అభిషేక తైలమును తయారుచేయుటకు ప్రత్యేకమైన పరిమళ ద్రవ్యములు ఉపయోగింపవలెనని దేవుడు కోరెను. వీటియొక్క వివరములు వివరముగా నిర్గమకాండము 30:22-33లో తెలుపబడియున్నవి, దయతో దానిని చదువుము. ఈ తైలము మందిరమునందును, పరిశుద్ధ స్థలమునందు సేవచేయువారి మీద మాత్రమే ఉపయోగింప బడవలెను. మరి దేని కొరకు కూడా దానిని ఉపయోగింపకూడదు. ఈ తైలము జటామంసి, లవంగిపట్ట, గోపరసము, నిమ్మగడ్డి నూనె, ఒలీవనూనెతో కలిపి చేయబడవలెను. ఈ సుగంధ ద్రవ్యముల యొక్క ఆత్మీయ భావమును గురించి పరిశుద్ధ గ్రంథము ఏమి చెప్పుచున్నదో చూతము.

45వ కీర్తన ఒక ప్రవచన కీర్తన. మొదటి ఏడు వచనములలో మన పరలోకపు రాజు, అనగా రాజులకు రాజగు ప్రభువైన యేసుక్రీస్తు యొక్క మహిమా సౌందర్యములు వర్ణింపబడియున్నవి. ఈ కీర్తన యొక్క రెండవ భాగమునందు ఇదే పరలోకపు రాజు తన పరలోకపు వధువగు సంఘమునకు ఇచ్చుచున్న మహిమా సౌందర్యములు వర్ణింపబడి యున్నవి.

8వ వచనమునందు పరలోక సుగంధ ద్రవ్యములతో రాజు యొక్క వస్త్రములు నింపబడియున్నట్లు మనము చదువుచున్నాము. ఈ వచనమును

పరమగీతము 4:12-16 లోని వాక్యములతో సరిపోల్చి చూతము. ఇక్కడ ఈ సుగంధ ద్రవ్యములు మొలచు ఉద్యానవనమునకు సంఘము పోల్చబడి యున్నది. సుగంధద్రవ్య వృక్షములను అత్యంత శ్రద్ధతో, ఆసక్తితో పెంచవలెనేగాని, అన్ని స్థలముల యందు మొలచునట్టివి కావు. గోపరసము, అగరు వృక్షములు, జటామాంసి, నిమ్మగడ్డి మొదలగు పరిమళ తైలవృక్షము లన్నియు ఒకే ఉద్యానవనమునందు మొలచుచున్నవని ఊహింతము. శ్రద్ధతో పెంచిన వెనుక అవి పుష్పములు పూయసాగును. ఉత్తర దక్షిణ వాయువులు వీచుట కారంభించగా, ఈ సుగంధ పుష్పముల పరిమళము వనమంతటను వ్యాపించుచు, ఆ వనమందు తిరుగుచున్న వారికి మహానందము కలిగించును. "నా ప్రియుడు ఉద్యానవనమునకు వేంచేయుగాక, తన కిష్టమైన ఫలముల నతడు భుజించుగాక," అని పెండ్లి కుమార్తె పాడెను. నీ విట్లు ప్రభువైన యేసుక్రీస్తుకు పాడగలవా? "నా హృదయమనెడి పరిమళ తైలవృక్షముల ఉద్యానవనమునకు యేసుక్రీస్తు ప్రభువా, వేంచేయుము" అని పాడగలవా? దేవుని మహిమ పరచునట్టి జీవితము జీవించకుంటివేని, నీలోనుండి ఏ పరిమళ తైలద్రవ్యముల సువాసనయు ఆయనకు వీచదు; వట్టి దుర్గంధమే వీచును. అయితే ఆయనను సంతోషపరచునట్టి జీవితము నీవు జీవించిన యెడల ఆ సుగంధ ద్రవ్యముల ఉద్యానవనము వలె నీ హృదయము ఆయనకు ఆనందము కలిగించును. 1 కొరింథీయులు 3:9లో "మనము దేవుని వ్యవసాయము" -"దేవుని తోట' అనియు, 2 కొరింథీ 2:14-16లో "మనము దేవునికి క్రీస్తు సువాసనయై యున్నాము" అనియు వ్రాయబడియున్నట్లు చదువుచున్నాము. మన ప్రభువైన యేసుక్రీస్తు తన ఉద్యాన వనములయందు విహరించునపుడు వాటి సువాసనను ఆయన ఆఘ్రాణించినట్లుగా మన జీవితములుండవలసిన విధము యిదే.

పరిమళ ద్రవ్యముల వలన మనము నేర్చుకొనిన పాఠముల ద్వారా సువార్త చరిత్ర యందు క్రైస్తవ జీవిత అభివృద్ధి యొక్క ఆరు దశలు గుర్తింతుము. మత్తయి 2:11 నందు కదలిపోవుచున్న నక్షత్రము ననుసరించి దూరదేశమునుండి వచ్చిన జ్ఞానులను గురించి చదువుదుము. వారు శిశువును చూచి, సాగిలపడి ఆయనను పూజించిరి. వారు బంగారము, సాంబ్రాణి, బోళము, పరిమళ ద్రవ్యములు తెచ్చిరి. ఆయన ఒక మహారాజని మాత్రమే వారు ఎరిగియుండిరి. గనుక ఆయనపై వారికి గల గౌరవమును ఆ పరిమళ ద్రవ్యముల ద్వారా కనపరచిరి. మన ప్రారంభము కూడ ఇట్లే యుండవలెను. ప్రధమముగా మనము ఈ జ్ఞానులవలె క్రీస్తునొద్దకు వత్తుము. ఆయనను గురించి మనకు ఎక్కువగా తెలియదు. విశ్వాసము, ప్రత్యేకత, విమోచన, పాపికి బదులుగా పుణ్యాత్ముడు దండింపబడుట మొదలగు వాటిని గూర్చి ఎవరైనను మనలను ప్రశ్నించినచో ఏమి చెప్పవలెనో మనకు తెలియకపోయినను, ప్రభువైన యేసుక్రీస్తును ప్రేమించుచు ఆయనను పూజించుటకు ప్రారంభించినాము.

లూకా 7:38లో ప్రభువైన యేసుక్రీస్తును గురించి కొంత యెరిగిన స్త్రీ విషయమై మనము చదువుచున్నాము. ఆమె పాపములను ఆమె గుర్తెరిగి, కన్నీటి ద్వారా తన పశ్చాత్తాపమును వెల్లడిచేయుచు ఆయన యొద్దకు వచ్చి, ఆయన యెడల తనకు గల ప్రేమను తెల్పుటకు ఏదో ఒకటి చేయవలెనని అత్యంత ఆశగలిగి ఆయన పాదములపై అత్తరును పోసెను. ప్రభువైన యేసుక్రీస్తు మాత్రమే తన పాపములను క్షమించగలడని యెరిగి, విశ్వాసము ద్వారానే జటామాంసి తైలమును ఒక ప్రశస్తమైన పరిమళ ద్రవ్యమును ఆమె తెచ్చెను. ఇది రెండవదశ. ఎప్పుడైతే ప్రభువైన యేసుక్రీస్తుతో నడువ నారంభింతుమో, అప్పుడు మన పాపములను అంతకంతకు అధికముగా చూడనారంభింతుము. దేవునికి మనము ఎంత సమీపముగా జీవింతుమో,

అంత అధికముగా మనము చెడిపోయిన వారమనియు, పాపులమనియు, అదే సమయమున ఆయన ఎంత కృప గలిగినవాడో మనము తెలిసికొనగలము. అందుచేతనే మనకు యేసుప్రభువు ననుగ్రహించినందుకు దేవునికి వందనములు, స్తుతులు చెల్లించవలసినవారమై ఉన్నాము. మరియు 'నేనొక పాపినై యుంటిని, ప్రభువైన యేసుక్రీస్తే నన్ను క్షమించెను. అంధకారమందుంటిని, గాని ప్రభువు నన్ను వెలుగు లోనికి తెచ్చెను. సంతోషహీనుడనై యుంటిని, నా ప్రభువు సంతోషమును అనుగ్రహించెను. సమాధానము లేనివాడనై వుంటిని, నా ప్రభువు నాకు సమాధానము అనుగ్రహించెను.' అని మనము ఎక్కడికి పోయినను సాక్షమివ్వకుండా ఉండలేము.

ఇప్పుడు తిరిగి యోహాను 12వ అధ్యాయమునందు తన సహోదరుని మృతులలో నుండి ప్రభువైన యేసుక్రీస్తు లేపినందుకుగాను కృతజ్ఞత గలిగిన యొక స్త్రీని గూర్చి చదువుచున్నాము. ఇతర జీవితముల యందు క్రీస్తు యొక్క శక్తిని ఈమె కొంత గ్రహించినందువలన తన కృతజ్ఞతను చూపుచు, అత్తరును తెచ్చెను. అందువలన మూడవదిగా మన సాక్ష్యము ద్వారా మన సహోదరులు మార్చబడుటయు, మన సహోదరీలు, ఇరుగు పొరుగువారు నూతన జీవితమునందు ప్రవేశపెట్టబడుటయు మనము చూచినపుడు: "ఓ ప్రభువా! నీవు నన్ను రక్షించుటయేగాక నా సహోదరుని, సహోదరీని, తల్లిని తండ్రిని స్నేహితులను, ఇరుగు పొరుగువారిని కూడ రక్షించి ఉన్నావు" అని ప్రభువునకు వందనములు చెల్లింపగోరుచున్నాము. కనుక ఈ ఉల్లాసముతో మన ఇరుగు పొరుగువారి యొద్దకు స్నేహితుల యొద్దకు వెళ్ళి "నా సంతోషములో నీవు కూడ పాల్గొనుము" అని వారితో చెప్పుచున్నాము.

నాలుగవదిగా మత్తయి 26:7-12లో పస్కా పండుగకు రెండు దినములకు

ముందు ఒక స్త్రీ మిక్కిలి విలువగల అత్తరు బుడ్డి తెచ్చి ఆయన తలమీద దానిని పోసెను. సమస్త పాపుల కొరకై ఆయన చనిపోయి, భూస్థాపన చేయబడునని విశ్వాసము ద్వారా ఎరిగియుండి, ఆమె ఆయన భూస్థాపన నిమిత్తమై ఇట్లు చేసెను. లూకా 7వ అధ్యాయములో చెప్పబడిన స్త్రీ ప్రభువు తనకు వ్యక్తిగతముగా ఏమి చేసెనో అది మాత్రమే చూడగలిగెను. కాని ఈ స్త్రీ సర్వలోకము కొరకు ఆయన ఏమి చేయనై యుండెనో దానిని చూచెను (మత్తయి 26:13). సర్వలోకములోని, సర్వయుగములలోని సమస్త పాపుల కొరకు మన ప్రభువు మరణించినందులకు మనము అయనకు వందనములు చెల్లింప గోరుదుము. గనుక ఇతర దేశములలో మన ప్రభువు పాపులను ఏ విధముగా రక్షించుచున్నాడో తెలిసికొనవలెనను కోరిక మనలో పుట్టుచున్నది. మనము రక్షింపబడుటకు పూర్వము ఈ విషయములను అడిగి తెలిసికొనుటకు ఇష్టపడువారము కాము. కాని ఇప్పుడైతే జపాను, చైనా, రష్యా, ఆసియా, అమెరికా, ఆఫ్రికా, ఆస్ట్రేలియా, ఐరోపా, ఇంగ్లాండు ఇంకను ప్రతిదేశమందును మన ప్రభువు పాపులను ఎట్లు రక్షించుచున్నాడో తెలిసికొన గోరుచున్నాము. ఇది మన ఆనందమును అధికము చేయుచున్నది. "ఆహా నా ప్రభువు నమస్త దేశముల యందును పనిచేయుచున్నాడు? ఆయనకు నా వందనములు."

ఐదవదిగా యోహాను 19:39లో నీకొదేమునకు ప్రభువైన యేసుక్రీస్తు యొక్క మరణశక్తి యొక్క గ్రహింపు కలిగెను. అతడు ప్రభువును బహుసమీపముగా వెంబడించుచుండెను. యేసు చేయుచున్న అద్భుతములను చూచియుండెను. గనుక రాత్రివేళ ఆయన యొద్దకు వచ్చెను. మరియు నీకొదేము ఆయన మరణించుటయు, వారు ఆయనను పొడుచుటయు దూషించుటయు ఆయన వారిని క్షమించుటయు, ఆయన మరణించగా సూర్యుడు మరుగుపడుటయు, భూమి కంపించి సమాధులు తెరువబడుటయు చూడగా తన మరణశక్తి చేత ప్రభువైన యేసుక్రీస్తు అపవాది నోడించి,

నలుగగొట్టి కలవరపెట్టెనని గ్రహించెను. ఏ పరిమళ ద్రవ్యములతో నీకొదేము అయనను అభిషేకించెనో వాటి ద్వారా సమస్త పాపుల పక్షమున ప్రభువైన యేసుక్రీస్తు చేసిన సేవ యొక్క సువాసనను అతడు వెల్లడిపరచెను. విశ్వాసము ద్వారా మనము కూడ మన ప్రభువు సర్వలోకమందు ఎట్లు పనిచేయుచున్నాడో చూచుచున్నాము. మరియు సిలువ యందు మనము కూడ అపవాదిని ఓడించి కలవరపరచగలమని గ్రహించుచున్నాము. ఈ విధముగా స్తుతియనెడి పరిమళమును మనము తెచ్చుచున్నాము: "ఓ ప్రభువా నీవాశ్చర్యకరుడవు! నీవు అపవాదిని ఎట్లు భంగపరచుచున్నావో చూచి అనందించుచున్నాము."

కడపటిగా మార్కు 16:1-3లో పునరుత్థాన అనంతరము కొందరు స్త్రీలు అయనకు పూయుటకై సుంగధ ద్రవ్యములు తయారుచేసి తెచ్చినట్లు మనము చదువుచున్నాము. వారెంతో శ్రమపడి ఈ ద్రవ్యములను తయారుచేసి తెచ్చుచుండగా సమాధి ద్వారము ఒక పెద్ద రాతితో మూయబడి యుండెననియు, ఆ రాతిని తీసివేయుట సాధ్యము కాదనియు మార్గమందు వారికి జ్ఞాపకము వచ్చెను; అయినను అది ఎట్లో దొర్లించి వేయబడగలదని నమ్మిరి. అకస్మాత్తుగా వెల్లడియైన పునరుత్థానశక్తి, మహిమలే వారి విశ్వాసమును సఫలపరచెను. పునరుత్థానశక్తి ప్రతి సమాధిపై నుండి ప్రతిరాతిని దొర్లించివెయును. కావున దేవుని బిడ్డలమైన మనము ప్రభువైన యేసుక్రీస్తు మృత్యువును జయించెనను దేవుని వర్తమానమును విశ్వాసము ద్వారా బహిరంగముగా చూచుచున్నాము. మనలను దాసత్వము నుండియు, ప్రతి హద్దుబాటు నుండియు విడిపించు నిమిత్తము మన ప్రభువు ప్రతి రాతిని తీసివేయునను సామాన్య సత్యమును బోధించుచున్నాము. మనము అట్లు చేయునపుడు, ఈ అద్భుతము జరిగి అయన ఎక్కువగా హెచ్చింపబడుచున్నాడు.

మనము అత్మీయముగా ఎదిగిన కొలది దేవుని సేవకులముగా మన

విలువ కూడ హెచ్చుచుండును. ఆత్మీయ ఎదుగుదలను గూర్చి సుగంధ ద్రవ్యములు మనకు బోధించుచున్నవి. సుగంధ ద్రవ్యములను తెమ్మని దేవుడు ఇశ్రాయేలీయులకు ఆజ్ఞాపించుటలో వారు దేవుని సేవ యందలి భావమును, అనగా ఆయనకు ఇష్టమైన సేవ ఎట్టిదో, ఎట్టి సేవ వలన నిత్యము నిలుచునట్టి ఫలితము రాగలదో, వారు తెలిసికొనవలెననియే ఆయన ఉద్దేశమై యుండెను.

ఈ ప్రత్యేకమైన అభిషేక తైలమును తయారు చేయుటకై దేవుడు తెమ్మని ఆజ్ఞాపించిన సుగంధ ద్రవ్యములు ఐగుప్తునందు దొరకలేదు. ఆదికాండమునందు యోసేపును తన స్వంత సహోదరులే ఇష్మాయేలీయులకు అమ్మివేసిన కథను నేర్చుకొనగలము. అన్నల యొక్క యోగక్షేమములు విచారించుటకై యోసేపు వారి యొద్దకు రాగా అతనిమీద వారికి గల ఈర్ష్యవలన అతనిని చంపవలెనని కోరిరి. చంపుటకు బదులుగా ఒక లోతైన చీకటి గుంటలో అతనిని పడవేసిరి. అనంతరము ఇష్మాయేలీయులైన వర్తకుల సమూహము ఒంటెలతో వెళ్లుచుండుట చూచి యోసేపును వారికి అమ్మివేసిరి ఆ ఒంటెలు ఐగుప్తుకు సుగంధ ద్రవ్యములను మోసికొని పోవుచుండెను (ఆదికాండము 37:25). అన్నలు తనను అమ్మివేయుటకు గల కారణము యోసేపు గ్రహించుట మిక్కిలి కష్టమాయెను, తాను యెవరికి యే కీడును చేసి వుండలేదు. కాని వారు అతనికి హాని చేయుటకు, చంపుటకు నిత్యము ప్రయత్నించుచుండిరి. స్వంత సహోదరుల ద్వేషము, శత్రుత్వము, ఈర్ష్య, క్రూరత్వము వలన యోసేపు ఎంతగా మనస్సు నొచ్చుకొని, ముఖము ఎంతగా వాల్చినవాడై వుండెనో! అయితే ఒంటెలు సుగంధ ద్రవ్యములను మోసికొని పోవుచుండెను. ఉత్తర దక్షిణ వాయువులు వాటి మీద వీయగా వాటి పరిమళము యోసేపు మీద వ్యాపించినప్పుడు దేవుడు అతనితో ఇట్లు మాట్లాడసాగెను. "యోసేపూ! నీ దుఃఖమంతయు ఒకనాడు ఆశీర్వాద కరమగునట్లు

చేయుదును" ఇట్లు ఆ మధుర పరిమళము యోసేపుకు దేవుని దగ్గర నుండి ఒక వర్తమానమును అందివ్వగా యోసేపు ఎంత ఆనంద భరితుడాయెనో గదా!

ఇప్పుడు ఇశ్రాయేలీయులు సుగంధ ద్రవ్యములను ఐగుప్తు నుండి కానానుకు తీసికొని పోవుచుండిరి. ఐగుప్తీయులు ఇహలోక సంబంధమైన ...టి కొరకు సుగంధ ద్రవ్యములను ఉపయోగించుచుండిరి. గనుక వాటి నిజమైన విలువను ఎరిగియుండలేదు. ఇప్పుడు దేవుని పరిశుద్ధ ఆలయమందు ఒక పరలోక సంకల్పమునకు అవి ఉపయోగింపబడి వాటి యొక్క పరలోక భావము వెల్లడి కానున్నది.

లేవీయకాండము 8వ అధ్యాయమునందు పరిమళ తైలమును ఎట్లుపయోగింపవలెనో తెలుపబడి యున్నది. అహరోను మొదటి ప్రధాన యాజకుడు గనుక ఇశ్రాయేలీయులందరి పక్షముగా అతడు దేవునికి సేవచేసెను. ఇట్లు మిక్కిలి ప్రత్యేకమైన ఒక సేవకు అతడు ప్రత్యేక పరచబడి, స్థిరపరచబడవలసి యుండెను. అది ఎట్లు జరుగునో మనకు ఇచ్చట తెలుపబడి యున్నది. మొదటిగా సర్వసమాజము ఎదుటకు అహరోను తేబడెను. రెండవదిగా స్నానము చేయించబడెను. మూడవదిగా వస్త్రములు తొడిగింపబడెను. నాల్గవదిగా అందరి యెదుట అభిషేకింపబడెను. ఐదవదిగా అతని చెవిమీదను, చేతిమీదను, పాదము మీదను కొంత రక్తము పూయబడెను. దేవుని స్వరము వినుటకు చెవియును, దేవుని సేవయందుపయోగపడుటకు కాళ్లు, చేతులును ప్రతిష్ఠింపబడెను. ఆరవదిగా అతని చేతులు నింపబడెను. ఏడవదిగా రక్తము, అభిషేక తైలముల ద్వారా దేవుని సేవ కొరకు అతడు పరిశుద్ధ పరచబడెను.

మన అందరి మధ్య దేవుడు పనిచేయునది యిట్లే. దేవుని వాక్యము ద్వారా మున్ముందుగా మనము ఒప్పుదల క్రిందికి తేబడిన వారమై ఆయన తన హస్తముతో, శక్తితో మనలను తన యొద్దకు, తన వెలుగులోనికి తీసికొని

పిలువబడుచున్నామను సంగతి తెలిసికొందుము (1 పేతురు 2:9). సర్వ సమాజము ఎదుటకు అహరోను తేబడి వారందరి యెదుట నీటితో స్నానము చేయించబడుట చూచుచున్నాము. ఇట్లు ఎందుకు చేయబడెను? అతని యందు ఏ విధమైన కళంకముండినను అతడు ప్రధాన యాజకుడు కానేరడు. ఆ సేవ ఎన్నటికిని పొందనేరడు (లేవీయ. 21:16-20). అతని శరీరమందు ఎట్టి కళంకమైనను ఉండకూడదు. అతడు మంచి ఆరోగ్యమును కలిగియుండియు ఒక కంటియందు మాత్రమే ఏదేని కళంకముండిన యెడల అతడు దేవుని సేవకు పనికిరాడు. ముక్కు నందుగాని లేక పళ్ళ యందుగాని, చెవుల యందుగాని ఏ మాత్రమైన కళంక ముండినచో అతడు అయోగ్యుడని యెంచబడును. చేతికి అరుప్రేళ్ళు కలిగిన వాడైనను, తప్పటి ముక్కు కలిగియున్న వాడైనను అయోగ్యుడని యెంచబడును. ఏ కళంకమైనా నుండెనా, అదెంత సూక్ష్మమైనదైనను దేవుని సేవకతడయోగ్యుడే. బహిరంగ స్థలమునందు అందరి ఎదుట యాజకునిగా స్నానము చేయించుట కిదియే కారణము. అతడు కొందరి కండ్లను కప్పవచ్చును గాని అందరిని మోసగించలేడు. లక్షలాది ప్రజలు అహరోను స్నానమును చూచుచుండగ అతనికి ఏ కళంకమైన యున్నచో ఎవరో ఒకరు కనిపెట్టక తప్పదు.

మచ్చ, కళంకము లేనివారమై ఆయన ఎదుట నుండుటకు మన ప్రభువు కోరుచున్నాడు (యూదా 24). ఆయన మన పాపములను క్షమించుటయే గాక, ప్రతి మచ్చను, ప్రతి కళంకమును మనలో నుండి తీసివేయుచున్నాడు. అదే నిజమైన రక్షణ. మన ప్రభువు మనలను క్షమించిన తోడనే అంతయు తీరిపోయెననుకొంటివా? ఏ పాడు మచ్చయుండినను అది పూర్తిగా తీసివేయబడు నిమిత్తము దానిని యెత్తి చూపుచున్నాడు.

అహరోను స్నానము చేయించిన పిమ్మట అలంకారమును, ఘనతయు

కలుగునట్లు ప్రతిష్టిత వస్త్రములను అతనికి తొడిగింపవలసి యుండెను (నిర్గమ. 28:2). మన ప్రభువైన యేసుక్రీస్తు ద్వారానే సౌందర్య మహిమలు మనకుండెవలెనని దేవుడు కోరుచున్నాడు. ఆ సౌందర్య మహిమలను ఇవి సూచించుచున్నవి. నిర్గమ 27వ అధ్యాయమునందు ఇవి మనకు వివరింపబడియున్నవి. అహరోను మొదట ఒక తెల్లని నారపు అంగిని తొడుగుకొనవలెను. దీనిపైన ఒక నీలినిలువు టంగీని వేసుకొనవలెను. ఈ అంగీ క్రింద అంచు చుట్టును నీలి ధూమ్ర రక్త వర్ణములు దానిమ్మ పండ్లను, పండు పండునకు మధ్య బంగారు గంటలను తగిలింపవలెను (వ. 31-35). దీనిపై ఏఫోదును పెట్టవలెను. ఏఫోదు బంగారు, నీల ధూమ్ర రక్తవర్ణముగల నూలుతోను, పేనిన సన్ననారతోను చేయబడియుండెను (వ. 6-8). ఈ ఏఫోదునందు న్యాయ విధాన పతకముండును, ఈ పతకమునందు 12 గోత్రముల పేర్లు చెక్కబడిన 12 రాళ్ళుండును (వ. 16-21). ఈ 12 రత్నములుగాక ఊరీము తుమ్మీము అను రెండు రాళ్ళుండును (30 వ.). ఈ ఊరీము, తుమ్మీము అను రాళ్ళ ద్వారా యాజకుడు దేవుని చిత్తమును తెలిసికొనుచుండెను (సంఖ్యా. 27-21). భుజములపై రెండు లేతపచ్చలుండెను. వీటి మీద కూడా వారి జననక్రమము ప్రకారము 12 గోత్రముల పేర్లుండెను (నిర్గమ. 28:9-12). పిమ్మట అతని తలపై పరిశుద్ధ పాగా పెట్టబడెను. ఈ పాగా ముందు భాగముపై "యెహోవాకు ప్రతిష్ఠితము". "యెహోవా పరిశుద్ధుడు" అను మాటలు చెక్కబడిన బంగారు రేకు కట్టబడెను (36-38).

ఇవన్నియు అహరోను ధరించిన పిమ్మట పరిశుద్ధ అభిషేక తైలము వీటన్నిటిపై పోయబడెను. పరీక్షించబడి స్నానము చేయించబడి, వస్త్రములు తొడిగించబడి, అభిషేకించబడిన పిమ్మట అహరోను దేవుని సేవ చేయుటకు సిద్ధముగా నుండెను. దేవుని సేవించుట సులభమైన పనికాదు. వేదపారాయణ పాఠశాలకు వెళ్ళుటయే దేవుని సేవకు సిద్ధ పరచబడుటయని కొందరు

భావింతురు. చంకలో బైబిలు పెట్టుకొని తిరుగుటయే దేవుని సేవించుటయని మరికొందరు తలంతురు. ఈ పద్ధతుల ద్వారా ఎవరును దేవుని సేవించలేరు. దేవుని సేవించుట సులభమైన పద్ధతని తలంచవద్దు. పరిశుద్ధ అభిషేకతైలము, దేవుడు ఎట్టిసేవ కావలెననుచున్నాడో దానికి గుర్తుగా నున్నది. మన మందరము కూడ దేవునికి అంగీకారమైన విధముగా ఆయన యెడల భయభక్తులతో ఆయనను సేవింపగలుగుటకై ఒక దివ్య సంకల్పమును ఆయన ఏర్పరచియున్నాడు. దేవునికిట్లు అంగీకారమగు సేవ కొరకై ఆయన చేసిన ఏర్పాటు ప్రకారము సిద్ధ పరచబడవలెను.

అభిషేక తైలమును అహరోనుపై పోయుటకు ముందుగా మోషే దానిని మందిరము, మందసము, ధూపవేదిక బలిపీఠములపై పోసెను. కడపటిగా అది అహరోనుమీద పోయబడెను (లేవీయ. 8:10, 12). పరిశుద్ధ స్థలము యొక్క క్షేమాభివృద్ధి కొరకు యాజకుని యొక్క సేవ యుండవలెను. అహరోను ఇశ్రాయేలీయుల సర్వజనాంగమును సేవించుటకే గాని, ఒక మనుష్యుని మాత్రమే లేక ఒక గోత్రమును మాత్రమే సేవించు నిమిత్తము ప్రధాన యాజకుడుగా చేయబడలేదు

ఇది కూడా గమనింపుము. అభిషేక తైలము సూచించు సేవ పరిశుద్ధ స్థలము యొక్క హద్దుల నడుమనే జరుగవలసినది. దైవభక్తులెందరో నిర్మించిన కట్టడము లెన్నియో గలవు; అవి మంచి సేవ చేయుచున్నవి. ''ఇవి యన్నియు పొరపాటులోనే యున్నావా?'' అని నీవు ప్రశ్నించవచ్చును. అయితే నేనడుగుచున్న ప్రశ్న ఏమనగా నీవు చేయుచున్న సేవ దేవుని పరిశుద్ధ స్థలము నిమిత్తమేనా? కాకున్నచో ఆ సేవ ఏ మాత్రము ఫలించనేరదు. ప్రజలు తెచ్చిన బలులు తీసికొని ప్రధాన యాజకుడు తన కిష్టము వచ్చిన స్థలమునకు పోయి అర్పించుటకు వీలులేదు. ఈ బలులను ఆ వ్యక్తి యొక్క గుడారములోనో,

మరియొక వ్యక్తి ఆవరణములోనో అర్పింతునని అతడు చెప్పి యుండగలడు. అయితే దేవుడు అతనితో ప్రతి బలి మందిరము యొక్క ఆవరణమునందే ప్రజలందరి నిమిత్తము అర్పింపబడి ఆ రక్తముతోనే దేవుని సన్నిధిని ప్రవేశింపవలెనని చెప్పెను.

ఇట్లు దేవుని సర్వసంఘమునకు అభివృద్ధి తెచ్చెడు సేవ మాత్రమే ఆయనకు అంగీకారము. ఈ తలంపు అనేక ప్రశ్నలకు జవాబివ్వగలదు. తన పవిత్ర పరిశుద్ధ స్థలము యొక్క అతి పరిశుద్ధ స్థానమునకు పరిమళముగా నుండునట్టి సేవయే ఆయనకు అవసరమైనది. అనగా ఆయన సంఘము క్షేమాభివృద్ధి పొందునట్టి సేవ. ఈ సంఘము ఒక నగరములోని లేక ఇండియాలోని లేక ఆసియాలోని సంఘముగాక, సర్వలోకమందు సర్వయుగములలో గల సార్వత్రిక సంఘము.

అయితే, ఇట్టి సేవకు ఎక్కువ శ్రమ, సమర్పణ కావలసి యున్నది. మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క వస్త్రములు సుగంధ ద్రవ్యములతో నిండియుండెనని చూచితిమి. "నీ వస్త్రములెల్ల గోపరస వాసనే, అగరు వాసనే, లవంగ పట్టవాసనే" (కీర్తన. 45:9). ప్రభువైన యేసుక్రీస్తు వస్త్రములు సుగంధ ద్రవ్య వాసనలు ఎట్లు కలిగియుండెను?

మొదటిదిగా, ఆయన మనకొరకు మానవుడాయెను. ఒక మానవునిగా మన కొరకు బాధల నొందెను. మన నిమిత్తము తన్ను తాను తగ్గించుకొని, నానా విధములైనా దూషణలననుభవించెను. పిమ్మట మరణించి మూడవ దినమున తిరిగి లేచెను. ఈ విధముగా ఆయన వస్త్రములను, సుగంధ ద్రవ్యములను సేకరించెను. మనము కూడా ఆయన శ్రమలలో పాలు పొందవలెను. ఇట్లు శ్రమలు సహించుట వలననే మన జీవితములకు సుగంధ ద్రవ్యముల వాసన కలుగును (1 పేతురు 2:21-24). ఇందునిమిత్తమే యోసేపు అంతగా శ్రమల

ననుభవించవలసి వచ్చెను; ఈ బాధలనుండి యోసేపును తప్పించవలెనని దేవుడు కోరియుండినచో, యోసేపు శ్రమలను తప్పించుకొని యుండెడివాడే. కాని, ఒక ప్రత్యేకమైన ఉద్దేశముతో ఆ శ్రమలను యోసేపుపై దేవుడు రానిచ్చెను. యోసేపు తన స్వంత సహోదరుల వలన ద్వేషింపబడి, తృణీకరింపబడి, విడనాడబడి వెళ్ళగొట్టబడెను. ఇంటినుండి వేరుచేయబడి అనేక సంవత్సరములు ఒక బానిసగా జీవించి, శరీర శోధనల వలన నిత్యము శోధింపబడెను. విడనాడబడి, మరువబడి, అబద్ధ నేరము మోసబడి, కారాగృహమందుంచబడెను, అటు పిమ్మట దేవుడు అతనిని సింహాసనముపై కెక్కించెను. ఆ సింహాసనముపై నుండి దేశమంతటికిని సేవ చేయగలిగెను. అతనిని ఐగుప్తుకు తెచ్చిన ఒంటెల మీద వేయబడిన సుంగధ ద్రవ్యముల ద్వారా దేవుడిది యోసేపుకు చూపెను.

కొన్ని సుగంధ ద్రవ్యములను ఏకాంత స్థలములయందు మాత్రమే పెంచగలము. "ఈ ఏకాంతమందు, ఈ కఠినమైన కష్టమైన స్థలమునందు దేవుడు నన్నెందుకుంచెనో; మాట్లాడుటకు గాని, కలసి ఆరాధించి ప్రార్థించుటకు గాని ఎవరును లేరు. నేను ఒంటరివాడనైతిని. నా కుటుంబములో కూడ నే నొంటరివాడనే. తల్లిదండ్రులు నాకు వ్యతిరేకముగా నున్నారు. తక్కినవారు సహితము అట్లే యున్నారు; ఓ దేవా! ఇవన్నియు ఎందుకు రానిచ్చితివి?" అని నీవు తలంచుచుండవచ్చును. నీవిట్టి యనుభవముల ద్వారా వెళ్ళుచుంటివా? నీ సహోదరుల ద్వారా అమ్మి వేయబడితివా? వారు నిన్ను వెళ్ళ గొట్టుచుండిరా? లోతైన, ఎండిపోయిన బావియందు పడద్రోయబడితివా? దూరమైన ఏకాంత స్థలమందుంటివా? శరీర శోధనలను నీవు ఎదుర్కొనుచుంటివా? అట్లయినచో దేవుని మందిరము నిమిత్తము సుగంధ ద్రవ్యములను సమకూర్చు మార్గమిదేయని జ్ఞాపకము చేసికొనుము. నీ వస్త్రములు ఈ సుగంధ ద్రవ్య పరిమళముతో నిండియుండును, నీవు పరలోకమున కెత్తబడినప్పుడు కూడా ఈ పరిమళములు నీతో కూడా వచ్చును.

అవును,సుగంధ ద్రవ్యములు ఏకాంతమైన, కఠినమైన స్థలములందు దొరుకును. అయితే నీవు దేవుని వ్యవసాయమై యున్నావు. ఉత్తర దక్షిణ వాయువులు వీచునప్పుడు అంతదీర్ఘ కాలము నీవు అచ్చట ఏల ఉంచబడితివో తెలిసికొనగలవు. ఏ అభిషేక తైలము ప్రధాన యాజకునిపై పోయబడెనో, అదే తైలము కుష్ఠరోగులను శుద్ధీకరించుటకు ఉపయోగింపబడెను. మరియు భూమిపై నీ ప్రతిష్ఠత సేవ వలన ఆత్మీయ కుష్ఠు రోగులు సహితము శుద్ధీకరింపబడుదురు. ప్రభువును ఎట్లు సేవింపవలెనో ఆయన కొరకు సుగంధ ద్రవ్యములను ఎట్లు సమకూర్చవలెనో ప్రభువే నీకు బోధించును గాక!

# 14
# సుగంధ సంభారములు

"ప్రదీపమునకు తైలము ............... సుగంధ సంభారములు" (నిర్గమ కాండము 25:6)

అభిషేక తైలము చేయుటకు సుగంధ ద్రవ్యములు వాడబడినట్లు మన మింతకు ముందే చూచితిమి. ధూపము వేయుటకు కూడ ఈ పరిమళ ద్రవ్యములను సిద్ధపరచునపుడు గమనించవలసిన విషయములను నిర్గమ. 30:34-38లో చదువుము. అభిషేక తైలము, మనము దేవుని ఇంటియందు చేయవలసిన సేవను, ధూపము విశ్వాసుల హృదయముల నుండి దేవుని కృపాసనమునకు చేరు విజ్ఞాపనా ప్రార్థనలను సూచించుచున్నవి.

దేవుని పరిశుద్ధ స్థలమందు సువర్ణ బలిపీఠముపై రాత్రింబగళ్ళు ధూపము వేయబడుచుండెను. సువర్ణ దీపస్తంభముపై నున్న దీపము ఎడతెగక వెలుగుచుండినట్లు ధూపము కూడ నిత్యము రాత్రింబగళ్ళు వేయబడుచుండెను. వెలుగు దేవుని వాక్యమును, ధూపము ప్రధాన యాజకుడు దేవుని యెదుట చేయు విజ్ఞాపనా ప్రార్థనలను సూచించుచున్నవి. మనకందరకును దీనిలో పాలుగలదు. "నా ప్రార్థన ధూపమువలెను, నేను చేతులెత్తుట సాయంకాల నైవేద్యమువలెను నీ దృష్టిని అంగీకారము లగును గాక;" (కీర్తన 141:2).

ప్రకటన 8:2-3 ద్వారా కూడా ధూపము పరిశుద్ధుల ప్రార్థనలను

సూచించుచున్నదని మనము తెలిసికొనగలము. "అంతట నేను దేవుని యెదుట నిలుచు ఏడుగురు దూతలను చూచితిని. వారికి ఏడు బూరలియ్యబడెను. మరియు సువర్ణ ధూపార్తి చేత పట్టుకొని యున్న వేరొక దూత వచ్చి బలిపీఠము యెదుట నిలువగా సింహాసనము యెదుటనున్న సువర్ణ బలిపీఠముపైన పరిశుద్ధులందరి ప్రార్థనలతో కలుపుటకై అతనికి బహు ధూపద్రవ్యములు ఇయ్యబడెను." నిత్య జీవమను వరమును మనము పొందినపుడు, మనము దేవుని జతపనివార మగుచున్నాము. గనుక ప్రతి విషయమును ప్రార్థన ద్వారా మనము దేవుని యొద్దకు తేవలెను. మనము ప్రార్థింపక ముందే దేవుడన్ని సంగతులను యెరిగియున్నాడు. అవును దేవుడు మన అక్కరలనే గాక, మన లోటుపాటులను గూడా ఎరిగియున్నాడు. అయినను మనము నిత్యము ప్రార్థించవలెనని కోరుచున్నాడు. ఎందులకు?

మనమే రీతిగా దేవుని జతపనివారమై యున్నామో గ్రహింపవలెను. ప్రార్థనలలో మన మాయనతో మాట్లాడుట ప్రారంభించినపుడు, ఆయన ఇతర స్థలములందు పనిచేయనారంభించును. ఈ తలంపు ప్రకటన 8:5లో విశదీకరింపబడియున్నది. "ఆ దూత ధూపార్తిని తీసికొని బలిపీఠముపైనున్న నిప్పులతో దాని నింపి భూమిమీద పడవేయగా ఉరుములు, ధ్వనులు, మెరుపులు, భూకంపములు కలిగెను."

ఇక్కడ దేవుని యొక్క తీర్పు ప్రపంచమంతటి మీదను కుమ్మరింపబడనై యుండెను. ఉరుములు, మెరుపులు, భూకంపములు దేవుడు చేయనైయున్న అంత్య తీర్పుకు గుర్తులై యున్నవి. ఈ దినములయందు నీతి న్యాయములు భూమిపై విజయమును పొదుట దేవుడు కోరుటలేదు. ఈ దినములయందు దుష్టులు వర్ధిల్లుచున్నారు; నీతిమంతులు శ్రమల పాలగుచున్నారు. "క్రీస్తుయేసునందు సద్భక్తితో బ్రతుకనుద్దేశించు వారందరు హింస

పొందుదురు" (2 తిమోతి 3:12). అయితే ఒక దినము వచ్చుచున్నది; ఆ దినమందు దేవుడు ప్రతిపాపిని, ప్రతి పాపమును తీర్పులోనికి తేనైయున్నాడు. ఓ పాపి, నీ పాపము అనేక శతాబ్దములుగా కప్పబడి, తీర్పులోనికి రాదని తలంచవద్దు. ఒకానొక దినమున దేవుడు ప్రతి పాపికి తీర్పు తీర్చనైయున్నాడు (ప్రసంగి 8:11-13). ఒక పాపి వెయ్యి పర్యాయములు పాపము చేసి కూడ శిక్షింపబడకుండిన యెడల, దేవుడతనిని శిక్షింపడను భావము కాదు. ఒకానొక దినమున దేవుడు ప్రతి పాపిని శిక్షించును.

అవును, న్యాయతీర్పు దినమొకటి యున్నది. ప్రకటన 8వ అధ్యాయమునందు దేవుని దూతలు ఆయన ఆజ్ఞానుసారముగా ఆయన ఉగ్రతను భూమిపై పోయుటకు సిద్ధముగా నున్నారు. వారి చేతులయందు ధూపమున్నది - అనగా దివారాత్రులు దేవుని సింహాసనమునకు చేరు పరిశుద్ధుల ప్రార్థనలు, కనుక దేవుని బిడ్డల యొక్క ప్రార్థనలకు దేవుని అంత్య తీర్పునందు భాగము గలదు.

మనము దేవుని జతపని వారమగుటచే ప్రార్థన చేయుట అవసరము. ఈ లోకమునందున్నంత కాలము మన ప్రార్థనలకు జవాబు దొరుకక పోయినను పరలోకమందు ప్రతి ప్రార్థనా ఫలితమును చూడగలము. ఏ ప్రార్థనకును జవాబు రాకుండయుండదు. "దేవుడు నా ప్రార్థన నాలకించుట లేదు, నా పొరుగువానిని ప్రేమించినంతగా నన్ను ప్రేమించుట లేదు, అతని ప్రార్థన ఆయన ఆలకించెను. కాని నేను 38 సంవత్సరముల నుండి ప్రార్థించుచున్నను, నా ప్రార్థనకు జవాబిచ్చుటలేదు," అని నీవు తలంచవచ్చును. కాని ఇది సత్యము కాదు. తిరిగి జన్మించిన ప్రతివాని యొక్క ప్రార్థనలు భద్రము చేయబడియున్నవి. ప్రార్థనలో గడిపిన నీ సమయమెన్నటికిని వ్యర్థము కాదు. నీవు దేవుని జతపనివానిగా పని చేయుచున్నావు.

కొన్ని పర్యాయములు ఎట్లు ఏ విధముగా ప్రార్థించవలెనో మనకు తెలియదు, మాటలు రావు. ప్రార్థన స్వచ్ఛమైన భాషపై ఆధారపడియున్నదని తలంచరాదు. కొన్ని నత్తిమాటలనైనను, వ్యాకరణోక్తమైన భాష కాకపోయినను, ప్రార్థన హృదయములో నుండి వచ్చినట్లయినచో దేవుడు దానిని అంగీకరించును. కొంతకాలము క్రిందట ఒక యౌవనస్థుడు బహు సంతోషముగా నున్నట్లు కనిపించగా తన సంతోషమునకు కారణమేమని నే నడిగితిని. అందుకతడు "నా చిన్న కుమారుని దగ్గర నుండి నేడే మొట్టమొదటి జాబు వచ్చినది" అనెను. పిల్లవాని వయస్సు ఎంత అని అడిగితిని. మూడేండ్లని అతడు చెప్పగా, నేను మూడేండ్ల వయస్సు గల పిల్లవాడు ఎట్లు వ్రాయగలడని ఆశ్చర్యపడి, ఆ జాబును చూడగోరితిని. అప్పుడతడు ఆ ఉత్తరమును నాకిచ్చెను. ఒక కాగితముపై కొన్ని గీతలు తప్ప మరి ఏమియులేవు. తన భార్య తనకు జాబు వ్రాయుచుండగా ఆ చిన్నవాడు గమనించి అమ్మా ఏమి చేయుచున్నావని అడిగెను. తన తండ్రికి వ్రాయుచున్నదని తెలిసికొని తాను కూడా వ్రాయగోరి ఒక కాగితమును తీసికొని ఒక పుల్లను సిరాలో ముంచి కొన్ని కోడి గీతలు గీసెను. నా కుమారుడు జాబు ... సెనని తండ్రి కానందమాయెను. తండ్రికవి వట్టి గీతలు మాత్రమే కావు. ఆ చిన్నబాలుని హృదయములో నున్న ప్రేమను అతడు ఆ గీతల ద్వారా గ్రహించెను. గనుక, జవాబు పొందుటకు చక్కని మాటల నుపయోగించి పొడవైన ప్రార్థనలు చేయవలెనని తలంచవద్దు. కొందరు ప్రార్థన పుస్తకము నందలి ప్రార్థనలనే దేవుడు అంగీకరించునని తలంచుదురు. దేవుడు ప్రార్థన పుస్తకములందలి ప్రార్థనలను కోరుటలేదు. హృదయపూర్వకమైన ప్రార్థనలనే దేవుడు కోరుచున్నాడు.

ప్రార్థన యందు చెప్పిన మాటలే తిరిగి చెప్పవలెనని తలంచవద్దు. మనము దేవుని జతపనివారము గనుక ఈ విశ్వాసముతోనే ప్రార్థించవలెను. ఒక్కొక్కప్పుడు భారముతో కూడిన మన హృదయమందలి ఒక నిట్టూర్పె

ప్రార్థనగా ఎంచబడును. లోకములో ఇక్కడ అక్కడ పాపము, దుష్టత్వము ప్రబలుట చూచినపుడు "ఓ దేవా న్యాయము తీర్చవా?" అని ప్రార్థించినపుడు మన ప్రార్థనల ద్వారా దేవుడు తన కార్యము చేయ నారంభించును.

లేవీయకాండము 16వ అధ్యాయములో పాప పరిహారార్థ దినములను గురించి చదువుచున్నాము. ఆ దినమందు ప్రధాన యాజకుడు పాప పరిహారార్థపు రక్తమును మొదట తన కొరకును, తన ఇంటివారి కొరకును తరువాత ఇశ్రాయేలీయుల జనాంగమంతటి కొరకును అర్పించి అతి పరిశుద్ధ స్థలములోనికి రావలెను. సాధారణముగా ప్రధాన యాజకుడు మహిమా సౌందర్యములు గల వస్త్రమును ధరించును. అయితే ఆ దినమున తన మహిమా సౌందర్య వస్త్రములను తీసివేసి స్నానము చేసి శుభ్రమైన నార వస్త్రములను ధరించి అతి పరిశుద్ధ స్థలములోనికి వెళ్ళవలెను (4వ వచనము). తరువాత అతడు రెండు మేకపిల్లలను తీసికొనవలెను. ఒక సజీవమైన మేకపై అహరోను చేతులుంచి దానిని అరణ్యములోనికి విడిచి పెట్టవలెను (4, 20; 22, వచనములు). రెండవ మేక యొక్క రక్తమును అతి పరిశుద్ధ స్థలములోనికి తేవలెను, అట్లు రక్తమును తీసికొని రాకముందు కరుణాపీఠమునకు ముందు ధూపము వేయవలెను (12-13 వచనములు). ఇట్లు చేసిన తరువాత కరుణాపీఠము మీద మొదట తన కొరకును, తరువాత ప్రజలందరి కొరకును రక్తమును ప్రోక్షించవలెను (6, 15, 16 వచనములు).

ఈ విషయములన్నియు మన ప్రభువైన యేసుక్రీస్తు తానే స్వయముగా చేసిన బలిని చూపు ఛాయగా నున్నవి. మొదటిదిగా మన ప్రభువైన యేసు తన మహిమా సౌందర్యములు గల వస్త్రములను తీసివేసెను. అనగా ఆయన దేవుడైనప్పటికి కూడా తన మహిమ గల పరలోకపు సింహాసనము వదలి మనకొరకు మనుష్యుడాయెను. తరువాత పాపములను భరించి వాటిని

మోసికొనిపోయెను. ఆ మేక అరణ్యమునకు పంపబడగా తిరిగి ఎవరును దానిని చూడలేదు. అట్లే అయన మన పాపములను ఎన్నటికిని జ్ఞాపకము రాకుండునట్లు భరించెను. కడపటిదిగా తన స్వరక్తమును అతి పరిశుద్ధ స్థలమునకు తెచ్చి దేవుని సంపూర్తిగా తృప్తి పరచెను (హెబ్రీ. 9:11-12).

దేవుడు మన పాపములను క్షమించునపుడు సంపూర్ణముగా క్షమించును, నీ పాపములు ఎంత ఘోరముగా నున్నను నీవు పూర్ణ హృదయముతో పశ్చాత్తాపపడి ప్రభువైన యేసు నీకు బదులుగా మరణించెనని హృదయ పూర్వకముగా నమ్మిన యెడల నీ పాపములు ఇక ఎన్నటికిని జ్ఞాపకమునకు రావు. తన ప్రియకుమారుని యొక్క ప్రశస్తమైన రక్తము ద్వారా దేవుడు సంపూర్ణముగా తృప్తిచెందెను. నీ పాపములన్నియు పూర్తిగా క్షమింపలేదని దుష్టుడు నిన్ను భయపెట్టనీయకుము. ఈ విధముగా నేను రక్షింపబడిన కొన్ని నెలలకే అపవాది నన్ను సమీపించెను. నేను అప్పుడు గొప్ప కష్టములు, పరీక్షలు అను సాగరములను ఈదుచుంటిని. "ప్రభువు నీ పాపములను క్షమించెను గాని పూర్తిగా క్షమించలేదు. నీవు లండన్ పట్టణములో చేసిన కొన్నిపాపముల నిమిత్తము దేవుడు నిన్ను ఇట్లు శిక్షించుచున్నాడు" అని నన్ను సైతాను శోధించెను. నేను అతని మాటలు నమ్మి ఈ విధముగా అతనితో చెప్పితిని. "అవును అది నిజమే. దేవుని నేను దుఃఖపరచితిని గనుక ఆయన నన్ను శిక్షించవలసినదే."

నేను పాపముల విషయమై పశ్చాత్తాపపడి యేసుక్రీస్తు ప్రభువు నాకు బదులుగా మరణించి నా కొరకై తిరిగి లేచెనని నా హృదయపూర్వకముగా నమ్మిన యెడల నా పాపములను దేవుడు తన వీపువెనుక పారవేయునని లేఖనములు నేర్పించుచుండెను. అవి పూర్తిగా తుడిచివేయబడి ఇక ఎన్నటికి జ్ఞాపకము చేసికొనబడవు. సముద్రపు అగాధములో పడవేయబడినవి.

తూర్పునుండి పడమటికి ఎంత దూరమో, అంత దూరముగా పారవేయబడినవి. ఇట్లు లేఖనములు చెప్పుచున్నవి (కీర్తనలు 103:12, యెషయా 38:17; 43:25; 44:22, మీకా 7:19; 1 యోహాను 1:7). అయినప్పటికి అపవాది నీవు ఇంకను ఈ పాపము కొరకై శిక్షింపబడుచున్నావని శోధించును. గనుక అనేకులు అధైర్యపడి కృంగిపోవుచున్నారు, అయితే దేవుడు క్షమించునపుడు సంపూర్ణముగా క్షమించునని మొదటినుండి చూపించుచున్నాడు. ప్రభువు యొక్క ప్రశస్తమైన రక్తము కరుణాపీఠముపై దేవుని యెదుట నున్నది. మన పాపములను మోసిన మేకపిల్ల మరచిపోబడుటకే అరణ్యములకు పంపబడినది.

రక్తము ప్రోక్షింపబడుటకు ముందు కరుణాపీఠము నొద్ద ధూపము వేయబడెనని జ్ఞాపకముంచుకొనుము. ఇది పరిశుద్ధుల ప్రార్థనలని మనకు తెలుపుచున్నది. ఒక పాపి రక్షింపబడక ముందు ఇతరులు అనేక ప్రార్థనలు ఆయన కొరకు చేయవలెను. అట్టి ప్రార్థన విషయమై నా స్వంత అనుభవమును చెప్పెదను.

1932 సంవత్సరము సెప్టెంబరు నెలలో నా రక్షణను గూర్చి నా తండ్రికి వ్రాసితిని. అప్పుడు నేను కెనడాదేశము నందుండి నేనెట్లు తిరిగి జన్మించితినో వ్రాసితిని. ఆదికాండము నుండి ప్రకటన గ్రంథము వరకు అనేక వచనములతో కూడిన ఒక పొడవైన ఉత్తరము వ్రాసితిని. మా తండ్రి ఆ వచనములను ఎట్లు అర్థము చేసికొనునో నాకు తెలియకపోయినను అట్లు వ్రాసితిని. నా లెక్క ప్రకారము ఆ జాబు మా తండ్రికి అక్టోబరు 21వ తారీఖున చేరును గనుక ఆయన కొరకు ప్రార్థించుమని కెనడాలో నున్న నా స్నేహితులకు చెప్పితిని. కనుక అక్టోబరు 21వ తేదీని 44 మంది స్నేహితులు కూడి ప్రార్థించితిమి. మేము ఒక గదిలో మోకరించి ఒకరి తరువాత ఒకరిగా నలుబది నలుగురము "ప్రభువా ఆ ఉత్తరము ద్వారా ఆ మనుష్యుని కన్నులను తెరువు"మని

ప్రార్థించితిమి. నేననుకొనిన దినమునకే అందినది. ఆయన ఉత్తరము నా తండ్రికి ఉత్తరము తెరచి అందు అనేకమైన బైబిలు వాక్యములుండుట చూచి ఈ ఉత్తరము యొక్క బావమేమని తెలిసికొనుటకు ఒక మిషనరీ యొద్దకు వెళ్ళవలెనని తలంచెను.

ఆ ఊరిలోనే మెక్ ఆర్తరు అను నౌకరుండిరి. నా తండ్రి ఆ జాబును ఆయన యొద్దకు తీసుకొని వెళ్ళి, "నా కుమారుడు కెనడా దేశము వెళ్ళి అచటనుండి ఒక పెద్దజాబు వ్రాసెను. అందు అనేకమైన వచనములున్నవి. అవి నాకు తెలియవు. వాటిని అర్థము చేసికొనుటకు నాకు సహాయము చేయగలరా?" అని అడిగెను. అప్పుడాయన నా తండ్రికి ఒక ఉర్దు భాష బైబిలునిచ్చి దానిలోని వచనములను ఎట్లు చూడవలెనో తెల్పెను. నా తండ్రి ఇంటికి వెళ్ళి ఆ వచనములనన్నింటిని చదివెను. మెక్ ఆర్తర్ అక్కడనున్న క్రైస్తవులకు నా తండ్రి కొరకు ప్రార్థించమని చెప్పెను. ప్రభువు మెక్ ఆర్తర్‌తో ఇట్లు చేయుమని చెప్పెను.

ఇట్లు నా తండ్రికి తెలియకుండ అనేకులు కెనడాలోను, ఇండియాలోను ఆయన కొరకు ప్రార్థన చేయుచుండిరి. నేను ఇండియాకు వచ్చునంతలో నా తండ్రి సువార్తను అంగీకరించుటకు సిద్ధముగా నుండెను. త్వరలోనే ఆయన తిరిగి జన్మించెను. కెనడా, ఇండియా దేశములలో అనేకులు ఆయన రక్షణ కొరకు ప్రార్థించిన ప్రార్థనల ఫలితముగా దేవుడు ఆయనను రక్షించెను.

గనుక ప్రతి ఆత్మ యొక్క రక్షణ కొరకు ఎక్కువ ప్రార్థన అవసరము. మన ప్రార్థనల యొక్క ఫలితమును కొన్నిసార్లు మన మెరుగుదుము, కొన్నిసార్లు ఎరుగము. అయితే మనము పరలోకమునకు వెళ్ళినపుడు దేవుడు మనలను చూచి "నా బిడ్డా, అక్కడ నున్నవారిని చూచితివా? నీ ప్రార్థనల వలన రక్షింపబడిన వారు వీరే," అని అనును. "ఓ దేవా: వారెవరో నే నెరుగనే," అని

నీవందువు. అప్పుడు ప్రభువు "నీవు ఎక్కడ, ఎవరి కొరకు, ఎట్లు ప్రార్థన చేసితివో జ్ఞాపకము తెచ్చుకొనుము," అని అనును. దేవునికి మంచి జ్ఞాపకశక్తి కలదు. మనవలె సంగతులను త్వరగా మరువడు. గత వారములో నీవు మంచి భోజనము తిని కూడా, "నీవు పోయిన వారము ఏమి తింటివి?" అని ఎవరైన ప్రశ్నించిన "నేనేమి తింటినో నాకు జ్ఞాపకము లేదు" అని నీవందువు. నాలుగు దినముల క్రితము నీకు ఏమి కలిగియుండెనో అది కూడా జ్ఞాపకముంచుకొనలేవు. అది మానవ జ్ఞాపకశక్తి. అయితే దేవుడు దేనిని మరచువాడు కాడు. మనము చేసిన ప్రార్థన లన్నిటిని ఆయన జ్ఞాపకముంచుకొనును. నీవు ప్రార్థించునపుడు ఆ ప్రార్థన ధూపమువలె ఆయన పరిశుద్ధ ఆలయమునకు చేరును. నీ ప్రార్థనల ద్వారా ఆయన తన కార్యమును జరిగించును. ఏలీయా మనవంటి స్వభావము గలవాడే. అయినను అతని విశ్వాస సహితమైన ప్రార్థన, గొప్ప సంగతులను నెరవేర్చెను (యాకోబు 5:17-20). గనుక దేవుడు మన ప్రార్థనలను వినడని చెప్పరాదు.

నీవు ప్రభువు రక్తము వలన కొనబడినట్లయిన నీ వెవరవైనను సరే నీవు దేవుని యాజకుడవే. అన్ని సమయములందును అందరి కొరకును ప్రార్థించగలవు. అందరు ప్రసంగించలేరు గాని "ప్రభువా ప్రార్థించుటకు మాకు నేర్పుమని యందురు" ఎచటనైన ఏ సమయమునందైన ప్రార్థించగలవు. దేవుడు ప్రార్థనలను వినును. నీ ప్రార్థనల ద్వారా దేవుడు ఆశ్చర్య కార్యములను చేయగలడు. ఆత్మలను తన యొద్దకు పురలించగలడు. హృదయములు మెత్తపడునట్లు చేయగలడు. అనేక కుటుంబములను ఆశీర్వదించగలడు. మనమందరము దీనిలో పాలు పొందగలము.

ప్రజలు యోసేపును గురించి చెడ్డగా మాట్లాడినట్లు నీ గురించి మాట్లాడిన యెడల వారి కొరకు ప్రార్థించుము. నీవు వారిని గురించి చెడ్డ

మాటలు పలుకక "దేవా ఫలాని వారిని దీవించుము," అని వారి కొరకు ప్రార్థించుము. ఈ విధముగా పరలోకమునకు నీవు ధూపము పంపగలవు. దేవుని పరిశుద్ధ స్థలము పరిమళ వాసనతో నింపబడును. పరిమళ ద్రవ్యములు మొదట కానాను నుండి ఐగుప్తుకు తేబడెను. తిరిగి ఐగుప్తు నుండి కానానుకు పంపబడెను. అభిషేకించుటకు నూనెయు, ప్రార్థనయను ధూపమును ఈ పరిమళ ద్రవ్యమును పరలోకమునుండి మనము పొంది, తిరిగి పరలోకమునకు వాటిని పంపుచున్నాము.

# 15

# రత్నమణులు

"లేతపచ్చలు ఏఫోదుకును, పతకమునకును చెక్కు రత్నములు" (నిర్గమ. 25:7). ప్రధాన యాజకుని వస్త్రముల మీద రత్నములు కుట్టబడియుండెనని ఇదివరలోనే చూచియుంటిమి. నిర్గమకాండము 28వ అధ్యాయమందు ఈ యాజకత్వపు వస్త్రములను గూర్చి తిరిగి చూతము. అహరోను ముందుగా ఒక తెల్లని చొక్కాయిని తొడిగెను; దానిమీద నీలి నిలువుటంగీని తొడిగెను: మూడవదిగా ఏఫోదును తొడిగెను. ఈ ఏఫోదు బంగారును, నీలి ధూమ్ర రక్త వర్ణములు గల నూలుతోను, సన్ననారతోను చిత్రకారుని పనిగా చేయబడి యుండెను (వచనములు 6-8). ఏఫోదు భుజముల మీద రెండు లేతపచ్చలు లేక "ఇశ్రాయేలీయులకు జ్ఞాపకార్థమైన రత్నములు" ఉంచబడి యుండెను. ఇశ్రాయేలీయుల పన్నెండు గోత్రముల పేర్లు ఈ రత్నముల మీద చెక్కబడి యుండెను. "అహరోను తన రెండు భుజముల మీద యెహోవా సన్నిధిని వారి పేరులను భరించును" అని చెప్పబడియున్నది (వచనములు 9-12).

దీనిని బట్టి చూడగా ప్రభువు మనలను ఆయన భుజముల మీద భరించుచున్నాడు. అనేకులు తమ భారములను తామే భరించుచున్నారు. నే నెన్నో మారులు ప్రయాణీకులు రైలుబండి నెక్కి, తలమీద నున్న మూటలను దించక మోయుచునే యుండుట చూచితిని. బండిలో కూర్చుండినను, మూటలు

ఇంకను తలమీదనే యుండును. కూర్చున్న బెంచి క్రింద అవి పెట్టుకొనరు. తరుచుగా మనము చేయుచున్న పని కూడ ఇదే. దేవుడు "నీ భారమును నీ భుజముపై వేయుము" అని చెప్పినను దానిని మనమే మోయవలెననుచున్నాము. అందువలన రాత్రింబగళ్ళు దాని విషయమై చింతతో బాధపడుచున్నాము. 'రేపటి మాట ఏమిటి? రేపేమి జరుగునో? వచ్చే నెల ఏమి జరుగునో? రెండు నెలలు పోయిన తరువాత ఏమి జరుగునో? ఇప్పటికే ఐదుగురు బిడ్డలున్నారు. ఇంక కొంత కాలానికి మొత్త ఏడుగురు తప్పదు. వీరందరికి విద్య ఏలాగు? పెండ్లి పేరంటాలు ఏలాగు?" పిల్లలు పుట్టకముందు నుంచి కూడా వారిని గురించి చింత! ప్రభువైన యేసుక్రీస్తు నీ భారములు మోయనిమ్ము. ఆయన భుజముల మీద నీ భారము వేయుము. ఆ మోత ఆయనను మోయనిమ్ము. "ఆయన మిమ్మును గూర్చి చింతించుచున్నాడు గనుక మీ చింత యావత్తు ఆయన మీద వేయుడి" (1 పేతురు 5:7). ఈ పాఠమును నీవు నేర్చుకొనినప్పుడు ఆయన మీదనే భారమును వేసి ఆయన యొక్క పూర్ణ విశ్రాంతి సమాధానములను అనుభవింతువు.

ఏఫోదు మీద పతకముండెను. ఇది పేనిన సన్ననారతో చిత్రకారునిపనిగా చేయబడి బంగారు గొలుసులు జవలను కలిగియుండెను. ఈ పతకము మీద పన్నెండు మణులుండెను. వీటిమీదను కూడ ఇశ్రాయేలీయుల పన్నెండు గోత్రముల పేర్లుండెను (వచనములు 15-21). ఈ పన్నెండు మణులు ప్రధాన యాజకుని హృదయమును అంటియున్నట్లుండెను. అతడు ఎక్కడకు వెళ్ళినను ఈ మణులు అతనితోనే వెళ్ళును. ఈ మణుల ద్వారా దేవుడు తన జనులకు చెప్పునది ఏమనగా తన హృదయమును అంటినట్లు అంత సమీపముగా వారుండవలెను.

కొందరు దేవునికి అంత సమీపముగా రారు. దేవుని వాక్యము తప్పక

ప్రేమించుచున్నారు గాని, ఆయన ఇష్టపడునంత సమీపముగా ఆయన దగ్గరకు వచ్చుటలేదు. అప్పుడప్పుడు ఆయనకును మనకును మధ్యగా లౌకికులైన స్నేహితులు వచ్చుచున్నారు. ప్రార్థన చేయవలెనని మనసు కోరుచున్నది. ఎవరో ఒకరు ఆ సమయమున చూడవచ్చిరి. దేవుని సన్నిధిని విడచిపెట్టి ఆ స్నేహితుని కలిసికొని అతనితో సమయము గడుపుచున్నాము. ఇట్లు ఎన్నిమారులు జరుగుటలేదు? లౌకిక స్నేహితులను దేవునికి మనకు మధ్య రానిచ్చుచున్నాము. దేవునితోను ఆయన వాక్యముతోను మనము గడుపవలసిన సమయమును లోక విషయముల మీద గడుపుచున్నాము. దేవునికి సమీపముగా నుండెవలెనను కోరిక లేకపోలేదు. అయితే ఎక్కడనో ఏదో వెలితివచ్చెను. ఈ మణుల ద్వారా దేవుడు మనతో : "నా ప్రజలారా, నాకు అత్యంత సమీపముగా రండి; నా పూర్ణ ప్రేమ వాత్సల్యమును అనుభవించుడి" అని అనుచున్నారు.

కొందరు వారికేమైనను కావలసియుంటేనే ప్రార్థన చేయుదురు. ఉదాహరణముగా జబ్బు పడినప్పుడు : "ఓ దేవా, నన్ను స్వస్థపరచు, స్వస్థపరచు, స్వస్థపరచు." స్వస్థపడిన తరువాత దేవుడెక్కడో! కష్టాలలో ఉన్నప్పుడే ప్రార్థన. "ప్రభువా, నా కష్టాలు కొంచెము చూడు, ఈ ఇబ్బందులు కొంచెము తీర్చివేయుము" అని ప్రార్థన చేయుదురు. దేవుడు వారి ప్రార్థన నాలకించినప్పుడు మరల ఆయనను మర్చిపోవుదురు. కష్టాలు, దుఃఖాలు వచ్చినప్పుడు మాత్రమే అనేకులు ప్రార్థన చేయుదురు. దేవుని ప్రేమించుట చేత ఆయనతో కొంత సమయము గడుపుదామని ప్రార్థన చేయువారు బహు కొద్దిమంది మాత్రమే.

ఎదుగుచున్న మీ పెద్దపిల్లలు మీకెంత తొందర కలుగచేతురో మీరు ఎరిగియున్నారు. అయితే, పెరుగుచున్న కొలది బిడ్డలు మీరు వారికిచ్చు వస్తువుల నిమిత్తము మిమ్ము ప్రేమింతురు. అయితే, పసిబిడ్డకు తల్లి రొమ్ము చాలును. తల్లి ప్రేమ, వాత్సల్యము ఆ శిశువుకు లభించిన యెడల మరేమియు

అవసరము లేదు. తల్లి రొమ్ము కొరకు శిశువు ఆకలి గొనునట్లు దేవుని కొరకే మనము ఆకలిగొనవలెను. దీనికొరకు, దానికొరకు మొఱలు, విన్నపములు చేయుటకంటే మనమిట్లు వేడవలెను : "ఓ ప్రభువా, నాకు నీవే కావలెను; నీ సన్నిధిలో నుండగోరుచున్నాను; నీ ప్రేమయే నాకు కావలెను." మన ప్రధాన యాజకుని రొమ్ముమీద మణులవలె మన ముండవలెను. పతకమందు ఈ పన్నెండు రాళ్ళకు దిగువ మరొక రెండు రాళ్ళుండెను. ఇవే ఊరీము, తుమ్మీము ఇవి ఏమిటో ఇప్పటికింకను ఎవరికిని తెలియదు. అంతయు మర్మము. అది దేవుడు మనకు ప్రత్యక్షపరచని రహస్యము. ఈ రాళ్ళ సహాయముతో ప్రధాన యాజకుడు దేవుని చిత్తమును తెలుసుకొనుచుండెనని మాత్రము మనకు తెలియును. ఎవరైనను, ఏ విషయములోనైన, దేవుని ఆజ్ఞ ఏమిటని తెలిసికొనుటకు ప్రధాన యాజకుని యొద్దకు వచ్చినప్పుడు ఆయన ఈ రెండు రాళ్ళ ద్వారానే అది తెలిసికొనుచుండెను.

కీర్తనలు 43:3, 4లో ఈ రాళ్ళ విషయము ఒక సూచన యున్నది. దేవుని వెలుగునకు, దేవుని సత్యమునకు ఈ రాళ్ళను పోల్చవచ్చును. నీ వెలుగును సత్యమును బయలుదేర జేయుము; అవి నాకు త్రోవ చూపును, ప్రతి విశ్వాసికిని దేవుడు అవి అనుగ్రహించి యున్నాడు. ఎట్లయితే ప్రధాన యాజకుని పతకము మీద ఊరీము తుమ్మీములుండెనో అట్లే నీవు తిరిగి జన్మించిన వేళలో దేవుని యొద్దనుండి నీవు పొందిన దేవుని వెలుగు, దేవుని సత్యము, నీ హృదయమందు ఇప్పటికిని ఉన్నవి (2 కొరింథీ. 4:4, 6 చూడుము). అంధులకును వెలుగున్నదా? అట్లే యేసుక్రీస్తుయందు విశ్వసింపని వారు అంధకారమందున్నారు. అపవాది వారి కండ్లకు అంధత్వము తెచ్చిపెట్టెను. ప్రభువైన యేసుక్రీస్తునందు విశ్వసించువారిని గూర్చి దేవుడు ఏమనెననగా, ఆయనయందు ప్రత్యక్షమైన దేవుని వెలుగు వారిలో ప్రకాశించుననిని, ఆయన ఇట్లు కూడ చెప్పెను. "క్రీస్తు వాక్యము మీలో సమృద్ధిగా నివసింప

నియ్యుడి" (కొలొస్స. 3:16). విశ్వాసము ద్వారా ప్రభువును ఎప్పుడు ముఖా ముఖిగా చూచి-నీవు తిరిగి జన్మించెదవో అప్పుడు నీలో దేవుని వాక్యముండును; అనగా ప్రభువైన యేసుక్రీస్తే నీతో మాట్లాడుచుండును; మరియు దేవుని వెలుగు నీలో ప్రకాశించుచుండును. ఎట్లయితే ఈ రెండు రాళ్ళ ద్వారా ప్రధాన యాజకుడు దేవుని చిత్తము తెలిసికొనుచుండెనో, అట్లే మన హృదయములోని ఆయన వెలుగు ఆయన సత్యములను బట్టి మనము కూడ దేవుని చిత్తము తెలిసికొనగలము. ఎక్కడకైనను వెళ్ళేముందు, దేనికైనను పైకము ఖర్చుపెట్టే ముందు, మరియు మన విషయమో, మన బిడ్డల విషయమో, భవిష్యత్తు దినాల విషయమో ఏర్పాట్లు, తీర్మానములు చేసేముందు దేవుని చిత్తమును మనము తెలిసికొనవలెను.

అయ్యో! తమ జీవితముల విషయము మనుష్యులు దేవుని చిత్తమేమిటో తెలిసికొనుటలేదు; వారి సొమ్మును, వారి కాలమును, వారికి దేవుడిచ్చిన వరములను ఇష్టానుసారముగా వ్యయము చేయుచున్నారు. వారి విషయముగాని, వారి బిడ్డలు, వారి స్నేహితుల విషయముగాని ఈ రెండు రాళ్ళను వారు ఉపయోగించుట లేదు. క్రైస్తవ తల్లిదండ్రులెందరెందరో తమ పిల్లలను అంధకారమందు పడవేసి యున్నారు. తిరిగి జన్మించిన తల్లిదండ్రులు బిడ్డలను రోమన్ క్యాథలిక్ కాన్వెంటులలో చదివించుచున్నారు, "వాళ్ళు ఇంగ్లీషు నేర్చుకోవాలని మేము వాళ్ళని అక్కడ చదివిస్తున్నాము" అని అంటారు. ఈ ప్రేరపణ దేవుని వలన వచ్చినది కాదు. కేవలము సాతాను చేయు జిత్తులే.రోమన్ క్యాథలిక్ కాన్వెంట్లు బడులు విగ్రహారాధన కొరకే యున్నవి. నీ బిడ్డలు చిన్నవారుగానున్న కాలమందు 'నన్స్' విగ్రహములను పటములను మ్రొక్కుటవారు చూచి, అదే సరియైనదని భావించి వారు కూడా అట్లే చేయుదురు. ఇంగ్లీషు చక్కగానే నేర్చుకొందురు. అయితే దేవుని మందిరములో విగ్రహారాధనను కూడ తెచ్చి పెట్టుదురు. వారి బిడ్డలు తప్పాటకు జననీ

జనకులే కారణము.

మీ బిడ్డల వివాహ విషయము కూడ మీరు దేవుని చిత్తము తెలిసికొనుట మానుచున్నారు. ఇట్టి వివాహములు తుదకు సమాధానము లేనివై యున్నవి. ప్రతి విషయమందును దేవుని దగ్గరకు పరుగెత్తి ఆయన చిత్తమేమో అడుగుట వలన మీరు అంతకంతకు ఎక్కువగా దేవుని హృదయమును సమీపించుచున్నారు. రత్నమణులు మనకు నేర్పునది ఇదే; తన ప్రజల కొరకు దేవుడు ఏమి ఏర్పాటు చేసెననగా, వారు తన హృదయమును అంటునంత సమీపముగా రావలెను.

ఈ రాళ్ళు తిరిగి మనకు ప్రకటన 21:14-18 యందు కనబడుచున్నవి. పన్నెండుగురు అపొస్తలుల పేర్లు వ్రాయబడిన పన్నెండు పునాదులు గల పరిశుద్ధ పట్టణము యొక్క ప్రాకారముల దర్శనము ఇందు కనబడుచున్నవి. ఆ పునాదులలో ఈ రత్నమణులను చూచుచున్నాము. ఎంత బలమైన పునాదులు! ఈ అపొస్తలుల పునాదుల మీద మనము కట్టబడుచున్నట్లు ఈ రాళ్లు చెప్పుచున్నవి (ఎఫెసీ. 2:19-22). అపొస్తలులు సాధారణమైన మనుష్యులే. వారు అపురూపమైన గుణములు గల అసమాన్య పురుషులు అనుకొనుటకు వీలులేదు. మనవంటి స్వభావములు గలవారే అయినను, అట్టివారినే దేవుడు బలవంతులుగా చేసెను. మనము ఎన్ని అపజయములు పొందినను, మన మందరము కూడ అట్టి బలవంతులము కాగలము లూకా 6:13-16లో పన్నెండుగురు అపొస్తలుల పేర్లుగల పట్టీని చూచుచున్నాము. మొదటి పేరు సీమోనుది. సీమోను పేతురు ఎటువంటి వాడో మనము ఎరిగి యున్నాము. అతనికి అంత లోపము ఉండినను దేవునికి అతడొక రత్నమణి యాయెను. మనము కూడ తరచుగా తప్పుచుండినను ప్రభువైన యేసుక్రీస్తునందు మనము కూడ రత్నములుగా నున్నాము.

సీమోను పేతురు ఒక రత్నమెట్లు అయెను. 'పేతురు' అను పేరు యొక్క అర్థము ఒక మామూలు గరుకురాయి. ఇదే రాయి కడపటికి ఎక్కువ ప్రశస్తమైన మెరయుచున్న పునాది రాయి అయ్యెను. మొట్టమొదట ప్రభువైన యేసుక్రీస్తు నొద్దకు పేతురు వచ్చినప్పుడు అతడు ఎట్లుండెనంటే, వీధి ప్రక్కద పడియుండుట నీవు చూతువే అటువంటి సాధారణమైన, మురికి పట్టిన రాళ్ళలో ఒకదానివలె నుండెను. ఇప్పుడైతే పరమ పునాదులలో అతడు ఒక అతి రమ్యమైన మణిగా కనబర్చబడి యున్నాడు. "మొదటి పునాది సూర్యకాంతపు రాయి" (ప్రకటన 22:19). అ సాధారణమైన గరుకురాయిగా నుండిన పేతురు ఇప్పుడు ప్రకాశమానమైన, మెరయుచున్న, సొగసైన, అమూల్యమైన సూర్యకాంతపు రాయికి పోల్చబడుచున్నాడు. అతడు సూర్యకాంతపు రాయివలె ఎట్లాయెను?

లూకా 5:2, 3 లో ఇది చూచుచున్నాము. పేతురు తన దోనె ప్రక్కన కూర్చుండి తన వలను కడుగుచుండెను. ఒక పై వస్త్రము తప్ప అప్పుడు అతనిమీద మరొక వస్త్రము ఉండి యుండదు. మోటు ముఖము, దువ్వని తల కూడ ఊహింపగలము; ప్రభువైన యేసుక్రీస్తు సముద్రపు ఒడ్డుకు వచ్చి సీమోను అనుమతి పొంది అతని పడవలో నెక్కి విశ్వాసమును గూర్చియు, ఇతర విషయములను గూర్చియు సంభాషింప నారంభించెను. "ఈ బోధకు నాకు సంబంధమేమి?" యని పేరుకు మాత్రము ఏదో చిన్న బట్ట కలిగిన జాలరివాడు ఆశ్చర్యపడి యుండవచ్చును. సీమోనును గూర్చి అతనికే తెలియని విషయము లన్నియు ప్రభువు ఎరిగియుండెను. ఉపదేశమంతయు తీరిన తరువాత ఆయన సీమోనుతో "దోనెను లోతుకు నడిపించి చేపలు పట్టుటకు మీ వలలు వేయుడు" అని అనెను. సమూహములతో ప్రభువు మాట్లాడు చుండినను సీమోను మనస్సులోని తలంపు లన్నియు ఆయన చూచుచుండెను. సీమోను: "ఏలినవాడా, రాత్రి అంతయు మేము ప్రయాసపడితిమి గాని

మాకేమియు దొరకలేదు; అయినను నీ మాట చొప్పున వలలు వేతుము" అని అనెను. ఒక్క చేపయైనను వలలో పడునను నమ్మకము మాత్రము అతనికి లేదు. అతడు మనస్సులో "నేనైతే జాలరివాణ్ణి; ఇతడు ఎప్పుడైనా ఒక చేప పట్టియుండడు. ఇప్పుడు నేర్పిస్తున్నాడు. దోనెకు అవతలి ప్రక్క వల వేయమంటున్నాడు. రాత్రంత వలవేసి, వలవేసి తిప్పలు పడితే, ఒక్క చేపగూడ దొరుకలేదు. నాకేమి తెలియదు అనుకొంటున్నాడు. పోనీ, అతని సరదా కొంత తీరుస్తాను" అని అనుకొని అతడు అట్లే వలవేసెను (లూకా 5:5-8).

ఏమి జరిగెను? సీమోను, ఆ గరుకురాయి, బొత్తిగా నిరాశ చెంది సంశయముతో నిండి కూర్చుండినవాడు ప్రభువు మాటకు లోబడెను. కాగా వెంటనే వల చేపలతో నిండిపోయి, పిగిలిపోవుచుండెను.

ఇట్టివారినే ప్రభువు ఏర్పరచుకొనెను; బి.ఏ.లు కారు, ఎం.ఏలు కారు; విద్యలేని పామరులు, జాలరివారు, మెండుగా పొరబడువారే నిండుగా లోపములు బలహీనతలు గలవారే. అయితే ఆయన మాట శిరస్సావహించువారు. ఈ సీమోనే మూడు సంవత్సరములు ప్రభువైన యేసుక్రీస్తుకు చాలా తొందరలు కలిగించెను. ముక్కోపము, దుడుకుతనము మెండు. కావున తిరిగి తిరిగి ఆయన అతనిని గద్దింపవలసి వచ్చెను. మత్తయి 16లో చూచిన ఎడల క్రీస్తు దేవుని కుమారుడని పేతురు సాక్ష్యమిచ్చుచున్నాడు. అయితే తాను పొందవలసియుండిన హింసలు, మరణమును గూర్చి ప్రభువు అతనితో చెప్పగా ఆయన చాలా గొప్ప పొరపాటు చేసివేసెనని పేతురు భావించి, ఆయనతో ఇట్లనెను: "ప్రభువా ... అది నీకెన్నడును కలుగదు." తానేమి చెప్పుచుండెనో పేతురు గ్రహించలేదు. "సాతానా, నా వెనుకకు పొమ్ము" అని ప్రభువు అతనిని గద్దించెను. "దేవుని సంగతులను మనస్కరింపక యున్నావు" అని కూడ చెప్పెను. తాను ప్రభువును వెంబడించుచున్నాననే

పేతురు తలంచెను. ఇట్లు ఎందరు లేరు? బైబిలు సెమినెరీలకు పోయి హెబ్రీ భాష, గ్రీకు భాష నేర్చుకొనిరి. దేవుని గూర్చి ఎంతయో నెరుగుదురు. ఆయన మార్గములలోనే నడుచుచున్నామందురు. ఇంకను, మన ప్రభువు కంటె కూడ వారే ఎక్కువ తెలిసినవారని భావించుచు పేతురువలె: "ప్రభువా, సిలువ, రక్తము అత్యవసరము కాదు" అని చెప్పుదురు.

కొందరు మాతో, "మీ బోధ వినడానికి మా కిష్టమే గాని పాపము గురించి రక్తము గురించి మాతో ఏమి చెప్పకండి, ఇంకే విషయమైనా చెప్పండి. ఇవి మట్టుకు మాకు నచ్చుడము లేదు." అనుచున్నారు. ఎంతోమంది పాస్టర్లు అనబడువారు, పాపమును గూర్చియు, క్రీస్తు రక్తమును గూర్చియు మౌనముగా నుండుటకు ఇదే కారణము. మనుష్యుల బలిమికి లోబడి తమ పాపముల కొరకు క్రీస్తు మరణించెనని కూడ తెలుపరు. అయితే ప్రభువు, "సాతానా, నా వెనుకకు పొమ్ము" "మనుష్య కుమారుడు శ్రమలు పొంది తీరవలెను." "ఇందు నిమిత్తమే నేను భూలోకమునకు వచ్చితిని అని అనుచున్నాడు."

మత్తయి 18:21 చూచిన ఎడల 'మీరు క్షమింపవలెను' అని ప్రభువు చెప్పుచున్నాడు. పేతురు మనస్సులో ఇట్లు తలచుచున్నాడు: "క్షమించడము ఏలాగు, ప్రభువా? ఈ విధంగా మాకు బోధించవద్దు. ప్రభువా ఇటుకలు, రాళ్ళు మనుష్యుల మీద రువ్వి, కఱ్ఱలు, ఖడ్గాలు పట్టుకొని వాళ్ళమీద పడు వారిని శిక్షించవలసి యుండగా క్షమాపణ ఏమిటీ? పేతురు మాటిమాటికి ఆయనను ఎట్లు అభ్యంతర పరచుచుండెనో చూడుము. ఎన్నో మారులు తన శిష్యులకు ప్రభువు ఇట్లు చెప్పియుండెను. "నేను మరణించవలసియున్నది; నా మరణము ద్వారా తప్ప వేరొక విధముగా పాపులు రక్షింపబడుటకు మార్గము లేనందున, మరణము పొందుట కొరకే నేను ఈ భూలోకమునకు వచ్చియున్నాను. పాపులందరి కొరకు హృదయ పూర్వకముగా నా ప్రాణమును పెట్టు నిమిత్తము

పరలోకము విడిచి వచ్చియున్నాను." ఈ సంగతులన్నియు అన్ని మారులు వినియుండి కూడ పేతురు చేసిన పని ఏమి? ప్రభువును పట్టుకొనుటకై జన సమూహము ఆయన చుట్టు మూగియుండగా పట్టరాని కోపముతో తన ఖడ్గమును తీసి ప్రధాన యాజకుని దాసుని యొక్క చెవిని తెగవేసెను. తిరిగి ప్రభువు ఆతనిని గద్దింపవలసి వచ్చెను.

పేతురు ఒక గరుకురాయి. దేవుని మనస్సు గ్రహించలేని వాడతడు. అతని జీవితమంతా బలహీనతలు, లోపములే. అయినను, ఇదే గరుకురాయి ఒకనొకనాడు అమూల్యమైన సూర్యకాంతపు మణివలెనగునని ప్రభువు ఎరిగెను. మనమును పేతురువంటి వారమే. ప్రభువు యొద్దకు వచ్చేముందు, చిదచిద మండిపడే గుణము కలిగి, ఎప్పుడును తెలివితక్కువ పనులే చేయుచుంటిమి. అయితే, ఎటువంటి ప్రేమతో ప్రభువు మనలను గద్దించుచు, నేర్పించుచు, మనము కూడ రత్నములు మణులు అయ్యేవరకు కనిపెట్టుచున్నాడో! మన తప్పిదములు, లోపములు, బలహీనతలు ఎన్నియైనను కానిమ్ము మనము ఆయనకు లోబడితిమా ఆయన మనలను తీసి, మనలను మార్చి, రూపాంతరము గావించి వెరయుచున్న సూర్యకాంతపు రాయివలె మనలను చేయును.

ఎన్నో యేండ్లు గడచిన పిమ్మట కూడ అపొస్తలుడైన పౌలు ద్వారా దేవుడు పేతురును గద్దించవలసి వచ్చెను. ఎందుకనగా అతడు అన్యుల పంక్తిలో కూర్చుండి భుజించుటకు ఒప్పుకొననందున (గలతీ. 2:11, 12). మరణ పర్యంతము కూడ మనమైనను గద్దింపబడుచునే యుందుము. మణులను ఎక్కడ త్రవ్వి తీయుదురో ఆ భూఅంతర్భాగమందు గల అత్యంత వేడిలో నుండునందువలననే అవి అంత కాంత గలిగియున్నవి. ఆయన యొక్క చిత్తము పరిపూర్ణమైనదని నమ్మి, ఆయన తన చిత్త ప్రకారము మనలో పనిచేయునట్లుగా ఆయన పంపెడు పరీక్షలను రానిమ్మని దేవుడు మనలను

ఆడుగుచున్నాడు. మెరయునట్టి మణులుగా మనలను ఆయన చేయవలెనంటె పద్ధతి ఇదే. దేవుని యొక్క వెలుగును ఆయన సత్యమును మనలో పనిచేయు నిచ్చుట ద్వారా, ఆయన హృదయమును తాకునట్టి రత్నములుగా అగుదుము; ఆయన సంపూర్ణమైన ప్రేమ వాత్సల్యములను త్రాగుదుము.

దేవుని మందిరము నిమిత్తము సేకరింపబడు సామానుల యొక్క ఆత్మీయ భావమును తెలిసికొనుచున్నాము. అనుదినమును : 'ప్రభువా, నీ మందిరమునకు బంగారు, వెండి, ఇత్తడి, నీలము, ధూమ్రవర్ణము, రక్తవర్ణము, సన్ననార, మేక వెంట్రుకలు, పొటేళ్ళ తోళ్ళు, సముద్రవత్సల తోళ్లు, తుమ్మకర్ర, తైలము, పరిమళ ద్రవ్యములు, అమూల్య మణులు నేను తెచ్చునట్లు సహాయము చేయుము. ఇవన్నియు నీ మందిరమునకు తెచ్చు సంతోషము, భాగ్యము నాకిమ్ము. నీ నివాస స్థలమును నిర్మించు కార్యమందు నా వంతు నాకు కావలెను' అని ఈ రీతిగా ప్రార్థన చేయుదుము గాక!

# 16

# పలకలు

మన మింతవరకు దేవుని ఆజ్ఞ ప్రకారము పరిశుద్ధ స్థలము కట్టుటకుపయోగించిన వస్తువుల గురించి మాటలాడితిమి. ఆ జాబితా నిర్గమ కాండము 25:3-7లో నున్నది. ఇప్పుడు ఆ పరిశుద్ధ నిర్మాణము యొక్క భావమును నేర్చుకొనగోరుచున్నాము.

దేవుని అజ్ఞానుసారముగా అరణ్యములో నిర్మించిన ప్రత్యక్షపు గుడారమునకును, యూదుల సమాజ మందిరమునకును సంబంధము లేదు. ఈ సమాజ మందిరము యూదుల ఆరాధనకును, దైవవాక్య పఠనమునకును మాత్రమే ఉపయోగించు స్థలమైయున్నది. పరిశుద్ధ స్థలము ఈ విధముగా ప్రజలు కూడుకొను స్థలము కాదు. దీపములు వెలిగించుటకును, ధూపములు వేయుటకును, సముఖపు రొట్టెలు మార్చుటకును, యాజకులు తప్ప మరెవ్వరును అందులో ప్రవేశించకూడదు. అతి పరిశుద్ధ స్థలము విషయమైతే ప్రధాన యాజకుడు మాత్రమే. మరియు ఇతడైనను సంవత్సరమున కొకసారి మాత్రమే రక్తమును తీసికొని అందులో ప్రవేశించును.

సమాజ మందిరము పురుషులు కూడుకొను స్థలము. పరిశుద్ధ స్థలమైతే దేవుని నివాస స్థలము, మనుష్యులు ప్రార్థించుటకు గాక పనులు చేయుటకు అందు ప్రవేశించిరి. బలులు ఆవరణములో అర్పింపబడెను. రక్తము ప్రాయశ్చిత్తార్థ దినమున లోపలికి తీసికొనిపోబడెను. అత్మీయ స్థలమును

నియమించెను. గాని సమాజ మందిరమును నియమించలేదు. ఆ పెద్ద పరిశుద్ధ స్థలము చెక్క పలకలతో నిర్మింపబడెను. దాని పొడవు 20 మూరలు, వెడల్పు 8 మూరలు, ఎత్తు 10 మూరలు. ఒక మూర యనగా ఒక అడుగు ఆరు అంగుళములు. కనుక దాని కొలత దాదాపు 30 అడుగుల పొడవు, 12 అడుగుల వెడల్పు, 15 అడుగుల ఎత్తు. పరిశుద్ధ స్థలము రెండు భాగములుగా విభజింపబడి యుండెను. ముందున్న భాగము పరిశుద్ధ స్థలమనియు, వెనుకనున్న చిన్న భాగము అతి పరిశుద్ధ స్థలమనియు పిలువబడెను. పరిశుద్ధ స్థలము అతి పరిశుద్ధ స్థలముకంటె రెండంతలు పెద్దది. దానిని మూడువైపులు అనగా ఉత్తరమున, దక్షిణమున పడమట చెక్కతో చేసిన గోడలుండెను. తూర్పువైపు స్థంభములపై ఆధారపడియున్న తెరతో అది మూసివేయబడి యుండెను. ఉత్తరపు గోడ 20 పలకలతోను, దక్షిణపు గొడ 20 ఫలకలతో చేయబడి యుండెను. ఒక్కొక్క పలక 15 అడుగుల పొడవు, 2 అడుగుల 3 అంగుళముల వెడల్పును కలిగియుండెను. అవి వెలుపలను, లోపటను బంగారముతో పొదగబడి యుండెను (నిర్గమ. 26:15-25).

ఇప్పుడు దేవుని మందిరములోనున్న చెక్క పలకల ద్వారా దేవుడు సంఘమును గురించి మనకు ఏమి నేర్పనై యున్నాడో చూతము.

అరణ్యములో దేవుని ఆజ్ఞ ప్రకారము మోషే ద్వారా నిర్మింపబడిన పరిశుద్ధ స్థలమునకు అహరోను మొదటి ప్రధాన యాజకుడుగా నుండెను. ఈ యరణ్యములోని పరిశుద్ధ స్థలము యేసుప్రభువు గొప్ప ప్రధాన యాజకుడుగా నున్న పరలోకపు పరిశుద్ధ స్థలమునకు ఛాయగా నున్నది (హెబ్రీ. 8:1-2). ఇందును బట్టియే దేవుడు మోషేతో, "కొండమీద నీకు చూపబడిన మాదిరి చొప్పున సమస్తమును చేయుటకు జాగ్రత్త పడుము" అని చెప్పెను (వచనము 5). పరిశుద్ధ స్థలము యొక్క ప్రతి సూక్ష్మమైన వివరమును దేవుడు మోషేకు

తెలియజేసెను. ఈ వివరమును బట్టి చూడగా ఇట్టి మచ్చుగల నిర్మాణము ఏ మానవ శిల్పకారియు, ఎప్పుడును చేసి యుండలేదని తేటగా తెలియుచున్నది. నీవు పోయి ప్రపంచమంతయు తిరిగి ఆయా వ్యక్తులు ఆయా రకములుగా కట్టిన భవనములను, పలు విధ ఉద్దేశములతో కట్టిన పలువిధ ఆరాధన స్థలములను చూడవచ్చును. గాని ఇట్టి నిర్మాణమును నీవెక్కడను చూడలేవు. నీవు అనేకమైన దేవాలయములను, మసీదులను చూచియుండవచ్చును. ఏ భవనములైనను ఇట్టి నమూనాను పోలియుండవు. ఇది ప్రతి విషయములోను ప్రత్యేకమైనదిగా నుండెను. ఇట్టి మాదిరి ఏ మనుష్యుని మెదడు నుండి వచ్చినది కాదు. దేవుడు తానే ప్రతి చిన్న వివరమును మోషేకు తెలియజేయుచు "నీకు చూపబడిన మాదిరిలో ఎట్టి మార్పులు చేయకుండ జాగ్రత్త పడుమని చెప్పెను

దేవుడు తనతో ముఖాముఖిగా మాట్లాడిన మోషేకు అట్టి హెచ్చరిక నిచ్చినచో, మనము ఎంతగా ఆయన హెచ్చరికలను పాటించవలెను? దేవుని సంఘము యొక్క పరలోకపు పద్ధతులను మార్చుటకు సాహసింప గల వారెవరు? చాలామంది ప్రసంగికులు, మిషనెరీలు మానవ తెలివిననుసరించి దేవుని మందిరమును నిర్మింప ప్రయత్నింతురు. ఏ మానవుడు వాని యొక్క ప్రకృతి సంబంధమైన జ్ఞానము ద్వారా దేవుని మందిరమును కట్టలేడని ఈ పఠనముల ద్వారా మనము నేర్చుకొన వలసిన మొదటి పాఠమైయున్నది. దేవుడు తన వాక్యము ద్వారా అపొస్తలులకు ముఖ్యముగా పౌలుకు తెలియజేసిన సంఘ పద్ధతులను మార్చుటకు ఏ బోధకునికిగాని, ఏ ప్రసంగికునికి గాని, అధికారమైనను పనియైనను లేదు. దేవుని యొక్క పని ఎవరి కప్పగింపబడెనో వారు మొదట పరలోక మాదిరిని తెలిసికొని ఆ ప్రకారము చేయుటకు చూడవలెను. వెలుపలి భాగము, అనగా పరిశుద్ధ స్థలము - సంఘము యొక్క భూ సంబంధమైన పనిని గూర్చి మాట్లాడుచున్నది. లోపలి బాగము, అనగా

అతి పరిశుద్ధ స్థలము - సంఘము యొక్క పరలోక సంబంధమైన పనిని తెల్పుచున్నది. ప్రభువైన యేసుక్రీస్తు యొక్క సంఘమునకు ఈ రెండు విధములైన పని గలదు. మనము ఈ లోకములో కొంత పనిచేయవలెను. అదే సమయమున పరలోకపు కర్తవ్యమును కూడ నిర్వర్తించవలెను. ఇవి రెండును కలిసిపోవలెను. కొందరు భూలోక విషయములనే మనస్కరించుచు, పరలోకమునకు సంబంధించిన వాటిని, దైవిక పద్ధతులను మరచియున్నారు. మరికొందరు పరలోక సంగతులయందే పని కలిగి భూలోక సంగతులను మరచియున్నారు. సంఘము కొరకైన దైవపద్ధతి బయల పర్చబడవలెనన్నచో ఈ రెండును కలిసి జరుగవలెను. మొదటిగా మనము పరలోకపు కర్తవ్యమును (పనిని) చూచెదము.

ప్రకటన 4వ అధ్యాయమునందు అపొస్తలుడైన యోహానుకు ఒక పరలోక దర్శనమియ్యబడెను. పరలోకములో ఒక సింహాసనమును, దాని చుట్టును ఇరువది నాలుగు సింహాసనము లుండుటయు అతడు చూచెను. సింహాసనమును ఒక ఇంద్రధనస్సు ఆవరించి యుండుటయు, ఏడు దీపములు దాని యెదుట ప్రజ్వరిల్లుటయూ కూడ చూచెను. ఇక్కడ పరలోకమునందు మహిమ పరచబడిన సంఘము యోహానుకు బయలుపరచబడినది. ప్రకటన 3:21 యందు మన ప్రభువు యోహానుతో "నేను జయించి నా తండ్రితో కూడ ఆయన సింహాసనమునందు కూర్చుండియున్న ప్రకారము జయించువానిని నాతో కూడ నా సింహాసనమునందు కూర్చుండనిచ్చెదను" అని చెప్పెను. (ఈ ప్రతిష్ఠిత స్థలమునందు ప్రతి ఒక్కరు పాలు పొందునట్లుగా ఆహ్వానింప బడుచున్నారు).

మన ప్రభువు తన సంఘము కొరకైన ఈ వాగ్దానమును అపొస్తలుడైన యోహానుకు ఈ భూమిపైననే ఇచ్చియున్నాడు. తిరిగి 4వ అధ్యాయమునందు

పరలోకమునకు ఎత్తబడిన సింహాసనమును దానిపై నున్నవారిని చూచెను. అక్కడ ప్రతి చిన్న వివరమునకు గొప్ప ఆత్మీయ భావమున్నది. పరిశుద్ధ స్థలము, సింహాసనము అనగా ఏమిటో కొద్దిపాటియైనను తెలిసికొనుటకు ఒక వారము పట్టును.

మధ్యనున్న సింహాసనమును, దాని చుట్టునున్న ఇరువది నాలుగు సింహాసనములను చూతము. ఇరువది నలుగురు పెద్దలు బంగారు కిరీటములను ధరించినవారై ఆ సింహాసనములపై ఆసీనులై యుండిరి. ఏడు దీపములు ఆ సింహాసనము ఎదుట ప్రజ్వరిల్లుచుండెను. కెరూబులు దాని చుట్టు నిలువబడియుండిరి. వీటన్నింటికి పైగా ఇంద్రధనస్సుండెను. దేవుని గ్రంథమందు ఇంద్రధనస్సు దేవుని నిబంధనకు సూచనయై యున్నది. ఆదికాండమునందు జల ప్రళయమయిన తరువాత నోవహు ఒక ఇంద్రధనస్సు చూచెను. దాని ద్వారా దేవుడు నోవహుతో తానిక భయపడవలదనియు, జల ప్రళయముతో దేవుడిక భూ నివాసులను నాశనము చేయడనియు ఒక నిబంధనను చేసెను (ఆది కాం. 9:13). దేవుడు నోవహుతో చేసిన నిబంధనకు ఇంద్రధనస్సు గుర్తుగా నున్నది.

మీకు తెలిసినట్లు, ఇంద్రధనస్సునందు ఏడు రంగులు గలవు. అవేమనగా ఊదా, ఇండిగో, నీలి, ఆకుపచ్చ, పసుపు, నారింజ, ఎరుపు. దేవుడు మానవునితో ఏడు నిబంధనలను చేసెను. ఆయన మొదట నిబంధన ఆదాముతో చేసెను. ఆదాము తప్పిపోయి అవిధేయుడైనప్పటికిని రక్షకుడు స్త్రీ సంతానము నుండి వచ్చునని వాగ్దానము చేసెను (ఆది కం. 3:15). దేవుడు ఆదాముతో చేసిన ఆ నిబంధన వలననే యేసుప్రభువు ఈ లోకమునకు వచ్చెను. రెండవదిగా, దేవుడు నోవహుతో ఒక నిబంధన చేసెను. "సమస్త శరీరులను నాశనము చేయుటకు ఆలాగు ప్రవాహముగా నీళ్ళురావు" అని దేవుడు నోవహుతో

చెప్పెను (ఆది కాం. 9:15). ఇప్పుడు భూమి పాపముతో నిండి, అంతకంటె ఎక్కువ చెడుస్థితితో నున్నది. దేవుడు నోవహుతో నిబంధన చేసినందువలన దీర్ఘశాంతమును, ఓర్పును గలవాడై యున్నాడు. అట్లు కానిచో ఈ భూలోక మెప్పుడో నశించిపోయి యుండును.

దేవుడు అబ్రాహాముతో మూడవ నిబంధన చేయుచు 'భూలోకములోని జనములన్నియు నీ సంతానము వలన ఆశీర్వదింపబడు'నని చెప్పెను (ఆది కాం. 22:18). యేసుప్రభువు అబ్రాహాము సంతానము ద్వారా వచ్చి, అన్ని జనాంగములకును ఆశీర్వాదకారకుడాయెను. దేవుడు నాలుగవ నిబంధన మోషేతో చేసెను. 'నీవంటి ప్రవక్తను వారి కొరకు పుట్టించెదను,' అని చెప్పెను. అట్లే యేసు ప్రభువు వచ్చెను. దేవుని గృహమంతటిలో మోషే నమ్మకముగా నుండినట్లు, ఈయన కూడ తన్ను నియమించిన వానికి నమ్మకముగా నుండెను (హెబ్రీ. 3:1-2). దేవుడు ఐదవ నిబంధనను దావీదుతో చేసెను. ఆయన సింహాసనమును గురించి ఆయనపై, ఆయన సంతానముపై తన నిత్యనిబంధనను స్థిరపరుతునని చెప్పెను (కీర్తన 89:3, 4; 28-29; 33-35). ఇది తిరిగి యేసుక్రీస్తు ప్రభువునే సూచించుచున్నది. ఆరవదిగా దేవుని కుమారునితో చేయబడెను. నన్నడుగుము, జనములను నీకు స్వాస్థ్యముగా ఇచ్చెదను" (కీర్తన 2:7-8). ఏడవదిగా ఆయన ప్రతి విశ్వాసితో ఒక 'మేలైన నిబంధన' చేసియున్నాడు. 'నా ధర్మవిధులను వారి మనస్సులో నుంచి వారి హృదయముల మీద వాటిని వ్రాయుదును ........ వారి పాపములను ఇక ఎన్నడును జ్ఞాపకము చేసికొనను' (హెబ్రీ. 8:6, 10, 12, 13). ఈ ఏడు నిబంధనలను బట్టియే, ఆయన సింహాసనము నందు మనకు పాలిభాగము లభించుచున్నది. దేవుడు చేసిన నిబంధన, వాగ్దానములను బట్టి మనమంత ఉన్నతమైన స్థితికి ఎత్తబడుదుము. "ఓ అవివేకి! నీవు అంతటివాడ వెట్లుకాగలవు? దేవుడు నీకింతటి పదవి ఎట్లియ్యగలడు?" అని సాతాను వచ్చి నీతో చెప్పవచ్చును.

అయితే ఇంద్రధనుస్సు జవాబును ఇవ్వగలదు. ప్రేమగల నిబంధనను చేసి నెరవేర్చునట్టి దేవుని వలన మన మచ్చట నుందుము.

తరువాత యోహాను సింహాసనము ఎదుట ప్రజ్వరిల్లుచున్న ఏడు దీపములను చూచెను. ఇవి దేవుని ఏడు ఆత్మలు. ఇవి పరిశుద్ధాత్మ చేయు పరిపూర్ణమైన పనిని గూర్చి తెల్పుచున్నవి. రోమా పత్రిక 8వ అధ్యాయమునందు పరిశుద్ధాత్మ చేయు ఏడంతల పనిని గూర్చి చదువుచున్నాము. ఆయన విశ్వాసియందు నివసించును (9వ వచనము). ఆయన జీవింప చేయును (వ. 11). ఆయన నడిపించును (వ. 14). దేవుని తండ్రీ అని పిలుచునట్లు ఆయన మనకు స్వీకృత పుత్రాత్మగా నుండును (వ. 15). మనము దేవుని పిల్లలమని మన హృదయములో సాక్ష్యమిచ్చును (వ. 16, 17). దేవుని చిత్త ప్రకారము మనకొరకాయన విజ్ఞాపన చేయును (వ. 27). మనలను ప్రేమించినవాని ద్వారా మనము అత్యధిక విజయము గలవారమగుటకు, ప్రతి బలహీనతను జయించుటకు ఆయన మన దౌర్బల్యములను చూచి సహాయము చేయుచున్నాడు (వ. 26, 37). పరిశుద్ధాత్మ చేయు యీ సంపూర్ణమైన పని వలననే మనము పరలోకములో నుందుము. ఏ మానవ ప్రయత్నము వలన గాక, ఆ ఏడు దీపముల కార్యము వలననే, అనగా పరిశుద్ధాత్మ ఆయన సంపూర్ణత ననుసరించి మనయందు నివసించుట చేతనే యీ కార్యము జరుగుచున్నది. మనయందు నివసించు ఆత్మ శరీర సంబంధమైన ప్రతి బంధకమునుండి మనలను విడిపించును (వ. 9). జీవింపజేయు ఆత్మమర్త్యతను, క్షయతను జయించును (వ. 11). నడిపించు ఆత్మ మనలను దినదినము నడిపించును (వ. 14). స్వీకృత పుత్రాత్మ మనలోనుండి ప్రతి భయమును తొలగించి దేవుని తెలిసికొనుటకు లోతైన ప్రేమ ననుగ్రహించును (వ. 15). మనము దేవుని పిల్లలము, వారసులము గనుక మనకొరకై దేవునికి గల నిర్ణయ పద్ధతులను తెలిసికొనుటకు సాక్ష్యపు ఆత్మ సహాయము చేయును (వ.

16,17). విజ్ఞాపనా ఆత్మ దేవుని చిత్తము ప్రకారము మనము ప్రార్థించుటకు నేర్పును (వ. 27). చివరగా ఆదరణకర్త మనము యేసు ప్రభువుతో గూడ పరలోక సింహాసనమునందు కూర్చుండు పర్యంతము జయమునుండి జయమునకు నడిపించును (వ. 26, 37). సింహాసనము వెనుక ఏడు రంగులుగల ఇంద్రధనస్సును యోహాను చూచెను. సింహాసనము ఎదుట ఏడు మండుచున్న దీపములను చూచెను. మనకు వెనుక భాగమున దేవుని నిబంధన ఉన్నది, మనలో పరిశుద్ధాత్ముడు యున్నాడు. యీ విధముగా దేవుడు సంఘమునకు సంపూర్ణమైన ఏర్పాటును చేసియున్నాడు.

మరియు యోహాను ఇరువది నలుగురు పెద్దలను, ఇరువది నాలుగు సింహాసనములను చూచెను. వీరు పాత నిబంధన యందలి పండ్రెండుగురు పరిశుద్ధులను, కొత్త నిబంధనలోని పండ్రెండుగురు పరిశుద్ధులను తెలుపుచున్నారు. పాత నిబంధన క్రొత్త నిబంధనలోనివారు కలిసి సంపూర్ణులు కావలసియున్నది. హెబ్రీ. 11వ అధ్యాయమునందు పాత నిబంధన యందలి పరిశుద్ధుల జాబితా ఇవ్వబడియున్నది. మరియు క్రీస్తునందు విశ్వాసముంచిన మనము లేనిదే వారు సంపూర్ణులు కారని తెలియజేయబడుచున్నది (40వ వచనము). ఇక్కడ 24 సింహాసనములు ఉన్నవి. ఒకవైపు పండ్రెండు సింహాసనములు, మధ్యన ప్రభువు యొక్క సింహాసనము, మరియొక వైపున పండ్రెండు సింహాసనములు, యీ ఇరువది నాలుగు సింహాసనములపై ఇరువది నలుగురు పెద్దలు బంగారు కిరీటములు ధరించియుండిరి. అపజయము పొందినవారు కిరీటము ధరించలేరు. కాని సహించువారును, విజయులును, జయించువారు మాత్రమే వాటిని ధరింతురు (యాకోబు 1:12; 1 కొరింథీ 9:25). క్రైస్తవ జీవితము పందెపు రంగమున పరిగెత్తువానిని పోలియున్నది. పందెపు రంగమున పరుగెత్తువారు పాలు, చక్కెర, మీగడ మొదలగునవి తినుటలో జాగ్రత్తగా నుండవలయును. ఏలననగా, వారు

ఎక్కువ బలిసిన యెడల త్వరగా అలసిపోయి పరుగెత్తలేరు. వారు జయించ వలెనని కోరిక గలిగి తీర్మానించుకొనిన యెడల ప్రతిదినము శర్ీతును నవీనతను పొందవలయును. అప్పుడే వారు కిరీటములను పొందుదురు. అలాగే మనము అంత్యమున కిరీటము పొందుటకు మెళుకువగా, జాగ్రత్తతో, నమ్మకమైన జీవితము జీవించవలెను.

1 థెస్సలొనీకయులకు 2:19 నందు మనము ప్రభువు కొరకు సంపాదించు ఆత్మలు మనకతిశయ కిరీట మనియు, 2 తిమోతి 4:8లో మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క ప్రత్యక్షత నపేక్షించువారికి అనగా ఆయన రెండవ రాకడ కొరకు ఎదురుచూచువారికి నీతి కిరీటముంచబడి యున్నదనియు వ్రాయబడియున్నది. యోహాను 19:12లో రాణువవారు ముండ్ల కిరీటమును మన ప్రభువు శిరస్సుపై నుంచినట్లు చదువుదుము. ఆయన అది ధరించినందున మనకు అట్టి ముండ్ల కిరీటము లేదు. గనుక మన మాయన చెప్పినట్లు చేయుటకే మాత్రము సిగ్గుపడక ప్రభువైన యేసుక్రీస్తు కొరకు అవమానమును భరించుటకు సిద్ధముగా నుండవలెను. ప్రకటన గ్రంథమందు సమస్తము సువర్ణ కిరీమునందు ఇమడ్చబడియున్నది. దేవుని పరిశుద్ధ స్థలమునందు నిర్వర్తించబడిన పరిపూర్ణమైన క్రమమును పరలోకమందు కూర్చొనియున్న ఇరువది నలుగురు పెద్దలు సూచించుచున్నారు. ఎవరైతే దేవుని క్రమమును, పద్ధతిని అనుసరించెదరో వారు ఒక దినమున ఆయన సింహాసనముపై ఆయనతో పాటు కూర్చుందురు.

పరిశుద్ధ స్థలము తెరచేత రెండు భాగములుగా విభాగింపబడి లోపలి భాగము మనము నిర్వర్తించవలసిన పరలోకపు పనిని, వెలుపలి భాగము నేను భూలోక పనిని తెలియజేయుచున్నదని ఇంతకుముందే చూచితిమి. మన భూలోక పని విషయమై మరొకమాట చెప్పవలసి యున్నది.

ప్రతి పలక యొక్క పొడవు పది మూరలని చూచితిమి. బైబిలు నందు పదియను సంఖ్య సంపూర్ణత లేక పరిపక్వమును తెలుపును. పరీక్షల ద్వారా, పరిశోధనల ద్వారా మనము పొందు బాధ్యతను ఆత్మీయ పరిపక్వమును తెలుపును. పది దినముల శ్రమ కాలములో ఎవరు విజయులుగా వెలుపలికి వత్తురో వారు జీవకిరీటమును పొందుదురు (ప్రకటన 2:10). నీవు వెనుకకు తిరుగక ఎట్టి శ్రమలు, కష్టములోనైన ముందుకు సాగుటకు సిద్ధపడిన యెడల కిరీటము పొందుటకు సిద్ధపడియున్నావు. ఆత్మీయ పరిపక్వము మనకున్న మానసిన జ్ఞానము వలన లభించదు. నీకు సరియైన జ్ఞానమే యుండవచ్చును గాని అనేక కష్టములు, బాధలు, పరీక్షలు పొందిన తరువాతనే నీవు ఆత్మీయముగా ఎదుగుదలగల వాడవగుదువు. ఈ భూమిపై నీ జీవితము ఒక తర్ఫీదు స్థలముగా నీకుండును. ఆదికాండములో యాకోబు ఏ విధముగా పది సంవత్సరములు తన మామ ఇంటియందు శ్రమలు పొందెనో చూచుచున్నాము. మామ ఆయనను మోసపుచ్చ చూచెను గాని యాకోబు దానిలో విజయుడాయెను. గనుక పదియను సంఖ్య పరీక్షలు, శ్రమల తరువాత పొందు ఎదుగుదలను సంపూర్ణతను తెలుపుచున్నది.

యోబు ఐదు భయంకరమైన దెబ్బల ద్వారా తనకు కలిగినదంతయు, అనగా బిడ్డలను, ఆస్తిని చివరకు తన ఆరోగ్యమును సహితము కోల్పోయెను. పది చేదైన మాటలతో ఆయన గద్దింపబడెను. తొమ్మిది పర్యాయములు తన స్నేహితుల ద్వారా గద్దింపబడెను. పదవ పర్యాయము దేవుని ద్వారానే గద్దింపబడెను. దానంతటి వలన ఆయన ఆత్మీయమైన ఒక అంతస్థు చేరెను. దేవుడు ఆయనను మనుపటికంటె రెండతలుగా ఆశీర్వదించెను. మరల పదియను సంఖ్య బాధ్యతకును, సంపూర్ణతకును, భూలోకములో ఇవ్వబడిన పరీక్షా కాలమును సూచించుచున్నది.

జయ జీవితమును గురించి నేను మీకు బోధించవచ్చును. దీనికి సంబంధించిన ప్రతి వచనమును కూడ మీకు ఇవ్వవచ్చును. గాని నేను దేవుని యెదుట కొన్ని విషయములలో తప్పిపోవచ్చును. అది డబ్బు విషయము గాని, లేక మరిదేని విషయమైన కావచ్చును. అప్పుడు దేవుడు నన్ను పైకి లాగవలసి యుండును. సిద్ధాంతము మనలను యోగ్యులుగా చేయదు గాని దేవుడు మనయెదుట ఉంచిన పరీక్షల యందు విజయము పొందుటలో మనకు కలిగిన అనుభవమే మనలను యోగ్యులుగా చేయును. మనలను పరీక్షించు నిమిత్తమై మన జీవితములో పలురకములైన శ్రమలను, పరీక్షలను ప్రభువు రానిచ్చును. కొందరు ఓడిపోవుదురు; మరికొందరు జయము నొందుదురు. సంఖ్యాకాండము 14, 22, 23 అధ్యాయములలో ప్రజలు పది తరుణములు పొందినను ఓడిపోయిరని చూచుచున్నాము. గనుక సంపూర్ణత లోనికి వచ్చి, దేవుని ఇంటిలో బాధ్యతను పొందుటకు ప్రతి యొక్కరును ఇదే విధముగా పరీక్షింపబడి, పరిశోధింపబడుదురు. మనుష్యులు అధికారము, పలుకుబడి గలవారు కావచ్చును గాని, ఆత్మీయ కార్యములందవి పనికిరావు. భూలోక సంబంధమైన ఏ సిఫారసును పరలోకములో అక్కరకు రాదు. భూలోకములో ఇక్కడ నీకు స్వయముగా లభించు ఆత్మీయమైన విజయమే అక్కడ పరలోక విషయములో బాధ్యతగల వాడవగుటకు సమర్థత కలుగజేయును. ఇప్పుడు పది మూరల పొడవు, ఒకటిన్నర మూర వెడల్పు గల పలకలు నిలువబడుటకు ఆధారముగా ఒక్కొక్క దాని క్రింద రెండేసి వెండి దిమ్మలుండవలెను. దేవుడు యీ దిమ్మలకు బంగారును వినియోగించి యుండవచ్చును గాని వెండినే ఉపయోగించెను. ఎందువలన? బైబిలునందు వెండి విమోచనకు గుర్తు. మన ప్రభువైన యేసుక్రీస్తు మనలను తన కొరకు విమోచించుటకై చెల్లించిన విమోచన క్రయ ధనమునకు ఇది గుర్తు. ప్రజలు ప్రాణ పరిక్రయ ధనము నిచ్చినపుడు ధనవంతులెక్కువ, దరిద్రులు తక్కువ ఇవ్వకూడదు (నిర్గమ.

30:15). మనమందరము దేవునికి సమానముగా ప్రశస్తమైనవారము గనుక ఎవరును నేను నా పొరుగు వానికంటె ఎక్కువ అని చెప్పుటకు వీలులేదు. ఆయన అందరికి ఒకే విలువ చెల్లించెను. గనుక ఆయన సింహాసనమున అందరికిని ఒకే విధమైన హక్కును, ప్రవేశమును గలదు.

బైబిలునందు రెండు అను సంఖ్య ఐక్యతకును, సహనమునకును గుర్తు (మత్తయి 18:19). ప్రతి పలకయు రెండు దిమ్మల మీద నిలువవలయును. లేనిచో అది స్థిరముగా నిలువదు. పలకలు గట్టిగా, చక్కగా, బలముగా అమర్చబడుటకు దిమ్మలు వీలుగా అమర్చబడి యున్నవి. ఆత్మీయ జీవితమునందు స్థిరముగా నిలుచుటకు గల మర్మమేదనగా, నీ సహవాసులు నీతో కూడ ఒకే పునాదిపై ఉన్నారను గ్రహింపే క్రీస్తునందు ఏకత్వములో నీ యొక్క దృఢత్వము. ఇతరులతో కలసియుండుట, అందరును ఏకమనస్సుతో ప్రార్థించుట, ఏకమనస్సుతో ఆరాధించుట, – ఇవన్నియు పరిశుద్ధ స్థలములో నీకున్న పాలి భాగమునకు సాక్ష్యమైయున్నవి. అంతరంగ ద్వేషము, అసూయ, మత్సరములు, కలహములను పుట్టించును. రెండు దిమ్మలకున్న రెండు కర్రలు (కుసులు) మనము సమాన విలువచే కొనబడితిమి గనుక మన మందరము ప్రభువునకు సమానముగా ప్రశస్తమైన వారమని తెలుపుచున్నవి.

# 17

# అడ్డకర్రలు

గుడారపు పలకలను కలుపుటకు నాలుగు అడ్డకర్రలను పలకలపై తగిలించబడియున్న బంగారపు ఉంగరములలో దూర్చి అమర్చవలెను. యీ అడ్డకర్రలు బంగారముతో పొదిగింపబడియుండును. యీ నాలుగు కర్రలను వెలుపల నుండి చూడగలము. ఐదవ కర్ర యీ ప్రక్కనుండి అ ప్రక్కకు పలకల నడుమగుండా చేయబడిన సారంగములో యీ కొననుండి ఆ కొనవరకు దూర్చబడి పలకలన్నిటిని కలుపుచు నుండవలెను (నిర్గమ. 26:26-29). యీ పలకలన్నియు కలిసి ప్రపంచమంధున్న సార్వత్రిక సంఘమును సూచించు చున్నవి. యీ ఐదు అడ్డకర్రలు విశ్వాసులను ఏకముగా చేయు ఐదు ఆత్మీయ బంధములను సూచించుచున్నవి. దేవుని సంఘమందు నిజమైన ఆత్మీయ ఐక్యమత్య ముండవలెనన్న ఐదు విషయములు అవసరము. గుడారపు పలకలను ఏకము చేయుచు వెలుపలికి కనబడు నాలుగు తుమ్మకర్రలును, కనబడక ఒక కర్ర మధ్య నున్నట్లుగా - ఆత్మీయముగా మనలను ఐక్య పరచుటకు నాలుగు వెలుపలికి కనబడు బంధములును, కనబడని ఒక బంధమును ఉండవలెను. మధ్యనుండు అగోచర బంధము ప్రపంచమున ఉండు విశ్వాసులందరికి కలుపు యేసు ప్రభువు యొక్క జీవమే.

కొందరు మనుష్యులు చేయు పద్ధతుల ద్వారా క్రైస్తవులను ఐక్య పరచుటకు ప్రయత్నింతురు. ఏ సంఘ పద్ధతులైనను, మాన కల్పితములగు

ఏ చట్టములైనను, చెపరకు దక్షిణ ఇండియా సభ చట్టములైనను నిజముగా దేవుని సంఘమును ఐక్యపరచజాలవు. అంతరంగమున విశ్వాసి హృదయములో ప్రవహించు యేసు ప్రభువు యొక్క సమృద్ధియైన జీవమే ఐక్యపరచును గాని మరి ఇతరమైనవేవియు అట్లు చేయజాలవు. యేసు ప్రభువు యొక్క జీవము నీ యందును, నా యందును ప్రవహించిన యెడల మనమిద్దరము ఏకముగా నుందుము. మనము ఆత్మయందు నివసించని యెడల మనలో అసమ్మతము అనగా భేదాభిప్రాయములు కలుగును. మాన కల్పితములైన శాసనములు, పద్ధతుల ద్వారా యేసు ప్రభువు యొక్క సంఘము ఐక్యపరచబడనేరదు. ఇట్టి శాసనములు అధికారమును, శక్తిని ప్రయోగించుటకే చేయబడినవి. బ్రాహ్మణేతరులపై బ్రాహ్మణులు ఏ విధముగా అధికారము చలాయించుదురో, ఇది కూడ అట్లే యుండును. తమ సహ క్రైస్తవులపై తమకు అధికారము కావలెనని కోరు క్రైస్తవులను "బ్రాహ్మణ క్రైస్తవుల"ని పిలువవచ్చును. మనుష్యలను బంధించుటకును, ఆటంక పరచుటకు, కొన్ని చట్టములను నిర్మించి, "నీవు మా శాసనమునకు విరోధముగా ఇది, అది చేసిన ఎడల నిన్ను సంఘమునుండి వెలివేతుము; నీవు ఆ విషయములను, ఈ విషయములోను, దేవుని వాక్యమును విని, దానికి లోబడిన యెడల సంఘము యొక్క సహవాసము నీకు లభించదు" అని చెప్పుదురు. ఇట్టి బంధకములు విడగొట్టబడవలెను. కాని అంతరంగపు సంబంధమైన యేసుక్రీస్తు జీవమనెడి బంధము ఏనాటికిని తెగదు. ఏలయనగా దాని వలననే ప్రపంచ మందలి ప్రతి విశ్వాసితో మనము బంధించబడి యున్నాము.

భూలోక బంధములు బలహీనమైనవి. అవి ఏ మాత్రపు బరువునకైనను తాళలేవు. అయితే ఆత్మీయ బంధములు తెంచుట అసాధ్యము. అపొస్తలుల దినములలో కార్యమెట్లు అరంభమాయెనో చూడుము. అపొ. కార్య. 2వ అధ్యాయమునందు మూడువేల మంది బాప్తిస్మము పొంది వెంటనే స్థిరముగా

అభివృద్ధి చెందుట కారంభించిరి. వారిలో నెక్కువమంది నిరుపేదలుగా నుండిరి గాన యూదుల నుండియే గాక గ్రీకుల ద్వారా, రోమీయుల ద్వారా కూడ హింసలు పొందిరి. యూదులు మత గర్వము గలవారు. గ్రీకులు వారి యొక్క విద్యా నాగరికతను బట్టి గర్వించు వారు, రోమీయులు వారి సామ్రాజ్యమును బట్టి గర్వించువారు. ఈ మూడు రకములైన అధికారములు ఆది విశ్వాసులను ఎదిరించెను. యీ విశ్వాసులకు ధనముగాని, పలుకుబడి గాని లేదు. అయినప్పటికిని దేవుని వాక్యము వారి యందు ఫలించి, విస్తరించి, అగ్నివలె రగులుకొనెను. సమరయ, యూద, అన్య జనాంగములలో నుండి యీ మార్పుచెందిన క్రైస్తవులు వచ్చియుండినను వారియందు ఆశ్చర్యకరమైన ప్రేమయుండెను. వారు ఏ మానవుల పద్ధతులచేత గాని, చట్టముచేత గాని బంధింపబడి యుండలేదు. వారు యెరూషలేము మిషన్, అంతియొకయ మిషన్ లేక మరే ఇతరమైన మిషనును స్థాపింపలేదు గాని, వారి మధ్య నిజమైన ఆత్మీయ ఐక్యత యుండెను. వారిని బంధించిన బంధములేవి? యేసుప్రభువు యొక్క జీవమనునది మొదట సత్యమైన అంతరంగిక బంధము. అదియే వారిని క్రైస్తవులనుగా చేసెను. ఇదికాక, మరి నాలుగు బాహ్య బంధములు కూడ కలవు. అవి అపొ. కార్య. 2:42లో చెప్పబడియున్నవి. వీరు "అపొస్తలుల బోధయందును, సహవాసమందును, రొట్టె విరుచుట యందును, ప్రార్థన చేయుటయందును ఎడతెగక యుండిరి." వారీ విధముగా దైవ కృపయందు ఆత్మాభివృద్ధి నొందిరి. ఇప్పుడు ఆ బంధములు క్రైస్తవులుగా మనల నెట్లు బంధించునో ఒకటి తరువాత నొకటి చూచెదము.

మొదటిది అపొస్తలుల బోధ (గలతీ. 1:10-12; 1కొరింథీ. 2:3-5 చూడుము). వారు మనుష్య జ్ఞానము ననుసరించి బోధించలేదు, ప్రకటించలేదు. మనుష్యులను సంతోషపెట్ట వెళ్ళలేదు. మనుష్యులు ఇష్టపడినను, ఇష్టపడకపోయినను, దేవునియొక్క వర్తమానము జ్ఞానముతోను, శక్తితోను

ఇచ్చుటయే వారి విధియై యుండెను. అదియే అపొస్తలుల బోధ-జీవము గల దేవుని పవిత్రమైన వాక్యము, సత్యుడగు బలుడైన దేవుని యొక్క వర్తమానమే ప్రకటించబడెను. నేడెంతోమంది మనుష్య జ్ఞానమును బోధించుచు బైబిలులోని అర్ధమును గూడ మార్చుటకు ప్రయత్నించుచున్నారు. కొన్ని బైబిలు పాఠశాలలు మరియు సెమెనరీ లున్నవి; అందు బైబిలు విద్య నభ్యసించు వారి యొక్క విశ్వాసమును ఆ బోధ బలహీన పరచుచున్నది. గాన వాటియందు విద్య నభ్యసించిన వారు అటు తరువాత దేవుని సేవించుటకు బదులు మనుష్యులను తృప్తి పరచుటకును, సేవించుటకును పూనుకొందురు.

ఒకప్పుడొక మిషనెరీయు, సెమెనరిలో తర్ఫీదు పొందిన భారతీయ బోధకుడును బజారులో సువార్త ప్రకటించుటకు వెళ్ళిరి. కొంతసేపైన తరువాత మిషనరీ "అయ్యా! ఇంక కొంచెము గట్టిగా చెప్పుము." అని గద్దించెను. అందుకా బోధకుడు "అయ్యా, ఇది 25 రూపాయల స్వరము. నీవు 100 రూపాయలు ఇచ్చిన యెడల ఇప్పుడు అరచిన దానికంటె నాలుగంతలు గట్టిగా అరచి చెప్పెదను." అని జవాబు ఇచ్చెను. గనుక మనకు 25, 75, 125, 300 రూపాయలు చేయు స్వరములు గలవు. అట్టివారు డబ్బు, డబ్బు, డబ్బునే సేవించుచున్నారు గాని దేవుని సేవించుట లేదు. వారు దేవుని వర్తమానము నివ్వలేరు. వారి పెదవులు, నాలుకలు బిషప్పునో, అధ్యక్షుడినో, మిషనరినో మరెవరినో సంతోష పెట్టుటకు ఉన్నవిగాని దేవుని వర్తమానము నిచ్చుటకు బంధించబడి యున్నవి. వారు తమ మనస్సాక్షిని చంపుకొని, మనుష్యులను సంతోష పెట్టుదురు. అందువలననే యీ దినముల యందు దేవుని వాక్యము బహుకొద్దిగా వినుచున్నాము. దేవుని వాక్యమునకు బదులుగా మానవాభిప్రాయములను ప్రకటించిన యెడల ఆత్మలు ఆత్మీయ బంధకములలో నుండును.

ఉత్తర ఇండియా నందొక స్థలమున ఒక బైబిలు పాఠశాల కలదు. దాని యందలి యౌవన విద్యార్థులు పరీక్షింపబడుటకు గాను ఒక ప్రసంగము చేయవలెను. ఒక యౌవనస్థుడు చాల మంచి ప్రసంగము చేసెను. గనుక ఆ పాఠశాల యొక్క ప్రిన్సిపాలు "ఈ ప్రసంగమును సిద్ధ పరచుటకెన్ని పుస్తకములను చదివితివి" అని అతని నడిగెను.. అందుకా యౌవనస్థుడు "అయ్యా, పుస్తకములు చదువుటలోనే కాలమంతయు గడచిపోయెను. గనుక బైబిలు చదువుటకు సమయముండలేదు" అని ప్రత్యుత్తరమిచ్చెను.

అనేక ప్రసంగికులిట్లు ప్రసంగములను సిద్ధపరచుకొందురు. అట్టి ప్రసంగికుడు ప్రసంగమును సిద్ధపరచుకొనుటకు తన గదికి పోయి ఈజీ చేయిర్‌పై కూర్చుండి, ఒకచేత సిగరెట్టు పట్టుకొని, బల్లపై తన ఎదుట 'టీ' పెట్టుకొని, కాళ్లు ఒకదానిపై నొకటి వేసికొని, పుస్తకములను తెరచి, చదివి వ్రాసికొనును. సోమవారము మొదలుబెట్టి, శుక్రవారము వరకు ప్రసంగమును వ్రాయుచునే యుండును. ఆదివారము ఉదయము ఇరువదియైదు నిమిషములు ప్రసంగించి, ఆ ప్రసంగము దేవుని వర్తమానమని చెప్పును. ఎంత గ్రుడ్డితనము! ఎంత అంధకారము! అవి మనుష్య మనుస్సునుండి వచ్చినవేగాని, దేవుని మనస్సునుండి వచ్చినవి కావు.

అయితే అపొస్తలులు దేవుని వర్తమానము కొరకు [illegible] పై ప్రసనవేదన పడి, సంపూర్ణ గ్రంథములోని దేవుని ఆలోచనలను దైవోక్తి వలె చెప్పిరి. వారు తమ కిష్టమైన కొన్ని భాగములను మాత్రము తీసికొని బోధించక, బైబిలు నంతటిని బోధించిరి. ఇదే అపొస్తలుల బోధ, ఇట్టిబోధ, ప్రసంగములే క్రైస్తవులలో నిజమైన ఐక్యతను తీసికొని రాగలవు.

రెండవది సహవాసము. మొదట మనము ఆయన కుమారుడైన యేసుక్రీస్తుతో సహవాసము కలిగియుండవలెను (1 కొరింథీ 1:9) అటు

తరువాత తండ్రియైన దేవునితో సహవాసము కలిగియుండవలెను (యోహాను 1:3). చివరిగా మన మధ్యను మరియు దేవుని వెలుగులో నడుచుచుండు వారందరితోను సహవాసము కలిగియుండవలెను (1 యోహాను 1:7). అదియే సహవాసము. ఇది తండ్రి నుండియు కుమారుని నుండియు ప్రారంభమగును. మనము తండ్రి నుండియు కుమారుని నుండియు ఏమి పొందితిమో దానిని మన మధ్య కలిసి పంచుకొందుము. ప్రాతఃకాలమున మనము మోకాళ్ళపై దేవునితో మాట్లాడుదుము. మధ్యాహ్నము దేవునితో మాట్లాడుదుము. మనము పండుకొనుటకు వెళ్ళేముందు దేవునితో మాట్లాడుదుము. మరియు ఆయన మనతో మాట్లాడును; తరువాత మన సహ విశ్వాసులను బజారులోగాని, యింటియందుగాని కలిసికొనినప్పుడు మనము పొందిన దానిని వారితో పంచుకొనెదము. అదే నిజమైన సహవాసము.

వ్యర్థమైన మాటలు మాట్లాడుటకును, కాఫీ, టీ త్రాగుటకును కూడుట ప్రోత్సాహమునకు గాని, క్షేమాభివృద్ధికిగాని తోడ్పడదు. అది సహవాసమని పిలువబడదు. అయితే దైవ విషయములు క్షేమాభివృద్ధిని, విద్యాభ్యాసమును, అభివృద్ధిని కలుగజేయును. హృదయము మారనివారు వ్యర్థమైన సంభాషణలను చేయుచు కాలమును వృధా పుచ్చుదురు. స్త్రీలు కలిసినప్పుడు "ఈ చీర మీరెక్కడ కొంటిరి, ఆ సొగసైన జాకెట్ ఎక్కడ కొంటిరి? ఆ కంఠహారము ఎంతకు కొంటిరి?" మొదలగు ప్రశ్నలను వేసుకొనుచుందురు. అది సహవాసము కాదు, వ్యర్థ సంభాషణలే. దేవుని గురించి మాట్లాడుటయే సహవాసము. దేవుడు ఎట్లు ప్రార్థనలను విని, జవాబు లిచ్చునో, ఎట్లు మానవులను మార్చగలడో ఇతరులకు తెలుపుము. అట్లు ఆది విశ్వాసులు ఎప్పుడు కలిసికొనినను వారి ఆత్మీయ అనుభవములను ఒకరితో నొకరు పంచుకొనుట ద్వారా ఒకరినొకరు ఆదరించగలిగిరి. దేవుడు వారి మధ్య ఎట్లు పనిచేయుచున్నాడో చూచినపుడు వారి దుఃఖములను, శ్రమలను మరచిపోయిరి. ఇదే ఆదరణ

పొందునట్టి దైవ పద్ధతి.

మనమందరము కొన్ని సమయములందు కృంగి నిరుత్సాహ పడుదుము. గనుక అట్టి సమయములందు మనలను బలపరుచుటకు, ఆదరించుటకు, సంతోషపెట్టుటకు దేవుడు మనకు సహ విశ్వాసుల నిచ్చియున్నాడు. అట్టి సహవాసమును యీ దినములలో చూడగలమా? అనేక నామకార్థ క్రైస్తవులు కూటములకు వచ్చినది మొదలు గడియారమును చూచుచుందురు. కూటము ముగిసిన వెంటనే పురుషులు సిగరెట్లు కాల్చుటకును, స్త్రీలు పట్టణములలో, పల్లెలలో జరుగు విషయాలను గురించి మాట్లాడుటకును ప్రారంభింతురు. అది సహవాసమని పిలువబడదు. అవి అనవసరమైన సంభాషణలే. ప్రజలు ఒకే వీధియందో లేక ఒకే ఆవరణమునందో నివసించు చుండవచ్చును గాని యేసు ప్రభువుతోను ఆయన యందుండు ఇతరులతో నున్న నిజమైన సహవాసమనగానేమో తెలియక పోయిన యెడల నిజమైన సంతోష సమాధానములు వారికుండవు.

ప్రేమా సహవాసములయందు శక్తి, బలములున్నవి. ఒక్క శరీరముగా మనము కలసి వచ్చుట ద్వారా మన పేదరికమును, దుఃఖములను మరచిపోవుదుము. ఒకరి భారము నొకరము భరించుట ద్వారా క్రీస్తు నియమమును నెరవేర్చుచున్నాము. మనము కలిసి ఆయన నామమున ప్రార్థించుట ద్వారా సాతానును బంధించుచున్నాము. (మత్తయి 19:18, 19).

మూడవది రొట్టె విరుచుట. విశ్వాసులు ఆదివారమాదివారము కలిసి కూడినప్పుడు ఆయన వచ్చు పర్యంతము ఆయన మరణమును జ్ఞాపకము చేసికొనుచున్నారు (1 కొరింథీ. 11:23-34 చూడుము). ప్రభువు బల్లలో పాలు పుచ్చుకొనక ముందు తమ్మును తాము పరీక్షించుకొన వలయునని చెప్పబడిరి. తమ హృదయము దేవుని యెడల సమ్మతముగా లేని యెడల వారు దానిలో

పాలు పుచ్చుకొనకూడదు. వారు తమలో తాము సమాధానముగా ఉండిన పక్షముననే రొట్టె విరచుటలో పాలు తీసికొనవలెను. వారు తిరిగి జన్మించి "ప్రభువా, నా హృదయము నీ యందు స్థిరమాయెను. నీ కొరకు ఎదురు చూచుచున్నాను" అని చెప్పగలిగితేనే గాని, ప్రభువైన యేసుక్రీస్తును ముఖాముఖిగా ఎదుర్కొనుటకు సిద్ధపరచబడి యుంటేనేగాని ప్రభువు బల్లలో పాలు పుచ్చుకొనలేరు.

లేఖనముల యందు యీ రొట్టె విరచుటలో ఒక లోతైన సూచన యున్నట్లు చూడగలము. లూకా 24:13-32లో ప్రభువు, ఇద్దరు శిష్యులతో ఎమ్మాయి అను గ్రామమునకు నడచి వెళ్ళుచు మోషేతో ప్రారంభించి ఇతర ప్రవక్తలను గురించి చెప్పుచు లేఖనములను విప్పి వివరించుచున్నట్లు చదువుచున్నాము. ఆ యిద్దరు శిష్యులు పునరుత్థాన దినమున జరిగిన సంగతులను గూర్చి యేమియు తోచనివారై దుఃఖముతో ఆ దారిని నడచి వెళ్ళుచుండిరి. ప్రభువు వారి వెంట నడచుచు వచ్చుచుండినను వారు ఆయనను గుర్తు పట్టలేకపోయిరి. ఆయన తనను గూర్చి మోషే మొదలుకొని, ఇతర ప్రవక్తలు ఏమి చెప్పిరో వారికి వివరించినను వారాయనను సంపూర్ణముగా గుర్తింపలేకపోయిరి. వారు చేరవలసిన గ్రామమునకు వచ్చు సరికి వారి హృదయములు వారిలో మండుచుండెను. ప్రభువైన యేసు వెళ్ళబోవు సమయమున వారు : "సాయంకాలము కావచ్చినది, మాతో కూడ యీ రాత్రివుండు మని" ఆయనతో అనగా, ఆయన వారితో కూడ భోజనమునకు కూర్చుండెను. ఆయన కృతజ్ఞతా స్తుతులు చెల్లించి, రొట్టె విరిచినపుడు వారి నేత్రములు తెరువబడి వారు ప్రభువును గుర్తించిరి. అంతట ఆయన వారికి అదృశ్యుడాయెను.

రొట్టె విరుచుట యందు గల ఒక ప్రాముఖ్యత ఇదియే. దీని ద్వారా

ప్రభువైన యేసుక్రీస్తును గురించిన సమీప ప్రత్యక్షత మనకు కలుగవలెను. మనము అనుదినము ఆయనను గురించి చదువవచ్చును, ఆయనకు ప్రార్థించవచ్చును గాని ఆయనను తెలిసికొన వలసిన రీతిగా తెలిసికొనలేక పోవుచున్నాము. ఆయన ఎంత గొప్పవాడు, ఎంత ఆశ్చర్యకరమైనవాడు, మనమెంత ఎన్నిక లేని బలహీనులము! రొట్టె విరచుట ద్వారా మనము ప్రభువును సమీపించి, ఆయనను చూడవలసిన విధముగా చూడవలయుననియు, తద్వారా దేవుని యొక్క హృదయములో ప్రవేశించుచు, ఆయన ప్రేమ యొక్క పొడవు, వెడల్పు, లోతు, ఎత్తు తెలిసికొనవలెననియు ఆయన యొక్క దైవ ఏర్పాటుగా నున్నది.

ప్రభువు బల్లయందొక ఆచారముగా పాలు పుచ్చుకొనుట ఎంతో భయంకరమైనది. ఇండియా దేశములో గూడ నామకార్థ క్రైస్తవ సంఘములున్నవి, వాటిలో ప్రభువు భోజనమునకు ముందు యాజకుడు జారెడు సిల్కు వస్త్రములను ధరించి ఒక గంటసేపు కొన్ని ప్రార్థనలను, పాఠ్య భాగములను వల్లించుచుండును; ఆ సమయములో కొందరు వెలుపలి యావరణములో యుండి రొట్టె పంచుటకు గంట కొట్టువరకు పొగాకు త్రాగుచుందురు. గంట కొట్టినప్పుడు లోపలికి వెళ్ళి పరిశుద్ధ సంస్కారములో పాలు పొందుదురు.

ఒకానొకప్పుడు ఒకడు తన కుమారునితో కలిసి ఆదివారము గుడికి వచ్చెను. వారిరువురు గుడి ఆవరణములో నిలిచియుండిరి. గురువు ప్రార్థనలు వల్లించుచుండగా తండ్రి వెలుపల ఎవరితోనో కలహించుచుండెను. ప్రభు భోజనము కొరకు గంట కొట్టగా తండ్రి కుమారుని పిలిచి, "ఒరే, అబ్బాయి, నేను లోపలికి వెళ్ళి ప్రభు భోజనము పుచ్చుకొని తిరిగివచ్చే వరకు నా బదులు నీవు వీడితో జగడం సాగించు. నేను వచ్చిన తరువాత నీవు వెళ్ళి ప్రభు భోజనం పుచ్చుకో" అని చెప్పి లోపలకు వెళ్ళి ఎంతో భక్తి మర్యాదలతో మోకరించి, ప్రభు

సంస్కారము పుచ్చుకొనెను. పిమ్మట వెలుపలికి వచ్చి "అబ్బాయి, ఇప్పుడు నీవు లోపలికి వెళ్ళుము, జగడమింక నేనే సాగిస్తాను" అని కుమారుని పంపివేసెను. ఇదే కొందరికి పరిశుద్ధ సంస్కారము. ఆచారములు నిన్ను ఇక్కడికే నడుపును.

పై చెప్పబడినట్టి కలహ భావముతో కూడిన పరిశుద్ధ బల్ల ఎట్లు ఐక్యతను చేకూర్చును? అది ద్వేషమును, విభాగమునే తెచ్చును. అయోగ్యముగా తిని, త్రాగువారు శిక్షావిధి పొందుదురని దేవుని వాక్యము చెప్పుచున్నది. వారు దేవుని చేత శిక్ష నొందుదురు. అందుచేతనే అనేకులు రోగులై చాలమంది మరణించుచున్నారు (1 కొరింథీ 11:29, 30). క్రిస్మస్ దినమున, ఈస్టరు (పునరుత్థాన) దినమున, నూతన సంవత్సరపు దినమున బల్లలో పాలు పుచ్చుకొనుట ద్వారా ప్రత్యేక ఆశీర్వాదము లభించునని కొందరు తలంతురు. అట్లు కానేకాదు. ఈ సూచనల యందు ఏ మంత్రము గాని తంత్రముగాని లేవు. "ఎవరు అయోగ్యముగా తిని, త్రాగుదురో వారు తమకు శిక్షావిధి కలుగుటకే తిని త్రాగుచున్నారు" అని బైబిలు చెప్పుచున్నది. అందువలననే దేవుని ఆజ్ఞను తృణీకరించు క్రైస్తవులలో ఆత్మీయ బలహీనత కనుగొందుము. కొందరు వ్యభిచారములోను, పాపములోను జీవించుచు ధనాశ, ద్వేషములతో నిండిన హృదయములు గలవారై యుండియు మోకరించి బల్లలో పాలుగొనుచుందురు. అట్టి స్థితిలో నుండు నీవెట్లు పాలు పుచ్చుకోగలవు?

రొట్టెయందుగాని, పాత్రయందుగాని ఏ మంత్రము లేదు. అవి మనము ప్రభువు వారమని సాక్ష్యమిచ్చును. "ఓ ప్రభువా! నీవు నన్ను నీ రక్తముచే విమోచించితివి గాన నా హృదయములో నాకు సమాధానమున్నది. అందుచేతనే పవిత్రమైన హృదయముతోను, శుద్ధ చేతులతోను నీ బల్ల యొద్ద తిని త్రాగుటకు సిద్ధముగా నున్నాను. నా హృదయము ఆనందముతోను, ప్రతివారి యెడల ప్రేమతోను నిండియున్నది. ఈ రొట్టె నీ శరీరమును, ఈ పాత్ర నీ

రక్తమును సూచించుచున్నవి. ప్రభువా నిన్ను నీవు నాకు ఎక్కువగా ప్రత్యక్ష పరచుకొనుము. ప్రభువా! నేను నీ ముఖము చూచుటకు సిద్ధముగా నున్నాను" అని మన హృదయములు చెప్పుటకు తగియుండవలెను. ఇదే రొట్టె విరుచుటలో గల నిజమైన భావము.

ప్రభువు బిడ్డలు ఎప్పుడు యోగ్యముగా పాలు పొందుదురో అప్పుడు వారి మధ్య ప్రేమ ఐక్యత లుండును. ఇది ప్రభువు బల్లగాని మనుష్యుల బల్ల కాదని జ్ఞాపకముంచుకొనుము (1 కొరింథీ. 10:16). ఆహ్వానించువాడు ఆయనే గాని మానవుడు కాడు. ప్రభువు బల్ల యొద్ద విశ్వాసులందరు సమానులే. "నేను ఫలాని ఫలాని వారికంటె మంచివాడ"నని చెప్పకూడదు. దేవుని వలన ఎంతశక్తి, అధికారములు నీవు పొందినప్పటికిని ప్రభువు బల్ల యొద్ద ఒక సామాన్య విశ్వాసి కన్న నీవు ఏ మాత్రమును ఎక్కువైన వాడవు కావు. "ఓ ప్రభువా! నేను నీ కృప ద్వారా రక్షింపబడిన ఒక పాపిని" అని చెప్పవలెను. ఈ విధముగా బల్లలో పాలు పొందుట ద్వారా విశ్వాసులందరు ఒకే జీవమునందు, ఒకే శరీరమునందు, సంఘమునందు పాలు గలవారని తెలియును. మనుష్య బంధము తెంపబడి, దేవుని బిడ్డలను భద్రపరచు బంధము కలవారమగుదుము.

దేవుడు ఏకమత్యమును కోరుచున్నాడు. ఈ ఐక్యత ఒక ప్రత్యేకమైన రీతిగా బల్ల యొద్ద బయలు పరచబడును. అక్కడ విశ్వాసులందరు ఏకమై క్రీస్తు ప్రభువు మాత్రమే ప్రాముఖ్యమైనవాడుగా నుండును. అప్పుడే నిజమైన క్రైస్తవ ప్రేమగలవారై, ఇంతకు పూర్వము కలహించువారు సమాధానపడి, ఒకరి భారము లొకరు భరించుటకు ప్రారంభింతురు. పాపమేదైన నున్న యెడల ఒప్పుకొనబడి, కడుగబడి, విశ్వాసులు యేసు ప్రభువు యొక్క రాకడ కొరకు ఎదురు చూచుచుందురు. యేసు ప్రభువు యొక్క జీవమునుండి ఒకరి ఎడల ఒకరికి ఉబుకుచున్న ప్రేమ బంధమే మనల నందరిని ఏకము చేయు

నిజమైన, బలమైన బంధమగును. ఈ బంధము వలన ఏ దేశమునకు చెందినవారైనను ప్రపంచములోని విశ్వాసులందరు ఏకము చేయబడి నిత్యత్వమునకు బంధింపబడుదురు.

నాలుగవది ప్రార్థనలే. ఆది విశ్వాసులు రాత్రియంతయు ప్రార్థనలలో గడుపుచుండిరి. వారు చెరసాలలో వేయబడినప్పటికిని భూ సంబంధమైన ఆయుధముల ద్వారా వారు శత్రువును జయించలేదు. వారు హింసించబడి ద్వేషించబడినప్పుడు ప్రార్థన చేయ ప్రారంభించిరి.

ప్రార్థన ద్వారానే శత్రువును జయించిరి. ఈ దినములయందు పరిస్థితులు వేరుగానున్నవి. క్రైస్తవులనబడినవారు కూడ భయపెట్టి జయించుచున్నారు. "నీవు మా కట్టడలకు లోబడని యెడల నీమీద ఫలాని చర్య తీసికొనబడును' ' అని చెప్పుచు అనేక విధములుగా నిన్ను నొక్కి వేయచూతురు.

అయితే మనము ఈ ఆది అపొస్తలుల ద్వారా పాఠము నేర్చుకొనవలసియున్నది. వారనేక శ్రమలను, శత్రువులను ఎదుర్కొనవలసినపుడు ప్రార్థన ద్వారా మాత్రమే పోరాడిరి (అపొ. కార్య. 16:25). ప్రార్థన ద్వారా మాత్రమే జయించిరి. వారు కలహించుట ద్వారా శత్రువును జయించలేదు గాని మోకాళ్ళపై ప్రార్థించుట ద్వారానే జయించిరి. యీ విధముగా అన్ని ప్రదేశములలోని విశ్వాసులు ప్రార్థన బంధముచేత ఐక్యము చేయబడిరి. దీనియందే వారిశక్తి ఇమిడియుండెను.

మనమింతవరకు నాలుగు బాహ్య బంధములను చూచితిమి. ప్రతి సమాజములో పై నాలుగు విషయములను ప్రత్యక్షపరచిన యెడల శక్తియు, ఐక్యతయు చూడగలము. వాటిని మరల చూతము : మొదటిది అపొస్తలుల బోధ, రెండవది సహవాసము, మూడవది రొట్టె విరుచుట, నాలుగవది ప్రార్థన.

వీటిలో దేనిని కూడ తీసివేయలేము.

వీటిలో ప్రాముఖ్యమైన బంధము యేసు ప్రభువు యొక్క జీవము అంతరంగమున కలిగియుండుటయే. ఆత్మీయముగా ఎక్కువ అభివృద్ధి చెందిన ఎఫెసులోని విశ్వాసులకు వ్రాయబడిన పత్రిక 3వ అధ్యాయమును జాగ్రత్తతో చదివి గమనించుము. "మీ నిమిత్తమై నేను మీ పక్షముగా కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు, దూరముగా నున్న మీ కొరకు ప్రార్థించుచున్నాను. విశ్వాసము ద్వారా ప్రభువైన యేసుక్రీస్తు మీ హృదయములలో నివసించవలయునని ప్రార్థించుచున్నానని" పౌలు వ్రాసెను. "యేసు ప్రభువు అంతకు ముందే వారి హృదయములలో నివసించి ఉండలేదా?" అని నీవు ప్రశ్నించవచ్చును.

ఇంటిలో ప్రవేశించి నివసించుటలోను, ఇంటిని స్వాధీన పరచుకొనుటలోను బహు తారతమ్యములు గలవు. నీవు ఒక గృహమునందు అతిథిగా నివసించవచ్చును. గాని నీ ఇష్టము వచ్చినట్లు ఆ ఇంటిలో పనులు చేయుటకు సంపూర్ణ స్వాతంత్ర్యముండదు. నీవు ఆ ఇంటిలో యజమానివైన యెడల ఆ ఇంటిలో అన్నివేళల స్వాతంత్ర్యమును అధికారమును నీకుండును. అదే విధముగా మన ప్రభువు మనలో నివసించవలెను. మనలను సంపూర్ణముగా స్వాధీనపరచుకొనవలెను. మన అందరిలో అది సత్యమైన యెడల దేవుని ప్రేమను మనము గ్రహించుకొందుము.

మన మందరము ఐక్యము చేయబడినపుడే దేవుని నిజమైన ప్రేమను గ్రహించగలమని పౌలు చెప్పుచున్నాడు. మనలో మనము ఒంటరిగా, వేరుగా జీవించిన యెడల ఆ ప్రేమను గ్రహించలేము. క్రైస్తవులకు క్రైస్తవులకు మధ్య మానవులు కలుగజేసిన భేదమును నీవు పాటించి వాటికి బద్ధుడవైన యెడల నీ సహ క్రైస్తవుల యెడల నీ యభిమానము సంకుచితమై పోవును. ప్రపంచమందలి ఇతర భాగముల యందున్న దేవుని బిడ్డలను విశాల

హృదయముతో ప్రేమించవలెనన్నచో ఈ హద్దుబాటు లన్నింటిని నీవు లొంగదీయవలయును.

ఇది సాధ్యము కావలెనన్న ప్రభువైన యేసుక్రీస్తు మన హృదయముల యందు నివసించుటయే గాక మనలను సంపూర్ణముగా స్వతంత్రించుకొని యుండవలెను. ఇదియే ఒక కొననుండి మరియొక కొనకు పలకల మధ్యగా పోవునట్టి మరుగుపడిన కఱ్ఱ. యేసు ప్రభువు మన జీవితమునకు ప్రభువైన యెడల మనము అందరిని ప్రేమించగలము. ఎందుకనగా యేసు ప్రభువు యొక్క ప్రేమ మనలో నుండి ఆయన బిడ్డలందరికి ప్రవహించును. ఇట్లు కాని యెడిన ఆంధ్రులు ఆంధ్రులనే, అరవమువారు అరవము వారినే, తెల్లవారు తెల్లవారినే, నల్లవారు నల్లవారినే ప్రేమింతురు. ఆ ప్రేమ "సమస్త పరిశుద్ధులతో" కలిగియుండు ప్రేమకాదు. అది దైవిక ప్రేమకాదు. ఒక విశ్వాసి మరొక విశ్వాసిని కలిసినపుడు "నీ కులమేమి? నీ ఉద్యోగమేమి?" అని ప్రశ్నించరాదు. యేసు ప్రభువు యొక్క జీవము, వారిద్దరి హృదయములను సంపూర్ణముగా ఆవరించి యుండుటచే యేసు ప్రభువు యొక్క ప్రేమ వెంటనే వారిని బంధించును. ఆయన ఈ అదృశ్యమైన బంధమును మన జీవితములలో బలమైనదిగా చేయునుగాక.

# 18

# దాచబడిన వస్తువులు

ప్రత్యక్షపు గుడారము యొక్క సన్నిధి రొట్టెలనుంచు బల్ల గంగాళము, దహనబలి నర్పించు బలిపీఠము, దాని యుపకరణములు, పలు విధములైన బలులు మొదలగు మిగిలిన వాటిని గురించిన వివరములను ముచ్చటించుటకు మనకు సమయము లేదు. గనుక పరిశుద్ధ స్థలము యొక్క కేంద్రమైన అతి పరిశుద్ధ స్థలమును గురించి నేర్చుకొందుము. దీనియందు సాక్ష్యపు మందసమున్నది. ఇది తుమ్మకర్రతో చేయబడిన ఒక పెట్టె. దాని పొడవు 2.5 మూరలు, వెడల్పు 1.5 మూరలు, ఎత్తు 1.5 మూరలు. ఇదంతయు బంగారురేకుతో పొదిగింపబడియున్నది. దానిపై నొక మేలిమి బంగారపు మూత, ఇదే కరుణా పీఠము దానిపై ఒక్కొక్క కొనను ఒక్కొక్క కెరూబును కరుణా పీఠముతో ఏకాండముగా దాని రెండు కొనలమీద చేయవలెను. ఈ పెట్టెయొక్క ఉద్దేశమేమి?

ఇశ్రాయేలు ప్రజల చరిత్రకు సంబంధించిన మూడు వస్తువులు మనుష్యులకు కనబడకుండ దేవుని సన్నిధి యందు దాచబడి యున్నవని హెబ్రీయులకు వ్రాసిన పత్రిక తెల్పుచున్నది: "మన్నాగల బంగారు పాత్ర, చిగిరించిన అహరోను చేతికర్ర, నిబంధన పలకలు" (హెబ్రీ. 9:4; నిర్గమ. 16:33; సంఖ్యా. 17:10; నిర్గమ. 25:16 చూడుము). ఇప్పుడీ వస్తువులను గురించి చూచెదము.

ఇశ్రాయేలు ప్రజలకు మన్నా ఏ విధముగా ఇవ్వబడెనో నిర్గమ కాండము 16వ అధ్యాయమందు వివరించబడి యున్నది. వారు అరణ్యములో ప్రయాణము చేయుట కారంభించిన దినము మొదలు కానానులో ప్రవేశించు దినము వరకు అనగా నలువది సంవత్సరములు ప్రతిదినము ఆకాశము నుండి ఆహార మియ్యబడెను. ఈ మన్నా చూచుటకు మంచు కణముల వలెను; రుచికి తేనె కలిపిన పలచని అప్పడములవలె ఉండి ప్రజలందరికి చాలినంతగాను, తృప్తి పరచునంతగాను ఉండెను. ఇది వేకువనే కూర్చుకొనవలసి యుండెను. ఒక ఓమెరుమన్నా ఒక మనుష్యునికి చాలినంతగా లెక్కించబడెను. గనుక దేవుడు ప్రతి మనుష్యునికి చాలినంత ఆహారమును సమృద్ధిగా ఉంచి యున్నాడనుటకు సాక్ష్యముగా ఒక ఓమెరు మన్నా ఒక బంగారు పాత్రలో ఉంచబడి సాక్ష్యపు మందసపు పెట్టె యందుంచబడెను. దేవుని ఇంటియందు ఆకలితో నుండుట ఎవరికి అవసరము లేదు.

దేవుడు ఒకానొక దినమున ఈ లోకము లోనికి పంపనైయున్న నిజమైన ఆహారమునకు ఈ మన్నా ఛాయయై యున్నది. తానే మనకు జీవాహారమైన యేసు ప్రభువును గురించి ఇది చెప్పుచున్నది (యోహాను 6:47-50). ఆకాశము నుండి ప్రతిదినము, 40 సంవత్సరములు ఆహారము పడుట చూడగా ఇశ్రాయేలు ప్రజలకు ఆశ్చర్యముగా నుండును. అది ఎట్లు తయారు చేయబడెనో ఎట్లు వచ్చెనో ఎవరికి తెలియదు. ప్రతి ఉదయము దానిని కూర్చుకొనుటకు వారికివ్వబడిన దేవుని సలహాలకు లోబడుటయే వారి విధియై యుండెను.

ప్రతి ఇశ్రాయేలీయుడు తన కొరకు తానే ఆహారము సమకూర్చుకొనవలసి యుండెనే గాని తాను సోమరియై మరియొకని తనకు ఆహారము సమకూర్చుమని అడుగరాదు. అదే విధముగా మనము వ్యక్తిగతముగ క్రీస్తును భుజించవలెను. ప్రభువైన యేసు మనకు అనుదిన ఆహారమయ్యెను. గనుక మన్నావలె మొదటిగా వేకువనే ఆయనను భుజింపవలెను. మోకాళ్ళపై దినమును

ప్రారంభించి అలవాటు పడిన వారే తమ అక్కరల ననుసరించి విశ్వాసముతో పరలోక ఆహారముచే తమ కడుపులు నింపుకొనుటకు తెలిసినవారు.

మందసపు పెట్టెలోని బంగారుపాత్ర - ఆహారమును భద్రముగా దాచుటకు బంగారుపాత్రయే సరియైనదని తెల్పుచున్నది. బైబిలులో బంగారము దైవ స్వభావమునకు సూచనయని ఇంతకుముందే చూచితిమి. తిరిగి జన్మించని వారియందు దైవ స్వభావము లేదు. వారెన్ని పర్యాయములు బైబిలు చదివినను వారు చదివినది నిలుపుకొనలేరు. అది త్వరగా మరచిపోబడును. దేవుని వాక్యము శరీర సంబంధమైన మనస్సు నందు నిలువనేరదు. తిరిగి జన్మించిన వారు బంగారు పాత్రవలె నగుదురు. బాహ్యముగ నది మంటి పాత్రయే, అనగా శరీరము. అయితే లోపల బంగారు పాత్ర, అనగా దైవస్వభావము. నీవు మారుమనస్సు పొందిన తరువాత దేవుని వాక్యము నుండి నీవు నేర్చుకొనిన వన్నియు నిత్యత్వము కొరకు అవి నీ సంపాద్యమైయుండును. నీవు కొద్దికాలము వాటిని మరచిపోయినను అవి పరిశుద్ధాత్మునిచే నీ హృదయముపై లిఖింపబడినవి గనుక నిత్యమైన విలువను కలిగియుండి, అవసర పరిస్థితుల యందు అవి దేవుని ద్వారా జ్ఞప్తి చేయబడుచుండును.

మన పాత్రల యందు మన్నా ఉండినట్లు దేవుని వాక్యము మనయందు సమృద్ధిగా నివసింప చేయవలెను. నేర్పుటకు, జాగ్రత్త చేయుటకు అను రెండు ఉద్దేశ్యములతో దేవుని వాక్యము మన హృదయములలో ప్రవేశించును. ఆ వాక్యము మనకు బోధించుటకును, బుద్ధి చెప్పుటకును అనుమతించి, మనము ప్రభువు ద్వారా ఏమి నేర్పింపబడితిమో దానినే ఇతరులకు పంచి వారికి సహాయము చేయవలసిన విధి మనదైయున్నది. ఒకడు లేఖనముల ద్వారా సంధింపబడకయు, ఉపదేశింపబడకయు, తప్పు దిద్దబడకయు వుండినచో ప్రతి సత్కార్యము చేయుటకు పరిపూర్ణుడు కాజాలడు (2 తిమోతి 3:16-17). దేవుని వాక్యము నీయందు నివసించిన యెడల అది మొదట నీకుపదేశించి,

సరిదిద్దిన తరువాత నీద్వారా ఇతరులకును అట్లే చేయును. దేవుని వాక్యము ప్రకటించునపుడు "బోధించుచు, హెచ్చరించుచు సంపూర్ణాధికారముతో (దుర్బోధను) ఖండించుచు నుండవలెను" (తీతు 2:15). ఇట్లు చేయుటకు బంగారుపాత్ర అవసరము. పునర్జన్మము నొందని మానవ పాత్రలలో నెవరు దేవుని వాక్యముంచుకొనుటకు ప్రయత్నింతురో వారికి ఖండించుటకు గాని, ఉపదేశించుటకు గాని, తప్పుదిద్దుటకు గాని అధికారము లేదు. వారు తప్పులు మాత్రము పట్టుటకు చూతురు. వారట్లు చేయుట ద్వారా కీడేగాని మేలు కలుగదు.

ప్రభువైన యేసుక్రీస్తే వాక్యము. జీవవాక్యము మనలో నేలునట్లు ఆయన శరీరధారి యయ్యెను. ఆ కారణము చేతనే నీవు తిరిగి జన్మించినపుడు బైబిలు కొరకైన నూతన ఆకలి నీకు కలుగుచున్నది. మన్నా రుచికరమైనది కాదుగాని బలము నిచ్చునదై యుండును. కొన్ని పర్యాయములు దేవుని వాక్యము గ్రహించుటకు కష్టముగా నుండి మన సహజమైన ఇంద్రియములను తృప్తి పరచలేదు. కాని అది మన ఆత్మీయ బలాభివృద్ధికై యియ్యబడినది. దేవుని వాక్యము నివసించుట కొరకై మనము బంగారు పాత్రమైతిమి. ఆ వాక్యమునకు ఎట్టి ప్రశ్నలు వేయక లోబడుదుము గాక!

రెండవదిగా మందసపు పెట్టెయందు చిగిరించిన అహరోను కర్రయున్నది. అహరోను కర్ర చిగిర్చి, పువ్వులు పూసి, బాదము కాయలు కాసెనని సంఖ్యా కాండము 17వ అధ్యాయమునందు చెప్పబడెను. అది అట్లే మందసము నందుండెను. ఇశ్రాయేలు ప్రజల పెద్దలు మోషే అహరోనులకు వ్యతిరేకముగా సణిగి, వారి అధికారమును గురించి ప్రశ్నించినపుడు (సంఖ్యాకాండము 16:1-3) వారు కలిగియున్న అధికారమును దేవుడు తానే వారికిచ్చి యున్నాడని ఆ దైవ అధికారముచే దైవశక్తిచే వారు పనిచేయుచున్నారనియు రుజావు చేయుటకై మృతమైన ఆ కర్రను సజీవముగల దానిగా పుష్పింపజేసెను. దైవిక పునరుత్థాన

శక్తి వలననే మానవులు దేవుని సేవకులగుదురు. అనేకులు తమ పనికై దైవ అధికారము కావలెనని కోరుదురు గాని బాదము పుష్పముల యొక్క సూచన ఏ మాత్రము ఉండదు.

మందసము నందలి పుష్పములు, కాయలు కారి, కర్ర దేవుడు కోరుపనిని జ్ఞాపకము చేయుచున్నది. మోషే వలె ప్రజలను తాము కూడ నడిపించుటకు అచ్చట 250 మంది ప్రధానులు అభిలషించుచుండిరి. దేవుని మందను నడిపించుటలో తగిన యోగ్యత తమకున్నదని తలంచిరి గాని దేవుడు వారి నుపయోగించుకొనలేకపోయెను. ఈ గొప్ప బాధ్యత వారికి ఇయ్యబడక పూర్వము మోషే అహరోనులు అరణ్యములో అనేక సంవత్సరములు దేవునిచే పరీక్షింపబడి, పరిశోధింపబడిరి. పిమ్మట ఆయన వారిని ఏర్పరచుకొనెను.

దేవుని సేవకులందరి విషయములో యిది సత్యము. వారు పునరుత్థాన శక్తిని తమ జీవితములలో వాస్తవముగా ఎరుగు పర్యంతము కష్టముల ద్వారాను, అరణ్య అనుభవముల ద్వారాను తర్ఫీదు చేయబవలెను. ప్రధమముగా మనము దేవుని యొద్దకు వచ్చినపుడు సామాన్యమైన ఎండిన కర్రవలె నున్నాము. చాలాకాలము వరకు ఫలములను కొద్దిగానే చూతుము. మనలను మనము సంపూర్ణముగా ఆయన చేతుల కప్పగించుకొని ఆయన కార్యము చేయుటకు సమయము నిచ్చిన ఎడల నూతన జీవములోనికి పోగలము.

ఒక భిక్షకుని కధకలదు. అనేక సంవత్సరములు అతడు వీణె వాయించుచుండువాడు. ప్రజలు వానిని దాటుచు వెళ్ళునపుడు ఐదు లేక పదిపైసలు వాని పెట్టెలో వేయుచుండెడివారు. ఒక దినమున ఆ మార్గమున పోవుచున్న ఒకడు భిక్షకుని దగ్గర నుండి వీణె అడిగి తీసుకొని దానిపై మనోహరమైన సంగీతమును వాయించి, కొద్దికాలములోనే చుట్టుచేరిన వారి యొద్దనుండి ఎంతో ద్రవ్యమును పోగుచేసి ఆ భిక్షకుని కిచ్చెను. ఆ భిక్షకుని

యొద్ద అనేక సంవత్సరముల నుండి ఆ వీణె యుండెను గాని అతనికి వాయించుట చేతగాక కొద్ది డబ్బు మాత్రమే సంపాదించగలిగెను. అయితే నిజమైన సంగీతగాడు దానిపై మధురమైన సంగీతమును వాయించెను. నీకు నీవు చనిపోవుటకు ఇష్టపడి ఆయన హస్తములకు నిన్ను నీవు సంపూర్ణముగా అర్పించుకొనిన యెడల ఆయన పునరుత్థాన శక్తి నీలో కార్యసాధకమై పుష్పములను, శాశ్వతమైన బాదము కాయలను కాయునట్లు చేయును. అహరోను కర్ర యొక్క వర్తమానమిదే.

మూడవదిగా అదే మందసమందు రెండు రాతి పలకలుంచబడెను. నిర్గమ కాండము 40:20నందు ''సాక్ష్యము'' (శాసనములు) అని పిలువబడుచున్నవి. ప్రథమముగా ఇయ్యబడిన పలకలు పగులగొట్టబడినవి. మోషే దేవునితో ముఖాముఖిగా మాట్లాడిన ఒక ప్రవక్త. రెండు రాతి పలకలపై దేవుడు అతనికి ఆజ్ఞల నిచ్చెను. ఆ పలకలను తీసికొని పర్వతము దిగుచుండగా సమాజము ఒక విగ్రహమును పూజించుచు పాపము లోనికి పోవుట చూచెను. కోపముచే అతడా పలకలను తుత్తునియలుగ పగులగొట్టెను. రెండవ పర్యాయము దేవుడు మోషేను పర్వతము పైకి పిలిచి మరి రెండు పలకలపై ఆజ్ఞలను వ్రాసి మోషే చేతిలో నా పలకలు భద్రముగా లేవు గనుక మందసపు పెట్టె యందు ఉంచుమని సెలవిచ్చెను. ప్రవక్తలందరిలో గొప్పవాడైన వాడు కూడ దేవుని వాక్యమును భద్రపరచలేకపోయెను. గాన అవి భద్రత కొరకై మందసము లోనికి పోవలసి వచ్చెను. యేసుక్రీస్తు ప్రభువు ద్వారానే తప్ప మరియే గొప్ప బోధకుల ద్వారాగాని, ప్రవక్త ద్వారాగాని తన వాక్యము భద్రపరచబడదని దేవుడు చూపుచున్నాడు. ఎప్పుడైతే యేసు ప్రభువునకు ప్రథమ స్థానమియ్యబడునో అప్పుడే దేవుని వాక్యము జీవమును కలుగజేయును.

అనేకులు బోధపై మాత్రమే ఆధారపడుదురు. వారు అనేక కూటములకు

హాజరు కావలెననియు, అనేకమైన పుస్తకములను, బోధకులను కలిగియుండవలెనని అభిలషింతురే కాని యేసు ప్రభువునకు తమ హృదయములలో ప్రథమ స్థాన మియ్యరు. ఇదియే మన అపాయము. మనమనేకమైన మంచి ప్రసంగములు వినుచుండినను అపజయ జీవితమును జీవించుచుండవచ్చును. మన జీవము క్రీస్తుతో కూడ దేవుని యందు దాచబడి యున్నదను పాఠము మనము నేర్చుకొనుటయే దీనికి తగిన చికిత్స (కొలస్స 3:3). ప్రభువైన యేసు నిన్ను స్వాధీనము చేసికొన నిచ్చి ఆయనలో దాగియున్న యెడల సమృద్ధియైన జీవముండును.

పలకలు మోషే చేతుల యందున్నప్పుడు అవి పగుల గొట్టబడెను గాని మందసము నందున్నప్పుడవి భద్రపరచబడెను. యేసు ప్రభువునందు దాగు రహస్యమును నీవెరుగవలయును. నీకు సహాయము చేయుటకు దేవుడు బోధకుల నుపయోగించుననది వాస్తవమే గాని ఆయనకే సమస్త మహిమ, ఘనత కలుగునట్లు నీ హృదయమందును, నీ ఇంటియందును, నీ వ్యాపార మందును ఆయనకు ప్రథమస్థాన మియ్యవలెను. ఇతరులు నిన్ను చూచి నీతో మాట్లాడునపుడు ఆయనను మహిమ పరచునట్లు నీ వెల్లప్పుడును వెనుకనే యుండవలెను. నీవు ప్రార్థించునవుడు ఆయనను హెచ్చించుటకు నేర్చుకొనవలెను. ఆయన మహిమపొంది పూజింపబడవలెననియే ఆదివారపు ఆరాధన యొక్క ఉద్దేశ్యమై యున్నది. అప్పుడు నీ జీవితము అభివృద్ధి చెందును. లేనిచో నీవు ఎగతెగక నీ ప్రార్థనయందు భిక్షగానివలె మొరపెట్టినను ఎదుగుదల యుండదు. యేసుక్రీస్తును మహిమ పరచుము, అప్పుడు అభివృద్ధి కలుగును.

నీవెచటకు వెళ్ళినను యేసు ప్రభువు నందు దాగుకొనుచున్నావా? నీ సంభాషణ, వస్త్రములు, జీవితము ద్వారా నీవు గాక ఆయనే మహిమ పరచబడుచున్నాడా? అట్టి దాగు చోటికి నిన్ను తీసికొని వచ్చుటకు దేవుడు

బాధకరమైన అనుభవములను వాడుకొనును. ఆయన నీ స్నేహములను విడగొట్టుటకు ప్రారంభించును. నీ ఇంటిని గాని, తల్లితండ్రులనుగాని, భార్యనుగాని, భర్తనుగాని లేదా నీవెక్కువగా ప్రేమించు నీ బిడ్డలను గాని తీసివేయవచ్చును. నీవు చేయుచున్న నీ ఏర్పాటులన్నిటిని తలక్రిందులుగా చేయవచ్చును. మోషే చేతియందున్న రాతి పలకలు విరుగగొట్టబడెను. అయినను ఆ సమయమందు ఆయన కవి ప్రశస్తమైనవిగా నుండెను. ఆ దినమునుండి మోషే యొక్క స్వకీయ ఆధారము విడగొట్టబడెను. అందువలననే అతడంత సాత్వీకుడాయెను. తాను కోపోద్రేకముతో ఆ పలకలను పగులగొట్టిన దినమును అతడెల్లప్పుడు జ్ఞాపకముంచుకొనెను. ఆ సంఘటన అతనిని వాస్తవముగా సాత్వీకునిగా చేసెను. అట్లే దేవుడు నిన్ను పగులగొట్టును.

మీలో కొందరు పగులగొట్టబడుటకు చాలా కఠినముగా నుందురు. నీవెల్లప్పుడును నీ స్వంత మార్గముననే వెళ్ళ నిచ్ఛయింతువు గనుక నీ మార్గములను మార్చుకొనుటకు నీకు కష్టముగా నుండను. మోషే తాను విరుగగొట్టబడుట ద్వారా జయ జీవితము యొక్క రహస్యమును నేర్చుకొనెను. ప్రతి విశ్వాసి యొక్క జీవితములో తనకు తగ్గింపును కలుగజేయు సందర్భములు, తరుణము గలవు. "నేనెందుకా విధముగా ప్రవర్తించితిని?" అని నీవు అటు తరువాత ఆశ్చర్యపడవచ్చును. కాని వాటి ద్వారా దేవుడు నిన్ను విరుగగొట్టి, తగ్గించి; మోషేవలె సాత్వీకునిగా చేయుచున్నాడు. అప్పుడే నీవు వాస్తవముగా యేసు ప్రభువునందు దాగియుండి ఆయనే నీకు సమస్తమని తెలిసికొందువు. అప్పటినుండి నీవు ఇతరులపైగాని, నీపైనగాని గాక ఆయనమీదనే ఆధారపడుదువు. పౌలుకు అరణ్యమందు ఈ పాఠము నేర్పబడెను. నీకు కూడ దీనిని నేర్పవలెనని దేవుడు చూచుచున్నాడు.

మందసమునందు దాచియుంచబడిన వస్తువుల భాగమును పూర్తిగా తెలిసికొనుటకు దేవుడు నీకు సహాయమును చేయునుగాక!

# 19
# జీవులు

కరుణాపీఠముతో ఏకాండముగా రెండు బంగారు కెరూబులుండెను (నిర్గమ కాండము 25:18-20). మందిరపు పది తెరలమీద చేయబడిన చిత్రకారుని పనియైన కెరూబులు కూడ నుండెను (26:1). మరియు అతి పరిశుద్ధ స్థలము యొక్క అడ్డతెర మీద కూడ చిత్రకారుని పనియైన కెరూబులుండెను (26:31). అనగా కరుణాపీఠము మీదను, మరియు ఎదుటను కెరూబులుండెను. వాటి రూపమెట్లుండెనో అది చెప్పబడలేదు. ఈ విషయము తెలిసికొనవలెనంటె బైబిలులో వేరే భాగములు చూడవలెను. ముఖ్యముగా యెహెజ్కేలు పిమ్మట ప్రకటన. ఈ గ్రంథములందివి 'జీవులు' అనబడుచున్నవి.

ఇవి పరిచర్యతో సంబంధము గలవి. యెహెజ్కేలు మొదటి అధ్యాయము చూడుము. యెహెజ్కేలు ద్వారా దేవుడు జనాంగములకు ఒక ప్రాముఖ్యమైన వర్తమానము పంపనుండెను. ఆ వర్తమానమును అతడు గ్రహించే ముందుగా యెహెజ్కేలుకు దర్శనమందు కెరూబులను చూపవలసియుండెను. ఈ దర్శనము తన దృష్టి యెదుట ఉంచుకొని ప్రజలకు దేవుని వర్తమానమును అతడు సంపూర్తిగా ఇవ్వవలసి యుండెను. మనము తిరిగి జన్మించినప్పుడు మనకు కూడ ఒక పరిచర్య ఇవ్వబడుచున్నది. దానిని నెరవేర్చుటకు, అది ఏమైయుండునో మనము గ్రహించుట కెరూబుల యొక్క అర్థమును మనము నేర్చుకొనిన కొలది ఆ పరిమితిని బట్టి యుండును.

ఈ ప్రవక్త "చెరలోని వారి మధ్య కాపురము" ఉండినట్లు యెహెజ్కేలు 1:1లో చదువుచున్నాము. ఈ చెరలోనివారు తమ స్వంత అవిధేయతను బట్టియు, పాపములను బట్టియు, యూదా దేశ సమస్తము యొక్క పాపములను బట్టియు బబులోనులో దాసులుగా నుండిరి. దేవుడు యెహెజ్కేలుకు ఈ దర్శనము నిచ్చినప్పుడు అతడు కెబారు నదీ ప్రదేశమున నుండెను. దేవుడు ఆకాశమును తెరచి యూదులు ఏ కారణముచేత చెరలో నుండిరో, వారు కోల్పోయిన వాటిని ఎట్లు తిరిగి పొందగలరో జనములన అయన ఏ విధముగా తీర్పు తీర్చునో అతనికి చూపెను. 3వ వచనములో "యెహోవా హస్తము అతని మీదికి వచ్చెను" అని చూచుచున్నాము. దేవుని వాక్యమిచ్చు నిమిత్తము దేవునితో ప్రవక్త ఐక్యపడెనని దీని భావమైయున్నది. దేవునితో ముందుగా ఐక్యపడిన పిమ్మటనే దేవునికి బదులు ఆయన మాటను తాను పలుకగలడు. మరియు దేవునియొక్క సత్యసాక్షి లేక ప్రవక్త లేక దాసుడుకాగలడు. ఈ ఆత్మీయ ఐక్యత కెరూబుల విషయమైన అర్థము ద్వారానే అతనికి బోధింపబడెను.

1:4 చూడుము : "ఉత్తర దిక్కునుండి తుఫాను వచ్చుచుండెను." దేవుడు తన తీర్పులను ఏ దిక్కునుండి పంపునో ఆ దిక్కును ఉత్తరము సూచించుచున్నది. తుఫాను అతి వేగమును తెలుపుచున్నది. అనగా తాను చెప్పుచున్న విషయములు త్వరితముగా నెరవేరనున్నవని దేవుడు ప్రవక్తకు చూపెను. తుఫానులో నుండి అగ్ని బయలుదేరెను. ఇదే దేవుని తీర్పు అగు అగ్ని. ఈ అగ్నిలో నుండి జీవులు బయలుదేరెను. వాటి కాళ్ళు చక్కగా నిలువబడియున్నవి. వాటి అరికాళ్ళు పెయ్యకాళ్ళవలె నుండెను. అవి తళ తళలాడు అపరంజివలె నుండెను. పెయ్య దేవుని సేవకు సూచనగా నున్నది. యెహెజ్కేలు దేవుని సత్యదాసుడుగా నుండవలెనంటే దేవుడు ఆజ్ఞాపించిన మార్గమందు తిన్నగా నడుచు పాదములు కలిగియుండవలెను. వంకర టింకరగా నడచుట పనికిరాదు. "అవును," అంటే "అవును," "కాదు" అంటే "కాదు."

వ్యర్థమైన మాటలు అతని పెదవులు పలుకరాదు. పాదములు ఏల ఇత్తడివలె నుండెననగా ప్రభువైన యేసుక్రీస్తు తన పాదముల క్రింద సాతాను తలను నలుగగొట్టినట్లు మనము ఆయనకు విధేయులగుట ద్వారా మన పాదముల క్రింద సాతానును నలుగగొట్టుదుము (రోమా. 16:19, 20).

ఈ జీవులు ఇంత వింతగాను, గంభీరముగాను నుండినను వాటి ఆకారము మనుష్యుని పోలియుండి (వచనము 4) మనుష్యుని వలె చేతులు కలిగియుండెను (వచనము 8). ఇట్లే యెహెజ్కేలు ఒక మనుష్యుడై యుండినను అతని ద్వారా ఒక గొప్ప పరిచర్య దేవుడు నెరవేర్చుకొన వలెననుకొనెను. మనము తిరిగి జన్మించగా ఒక పరలోక సంబంధమైన పరిచర్యకు దేవుడు మనలను పిలుచుచున్నాడు. మనము మనుష్య మాత్రులమేయని అయన ఎరుగును. మనము భుజించుట, విశ్రమించుట అవశ్యమైయున్నది; మరియు మన శరీర శక్తులకు ఒక హద్దు ఉన్నది. ఇవన్ని ఇట్లుండియు తన నిత్య ఏర్పాట్లను నెరవేర్చుటలో దేవునికి మనుష్యుని పని కావలసి యున్నది. ఆయనతో విశ్వాసము ద్వారా మనము ఏకమై, అయన సమస్త చర్యలు, సమస్త ఏర్పాట్లలో ఆయనతో కలిసి పోయినప్పుడే ఇది సాధ్యమగును. "మానవ హస్తముల" యొక్క భావమిదే.

ఒక ఉదాహరణము : చక్కని ప్రార్థన వలన ఎంతటి కార్యములు జరుగునో! ప్రార్థన యొక్క రహస్యమును మనుష్యులు గ్రహించినప్పుడు, వేదనలో ప్రార్థన చేయుట ఎట్లో నేర్చుకొనినప్పుడు ప్రపంచపు ప్రతి భాగమునకు ఎంత శక్తి విడుదల యగుచున్నదో! వారు ఏ ప్రత్యేక వరముగాని, ఈవి గాని లేనట్టి సామాన్య, సాధారణ మనుష్యులే అయియుండవచ్చును. అయినను వారి ప్రార్థనల వలన ఆకాశము తెరువబడి పట్టణములు నగరములు ఆశీర్వాదము పొందుచున్నవి. మనము ఆయనతో ఐక్యపడినప్పుడు మన

ద్వారా దేవుడెట్లు కార్యములు నెరవేర్చగలడో తెలుపుటకు ఈ ఉదాహరణము ఒకటి మాత్రమే ఇవ్వబడియున్నది. తాను దేవునితో ఐక్యపడిన యెడల అతని ద్వారా దేవుడు ఆయన యొక్క సమస్తమైన ఏర్పాట్లు, ప్రవచనములు, సంపూర్తి చేయగలడని యెహెజ్కేలు చూచెను.

ఈ జీవులకు రెక్కలు కూడ నుండెను (వచనము 8). నిరాటంకమైన చర్యకు రెక్కలు గురుతుగా వున్నవి. పక్షులు ఆకాశమందు ఇష్టము వచ్చినట్లు మార్గమందు ఏ ఆటంకములు లేనందున నిర్భయముతో, స్వేచ్ఛగా ఎగురును, మనము ఆయనతో ఐక్యపడి, దేవుని యొక్క సర్వ విశ్వమందు నిరాటంకముగా, ఘనముగా మనము సంచరించు నిమిత్తము దేవుడు మనకు కూడ ఆత్మీయ రెక్కలు ఇచ్చియున్నాడు. క్రైస్తవ జీవిత ప్రారంభమందు మనచింత యావత్తు మన విషయమే, మన కుటుంబ విషయమే ఆత్మీయముగా ఎదుగ నారంభించగా మన ఇరుగు పొరుగులు, గ్రామస్థులు, రాష్ట్రమువారు, దేశస్థులు మొదలగు మనతో నుండువారి విషయము కూడ తలంతుము. క్రమముగా మన ఆలోచనలు ప్రపంచము నంతయూ ఆవరించి, ఇతర దేశములలో దేవుడెట్లు పనిచేయుచున్నాడోయని చూతుము. అటు పిమ్మట ఈ లోకము ముగిసిన వెనుక, దేవుడు ఏమి చేయనున్నాడని తెలిసికొను వాంఛ కలుగుచున్నది. ఆకాశము, రాబోవు క్రొత్త సృష్టి, ఇవన్నియు మన మనస్సులో ప్రవేశించును. ఇదంతయు మనము ఆత్మీయముగా ఎదుగుచుండగా సంభవించును. సాతాను మనకొక హద్దువేసి, కేవలము భూసంబంధమైనట్టియు, నశించి పోవునట్టియు విషయములలోనే మనము మునిగిపోవునట్లు యత్నించుటకు ఇదే కారణము. మానవరీతి ఆలోచనల వలన ఇంకను మనకు ఏ హద్దును ఏర్పడరాదని దేవుడు ఏర్పాట్లు చేయుచున్నాడు. వాటి రెక్కల సహాయమున ఆ కెరూబులు దేవుని విశ్వమందంతట ఆయన సంకల్పములను నెరవేర్చుటకై ఎక్కడికైనను సంచరింపగలిగెను. ఇట్లే మనము కూడ దేవునికి విధేయులగుట ద్వారా దేవుని

పరమ సంకల్పములు సంఘము ద్వారా ఎల్లెడల నెరవేర్చబడును.

వాటి రెక్కలు ఒకదాని నొకటి కలిసికొని యుండెను (వ.9). దీని భావమేమనగా ఏ ఒక జీవియైనా ఎటు వెళ్ళునో మిగిలిన మూడు కూడ దానితో వెళ్ళవలసినదే. ఇది ఆత్మీయ ఐక్యతను సూచించుచున్నది. కదలితేనాలుగును కదలవలసినదే. విశ్రమించితే నాలుగును విశ్రమించవలసినదే. దేనికది ఇష్టానుసారముగా దిక్కుకొకటి వెళ్లుటకు వీలుపడదు. ఒకేప్రాణివలె మాత్రమే అవి వెళ్ళగలుగును. క్రీస్తు సంఘము పనిచేయవలసినది ఇట్లే. ఆయన సేవయందు ఎవరికి వారు తమ ఇష్టానుసారము మాట్లాడుటకు గాని కార్యములు చేయుటకుగాని వీలుపడదు. తన సంఘము విషయమై దేవుని సంపూర్ణ సంకల్పమేమిటో తెలిసికొనిన పిదప, ఇతర విశ్వాసులతోను, సహపాటి సేవకులతోను అనగా ఎవరితోనైతే మనము కలసి జీవించుచు, ఒకే బాధ్యతను పంచుకొనుచున్నామో వారితో పూర్ణ సహవాసము కలిగి పనిచేయగలమే గాని, ఎవరికి వారు తమంతట తామే ఏదియు చేయలేము. మనకందరికి స్వతంత్రత ఇష్టమే; ఇట్లెందుకు చేసితివి యని మన కార్యముల విషయము ఎవరైనా ప్రశ్నించినచో మనకు ఇష్టమే ఉండదు; మనము చేయు కార్యములలో ఇతరులు జోక్యము కలిగించుకొనుట మనకు పడదు. ఉపాధ్యాయులో, పాస్టరులో, బోధకులో, ఉపదేశకులో, మనము ఏమైయుండినను సరే- అందరిలోను మానవ స్వభావమే యున్నది. నీకు బైబిలు చక్కగా తెలియును గనుక నీ లోపల బలహీనతలు లేవని తలంచకుము. మనలో ప్రతి యొక్కరిలో ఏదో ఒక లోపమో, బలహీనతయో ఉండకపోలేదు. ఇంకను స్వార్థపరత్వమున్నది. **అది** విరువబడవలెను.

యెహెజ్కేలు ఒక ఒంటరి మనుష్యునిగా మాట్లాడినను అతడు పరలోక పక్షముగానే మాట్లాడుచున్నాడని దేవుడు అతనికి చూపించుచుండెను. దేవుని

జనులు పొరపాట్లు చేసినప్పుడు పరలోకమునకే ఆ నింద వచ్చుచున్నది. యెహెజ్కేలు దేవుని బదులుగా మాట్లాడుచుండినందునను, అతని ప్రవర్తన వలన దేవుని కార్యములు నెరవేరుటయో, చెడుటయో అగును గనుక, అతడు తన ఇష్ట ప్రకారము మాట్లాడుటకుగాని, కార్యములు చేయుటకు గాని వీలుపడదు, మన సంగతి కూడ ఇంతే. ఆ రెక్కలు అతుకుకొని యుండుట దేనికి సూచనగా నున్నది యనగా: మనతో దేవుడు కావలెననుచున్న ఆత్మీయ ఐక్యత. ఈ నాలుగు జీవులకు నాలుగు రకములైన ముఖములుండినను (వ. 10) వారి చర్యలన్నింటిలోను వారొకరికొకరు అతుకబడి, ఒకేవైపు వెళ్ళవలసి యుండెను. మీరు ఆత్మీయముగా ఎదిగిన కొలది దేవుని జతపనివారైన మీ మధ్య ఇట్టి ఆత్మీయమైన ఐక్యత ఉండునట్లు మీరు చూడవలెను. ఇతరులతో కలిసి మెలిసియుండుట, ఇతరులతో ఏకముగా పనిచేయుట మీకు కష్టమనిపించిన ఎడల మీరింకను శరీర సంబంధులే. ఇంకను క్రీస్తులో పసిబిడ్డలే. ఆత్మీయముగా ఎదుగుదల కలుగుచున్నప్పుడు ఐక్యత, పొందిక, స్వతంత్రత, సమాధానము మీకు కలుగును. చక్కగా గమనింపుము. ఈ ఐక్యత ఆత్మీయమైనది గాని లౌకికమైనది కాదు. కారణము: దేవుని చూడనివారు ఆయన సంకల్పములను ఏర్పాట్లను ఎరుగనివారు మీతో ఐక్యపడజాలరు. దేవుని ఎరిగి ఆయన ఆత్మను కలిగిన వారు మాత్రమే నీతో కలిసి పనిచేయగలరు. ఈ నాలుగు జీవులు ముందుకు సూటిగా పోవుట నిత్యజీవమును సూచించుచున్నది (వ. 12). దేవునితో కలిసి మనము ముందుకు సాగినప్పుడు ఎదుగుచునే యుండవలెను.

అరణ్యమందు ఇశ్రాయేలీయులు ప్రయాణము చేయుచుండగా వారు ముందుకు సాగి నడచునప్పుడైనను, ఎక్కడైనా దిగినప్పుడైనను, వారెల్లప్పుడు నాలుగు సమూహములుగా నుండిరని మీకు జ్ఞాపకముండును. ఉత్తర దిక్కు, దక్షిణ దిక్కు, తూర్పు దిక్కు, పడమటి దిక్కు; ఈ నాలుగు సమూహములుండెను.

గుంపుకొక ధ్వజము లేక జెండాయుండెను. యెహెజ్కేలు చూచిన కెరూబుల ముఖములే ఈ ధ్వజముల మీద నుండెను. సింహము ఒకదానిమీద, మనుష్యుడు మరొక దానిమీద, ఇట్లే మిగిలిన రెండింటి మీద ఎద్దు, పక్షిరాజు (యెహెజ్కేలు 1:10ని, సంఖ్యాకాండము 2:17తో పోల్చిచూడుము). మందిరము యొక్క నాలుగువైపుల మూడేసి గోత్రములు, వారి వారి సొంపు ధ్వజములు క్రింద కూడియుండిరి. దేవుని ఆజ్ఞ ప్రకారము వారు సాగి నడచుచున్నను లేక ఒకచోట దిగినను ఆయన ఏర్పరచిన క్రమమిదే. ఈ క్రమమును ఆయన మార్చనేలేదు, ధ్వజము మీద నొకటి చొప్పున ఈ నాలుగు ధ్వజముల మీది నాలుగు ముఖములు తన ప్రజల కొరకు దేవుడు చేసిన నిత్య ఏర్పాటును ఇశ్రాయేలీయులకు జ్ఞాపకము చేయుచుండెను. ఒకవేళ దేవుడు ఏర్పరచిన క్రమమును విడిచి మొదట యూదా గోత్రము సాగి నడిచే బదులు బెన్యామీను గోత్రము సాగి నడిచెనను కొం ,ఏమి జరిగియుండును? ఇశ్రాయేలీయులతో దేవుడు వెళ్ళియుండడు. తాను కనబరచిన తన పరలోకపు ఏర్పాటు చొప్పున వారు సాగి నడచితేనే గాని దేవుడు వారితో వెళ్ళజాలడు. నీవైనను ప్రత్యక్ష పరచబడిన దేవుని ఏర్పాటును తెలిసికొననిదే నీకు జయముండదు.

ప్రజలు ఏ రీతిగా దేవుని నుండి తప్పి, వారి జీవితముల విషయమును, వారి సేవ విషయమును దేవుడు ఏర్పరచిన క్రమమును ఎట్లు మార్చివేసిరో దానినే కెరూబుల నాలుగు ముఖములు యెహెజ్కేలుకు జ్ఞాపకము చేసెను. యూదులు ఒక జనాంగముగానే దేవుని నుండి తప్పిరి, ప్రారంభము నుండి కూడ "ప్రతివాడు యిష్టానుసారముగా ప్రవర్తించుచు వచ్చెను" (న్యాయాధి. 21:25). యెహెజ్కేలును దేవుడు తన ప్రజల దగ్గరకు పంపినప్పుడు కూడ వారి స్థితి ఇట్లే యుండెను. అంతయు అరాజకము, అక్రమము, గొడ్డుతనమే. కారణమేమనగా ప్రత్యక్ష పరచబడిన దేవుని ఆజ్ఞను త్రోసివేసి, దేవుని నివాస స్థానమును వారు అపవిత్ర పరచియుండిరి (యెహెజ్కేలు 8, 9 అధ్యాయములను

చదువుము). నేడు కూడ అదే స్థితి కనబడుచున్నది. దేవుని వాక్యము ఉండవలసిన స్థానమున మనుష్యుడు ఏమి తెచ్చి పెట్టియున్నాడు? తన స్వంత ఆలోచనలు, తాను చేయు అభివృద్ధి, తాను కల్పించు నాజూకుతనము. ఫలితమేమి? దేవుని జనుల మధ్య అల్లకల్లోలములు, కలహములు, గొడ్డుతనము. దేవుని వాక్యము ఎన్నడు మారదని ఆ నాలుగు ముఖములు ప్రవక్తకు జ్ఞాపకము చేసినట్లు మనము కూడ జ్ఞాపకము చేసికొనవలెను: ఒక్కొక్కటిగా వీటిని ఆలోచింతము.

మొదటి దాని ముఖము మనుష్యుని ముఖము. ప్రభువైన యేసుక్రీస్తు మనుష్యావతారమును ఇది తెలుపుచున్నది. రాజులకు రాజైనవాడు బలహీనుడై మన కొరకు సిలువ వేయబడెను. కావున మనలను మనము తగ్గించుకొని ఆయన వలన సాత్వీకము నేర్చుకొందము. మనక్రియలను బట్టి అతిశయించుటకు మన మెవరము? క్రీస్తుయొక్క సిలువ మనలో అంతకంతకు లోతుగా పనిచేసి మనలను నిజముగా తగ్గించవలెను. అట్లయితేనే దేవుని సంకల్పములతో మనము ఐక్యపరచబడగలము.

రెండవ జీవి సింహము వంటి ముఖము గలది. ఆదికాండము 49:10లోని ప్రవచనము చూడుడి. "షిలోహు వచ్చువరకు యూదా యొద్దనుండి దండము తొలగదు. ప్రజలు అతనికి విధేయులై యుందురు. యూదా రాజులలో కడపటివాడు సిద్కియా (2 రాజులు 25:7). అతని తరువాత యేసుక్రీస్తు వచ్చు పర్యంతము రాజులు లేరు. ఆయన "యూదా గోత్రపు సింహము" అనబడుచున్నాడు (ప్రకటన 5:5). దేవుని నిజమైన రాజు సింహము వలె వచ్చెను. యూదా రాజ్యమును పాలించిన యూదా గోత్రపు రాజులందరును తప్పిరి. అయితే సత్యనీతి రాజైన ప్రభువైన యేసుక్రీస్తు పాలించుటకు వచ్చియున్నాడు. ఇప్పుడు ఆయన రాజ్యము భూమిమీదకు రావలసియున్నది. ఎంతటి మంచి రాజ్యమైనను నిరంతరము నిలిచిపోవునట్టి మరొక రాజ్యము

లేదు. భూలోక రాజ్యములన్నియు గతించి పోవలసినవే. రాజులకు రాజైన ప్రభువైన యేసుక్రస్తు తిరిగి వచ్చుచున్నాడని మనము నమ్ముచున్నాము. రాజ్యమేలుటకు ఆయన వచ్చినప్పుడే భూమికి సత్య సమాధానము తెచ్చును, దీని కొరకై మనము సిద్ధపడవలెను. ఇప్పుడు మనము ఆయనతో అన్ని విషయములందు ఐక్యపడితేనే ఆయన తీర్పు తీర్చుటకును, రాజ్యమేలుటకును వచ్చినప్పుడు ఆయనతో నుందుము.

మూడవ జీవి ముఖము ఎద్దు ముఖము వంటిది. దహన బలి, సమాధాన బలి, పాప పరిహారార్థమైన బలుల కొరకు లేవీయులు కోడెను ఉపయోగించుచుండిరి. ఎద్దును అర్పించలేనంతటి పేదలు గొర్రెపిల్లనో, పావురమునో తెచ్చుచుండిరి. అయితే సరియైన అర్పణకు ఎద్దే కావలసియుండెను. నీ పాపమును, నీ భారమును మోయువానిగా నీకు బదులు ప్రభువైన యేసుక్రీస్తు మరణించెను. బండ్లు లాగుటకును, బరువులు మోయుటకును సాధారణముగా మనుష్యులు ఎద్లను ఉపయోగింతురు. ఓర్పుగల సాత్వీకమైన ఈ పశువులు మనకు ఏమి జ్ఞాపకము చేయుచున్నవనగా: మన బరువులను, మన పాపములను మోయుటకై ప్రభువైన యేసుక్రీస్తు ఎంత సంపూర్ణముగా తన్ను తాను అర్పణగా చేసికొనెనో దానినే జ్ఞాపకము చేయుచున్నవి. నీ భారములను నీవే మోయజాలవు. అయితే నీవు సమ్మతించిన ఎడల ఆయన మోయగలడు. నీవు ఇంకను నీ భారములను, చింతలను, ఇక్కట్లను నీవే మోయ యత్నించు చుండిన యెడల ఆ బరువు నీమీద నుండి దొరలిపోయి ఆయన మీద పడునంత వరకును ప్రార్థించుము; ప్రార్థన చేయుచునే యుండుము. ఎంతశక్తి ఆయన వలన నీవు పొందుచున్నావో అప్పుడు నీవు గ్రహింతువు. మిక్కిలి భారము మోయుచున్న వారికి విశ్రాంతిని ఆయన అందించుచున్నాడు. మన చింత ఆయన మీద వేసినప్పుడు మాత్రమే ఈ విశ్రాంతి మనకు లభించును. ఆయన భూమిమీద నుండగా ఇవే శ్రమలు

ఆయన కూడ పొందినందున మన బలహీనతలు ఆయనకు జాలి కలిగించును. కావున మన పాపమును, భారమును మోయువానిగా ఆయనను చేసికొని ఆయనయందు ఉండుము.

నాల్గవ జీవి ముఖము పక్షిరాజు ముఖము వంటిది. పక్షిరాజు త్వరితముగా ముదిమి చెందదు. నిత్య యౌవనత్వమునకది సూచనగా నున్నది (కీర్తనలు 103:5; యెషయా 40:31). నీకు ముదిమి వచ్చిన పిదప, పూర్వము చేయగలిగినంత అప్పుడు చేయలేవు. పక్షిరాజు యౌవనమందే యుండునని చెప్పుదుము. ఏలయనగా దాని ముదిమి యందైనను నిలిచి నడచుట అది ఎరుగదు. అప్పటికి కూడ ఎత్తుగా ఎగిరి ఎంతెంతో దూరము వెళ్ళును. దీని అర్థము చూడుము: దేవుని యొక్క పరసంబంధమైన కార్యములందు మనము నిజముగా ఐక్యపడినప్పుడు వదలుట యనునది ఎరుగము. ఎందుకనగా ఎడతెగని శక్తి మనలో దిగుచుండును. మనము మరణించినను ప్రభువైన యేసు నామమున మనము ప్రారంభించిన పని పూర్తియగు పర్యంతము సాగి వెళ్ళుచునేయుండును. ప్రభువైన యేసుక్రీస్తు శక్తితో అది ప్రారంభమై యుండిన ఎడల అది సాగి వెళ్లుచునేయుండును, అంతరించదు.

ఈ జీవుల రూపములు ఇట్లు వివరింపబడియున్నవి. "మండుచున్న నిప్పులతోను దివిటీలతోను సమానములు; ఆ అగ్ని జంతువుల మధ్యను ఇటు అటు వ్యాపించెను. ఆ అగ్ని అతి కాంతిగా ఉండెను. అగ్నిలో నుండి మెరుపు బయలుదేరుచుండెను. మెరుపు తీగెలు వంకరలుగా కనబడు రీతిగా జంతువులు ఇటు అటు తిరుగుచుండెను" (13, 14 వచనములు). లేఖనము లందంతటను అగ్ని మనకు తీర్పును సూచించుచున్నది. కావున ఇక్కడ మనకొక గంభీరమైన హెచ్చరిక యున్నది. అపొస్తలుడైన పౌలు 1 కొరింథీయులు 3లో ప్రతివాని పని అగ్నిచేత బయలు పరుచబడును అని చెప్పుచున్నాడు. భూమిమీద ఎప్పుడైనను

మాటలతోగాని, క్రియతోగాని ఏమేమి చేసియుంటిమో అదంతయు అగ్నిచేత సంపూర్ణముగా పరీక్షించబడి, బయలుపరచబడును. అది ఈ అగ్ని పరీక్షకు నిలిచిన ఎడల బహుమానమున్నది; కాలిపోయిన ఎడల అంతా నష్టమే. కావున భూసంబంధమైన కార్యములేవో, పరలోక సంబంధమైన కార్యములేవో అనగా మానవయత్న ఫలితమేదో, ఆత్మశక్తి వలన కలిగిన ఫలితమేదో మనము పరీక్షించి చూడవలెను. న్యాయతీర్పు దినమున మొదట చెప్పబడినది నశించును. దేవునికి అంగీకారమైనది ఏదనగా పరలోక శక్తి ఐశ్వర్యములను బట్టి ప్రారంభింపబడి నెరవేరిన పనియే. దేవుడు ఈ సర్వమును అగ్నిచేత పరీక్షింపనై యుండగా ఏ విధముగా మనశక్తిని, సమయమును, డబ్బును వ్యయము చేయుచున్నామో దాని విషయము మనమెంత జాగ్రత్త పడవలయును! పరిశుద్ధాత్మచే జరిపింపబడునది ఏదో అది నిరంతరము నిలుచును. మనుష్య ఆవేశముతో జరిగింపబడునది త్వరలో వాడిపోవును. మనము ఎప్పుడైతే దేవుని నిజమైన దాసుల మగుదుమో అప్పుడు మండుచున్న అగ్ని జ్వాలలవలె నుందుము. ఆయన అంగీకరించునది ఇట్టి సేవయే.

ప్రకటన 4లో అపొస్తలుడైన యోహాను ఇట్లే దర్శనమందు జీవులను చూచెను. మరియు దేవుని సింహాసనము ఎదుట మెరుపులు, దీపములు కూడ చూచెను (వచనము 5), ఎక్కడనైనను సూచన అదే. తనకు విరోధముగా తిరుగుబాటు చేసినవారి మీద తన కడపటి తీర్పులు, తెగుళ్లు ఆయన కుమ్మరించుటకు సిద్ధముగా నుండెను. ఈ ఏడు దీపములు "దేవుని ఏడు ఆత్మలు" అనబడుచున్నవి! ఇవి పరిశుద్ధాత్మ యొక్క పనిని పరిపూర్ణముగా సంపూర్ణముగాను తెలుపుచున్నవి. పరిశుద్ధాత్మ యొక్క పని మన లోపల జరుగుచున్నది; ఎప్పుడైతే ఆయన ఈ పనిని పూర్తిగాను నిరాటంకముగాను జరిగించగలడో అప్పుడు మన ద్వారా తన ఏర్పాటులను నెరవేర్చుకొన గలుగుచున్నాడు. మహిమ పరచబడిన సంఘము ద్వారా ఈ తీర్పులు

జరిగింపబడును. సాతాను ఏనాడైతే దేవుని మీద తిరుగబడెనో ఆనాడే అతనిని ఆయన ఏల నాశనము చేయలేదు? అతనికి తీర్పు జరుగుటకు ఇంత దీర్ఘకాలము ఎందుకు ఆలస్యము చేయవలెను? అని మనము తరచుగా అడుగుచుందుము. ఆయన సంఘము చేతనే ఆతనికి తీర్పు చేయించవలెనని దేవుడు కోరుచున్నాడనునది దీనికి జవాబై యున్నది. తన జనులను ఆయన ఎంతగా ప్రేమించుచున్నాడంటె తన అధికారము ఈ విషయములో వారికే ఇవ్వవలెనని యున్నాడు. అయితే ఇంతటి అధికారమును ప్రయోగించుటకై మనము మాటిమాటికి అగ్నిచేత పరీక్షింపబడి పుటము వేయబడవలెను. ఇబ్బంది కొలిమిలో నుండియే మనలను ఏర్పరచుకొనుచున్నాడు (యెషయా 48:10) దైవ సంకల్పము నెనవేరు నందులకై దేవుని పరిశుద్ధజనులు శారీరకముగాను, మానసికముగాను, చెప్పతరము కాని బాధలుపడవలసి యుందును, ఏ అగ్ని అయితే దుష్టులను దహించి వేయునో ఆదే అగ్ని దేవుని మార్గమందు నడచు వారికి స్వస్థతను తెచ్చునని మలాకీ చెప్పుచున్నాడు (మలాకీ 4:1, 2). వ్యాధి బీజములను ఏ సూర్య కిరణములైతే హరించుచున్నవో ఆ సూర్య కిరణములే వృక్షముల యొక్కయు, మొక్కల యొక్కయు ఆకులు పీల్చుకొనినప్పుడు ప్రాణము, ఆరోగ్యమును ఇచ్చుచున్నవి. ఇట్లే యెహెజ్కేలు చూచిన జీవులతో మనము కలిసిపోయిన యెడల దేవుని అగ్ని మన లోపల పైకి క్రిందికి వెళ్లును. ఉన్నదంతయు పూర్తిగా, సంపూర్ణముగా పుటము వేయబడుటకు మనము సిద్ధపడి యుండవలెను.

ఈ జీవులు మెరుపుల వలె సంచరించుచుండెను. ఇవి దేవుని అగ్నియై భూలోకము నంతయు కప్పుచు ఏర్పరచబడిన వారిని వేరు పరచి దుష్టుల మీద తీర్పు తెచ్చు రీతినే దేవుని విశ్వమందు మెరుపు తీగలు ఎంత వడిగా ప్రయాణించునో అంత వడిగా తాము పని చేయవలసియున్నది. నూతన సృష్టియందు మనము పాలు పొందగా దేవుని మాటకు లోబడి, వేవేగముగా

కార్యములు సలుపవలసి యున్నది. "ఆత్మ యే వైపుకు పోవుచుండునో ఆ వైపుకే పోవుచుండును" (వ. 12). 15-21 వచనములందు వాటి చక్రములను గూర్చి చదువుచున్నాము. అవి ఎంత ఎత్తుగా నుండెనో మనకు తెలియదు. అయితే అవి చాలా ఎత్తుగా నుండెనని చెప్పబడి యున్నవి. ఈ జీవులు వాటి బ్రహ్మాండమైన చక్రములతోను, రెక్కలతోను ఏక శరీరముగా తిరుగుచుండెను. ఒకదాని నుండి ఒకటి వేరు పడుటకు వీలుకాదు. "జంతువులు జరుగగా చక్రములును జరుగుచుండెను. అవి నిలువగా ఇవియు నిలిచెను. అవి వెళ్లుట, నిలుచుట పరిశుద్ధాత్మ ఆజ్ఞను బట్టియే. రెక్కలు పరలోపు సంబంధమైన చర్యలను తెలుపుచున్నవని చూచియుంటిమి. చక్రములైతే, భూమి మీద మన్న కార్యములను చర్యలను తెలుపుచున్నవి. రెక్కలు, చక్రములు కదలుట ఒక్కమారే. నిలుచుట ఒక్కమారే. దేవునితో కలిసి మనము పనిచేయుట కూడ ఇట్లే ఉండవలెను. భూలోకమందు మనము చేయు కార్యములు బోధించుటయో, నేర్పించుటయో లేక సహాయ... లేనివారికి ఉపచారములు చేయుటయో ఇవన్నియు ఆకాశమందు దైవకార్యములకు లోబడినవై యుండవలెను. అవి ఏమని మనము తెలుసుకొనుట మనము ఏకాంతముగా దేవునితో నున్నప్పుడే. కొంతమందికి పట్టి స్వప్నములు, దర్శనములు చూచుచుండుటయే పని. వీరికి రెక్కలున్నవి గాని చక్రములు లేవు. అనగా భూమిమీద సాక్ష్యము శూన్యము. ఇంకొక రకమైన వారు కూడ నున్నారు. చక్కగా కనపడునట్టి, పొగడ దగినట్లుగా కనబడునట్టి పని భూమి మీద అధికముగానే చేయుదురు? అయితే పరలోకములో ఏ సంబంధమును యుండదు. దేవుడు దానిని అంగీకరించడు. మనము రెక్కలు, చక్రములు కూడ కలిగియుండవలెను. మన పాదములేమో భూమిమీద మోపియుండవలెను, మన జీవమేమో పరలోకము నుండి పొందుచుండవలెను. ఇదొక పెద్ద మర్మమే-అయినను దీనిని బట్టి ఇహ పరములను అదే సమయమందు

మనము అనుభవించగలము.

"ఆ నాలుగు కైవారములు చుట్టు కండ్లతో నిండియుండెను" (వ. 18). కండ్ల సహాయము చేతనే చక్రములు వెళ్లుచుండెను. ఈ కండ్లపని ఏమనగా: పరలోకమందు ఏమి జరుగుచుండునో చూచి దాని అర్థము చెప్పుట. మరియు రెక్కలు ఒకవైపు చక్రములు ఇంకొకవైపు గాక అంతయు ఒకేవైపు వెళ్లునట్లు కనిపెట్టుట. మనము భూమిమీద వున్నప్పటికిని దేవునితో సంపూర్ణ ఐక్యత కలిగి పనిచేయవలెను; ఆయన ఎట్లు, ఎక్కడ పనిచేయుచున్నాననియు, ఏమి చెప్పుచున్నాడనియు తెలిసికొనవలెను. బాహ్యముగా కరువులు, భూకంపములు, యుద్ధములు జాడ్యములు మొదలైన ప్రమాదముల ద్వారా దేవుడు మాట్లాడవచ్చును. లేదా అంతరంగికముగా మనకు గలిగిన అపజయములు, నిరాశల ద్వారా మాట్లావచ్చును. ఆయన మనకేమి చెప్పునో దానిని జాగ్రత్తగా ఆలకించి, ఆత్మ యొక్క ప్రేరణకు తక్షణమే విధేయులు కావలెను. దేవుడు ఎటు వెళ్లునో మనము కూడ అటు వెళ్ళితిమేని ఇట్లు ఆయననే అనుసరించుట వలన మన కదలికలు, మన కార్యములన్నింటిని సాగించువాడు పరలోక సింహాసనాసీనుడైనవాడే.

మోషేకు అప్పటిలో పూర్తిగా ప్రత్యక్ష పరచబడని అర్థము గల దర్శనములను ఈ విధముగా యెహెజ్కేలు చూచెను. యెహెజ్కేలు దేవునిచే పిలువబడుట దేనికనగా పాపము చేసిన దేశము లన్నింటి విషయము ఒక్కొక్క దానిమీద రానున్న దేవుని తీర్పులను ప్రత్యేకముగా ప్రకటించు నిమిత్తము; అదే సమయమందు దేవుని కొరకు ఎవరు ఓర్పుతో కనిపెట్టు చుండిరో వారికి దేవుని దయాదాక్షిణ్యములు ప్రకటించు నిమిత్తము గనుకనే అంతమందుగల అధ్యాయములలో దేవునికి జనుల మధ్య ఏర్పడిన నివాస స్థలము ఎంతో రమ్యముగా వర్ణింబడియున్నది.

దేవుని పరిపూర్ణ ప్రేమ యొక్క అంత్య తీర్పు కెరూబుల ద్వారా బయలుపరచబడును. "కెరూబుల మీద ఆసీనుడైనవాడా ప్రకాశింపుము. నీ పరాక్రమమును మేల్కొల్పి మమ్మును రక్షింప రమ్ము. యెహోవా సైన్యముల కధిపతివగు దేవా, చెరలోనుండి మమ్ము తప్పించుము. మేము రక్షణ నొందునట్లు నీ ముఖకాంతి ప్రకాశింప జేయుము" (కీర్తనలు 80:1, 2, 19). ఏ మందకైతే దేవుడు కాపరియై యున్నాడో ఆ మంద మీద తనకు గల ప్రేమ కరుణలకు కరుణాపీఠము మీద ఉన్నట్టి అడ్డతెరయు వేరే తెరల మీద కుట్టుపనిగా చేయబడినట్టి కెరూబులును సూచనలై యున్నవి. దుష్టుల మీద దేవుని తీర్పులు పోయబడినప్పుడు దేవుని యొక్క సంపూర్ణమైన పరమ ఏర్పాటులో ఆయన దాసులైన మనము ఆయనతో ఐక్యపరచబడి యుండవలెను.

# 20

# లోని తేజస్సు

"ఆలాగున మోషే పని సంపూర్తి చేసెను ... యెహోవా తేజస్సు మందిరమును నింపెను" (నిర్గమ 40:33, 34). "యెహోవా మహిమ నీ మీద ఉదయించెను (యెషయా 60:1).

పగటి వెలుగు ప్రవేశింప వీలులేనందున అతి పరిశుద్ధ స్థలము చీకటిగా నుండును. దేవుడు తన వాగ్దానము ప్రకారము అక్కడ నివసించితేనేగాని పరిశుద్ధ స్థలము వట్టి చీకటిలో పడియుండ వలసినదే. అయితే దేవుడు ఇట్లు చెప్పియుండెను: "అక్కడ నేను నిన్ను కలిసికొని కరుణాపీఠము మీద నుండియు, శాసనములు గల మందసము మీద నుండు కెరూబుల మధ్య నుండియు ... నీకు తెలియజెప్పెదను" (నిర్గమ. 25:22). ఈ వాక్కును నమ్మికొని అక్షరానుసారముగా మోషే దైవ ఏర్పాటును నెరవేర్చెను. సంఖ్యాకాండము 7:90లో ఇట్లు చదువుచున్నాము. "కరుణా పీఠము మీద నుండి, అనగా రెండు కెరూబుల నడుమ నుండి తనతో మాట్లాడిన యెహోవా స్వరము అతడు వినెను." "మోషే పరిచారకుడై యుండి దేవుని యిల్లంతటిని నమ్మకముగా ఉండెను."

ఇప్పుడు స్తెఫను చరిత్ర చూతము. అతడు మహాసభ ఎదుట నిలిచి యుండెను. అతనిమీద నేరములు మోపి యుండిరి. ఇప్పుడు స్తెఫను ఏమి చెప్పునో అది చెప్పుకొన వలసిన సమయము. "సభలో కూర్చున్న వారందరు

ఆతనివైపు తేరిచూడగా అతని ముఖము దేవదూత ముఖము వలె వారికి కనబడెను ... స్తెఫను చెప్పిన దేమనగా ... మన పితరుడైన అబ్రాహాముకు ... మహిమగల దేవుడు అతనికి ప్రత్యక్షమాయెను'' (అపొస్తలుల కార్యములు 6:15; 7:2).

ఇక్కడ రూపాంతరము చెందిన వాడొకడు కనిపించుచున్నాడు. ఇతని ముఖమందు వింతైన క్రొత్త వెలుగు ఒకటి కనిపించుచున్నది. దీని అర్థమేమై యుండును? ఆ క్రింది వచనమును చూడుము. స్తెఫను స్వంత మాటలలోనే ఆ వివరము ఇవ్వబడుచున్నది. "మహిమ గల దేవుడు" అపొస్తలుల కార్యములు 7:55లో ఇది తిరిగి దృఢ పరచబడుచున్నది. "అతడు పరిశుద్ధాత్మతో నిండుకొనినవాడై ఆకాశము వైపు తేరి చూచి దేవుని మహిమను చూచెను''.

ఇది గమనింపుము. ఈ రూపాంతరము ఈ మహిమా పరిచారకునిగా పిలువబడిన ఒకనిలో కనబడుచున్నది. దేవునికిని, ఆయన సంఘమునకును చేసిన పరిచర్య యొక్క సమాప్తమందు ఈ రూపాంతరము వచ్చును. స్తెఫను పరిచర్యమట్టుకు అచిరకాలములోనే ముగిసెను. ప్రారంభమందు ఈ పరిచర్య ఎట్టిది? ఎంతో ఘనమైనది కాదు. వట్టిది, సామాన్యమైనది. ఇట్టి సామాన్యమైన వ్యక్తిగాని, అతని చరిత్రగాని వారికంత అత్యాగ్రహమును కలిగించి యుండనేరదు. క్రొత్త విధముగా దేవుడు ఇతని ద్వారా ప్రత్యక్ష పరచిన తన శక్తియే వారికంత భయము కలిగించెను. వారు అతనికి వ్యతిరేకముగా అబద్ధ సాక్షులను నిలువబెట్టిరి. అతని ముఖము ప్రకాశించుచుండెను. మనుష్యులు అనుకొను దానికి వ్యతిరేకమైన సంగతి ఇది. ముఖస్తుతి చేసినప్పుడు ముఖములు వికసించునే గాని ఆక్షేపణలు చేసినప్పుడు కాదు. వారు చూచినది ప్రకృతి సంబంధమైనది కాదు. అది మహిమ - దేవుడు దేనిని మహిమ అనునో అది,

అనగా ఆ మనుష్యులు గ్రహించలేని ఒక విషయమది. దానిక్రింద వారే తీర్పు తీర్చబడుచుండిరి. కావుననే "తమ హృదయములందు నరుకబడిన వారై అతనిని చూచి పండ్లు కొరికిరి" (అపొ. కార్య. 7:54). వారు చివరిలో ఈ పరిచారకుని ఎదుట నిలువలేకపోయిరి. వారి మధ్య అతడుండుట సహింపజాలకుండిరి.

దేవుని విషయమైన సంగతులలో ఒక వ్యక్తి యొక్క చరిత్ర సమాప్తమగుచుండు సమయములో మహిమ వచ్చునని మనము తేటగా గ్రహించవలసిన మొదటి అంశమై యున్నది. మనము ఈ జీవితమందు ఎన్నో ఆశ్చర్యమైన అనుభవములు పొందవచ్చును. దేవుడు అద్భుత రీతిగా పనులు చేయుట చూడవచ్చును. ఇందువలన, "ఇదే మహిమ" యని అనుటకు మనకు శోధన కలుగుచున్నది. అయితే దేవుడు "అప్పుడే కాదు, ఇంత కంటే మేలైనది, ఇంతకంటె ఆశ్చర్యకరమైనది ఇక మీదట రానున్నది" అని చెప్పుచున్నాడు.

చాలా సంవత్సరముల క్రిందట నేను లండనులో చదువుకొనుచుండగా, లార్డ్ మేయర్ (నగరాధ్యక్షుడు) ప్రదర్శనమును చూడ వెళ్ళితిని. ఈ ప్రదర్శనము ప్రతి సంవత్సరము నవంబరు మాసమందు లండన్ యొక్క పాత మేయర్ వెళ్ళిపోయి, క్రొత్త మేయర్ తన అధికారమందు ప్రవేశించునప్పుడు జరుగును. పెద్ద ఊరేగింపుతో ఈ క్రొత్త అధ్యక్షుడు తన ఉద్యోగ స్థలమునకు వీధుల గుండా పోవుచుండగా అనేకులు వారికి సమయముండిన యెడల పనులు కొంతసేపు ఆపి ఈ ఊరేగింపును చూడ వెళ్ళుదురు. అది ఒక అద్భుతమైన దృశ్యము. అయా మిలిటరీ రెజిమెంట్లకు చెందిన మిలిటరీ బ్యాండ్లు మొట్టమొదట బయలుదేరెను. ఆయా వృత్తులను పరిశ్రమలను వెల్లడిచేయు ప్రదర్శనములను ఎన్నో కారుల మీద వెనుక సాగెను. వీటి వెనుక తిరిగి కొన్ని

బ్యాండ్లు వాద్యము చేయువారు, కొందరు కాలినడక మీద, కొందరు గుఱ్ఱముల మీద వెళ్ళిరి. వీరిని వెంబడించి రాయల్ లైఫ్ గార్డ్సులు, టవర్ ఆఫ్ లండన్ యొక్క బల్లెపు సిపాయిలు ఒకే విధమైన ప్రాచీన పద్ధతిలో దుస్తులను ధరించి వెళ్ళిరి. ఒకటి వెనుక నొకటి ఈ ప్రదర్శనములు దాటిపోయిన వెనుక అనగా ఎంతోసేపు కనిపెట్టిన పిమ్మట ఉద్యోగులు కూర్చుండిన గుఱ్ఱపు బండ్లు వరుసగా వచ్చెను.

మొదటి బండిలో కూర్చుండిన పురుషులు మంచి బట్టలు వేసికొని ఎంతో అందముగా కనబడిరి. వారి యొక్క పరిచారకులను, అంతస్థు చిహ్నములను చూచి వీరెవరని నా చుట్టునున్న వారిని అడుగగా, అందరిలోను తక్కువ పదవి గలవారని నాకు ప్రత్యుత్తర మిచ్చిరి. అటు పిమ్మట ఒక్కొక్కనిగా, అతి శోభగల ఒక్కొక్క బండిలో ఇంకొక పెద్ద ఊరేగింపుగా వేరే పురుషులు బయలుదేరిరి. ఈ మహనీయులు స్థూలకాయులు, నిండుపాటి అంగీలను, విగ్‌లను (న్యాయాధిపతులు కచ్చేరిలో ధరించుకొను వెంట్రుకలు), ఒకవైపు పైకెత్తుకొనిన టోపీలను ధరించి బంగారు గొలుసులు, ఖడ్గములు, నేత్రములు, మరి వేరే అధికారపు చిహ్నములు పెట్టుకొని ఆడంబరముగా నుండిరి. సమూహములు జయ ధ్వనులు చేయచుండగా, వాటిని అంగీకరింప తలలు వంచుచు ఒకని మించి వాని వెనుక వచ్చువాడు మరింత గంభీరముగా కనబడుచుండెను. క్రొత్తగా వచ్చు ప్రతి గుఱ్ఱపు బండిని చూచి, 'ఇందులో ఉండేవాడే లార్డ్ మేయర్' అనుకొనుచుంటిని. అయితే నా చుట్టునున్నవారు 'అప్పుడేకాదు' అని అనుచుండిరి. తుదకు ఒక బండిలో ఒంటరిగా కూర్చుండిన పెద్ద మనుష్యుడొకడు వచ్చెను. అందరికంటె ఇతడే స్థూలముగా కనిపించెను. ఇతరుల బండ్ల ఇరుప్రక్కల నడుచుచుండిన సిపాయిలు, పరివారము కంటే అధికముగా ఈయన బండికి రెండు ప్రక్కన అడుగులు వేయుచుండిరి. అయనను చూచి ఆ గుంపులు ధ్వనులు చేసి చప్పట్లు కొట్టగా 'తప్పక ఇతడే

లార్డ్ మేయర్ కదా?' అని ఎవరితోనో అంటిని. 'అట్లే కాదు ఇతడు వెళ్ళిపోతున్న లార్డు మేయర్.' అని తిరిగి జవాబు చెప్పిరి. క్రొత్త లార్డు మేయర్ కొరకు ఇంకను కనిపెట్టితిని. తిరిగి వాద్యములు బయలుదేరెను. మరి ఇంకను గార్డ్ల వరుసలు, ఒకే మాదిరి దుస్తులను వేసుకొనిన పరిచారకుల వరుసలు ఇవన్నియు దాటిన వెనుక బంగారు పూత పూయబడి మెరయుచున్న ఒక బండి వచ్చెను. ఇందులో కూర్చున్న ఆయనే లండన్ యొక్క లార్డ్ మేయర్. ప్రదర్శనము ముగిసిపోయెను. ఇంతసేపు నేను కనిపెట్టినది దీని కొరకే. నన్ను ఆశ్చర్యములో ముంచిన అనేక దృశ్యములను ఈ ప్రదర్శనయందు చూచితిని. కాని అసలైనది నా కంట బడినప్పుడు దాని ప్రతిభ అన్నింటిని మించియుండెను.

మహిమ అనగా ఈ రీతిగా నుండును, అది ఎప్పుడును అన్నింటిని మించి కడపటిగా వచ్చునది. మోషే యొక్క అనుభవమందు ఇది తేటగా కనబడుచున్నది. అతడు దేవునిని మొదట పొదలో చూచెను (నిర్గమ. 3). అటు తరువాత ఇశ్రాయేలీయుల పెద్దలతో కలిసి సీనాయి కొండనెక్కినప్పుడు "ఇశ్రాయేలీయులు దేవుని చూచిరి" (నిర్గమ. 24), అటు పిమ్మట మోషే ఒంటరిగా మేఘములో ప్రవేశించి కొండ శిఖరము ఎక్కినప్పుడు దేవుని ఆజ్ఞలను పొందెను, అతడు తిరిగి తన జనుల ద కు వచ్చినప్పుడు అతని "ముఖ చర్మము ప్రకాశించెను" (నిర్గమ. 34). ఇంతకాదు, ఇంకను కొంత మిగిలియుండెను. దేవుడు చెప్పిన ప్రకారము ప్రతి చిన్న వివరముతో ఆ పని యంతయు నెరవేర్చిన పిమ్మట దేవుని సంకల్పము నెరవేరిన దానిని బట్టి ఈ సంపూర్ణత యుండెను. సొలొమోను దేవాలయము పూర్తియైన తరువాత కూడా ఇదే సంభవించెను (2 దినవృత్తా. 5). లేఖనముల యందు మహిమ అను పదము ఎప్పుడు వాడబడుచున్నదనగా, ఒక దైవ నమూనాగాని, మచ్చుగాని నెరవేరినప్పుడే మాత్రమే. అనగా ఆ పదము భూసంబంధముగాను, మనుష్యుల సంబంధముగాను ఉపయోగింపబడినప్పుడు మహిమ ఒక దర్శనము కాదు.

మనలో కలుగు పరవశమో లేక అట్టిది ఇంకేదో కూడ కాదు. అది ఎల్లప్పుడు దేవుని యొక్క ఏర్పాటుతో సంబంధించియున్నది. మహిమ అను దానిని మనము తెలిసికొని అనుభవింపవలెనంటే దైవ మాదిరి, దైవ నమూనాలకు సంపూర్తిగా మనము లోబడవలెను.

ఆయన మహాత్మ్యమును మేము కనులారా చూచినవారమై తెలిపితిమి. ఈయన నా ప్రియ కుమారుడు, ఈయన యందు నేను ఆనందించుచున్నాను అను శబ్దము మహా దివ్య మహిమ నుండి ఆయన యొద్దకు వచ్చినప్పుడు తండ్రియైన దేవుని వలన ఘనతయు మహిమయు ఆయన పొందగా ..." (2 పేతురు 2:16, 17). ఇక్కడ వారు వినిన స్వరము నిజమైన మహిమను కలిగియుండెను. ప్రజ్వరిల్లుచుండిన వెలుగుగాని, ప్రకాశించుచుండిన వస్త్రములు గాని ఆ మహిమకాదు. ఇవి ఆ స్వరము తరువాతనే. దేవుడు తన వాక్యమునకే ప్రాముఖ్యత నిచ్చెను. "పేతురూ, నీవు చూచిన దానిని బట్టి నిర్ఘాంతపోకుము. ఈయన మాట వినుడి" (మత్తయి 17:4, 5). "ఈయన మాట విని, ఈయన ఆజ్ఞాపించునది చేయుడి."

దీని అర్థము నేను గ్రహించుటకు చాలా కాలము పట్టెను. నేను రక్షింపబడి ఎంతో కాలము వరకు ఇక్కడ అక్కడ పరుగెత్తి నా సాక్ష్యము చెప్పుచు సువార్త ప్రకటించుచుంటిని. దేవుని స్వరము మాత్రము వినియుండలేదు. అకస్మాత్తుగా నేను ఆపబడి, ఈ పాఠము నేర్చుకొనునప్పటికి రెండేండ్లు పైగా గడచి యుండెను. దేవుని కొరకు మనమే ఈ యేర్పాటు, ఆ యేర్పాటు చేయటలోను, దేవుని స్వరము విని ఆయన ఆజ్ఞ ప్రకారము చేయుటలోను చాల వ్యత్యాసమున్నది.

ఈ నియమము అపొస్తలుడైన యోహాను జీవితమందు పనిచేయుట చూచుచున్నాము. యోహాను 1:14లో ప్రభువైన యేసుక్రీస్తు మనుష్యావతారమును

గూర్చి మాట్లాడుచు "మనము ఆయన మహిమను కనుగొంటిమి" అని అనుచున్నాడు. తాను శిష్యుడైన క్రొత్తలో యోహాను చూచినది కొద్దిపాటిదే. అయితే ఈ కొద్ది పాటిదే అతనిని పట్టుకొని అతని ద్వారాను, అతనిలోను పనిచేయ నారంభించెను.

అనేక సంవత్సరములు గడచిన పిదప పత్మాసు దీవియందు ఇంతకంటె ఆశ్చర్యకరమైన సంగతి అతడు చూచెను. పునరుత్థానుడైన ప్రభువును కలిసికొని ఆయన మాట్లాడుట వినెను. ఈ అనుభవము ఇతని కేల లభించెను? ఆసియాలోని ఏడు సంఘములకు దేవుని వర్తమానమును ఇవ్వవలెననియే. దేవుని దగ్గర విని ఆ సంఘములకు యోహాను అందించిన వర్తమానమేమి? అతడు ఏమి చెప్పెనో ఆ వర్తమానమునే యోహాను విడిచి పెట్టెనా? లేదు. అతడు ఏమి చెప్పెనో ఆ వర్తమానమునే యోహాను తెలియజేసెను, ఈ వర్తమానమే తుదకు ప్రకటన గ్రంథమాయెను. దేవుని మహిమ ప్రత్యక్ష పరచబడుట యెందులకు? దానిని ఎవరు చూచిరో వారు సంతోషించి, వారి అనుభవమును ఇతరులకు ఎల్లప్పుడు చెప్పుకొనుచు తిరుగుటకా? కానే కాదు. సంఘమంతటి పరిచర్య నిమిత్తమే దేవుని మహిమ ప్రత్యక్ష పరచబడును.

మనకైతే వరములు, బోధలు, ఇంకను క్రైస్తవ పరిచర్య, సాక్ష్యములు, బాహ్య చిహ్నములే గొప్ప. ఒక బోధకుడు తప్పక పాటలు పాడువాడును, వీణె వాయించువాడును అయి యుండవలెనని నేను తలచుట వలన, నాకీ వరము ఇమ్మని ప్రార్థన చేయుచుంటిని. పాటలు, వాద్యములు లేకుంటె దేవుడు తన కార్యమును జరిగించలేడని నేను తలంచితిని. నా భ్రమను ఏమందును! పాటల వలనగాని, వీణ వాద్యముల వలనగాని ఒక్క ఆత్మ అయినను రక్షింపబడదు. మనము వినవలసినది దేవుని స్వరము. విని ఆయన ఏమి చెప్పుచున్నాడో తెలిసికొని అటు తరువాత ఆయన వర్తమానమును అందరికి

అందించుట మనము చేయవలసిన కార్యమైయున్నది.

దేవుని క్రమములో మనము ప్రవేశించవలెను. యోహాను ప్రభువుతో అత్యధిక సమీప సంబంధము కలిగి మెలగుచుండుట మనము తన సువార్తలో చూచుచున్నాము. పూర్వము ఆయనకు ఇంత సమీపముగా నుండినందుచేత ఇప్పుడు సంఘములకు అందివ్వవలసిన వర్తమానము అతనికి అప్పగింపబడెను. అతడు అధికారముతో మాట్లాడు నిమిత్తమే దేవుని మహిమ అతనికి ప్రత్యక్ష పరచబడెను.

సర్వ సంఘము యెడల దేవుని ఏర్పాటు ఏమైయున్నదో అందు ప్రవేశించుము. అప్పుడు మహిమ అనగా నేమిటో గ్రహించగలవు. "నా గుంపు" "పార్టీ" "నామిషన్" అనుచు నీ దాని కొరకు మాత్రమే పని చేయుచు, ఇంకను సభ్యులను రాబట్టుకొని, ఇతరులు నీ గొప్పతనము చూడవలెనను భావముండిన యెడల, నీ మహిమ కూడా నీకు ప్రత్యక్ష పరచబడదు. దేవుని నివాస స్థలము సంపూర్తి అయిన పిమ్మటనే ఆయన మహిమ లోపలికి ప్రవేశించును. అనగా పాత నిబంధనలో మందిరము, ఆలయము ఆత్మీయముగా దేనిని సూచించు చున్నవో ఆ సమస్తమును మనుష్యుల హృదయములో నాటుకొనినప్పుడే దేవుని మహిమ ప్రవేశించును.

గత అధ్యాయమందు మనమిది చూచితిమి. ప్రకటన 4, 5 అధ్యాయములలో యోహానుకు మరింత గొప్ప దర్శనము వచ్చుట, సింహాసనాసీనుడై యున్న గొర్రెపిల్ల యొక్క మహిమ అతనికి కనబర్చబడెను. ఈ దర్శనమే విచిత్రమైన సంగతి అయియుండగా రాబోవు తీర్పు, శ్రమలను గూర్చిన వర్తమానములను ప్రకటన గ్రంథము 6 నుండి 20వ అధ్యాయము వరకు కలిగియున్నది. అవి ఏ విధముగా 4, 5 అధ్యాయములకు సంబంధించి యున్నవో అది ప్రధానమైన అంశము. భూమిమీద జరుగుచున్న సంగతులను

చూచుచున్నట్టిది పరలోక సంబంధమైన దృష్టియని ఈ దర్శనము మనకు తెలుపుచున్నది. అది సింహాసనము నుండి చూచుదృష్టి. ఈ సంభవములను ఏలు వారును, వాటి ద్వారా ఏలువాడును గొఱ్ఱెపిల్లయే యని తెలియుచున్నది. భీకరమైన దేవుని తీర్పులు మన మీదకు వచ్చి పడుచుండగా యీ సంభవములన్నియు గొఱ్ఱెపిల్ల అధికారము క్రింద నున్నవని తెలిసికొని నప్పుడు మన హృదయములు ఎంత ధైర్యము తెచ్చుకొను చున్నవి!

చివరిగా 21వ అధ్యాయమందు, యోహానుకు పరిశుద్ధ నగరమైన క్రొత్త యెరూషలేము కనబర్చబడెను. అది "దేవుని మహిమగలదై" యుండెను. ఇప్పుడు దానిని చూచినంత మాత్రమున సంతోషించుట కాదు. మరియు చూచిన దాని విషయము చెప్పుకొనుట మాత్రమే కూడ కాదు. మోషే, స్తెఫను ముఖముల మీద ప్రకాశించిన ప్రకాశము వలె కాంతినిచ్చు ఒక వస్తువు కూడ కాదు. అది ఇప్పుడు పొందబడియున్న ఒక వస్తువు, దేవుని గురి అందుకొనబడెను; అయన ఏర్పాటు నెరవేరెను. అయన ప్రజలు అయన మహిమను పొందియున్నారు. అవును దేవుని ఏర్పాటు నెరవేరినప్పుడెల్ల మహిమ వచ్చుచున్నది.

చిన్న బిడ్డలు గొప్పతనము కోరుదురు. తాను పెద్దవాడైనప్పుడు ఒక పోలీసువాడో లేక ఒక సిపాయి లేకున్నచో ఒక ఇంజన్ డ్రైవరు కావలెననెడి గొప్పతనమునే ఒక పిల్లవాడు కోరుకొనును. వాడు ఎదుగుచు జ్ఞానము పొందిన కొలది, యీ చిన్నవి ఇంక పనికిరావు. ఇంతకంటె ఉన్నతమైన ఆలోచనలే వచ్చుచుండును. మనము దేవుని "చిన్న బిడ్డలము" మనలను రక్షించుటకై దేవుడు తన కుమారుని పంపెను. ఎందుకు? లోకములో మనము లాభము పొందవలెనని గాని, మనము మంచి ఆరోగ్యమైన స్థితియందుండ వలెనని గాని లేక ఇంతకంటె సంతోషముగా కాలము గడుపుటకు కాదు గాని

దేవుని యొక్క సంపూర్ణమైన ఏర్పాటులో మనము ప్రవేశించ వలెననియే. ఇదేమిటో ప్రారంభమందు బహు స్వల్పముగా, ఒక చిన్న పరిమాణము తప్ప, మనము ఏమియు గ్రహించుట లేదు. అయితే ఆయన కృప వలన ఈ జ్ఞానము మనలో ఉదయింప మొదలుపెట్టెను. ఒక దుఃఖకరమైన విషయమేమనగా ఎందరెందరో మన ఆత్మీయ జీవితమును గూర్చి ఎంతోకాలము చిన్న బిడ్డల అభిప్రాయమంత జ్ఞానము గల అభిప్రాయములు కలిగియున్నారు. దేవుని యొక్క ఏర్పాటులో మనము సరిగా అమర్చబడుటకును, దేవుని పట్టణము యొక్క నిర్మాణములో సరియైన స్థలము గలిగిన హారముగా నుంచుటకును ..ని స్వరమును మనము వినవలసి యున్నది.

మనస్పూర తమ్మును ఈ కార్యము కొరకై సమర్పించు కొనినట్టి స్త్రీ పురుషులను దేవుడు కోరుచున్నాడు. దేవాలయము యొక్క మచ్చు విషయము దావీదు ఇట్లు చెప్పగలిగెను : 'యెహోవా బలము నామీదకు వచ్చి ఈ మచ్చుల పని యంతయు వ్రాత మూలముగా నాకు నేర్పెను' (1 దిన వృత్తా. 28:19) మనము లేఖనములను గైకొని పరిశుద్ధాత్మ నడుపుదల మీద ఆనుకొని యుంటిమేని ఆనాడు దావీదు దేవుడు మచ్చు చూపిన రీతిని ఈనాడు మనకు తన సంకల్పమును చూపుట ఏమాత్రమును అసాధ్యము కాదు.

1 దిన వృత్తాంతములు 29లో దేవాలయ నిర్మాణమునకు మనుష్యులు ఏమి తెచ్చి యిచ్చిరో చదువుచున్నాము. 8వ వచనము ఇట్లు చెప్పుచున్నది : "తమ యొద్ద రత్నములున్న వారు వాటిని తెచ్చి యెహోవా మందిరపు బొక్కసము మీద నున్న (వానికి) ... ఇచ్చిరి". ఏది కూడను వారి స్వంతమునకు కాదు, సమస్తమును దేవునికి కావలసినంత ఆయన ఉపయోగించుకొనుటకు ఆయన అందుబాటులో నుంచిరి. వారి త్యాగము సరియైనదే. ఎందుకనగా ముందుగా దేవుడు తీసుకొనిన పిమ్మటనే ఏదైనను మిగిలియుండిన యెడల

అది వారిది. దేవునియొక్క మచ్చు ననుసరించి కార్యములు జరుగునపుడెల్ల ప్రజలయొక్క త్యాగము అలాగుండును. ఏ రత్నములు సమకూర్చుటకు యుద్ధములు సలిపిరో, ఎన్ని కష్టములు, పరీక్షల ద్వారా, పాటుపడుట ద్వారా వాటిని సంపాదించిరో, అవన్నియు మరచి దేవుని మందిరమునకు తెచ్చుటలో ఆనందించిరి.

దీనిని తేటగా చెప్పెదను. భూమిమిద నున్న గుడులు, గోపురములను అలంకరించమని గాని లేక భూమిమీది సంస్థలకు చందాలిమ్మని గాని దీని యర్థము కాదు. వీటిలో అనేకమైన వాటిమీద దేవుడు ఈ తీర్మానము చేసి యున్నాడు : "ఈ కాబోదు - ప్రభావము ఇశ్రాయేలీయులలో నుండి పోయెను"(1 సమూ. 4:21). ఇక్కడ చెప్పబడిన రత్నములు "జీవము గల మణులు". తిరిగి జన్మించిన విశ్వాసులగు స్త్రీ పురుషులే ఈ రత్నములు. వీరే క్రీస్తులో ప్రవేశించి ఆయనకు తమ్మును సంపూర్తిగా సమర్పించుకొనుట చేత "యేసుక్రీస్తు ద్వారా దేనికి అనుకూలములగు ఆత్మ సంబంధమైన బలులను సమర్పించుటకు పరిశుద్ధ యాజకులుగా ఉండునట్లు, మీరును సజీవమైన రాళ్లవలె నుండి ఆత్మసంబంధమైన మందిరముగా కట్టబడుచున్నారు" (1 పేతురు 2: 4, 5). మనలను సరిగా చెక్కి ఒకరితో నొకరిని ఆ మచ్చు ఆకారమునకు తగినట్లుగా అమర్చు కార్యము బహు క్రమముతోను, బాధాకరముగాను జరుగును. ఏలయనగా ఆత్మద్వారా మనము దేవుని నివాస స్థలముగా ఏర్పడవలెను (ఎఫెసీ. 2:22). ఎటువంటి పరిస్థితులలోనైనను మనము దేవునికి నమ్మకస్థులుగా నుందుముగాక! ఎందుకంటే దేవుడు ఈ కార్యమంతయు పూర్తిచేసిన పిమ్మటనే మహిమ ప్రకాశించుచున్నది. "దేవుని మహిమను కలిగి వుండు" దేవుని నివాస స్థలము పరిశుద్ధ స్థలమై వున్నది.